

'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50


సంపుటి: 18
సంచిక: 158

శుక్రవారం 29-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జిన్‌పింగ్.. ముర్ము.. మోదీ!
రహస్య లేఖతో మెరుగుపడ్డ భారత్‌–చైనా సంబంధాలు
- 6లో



అలా చెప్పలేదు..
75 ఏళ్ల నిబంధనేదీ ఆర్‌ఎస్‌ఎస్‌లో లేదన్న మోహన్ భగవత్
- 6లో



నీట మునిగిన కామారెడ్డి నగరం

జల విలయం

కామారెడ్డి జిల్లాలో కుంభవృష్టి.. అర్గొండలో 43.35 సెం.మీ అత్యధిక వర్షపాతం


11 మండలాల్లో 30 సెం.మీ. నుంచి 43 సెం.మీ. దాకా నమోదు

- భారీ వర్షాలతో మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల తదితర జిల్లాలు అతలాకుతలం
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు..అలుగు పారుతున్న చెరువులు
- వరదలు, వర్షాలతో ముగ్గురు మృతి, ఆరుగురు గల్లంతు
- జల దిగ్బంధంలో గ్రామాలు.. వందలాది మందిని కాపాడిన సహాయక బృందాలు
- రహదారులను ముంచెత్తిన భారీ వరద..ముంపులో జాతీయ రహదారులు
- కశ్మీర్ టు కన్యాకుమారి ఎన్‌హెచ్ 44కు కోతలు..రాకపోకలకు అంతరాయం
- పలుచోట్ల కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్‌లు.. నిలిచిపోయిన రైళ్లు
- అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష; ముంపు ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- సహాయక చర్యల్లో కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు, బీఆర్‌ఎస్ నేతలు

2 లో

గోదావరి మళ్లీ ఉగ్రరూపం

ఉపనదులకూ పోటెత్తిన వరద
శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 2 లక్షల క్యూసెక్కుల వరద
ఎల్లంపల్లికి 6 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
రేపు మేడిగడ్డ బరాజ్‌కు 9.5లక్షల క్యూసెక్కుల వరద వచ్చే చాన్స్
జైక్వాడ్ నుంచి ధవళేశ్వరం బరాజ్ వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- వివరాలు 3లో



'పోచారా'నికి తప్పిన ముప్పు

పోచారం ప్రాజెక్టుకు భారీ వర్షాలతో వరద పోటెత్తింది. ప్రాజెక్టు పైభాగం నుంచి నీరు పడటంతో స్ట్రక్చర్‌కు ఒకచోట గొయ్యి ఏర్పడింది. ప్రాజెక్టు తెగిపోయినట్టేనని అందరూ భావించారు. కానీ వరద తీవ్రత తగ్గడంతో ముప్పు తప్పింది.



వేలాడిన రైల్వే ట్రాక్..

కామారెడ్డి జిల్లా రామేశ్వర్‌పల్లి–తిప్పాపూర్ మధ్య రైలు కట్ట ధ్వంసం కాగా పట్టాల కింది నుంచి ప్రవహిస్తున్న నీరు..



తెగిన ఎన్‌హెచ్- 44

రాష్ట్రం మీదుగా వెళ్లే ఎన్‌హెచ్–44పై పలుచోట్ల రోడ్డు, వంతెనలు తెగిపోయాయి. కామారెడ్డి వద్ద హైవే కొట్టుకుపోవడంతో కూరుకుపోయిన లారీ, బస్సు



యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

- వరదలతో దెబ్బతిన్న రోడ్లు, చెరువులను పునరుద్ధరించాలి
- అందుకోసం వెంటనే అంచనాలు తయారు చేయండి
- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- మెదక్, కామారెడ్డి జిల్లాల వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- వరదలపై హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష

5 లో

మరో రెండ్రోజులు వర్షాలు

అల్పపీడనంతో రాష్ట్రాన్ని ముంచెత్తిన వానలు
సీజన్‌లో ఇప్పటివరకు 69.17 సెం.మీ వర్షపాతం.
అత్యంత చురుగ్గా నైరుతీ రుతుపవనాలు -5లో

ఎన్డీయేకు 324.. 'ఇండియా'కు 208

- ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే వచ్చే ఫలితాలివే..
- ఇండియా టుడే–సీ ఓటర్ మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే

ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడి

6 లో



అక్కడే ఉంటారు! కిందికి దిగితే ఇపుడే నిమజ్జనం అవుతారు!

విద్యార్థి వీసా నాలుగేళ్లే!

కాలపరిమితి విధించాలని అమెరికా యోచన
కొత్త వీసా నిబంధనలు ప్రతిపాదించిన ట్రంప్ ప్రభుత్వం
భద్రతాపరమైన ముప్పు తలెత్తుతుందన్న అగ్రరాజ్యం.. నిబంధనలపై ప్రజల అభిప్రాయాలకు 30 రోజుల గడువు



వాషింగ్టన్: అమెరికాలో వీసాల గడువును పరిమితం చేయడానికి ట్రంప్ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. దుర్వినియోగాన్ని తగ్గించడానికి, పర్యవేక్షణను మరింత కఠినతరం చేయడానికంటూ బుధవారం కొత్త నిబంధనలను ప్రతిపాదించింది. అంతర్జాతీయ విద్యార్థులకు ఇచ్చే ఎఫ్–వీసాలు, కల్చరల్ ఎక్స్ఛేంజ్ కోసం ఇచ్చే జే–వీసాలు, విదేశీ జర్నలిస్టులకు ఇచ్చే ఐ–వీసాలపై కాలపరిమితి విధించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు విద్యార్థి వీసాలపై ఎలాంటి కాలపరిమితి లేదు. వాళ్లు చదివే కోర్సు ఎన్ని సంవత్సరాలున్నా అంత కాలం వారు ఆ దేశంలో ఉండే అవకాశం ఉంది. అయితే, కొత్త ప్రతిపాదన ప్రకారం విద్యార్థి, ఎక్స్ఛేంజ్ వీసాలకు నాలుగేళ్ల కాలపరిమితి మాత్రమే ఉంటుంది. ఆ గడువు ముగిశాక పొడిగింపు కోసం దర ఖాస్తు చేసుకోవాలి. ఇక జర్నలిస్టులకు 240 రోజు లు మాత్రమే అనుమతిస్తారు. ఇక చైనీయులకైతే మిగతా 18వ పేజీలో ▶

భారతీయుల్లో వీసా గుబులు

- చదువు తర్వాత ఉద్యోగం వెతుక్కోవడానికి సమయం సరిపోదంటున్న విద్యార్థులు
- ఇప్పటికే పెరిగిన వ్యయంతో సతమతం

18 లో

సీఎస్ సర్వీసు 7 నెలలు పొడిగింపు

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని ఆమోదించిన కేంద్రం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.రామకృష్ణారావు ఈ నెల 31తో పదవీ విరమణ చేయాల్సి ఉండగా, ఆయన సర్వీసును మరో 7 నెలలు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ) అండర్ సెక్రటరీ భూపేందర్ పాల్ సింగ్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఏఐఎస్ (సీఎస్–ఆర్‌ఎం) మిగతా 14వ పేజీలో ▶

పార్లమెంటుకు ఆ అధికారం లేదు

- రాజ్యాంగంలోని ఆర్టికల్ 262 ప్రకారం ఏర్పాటైన ట్రిబ్యునల్‌కే నీటి కేటాయింపుల అధికారం
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ సర్కార్ వాదన
- నేడూ తుది వాదనలు వినిపించనున్న తెలంగాణ

8 లో





కామారెడ్డి జాతీయ రహదారిలోని జీఆర్ కాలనీలో కల్వర్టు కింద నుంచి ప్రవాహంలో కొట్టు కొచ్చిన కార్లు



కామారెడ్డిలో భారీ వరదకు ధ్వంసం అయిన 44వ జాతీయ రహదారి



వాగు ఉధృతిలో చిక్కుకుపోయిన నర్మాల రైతులకు డ్రోన్ ద్వారా ఆహారం పంపిణీ.. అనంతరం హెలికాప్టర్ ద్వారా రెస్క్యూ



జల విలయం

భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాలు అతలాకుతలం

సాక్షి, నెట్‌వర్క్: ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా కురిసిన కుంభవృష్టి కామారెడ్డి జిల్లాలో బీభత్సం సృష్టించింది. జల ప్రళయాన్ని తలపిస్తూ.. బుధవారం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం అర్గొండలో 24 గంటల్లో 43.35 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. 2023 జూలైలో ములుగు జిల్లా వెంకటాపూర్‌లో కురిసిన 64.9 సెంటీమీటర్ల తర్వాత ఇదే అత్యధిక వర్షపాతం కావడం గమనార్హం. అటు మెదక్, నిర్మల్ జిల్లాలను కూడా వాన ముంచెత్తింది. సిద్దిపేట, సిరిసిల్ల, ములుగు, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలను సైతం భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. కన్యాకుమారి – కశ్మీర్ నేషనల్ హైవే 44 సహా పలుచోట్ల ప్రధాన రహదారులు కోతకు గురికావడం, అనేకచోట్ల వంతెనలు, కాజ్‌వేలు కొట్టుకు పోవడంతో పట్టణాలు, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వందేళ్ల చరిత్ర కలిగిన పోచారం ప్రాజెక్టును వరద ముంచెత్తగా డ్యామ్‌కు ఒకవైపు గుంత పడటంతో ఒకదశలో ప్రాజెక్టు తెగిపోతుందేమోనన్న భయాందోళనలు వ్యక్తం అయ్యాయి. ముందుజాగ్రత్తగా మూడు గ్రామాలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించారు. మరోవైపు ఎన్నడూ లేనివిధంగా ఎగువ మానేరు ఉగ్రరూపం దాల్చింది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగు పారుతున్నాయి. రైల్వే ట్రాక్‌లు సైతం కోతకు గురి కావడంతో పట్టాలు వరదలో తేలుతున్నట్టుగా కన్పించాయి. వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు మరణించగా, ఆరుగురు గల్లంతయ్యారు. రాష్ట్రంలో వర్షాలు వరదల పరిస్థితిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఏరియల్ సర్వే ద్వారా ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

కామారెడ్డి కకావికలం



కామారెడ్డిలో వరదలో చిక్కుకున్న వాహనం

కుండపోతగా కురిసిన వర్షంతో కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. కామారెడ్డి పట్టణం చిగురుటాకులా వణికిపోయింది. కాలనీల్లో ఇళ్లు నీట మునిగాయి. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 24 గంటల్లో జిల్లాలోని 11 మండలాల్లో 30 సెం.మీ. నుంచి 43 సెం.మీ. దాకా వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. వేలాది మంది వరద ముంపుబారిన పడ్డారు. జాతీయ రహదారులతో పాటు జిల్లా రహదారులు, గ్రామీణ రహదారులు, వంతెనలు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు, వరదలు సృష్టించిన బీభత్సంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఒకరు గల్లంతయ్యారు. రాజంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గోడ కూలి ఇప్పకాయల పల్లె దవాఖాన వైద్యుడు వినయ్ (28) ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లిన బీబీపేట మండలం జనగామకు చెందిన రైతు రాజిరెడ్డి (63) ఎడ్లకట్టవాగులో గల్లంతయ్యాడు. గురువారం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. బీబీపేట మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన బాలరాజు వరదలో గల్లంతవగా ఆయన ఆచూకీ దొరకలేదు. జిల్లాలోని బీబీపేట చెరువుకు గండిపడింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండు ఎన్డీఆర్ఎఫ్, ఆరు ఎస్డీఆర్ఎస్ బృందాలు 25 చోట్ల రెస్క్యూ చేసి 775 మందిని కాపాడారు.

మెతుకుసీమ అతలాకుతలం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెతుకుసీమ కకావికలమైంది. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. ముఖ్యంగా హవేళీ ఘన్‌పూర్ మండలంలో వర్షం బీభత్సం సృష్టించింది. మెదక్ నుంచి రాజుపేట వైపు వెళ్తున్న ఓ ఆటో గంగమ్మ వాగులో కొట్టుకుపోవడంతో ఇందులో ప్రయాణిస్తున్న రాజుపేటకు చెందిన బెస్త సత్యనారాయణ మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన యాదగౌడ్ ఆచూకీ ఇంకా లభించలేదు. వాస్తవానికి వీరిద్దరు వాగులో ఉన్న ఓ చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేశారు. అయితే వరద ఉధృతికి వీరు కొట్టుకుపోయారు. మరోవైపు ఇదే మండలంలోని నక్కవాగులో ఓ కారు కొట్టుకుపోయింది. అందులో ఉన్న నరేందర్‌గౌడ్ ఓ పొదను పట్టుకుని 100కు ఫోన్ ద్వారా లొకేషన్ పంపడంతో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. గంగమ్మ వాగుపై రాజుపేట బ్రిడ్జిపై 8 మంది చిక్కుకుపోగా, వీరిని కూడా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. దూప్‌సింగ్ తండాను వరద నీరు ముంచెత్తింది. నిజాంపేట మండలం చల్మెడలోని సోమయ్య



మెదక్ జిల్లాలో నీట మునిగిన దూప్‌సింగ్ తండా

చెరువు, బ్రాహ్మణ చెరువు నిండిపోయి గ్రామాలను ముంచెత్తే ప్రమాదం ఉండటంతో చెరువు కట్టకు గండి పెట్టి నీటిని దిగువకు వదిలేశారు. కొల్చారం మండలంలోని తుక్కాపూర్‌లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లిన టేక్మాల్ మల్లప్ప భార్య ప్రమీల మంజీర నదిలో గల్లంతయ్యింది. గురువారం మధ్యాహ్నం వరకు అందిన వివరాల ప్రకారం..జిల్లాలో 49 రోడ్లు తెగిపోయాయి. 24 కాజ్‌వేలు, కల్వర్టులు కూలిపోయాయి. 21 బ్రిడ్జీలు దెబ్బతిన్నాయి. 22 చెరువులకు గండ్లు పడ్డాయి. మెదక్, రామాయంపేట పట్టణాలతో పాటు, పలు గ్రామాల్లో 20 కాలనీల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. 6,341 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

జలదిగ్బంధంలో రామాయంపేట

రామాయంపేటలో రెండురోజుల్లో 20 సెం.మీ వరకు వర్షం కురిసింది. పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ, అక్కలగల్లి, బీసీ కాలనీ ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రామాయంపేట – కామారెడ్డి– సిద్దిపేట మార్గంలో వరద నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్సీ మహిళా డిగ్రీ కాలేజీ హాస్టల్లో నీరు చేరడంతో 50 మంది విద్యార్థినులను తాళ్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ పర్యటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు.

రైతులు, ఇటుక బట్టీ కార్మికుల రెస్క్యూ

మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న భారీవర్షాలతో రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుకు బుధవారం వరద పోటెత్తింది. రికార్డు స్థాయిలో వచ్చిన నీటితో మానేరు పరవళ్లు తొక్కుతోంది. దిగువన ఉన్న పరీవాహక వాగులో ఒక రైతు గల్లంతు కాగా.. ఐదుగురు రైతులు, ఇద్దరు ఇటుక బట్టీ కార్మికులు ప్రవాహంలో చిక్కుకున్నారు. గురువారం భారత వైమానిక దళ హెలికాప్టర్ సాయంతో రైతులను, కార్మికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. గేదెల కోసం వెళ్లిన గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య అనే రైతు వరదలో గల్లంతయ్యాడు. నర్మాలకు చెందిన పలువురు రైతులు పశువులను తోలుకెళ్లి వాగులో చిక్కుకుపోయారు. అదే ప్రాంతంలో ఉన్న ఇటుకబట్టీలో పనిచేస్తున్న మహారాష్ట్రకు చెందిన ఇద్దరు కార్మికులు అక్కడే ఉండిపోయారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బీ గీతే వరదలో చిక్కుకుపోయిన వారికి డ్రోన్‌ల ద్వారా ఆహార పదార్థాలు పంపించారు.

బండి సంజయ్ చొరవ



వాగు వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న బండి సంజయ్

కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో భారత వైమానిక దళానికి చెందిన హెలీకాప్టర్ సాయంతో రైతులను, కార్మికులను ఒడ్డుకు చేర్చారు. గురువారం సంఘటన స్థలానికి చేరుకున్న సంజయ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రైతులతో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఎగువ మానేరుకు వచ్చి వరద ఉధృతిని పరిశీలించారు. మధ్యాహ్నం ఆర్మీ హెలీకాప్టర్లు బాధితులను రక్షించేంతవరకు ఆయన ఘటనాస్థలంలోనే ఉండటం గమనార్హం. కాగా వరదలో గల్లంతైన నర్మాలకు చెందిన పంపుకాడి నాగయ్య నివాసానికి సంజయ్ వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. నాగం కుమారుడు సాయికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు.

నీటమునిగిన నిర్మల్

నిర్మల్ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకు భారీ నుంచి అతిభారీ వర్షం కురిసింది. నిర్మల్ పట్టణంలో పలు కాలనీలు నీటమునిగాయి. జిల్లాలోని లక్ష్మణచాంద మండలంలో మునిపల్లి శివారులోని గోదావరి కుర్రులో చిక్కుకుపోయిన పశువుల కాపరి శంకర్‌ను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి కాపాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామం వద్ద రోడ్డు మీదుగా ఉధృతంగా వరద నీరు ప్రవహించడంతో సుమారు 24 గంటల పాటు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఎ.

తెగిన ఎన్‌హెచ్- 44..



ఎన్‌హెచ్ 44పై నిలిచిన వాహనాలు

కశ్మీర్ టూ కన్యాకుమారి ఎన్‌హెచ్-44 పై పలుచోట్ల రోడ్డు, వంతెనలు తెగిపోవడంతో జాతీయ రహదారిపై బుధ, గురువారాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ జిల్లా నార్సింగి వద్ద వరద 44వ నంబర్ జాతీయ రహదారిని వరద ముంచెత్తింది. దీంతో హైదరాబాద్ – నిజామాబాద్ మార్గంలో పలుచోట్ల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ – సిద్దిపేట రహదారిపై నిజాంపేట వద్ద ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో ఈ రూట్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ రహదారిపై పోచారం ప్రాజెక్టు పొంగి ప్రవహించడంతో వంతెన దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై భారీగా వరద నీరు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు కామారెడ్డి–భిక్కనూరు మండలాల సరిహద్దులో జంగంపల్లి వద్ద జాతీయ రహదారిపైకి భారీగా వచ్చిన వరద నీటితో రోడ్డు కోతకు గురైంది. సదాశివనగర్ మండలం కల్వరాల వద్ద కూడా ఎన్‌హెచ్ 44 కోతకు గురైంది. టేక్రియల్ వంతెన కోతకు గురైంది. హైదరాబాద్–నిజామాబాద్ ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోయాయి.

కొట్టుకుపోయిన రైల్వే లైన్లు

సికింద్రాబాద్–నిజామాబాద్ రైల్వే లైనుపై పలు చోట్ల మట్టికొట్టుకుపోయి ట్రాక్‌లు గాలిలో వేలాడడంతో రైళ్లను రద్దు చేశారు. మెదక్ జిల్లా శమ్నాపూర్ దేవుని చెరువు నీళ్ల ధాటికి రైల్వే ట్రాక్ కోతకు గురైంది. దీంతో అక్కన్నపేట – మెదక్ మార్గంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి జిల్లా తలమడ్ల సమీపంలో కూడా ట్రాక్ కోతకు గురికావడంతో సికింద్రాబాద్– మన్మాడ్ మార్గంలో రైళ్లు నిలిచిపోయాయి. ఈ రూట్లో రైళ్లు పునరుద్ధరించాలంటే రెండు రోజులైనా పట్టే అవకాశాలున్నాయని అంటున్నారు.

భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో..

భూపాలపల్లి జిల్లా ఎగువనుంచి వరద నీరు వస్తుండటంతో మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మహాముత్తారం మండలంలోని పెగడపల్లి, కేశవపూర్ మధ్య గల పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బమల్హార్ మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా, భూపాలపల్లి ఏరియాలో మంగళవారం, బుధవారం కురిసిన వర్షానికి ఓపెన్‌కాస్ట్ 2,3 ప్రాజెక్టుల్లో 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లినట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. ములుగు జిల్లా మొండ్యాల తోగు వద్ద జాతీయ రహదారి వరద తాకిడికి భారీగా కోతకు గురైంది. ఊరట్టం తూ ముల వాగు వరద తాకిడికి బ్రిడ్జి సమీపంలో రోడ్యాం వద్ద సీసీ రోడ్డు కోతకు గురైంది. రంగాపూర్ పెద్ద చెరువు కట్ట తెగిపోయింది.



ములుగు జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు



రాజన్న సిరిసిల్ల జిల్లా నర్మాల వరద ప్రవాహంలో గల్లంతైన నాగయ్య కుటుంబీకులను ఓదారుస్తున్న కేటీఆర్

సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్నా ముందస్తు ప్రణాళికలు, సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు విమర్శించారు. సహాయక చర్యల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని.. బాధితులకు అండగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలవారీగా వరద నష్టంపై ఆరా తీశారు.

జనజీవనం అస్తవ్యస్తంపై కేసీఆర్ ఆందోళన

భారీ వర్షాలు, వరదలతో రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు కలగడం, జనజీవనం అస్తవ్యస్తం కావడంపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. వరదలతో ఇళ్లు నీట మునిగి, రోడ్లు తెగిపోయి రవాణా వ్యవస్థ అతలాకుతలం కావడంపై దిగ్భ్రాంతి చెందారు. వరద ప్రభావిత ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలతో గురువారం ఫోన్‌లో మాట్లాడారు. తమ వంతుగా పార్టీ శ్రేణులు సహాయక చర్యలు చేపట్టేలా చూడాలని కేటీఆర్‌ను ఆదేశించారు.

బాధితులను పట్టించుకోని సీఎం ఎందుకు?

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



వాడి శివారులో నేలకూలిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

హవేళీఘణాపూర్ (మెదక్): ప్రజలు వరదలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కొట్టుమిట్టాడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం వారి కష్టాలు పట్టించుకోకుండా మూసీ నది, క్రీడలపై సమీక్షలు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బాధితులను పట్టించుకోని సీఎం ఎందుకని ప్రశ్నించారు. గురువారం ఆయన వరదలతో ప్రభావితమైన మెదక్ జిల్లా హవేళీఘణాపూర్ మండలం ధూప్‌సింగ్ తండా, నాగాపూర్, వాడి గ్రామాలను సందర్శించారు. కొట్టుకుపోయిన బ్రిడ్జి, రోడ్లను పరిశీలించారు.



మెదక్ జిల్లా హవేళీ ఘనపూర్ మండలం నాగాపూర్ శివారులోని నక్కవాగులో కొట్టుకుపోతున్న వాహనం

జల దిగ్బంధంలో సిద్దిపేట

రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో సిద్దిపేట జిల్లా కేంద్రం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. ఎగువ నుంచి కోమటి చెరువుకు వరద నీరు చేరడంతో పొంగి పొర్లుతోంది. దీంతో పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, హరిప్రియానగర్, శ్రీనివాసనగర్, సీతారామాంజనేయ థియేటర్ జలమయంగా మారాయి. హరిప్రియానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వరద నీరు చేరడంతో..వరద ప్రవాహంలోనే రోగులను స్ట్రెచర్‌పై మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గజ్వేల్‌లోని లక్ష్మీప్రసన్న కాలనీ, ఎలైట్ ప్రజ్వల్ కాలనీ కూడా నీట మునిగాయి. కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గజ్వేల్–దుబ్బాక మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గజ్వేల్ పట్టణంలోని ఎర్రకుంట పొంగి పొర్లుతుండటంతో వరద నీరంతా తూప్రాన్ రోడ్డు వై జంక్షన్ వద్ద నిలిచి 33/11 కేవీ సబ్ స్టేషన్ జలమయంగా మారింది. వరద ముంపులో చిక్కుకున్న సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు 22 గంటల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపారు. అనంతరం ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పడవ ద్వారా వారిని ఒడ్డుకు చేర్చారు.

పోచారం ప్రాజెక్టుకు తప్పిన ముప్పు

కామారెడ్డి జిల్లాలోని పోచారం ప్రాజెక్టుకు భారీ ముప్పు తప్పింది. భారీ వర్షాలతో ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టు పైభాగం నుంచి నీరు పడడంతో స్ట్రక్చర్‌కు ఒకచోట గొయ్యి ఏర్పడింది. ప్రాజెక్టు తెగిపోయినట్టేనని అందరూ భావించారు. కానీ వరద తీవ్రత తగ్గడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రైలుకు ఎదురెళ్లి నిలిపేసిన గ్యాంగ్‌మన్



గ్యాంగ్‌మన్ అప్రమత్తతతో పెద్ద రైలు ప్రమాదం తప్పింది. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో బుధవారం కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి–తిప్పాపూర్ మధ్య 528 మైలురాయి వద్ద రైల్వే ట్రాక్ కింద ఉన్న మట్టికట్ట 50 గజాల మేర కొట్టుకుపోయింది. దీంతో రైలు పట్టాలు గాల్లో వేలాడుతున్నాయి. గ్యాంగ్‌మన్ రమేష్ దీన్ని గమనించి అప్రమత్తమయ్యాడు. భిక్కనూరు నుంచి వస్తున్న కాచిగూడ–పెద్దపల్లి ప్యాసింజర్ రైలుకు ఎదురుగా వెళ్లి అది ఆగిపోయేలా చూశాడు. ట్రాక్ కొట్టుకుపోయిన విషయాన్ని లోకో పైలట్‌కు తెలియజేయడంతో ఆయన స్టేషన్ మాస్టర్ భానుశేఖర్‌కు సమాచారం అందించారు. ఆయన ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడంతో వారు వెంటనే సికింద్రాబాద్–నిజామాబాద్ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసి, కొన్ని రైళ్లను వేరే మార్గంలోకి మళ్లించారు. కాచిగూడ–పెద్దపల్లి ప్యాసింజర్ రైలులో 167 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరగకుండా వీరిని కాపాడిన గ్యాంగ్‌మన్ రమేష్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్, ప్రయాణికులు అభినందించారు.



వరదకు దెబ్బతిన్న మెదక్–అక్కన్నపేట రైల్వే లైన్



నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లోని ఎక్సైజ్ కార్యాలయ భవనంలో చిక్కుకుపోయిన కానిస్టేబుల్, నైట్ వాచ్‌మెన్‌లను సురక్షితంగా బయటకు తీసుకొస్తున్న రెస్క్యూ టీం సభ్యుడు



కామారెడ్డి హౌసింగ్‌బోర్డు కాలనీలో వరదనీటిలో కొట్టుకుపోతున్న కార్లు



నిర్మల్ శివాజీ చౌక్‌లో రోడ్లపై వరద నీటితో ఇక్కట్లు పడుతూ వెళ్తున్న జనం

మట్టి కొట్టుకుపోయినా.. గట్టిగా నిలిచి..

భారీ వరదను తట్టుకున్న పోచారం ప్రాజెక్టు
నిజాం కాలం నాటి ఇంజనీర్ల ప్రతిభకు ఈ ప్రాజెక్టే నిదర్శనం



బుధవారం ఇలా.. వరద ఉధృతికి మట్టి కొట్టుకు పోతున్న దృశ్యం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రెండు రోజులుగా కురుస్తున్న కుంభవృష్టితో పోచారం ప్రాజెక్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. 70 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టుకు ఒక్కసారిగా 1.80 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో ఈ డ్యాంను ఆనుకొని ఉన్న మట్టి కొట్టుకుపోయి భారీ గొయ్యి ఏర్పడింది. ప్రమాదకరంగా మారిన ఈ గొయ్యితో ప్రాజెక్టు కొట్టుకొనిపోయి ఉంటే భారీ విధ్వంసమే జరిగేది. దిగువన ఉన్న పదుల సంఖ్యలో ఊర్లు మునిగిపోయేవి. ప్రధానంగా హవేళీ ఘనపురం మండలం సర్దెన, జక్కనపేట, పోచంరాల్, కుర్తివాడ గ్రామాలన్నీ కొట్టుకుపోయేవి. వందల్లో ప్రాణనష్టం, భారీగా ఆస్తినష్టం జరిగేది. పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించిన అధికారులు గురువారం తెల్లవారుజామున సర్దెన, జక్కనపేట గ్రామాలను ఖాళీ చేయించారు. 700లకు పైగా కుటుంబాలను మెదక్, హవేళీ ఘనపురంలో ఏర్పాటు చేసిన మూడు పునరావాస కేంద్రాలకు తరలించారు. కానీ ఇంత భారీ వరదను సైతం తట్టుకొని ఈ ప్రాజెక్టు నిలబడటంతో అందరినీ ఊపిరి పీల్చుకునేలా చేసింది.

సర్దెన చెక్‌డ్యాం కారణమా?

పోచారం ప్రాజెక్టు దెబ్బతినడానికి కారణాలపై నీటిపారుదల శాఖ అన్వేషిస్తోంది. ఈ ప్రాజెక్టు దిగువన సుమారు 12 అడుగులతో నిర్మించిన చెక్‌డ్యాం కారణంగానే ఈ ప్రాజెక్టుకు నష్టం జరిగిందనే అభిప్రాయానికి ఇంజనీర్లు భావిస్తున్నారు. ఎత్తయిన ఈ చెక్‌డ్యాంతో వరద నీరు ఎదురొచ్చి ప్రాజెక్టుకే ముప్పు తెచ్చేలా చేసిందని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.



గురువారం ఇలా..మట్టి కొట్టుకుపోయినా.. గట్టిగా నిలిచిన సున్నపురాయి కట్టడం

103 ఏళ్ల ప్రాజెక్టు..


పోచారం ప్రాజెక్టు కామారెడ్డి-మెదక్ జిల్లాల సరిహద్దుల్లో ఉంది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం పోచారం గ్రామంలో మంచిప్ప వంగ (మంజీరా నది ఒక పాయ) మీద నిర్మించిన మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు. తెలంగాణలోని తొలి నీటిపారుదల ప్రాజెక్టుగా దీనికి పేరుంది. 1917లో నిజాం కాలంలో ఈ ప్రాజెక్టుకు పునాదిరాయి పడింది. ఐదేళ్ల పాటు నిర్మాణ పనులు కొనసాగి 1922లో పూర్తయ్యింది. అంటే ఏకంగా 103 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు మెదక్, కామారెడ్డి జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తోంది. ఈ ప్రాజెక్టు 2.42 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. పేరుకుపోయిన మట్టితో ప్రస్తుతం 1.82 టీఎంసీలకు తగ్గింది.

సున్నపు రాయితో నిర్మాణం

ఈ ప్రాజెక్టును సున్నపురాయి, రాక్‌ఫిల్ అనే సాంప్రదాయ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్‌తో నిర్మించారు. అప్పట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.17.11 లక్షలు. ఆధునీకరణ పనుల్లో భాగంగా కాంక్రీట్‌తో కాలువల నిర్మాణం జరిగింది. ఆ తర్వాత రూ.73 లక్షలతో ఈ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు చేశారు.

గోదావరి మళ్లీ ఉగ్రరూపం

ఉపనదులకూ పోటెత్తిన వరద
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 2 లక్షల క్యూసెక్కుల వరద
- ఎల్లంపల్లికి 6 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- రేపు మేడిగడ్డ బరాజ్‌కు 9.5లక్షల క్యూసెక్కులకు చేరనున్న వరద
- జైక్వాడ్ నుంచి ధవళేశ్వరం బరాజ్ వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత



ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పరుగులు పెడుతున్న గోదావరి



సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం సర్మాల వద్ద ఎగువమానేరు డ్యాంలో వరద ఉధృతి

సాక్షి, హైదరాబాద్: గోదావరి నది మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. పరీవాహక ప్రాంతాల్లో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రధాన ఉపనదులైన మంజీర, మానేరు, పెన్‌గంగా, వార్ధా, వెయిన్‌గంగా, ప్రాణహిత, ఇంద్రావతి, శబరితోపాటు గోదావరి నది ఎగువ, మధ్య, దిగువ పాయలు భీకరంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పరీవాహకంలోని అన్ని ప్రాజెక్టులకు గంటగంటకూ భీకర వరద పోటెత్తడంతో అప్రమత్తత ప్రకటించారు. మహారాష్ట్రలోని జైక్వాడ్ ప్రాజెక్టు నుంచి ఏపీలోని ధవళేశ్వరం బరాజ్ వరకు పరీవాహకంలోని అన్ని ప్రాజెక్టుల గేట్లు పైకి ఎత్తారు.

- ➤ భద్రాచలం వద్ద గోదావరిలో 7.45 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో నీటిమట్టం 38.6 అడుగులకు చేరుకుంది. ప్రవాహం 9.32 లక్షల క్యూసెక్కులకు చేరితే తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.
- ➤ మంజీరపై ఉన్న సింగూరు ప్రాజెక్టుకు 44,650 క్యూసెక్కుల వరద వస్తుండగా, 18.32 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న నిజాంసాగర్ గరిష్ట సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, 1.81లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 16.14 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 27 గేట్లు పైకెత్తి 2.2 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.
- ➤ శ్రీరాంసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రాజెక్టుకు 3.2 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 67.05 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 39 గేట్లు పైకెత్తి 3.55 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నెల 30న శ్రీరాంసాగర్‌కు గరిష్టంగా 3.7లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తనుందని అంచనా వేశారు.
- ➤ కడెం ప్రాజెక్టు సామర్థ్యం 4.7 టీఎంసీలు కాగా, 66,605 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 3.78 టీఎంసీల నిల్వ కొనసాగిస్తూ, 62,407 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. స్వర్ణ ప్రాజెక్టులోకి 5,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో అదేస్థాయిలో రెండుగేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 17,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో మూడుగేట్ల ద్వారా 18,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.
- ➤ దిగువన ఉన్న ఎల్లంపల్లి నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా 5.14 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో 14.63 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 38 గేట్లు పైకెత్తి 5.9 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సోమవారం రాత్రి నాటికి 9 లక్షల క్యూసెక్కులకు వరద పెరుగుతుందని అంచనా వేశారు.
- ➤ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సుందిళ్ల బరాజ్‌కు 8.36 లక్షలు, అన్నారం బరాజ్‌కు 6.19 లక్షలు, మేడిగడ్డ బరాజ్‌కు 5.52 లక్షల క్యూసెక్కులతోపాటు సమ్మక్క బరాజ్‌కు 5.13 లక్షలు, సీతమ్మ సాగర్ బరాజ్‌కు 7.02 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చిన వరదను వచ్చినట్టు కిందకు విడుదల చేస్తున్నారు. మేడిగడ్డ బరాజ్‌కు శనివారం నాటికి గరిష్టంగా 9.48 లక్షల క్యూసెక్కుల వరద రానుందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం మంగళ, బుధవారాల్లో అత్యంత ప్రమాదకర స్థాయికి పెరగనున్నట్టు అంచనా వేస్తున్నారు.

మిడ్‌మానేరు గేట్లు ఎత్తివేత..

భారీ వర్షాలతో మానేరు నది పోటెత్తింది. దీంతో మిడ్‌మానేరు రిజర్వాయర్‌కు మానేరు నుంచి 45,565 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ నుంచి ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా మరో 12,000 క్యూసెక్కులు కలిపి మొత్తం 57,566 క్యూసెక్కులు వచ్చి మిడ్‌మానేరులో కలుస్తుండడంతో జలాశయ 17 గేట్లను పైకెత్తి 47,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో దిగువ మానేరు జలాశయానికి వరద ప్రవాహం 56,944 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయం నిల్వ సామర్థ్యం 24.07 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.97 టీఎంసీలకు నిల్వలు చేరాయి. మంగళవారం ఉదయం నాటికి జలాశయం పూర్తిగా నిండొచ్చు.

సాగర్‌కు పెరిగిన వరద

26 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్/డిండి: సాగర్ జలాశయానికి 3,18,791 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, 26 క్రస్ట్ గేట్లు, విద్యుదుత్పాదనతో దిగువ కృష్ణానదిలోకి 2,35,058 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఆయకట్టుకు నీటి అవసరాలు తగ్గాయి. దీంతో నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు. అవసరమైన సమయంలో మళ్లీ నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

అలుగు పారుతున్న డిండి ప్రాజెక్టు

డిండి మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టులోకి వరద మరింత పెరిగింది. ఈ నెల 14 నుంచి ప్రాజెక్టు అలుగుపోస్తున్న విషయం తెలిసిందే. అయితే గురువారం నుంచి ప్రాజెక్టులోకి 10,202 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో అలుగు నుంచి నీటి విడుదల కూడా పెరిగింది. డిండి ప్రాజెక్టు అందాలను చూడటానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు.

వాగు దాటి.. అంత్యక్రియలు పూర్తి చేసి..



రేగోడ్(మెదక్): భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఓ యువకుడి అంత్యక్రియలు చేయడానికి కుటుంబసభ్యులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చివరి కార్యక్రమం నిర్వహించడానికి అండగా నిలిచారు. ఈ హృదయ విదారక ఘటన మెదక్ జిల్లా రేగోడ్ మండలం మర్పల్లిలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన బండి జనార్దన్‌కు కూతురు, కుమారుడు హరికృష్ణ (22) ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో హరికృష్ణ కాలు విరిగింది. అప్పటి నుంచి అనారోగ్యంతోనే ఉన్నాడు. నాలుగు రోజులుగా ఆరోగ్యం మరింత క్షీణించి మృతి చెందాడు.అంత్యక్రియలు చేయడానికి వెళుతుండగా, మర్పల్లి గొల్లవాగు దాటడం కష్టంగా మారింది. గ్రామస్తులందరూ కదిలివచ్చి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. జేసీబీ, ట్రాక్టర్ తెప్పించి మృతదేహంతో పాటు కుటుంబీకులను వాగు దాటించారు. తాడు సాయంతో గ్రామస్తులు సైతం వాగు దాటి అంత్యక్రియలు పూర్తి చేశారు.

మద్యం మత్తులో పందెం..
వాగులో కొట్టుకుపోయిన యువకుడు

అనంతగిరి(కోదాడ): మద్యం మత్తులో ముగ్గురు యువకులు వేసుకున్న పందెం ఒకరి ప్రాణాల మీదకు తెచ్చింది. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని పాలేరు వాగు వద్ద ఈ ఘటన జరిగింది. గోండ్రియాల గ్రామానికి చెందిన కిన్నెర ఉపేందర్ (30), అర్జున్, రాజు స్నేహితులు. గురువారం మధ్యాహ్నం వీరంతా మద్యం సేవించి ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు వాగుకు వెళ్లారు. వాగు దాటాలన్న పందెం కాశారు. అయితే రాజుకు ఈత రాకపోవడంతో వాగులోకి దిగలేదు. ఉపేందర్, అర్జున్ వాగు దాటేందుకు దూకారు. స్వల్ప అంగవైకల్యం ఉన్న ఉపేందర్ వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. అర్జున్ అతికష్టంపై ఒడ్డుకు చేరుకున్నాడు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వాగులో వెతగ్గా.. ఉపేందర్ ఆచూకీ లభించలేదు. రాత్రి కావడంతో ఆపరేషన్‌ను ఆపేశారు. శుక్రవారం తిరిగి గాలింపు చేపడతామని సీఐ ప్రతాప్ లింగం తెలిపారు.

ప్రసవం కోసం జేసీబీలో..



రాయికల్: జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన నిండు గర్భిణి పాల్మ్య కల్యాణి పురిటినొప్పులతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు గురువారం రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు బయల్దేరారు. అయితే మండలంలోని భూపతిపూర్, రామాజీపేట గ్రామాల మధ్యనున్న కల్వర్టు పైనుంచి వరద పొంగిపొర్లుతుండటం వల్ల ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. గర్భిణి ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక యువత.. ఎంపీడీవో చిరంజీవి, రామాజీపేట కార్యదర్శి మహేశ్, కానిస్టేబుల్ తిరుపతి సహకారంతో కల్యాణి, ఆమె కుటుంబసభ్యులను జేసీబీలో కూర్చోబెట్టుకొని కల్వర్టు దాటించారు. అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో రాయికల్ ఆస్పత్రికి తరలించారు.

కొట్టుకుపోయిన వంతెన..
గర్భిణిని స్ట్రెచర్ ద్వారా దాటించిన ఎన్‌డీఆర్‌ఎఫ్



హవేలీ ఘనపూర్ (మెదక్): మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని రాజ్‌పేట తండాకు చెందిన మాలోత్ హరిత పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో ఆస్పత్రికి తరలించేందుకు తండా నుంచి బూర్గుపల్లి వరకు కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. అయితే భారీ వర్షాలకు బూర్గుపల్లి వద్ద వంతెన కొట్టుకుపోవడంతో అక్కడే ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది స్ట్రెచర్ సాయంతో ఆమెను వంతెన దాటించి 108 అంబులెన్సులో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

2 వేల మందిని కాపాడారు



కామారెడ్డి జిల్లా సరంపల్లి గిరిజన వసతి గృహంలో చిక్కుకున్న విద్యార్థులను తాళ్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



మెదక్ జిల్లా రామాయంపేట సాంఘిక సంక్షేమశాఖ గురుకుల హాస్టల్ విద్యార్థులను తాళ్ల సహాయంతో తరలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

- ముమ్మరంగా సహాయక చర్యలు చేపడుతున్న వివిధ ప్రభుత్వ శాఖలు
- రంగంలోకి రెండు వాయుసేన హెలికాప్టర్లు.. 700 మందికిపైగా కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో ప్రభుత్వం రెస్క్యూ ఆపరేషన్లను ముమ్మరం చేసింది. కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోని వరద ప్రాంతాల నుంచి రెండు రోజుల్లో సుమారు 2 వేల మందిని కాపాడారు. ఒక్క ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలే దాదాపు 769 మందిలో 764 మందిని రక్షించాయి. మరో నలుగురు వరదలో చిక్కుకొని ఉండగా ఒక వ్యక్తి జాడ కనిపించలేదని రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ పేర్కొన్నారు. మొత్తం 13 ప్రాంతాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి, అందులో కామారెడ్డి, రామాయంపేట, అన్నాసాగర్ గ్రామం, రామారావుపల్లె, హవేళి ఘన్‌పూర్ మండలంలోని వాడి, కామారెడ్డిలోని ఎస్సీ సంక్షేమ విద్యార్థి గృహం నుంచి 200 మంది విద్యార్థులను రక్షించారు. రామాయంపేటలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లోని దాదాపు 80 మంది విద్యార్థులను ఈ బృందాలు రక్షించాయి. రామాయంపేట పట్టణంలోని ఎస్సీ ఉమెన్స్ డిగ్రీ కాలేజీ నుంచి 350 మంది విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

కామారెడ్డికి ఫోన్ చేస్తే ఖమ్మం కలెక్టరేట్‌కు

ఖమ్మం సహకారనగర్: కామారెడ్డి జిల్లాలోని వరద పరిస్థితి గురించి వివరించేందుకు బీబీపేట మండలం యాదారం గ్రామవాసి రమేశ్ బుధవారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని 1077 నంబర్‌కు ఫోన్ చేయగా లైన్ బిజీగా ఉండటం వల్ల ఆ ఫోన్ కాల్ ఖమ్మం కలెక్టరేట్‌కు చేరింది. 1077 నంబర్ అన్ని కలెక్టరేట్లలో ఉండగా ఒక జిల్లాలో స్పందన రాకపోతే మరో జిల్లాకు వెళ్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే రమేశ్ చేసిన ఫోన్‌ను ఖమ్మం కలెక్టరేట్ సిబ్బంది స్వీకరించి మాట్లాడారు. ఆపై కామారెడ్డి జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వగా ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గురువారం తెల్లవారుజామునే సుమారు 9 మందిని కాపాడారని రమేశ్ పేర్కొన్నాడు.

సత్యాన్ని తిరస్కరించినవాడు, తన తిరస్కార ఫలితాన్ని అనుభవిస్తాడు. సత్కార్యాలు చేసినవారు, తమ కొరకు సాఫల్య మార్గాన్ని తయారుచేసుకుంటారు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 29 ఆగస్టు 2025

సుంకాలపై 'సమష్టి' పోరు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. మన దేశంపై ఉన్న అదనపు సుంకాల భారాన్ని 50 శాతానికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఉన్న 25 శాతం సుంకాలకూ బుధవారం నుంచి మరో 25 శాతం చేరింది. క్షణానికో రకంగా, రోజుకో విధంగా ప్రవర్తిస్తూ ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోవటంలో సిద్ధహస్తుడైన ట్రంప్ చివరికి ఏం చేస్తారోనన్న ఉత్కంఠ అందరిలో ఉండేది. మూర్ఖత్వం విచక్షణను ఎరుగదు. తన ఆదేశాలను ధిక్కరిస్తూ రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేయటం వల్లే ఈ చర్య తీసుకున్నట్టు అమెరికా చెప్పుకొంటోంది. మనల్ని మించి ముడిచమురు కొంటున్న చైనాకు ఆ తర్కం ఎందుకు వర్తించదో ఇంతవరకూ అది సంజాయిషీ ఇవ్వలేకపోయింది. అసలు రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపే శక్తి అమెరికాకు తప్ప మరెవరికీ లేదు. ఎందుకంటే తెరవెనకుండి యూరప్ దేశాల ద్వారా ఉక్రెయిన్‌ను రష్యాపై ఉసిగొల్పిందీ, ఆ యుద్ధానికి అంకురార్పణ చేసిందీ తానే. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించటం ద్వారా... లేక ఇక వెనక్కు తగ్గాలని ఉక్రెయిన్‌ను కోరటం ద్వారా శాంతికి దోహదపడాల్సింది కూడా తానే. కానీ ఆ పని చేయకపోగా ఆ యుద్ధం కొనసాగటానికి మనమే బాధ్యులమంటూ దబాయిస్తోంది. దాన్ని 'మోదీ యుద్ధం'గా అభివర్ణిస్తూ వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవరో నోరు పారేసుకున్నారు. మనం చమురు కొనటం వల్లే రష్యా యుద్ధం కొనసాగుతోందని తప్పుడు భాష్యానికి దిగారు. ఏ రకంగా చూసినా ప్రపంచంలో సకల అవలక్షణాలకూ బాధ్యత వహించక తప్పని అమెరికాయే రష్యా– ఉక్రెయిన్ యుద్ధానికి కూడా కర్త, కర్మ, క్రియ. ఏకకాలంలో భిన్న సూచనల్ని పంపి అవతలి పక్షాన్ని గందరగోళపరచటం అమెరికాకు అలవాటైన విద్య. ఈ దబాయింపులకు ముందురోజే ఆర్థిక మంత్రి స్కాట్ బిసెంట్ 'చివరకు రెండు దేశాలూ ఒక్కటవుతాయి' అని మాట్లాడారు. అందరికన్నా ముందు ఏప్రిల్‌లోనే వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు మొదలెట్టిన భారత్... మే 1 లేదా జూన్ 1 కల్లా దానిపై సంతకాలు చేయాల్సిందని ఆయన చెబుతున్నారు. చర్చించుకుని ఒప్పందంపై సంతకాలు చేస్తారు తప్ప, తమకు నచ్చినట్టు రాసుకుని, ఒప్పందం పూర్తయినట్టేనని చెబితే అంగీకరించేదెవరు? ఇలాంటివి మాఫియా సామ్రాజ్యాల్లో చెల్లుబాటవుతాయి. నాగరిక ప్రపంచంలో సాధ్యపడదు.

భారత్–అమెరికా సంబంధాలు ఆదినుంచీ సంక్లిష్టమైనవే. ఇందుకు అమెరికా తనను తానే నిందించుకోవాలి. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో పాకిస్తాన్‌కు సాయపడుతూ, మనల్ని చీకాకు పరిచేందుకు నిరంతరం ప్రయత్నించేది. ఆ దశ దాటి ఇరు దేశాల మధ్యా స్నేహం చిగురించి, దృఢమైన బంధంగా మారి దశాబ్దాలు దాటుతోంది. కానీ పాకిస్తాన్‌ను దువ్వటం ఆపలేదు. ఉగ్రవాద ఘటనలు జరిగినప్పుడల్లా మన దేశం డిమాండ్ చేస్తే తాత్కాలికంగా ఆర్థిక సాయం ఆపటం లేదా ఆయుధ సామగ్రి ఎగుమతి నిలిపినట్టు కనబడటం, ఆ తర్వాత పునరుద్ధరించటం అమెరికా దురలవాటు. మొన్నటికి మొన్న పెహల్గాంలో ఉగ్రవాదుల దుశ్చర్యపై ఒక్క మాట మాట్లాడటానికి నోరు పెగలని ట్రంప్, భారత్–పాక్ ఘర్షణల్ని ఆపానని స్వోత్కర్షకు పోవటం ఇప్పటికీ ఆపలేదు. సరిగదా పాక్ ఆర్మీ చీఫ్‌కు ఘనంగా మర్యాదలు చేశారు. కెనడాలో జరిగిన జీ–7 శిఖరాగ్ర సదస్సు నుంచి రావాలన్న ఆహ్వానాన్ని మోదీ తిరస్కరించటం, తమ డెయిరీ ఉత్పత్తులనూ, జన్యుమార్పిడి ఆహార ఉత్పత్తులనూ అనుమతించాలన్న ఒత్తిడికి అంగీకరించకపోవటం ట్రంప్ కడుపుమంటకు కారణం. కానీ ముడిచమురు సాకు చెబుతున్నారు. భారత్‌లో 46 శాతం మంది సాగు రంగంపై ఆధారపడతారు. అమెరికాలో ఇది ఒక్క శాతమే. ఆ ఒక్కశాతం కోసం దేశ జనాభాలో సగంమంది ఆధారపడే రంగాన్ని ధ్వంసం చేయాలట!

ఏమైతేనేం తాజా సుంకాల భారం మన దేశంనుంచి పోయే 66 శాతం ఎగుమతులపై తీవ్ర ప్రభావమే చూపగలదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందువల్ల ఈ ఏడాది, వచ్చే ఏడాది మన వృద్ధిపై 0.8 శాతం కోత పడవచ్చంటున్నారు. రత్నాభరణాలు, దుస్తులు, వాహనాల విడిభాగాలు, స్టీల్, రొయ్యలు, తోలు ఉత్పత్తులు వగైరాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందనీ, ఈ రంగాల్లో అనిశ్చితి ఏర్పడుతుందనీ అంచనా. లక్షలాదిమంది కార్మికుల ఉద్యోగాలకు ముప్పు కలగవచ్చు కూడా. ఈ ఎగుమతుల్ని వేరే దేశాలకు మళ్లించగలిగితే నష్టాన్ని తగ్గించుకోగలం. అదృష్టవశాత్తూ మనది ఎగుమతుల ఆధారిత ఆర్థిక వ్యవస్థ కాదు. అందుకే దేశ ప్రజానీకమంతా ఒక్కటై పట్టుదలగా ఇక్కడి ఉత్పత్తుల్ని ప్రోత్సహిస్తే ఈ గండాన్ని గట్టెక్కడం కష్టం కాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.షష్ఠి సా.5.41 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** స్వాతి ప.10.32 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** సా.4.45 నుండి 6.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.20 వరకు, **అమృత ఘడియలు:** రా.3.22 నుండి 5.10 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.15
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

తట్టుకోగలదు!



ఇండియాపై యూఎస్ విధించిన 50 శాతం సుంకాలు అమలులోకి వచ్చాయి. కానీ కష్టాలు ఇండియాకు కొత్త కాదు. మంచి దేశీయ మార్కెట్, తక్కువ ద్రవ్యోల్బణం, బలమైన ఎఫ్‌డీఐల వెల్లువ, 700 బిలియన్ డాలర్ల రిజర్వులతో ఇండియా వాటిని కొంతకాలం భరించగలదు.

– క్యుంగ్‌హూన్ కిమ్, విధాన నిపుణుడు

బలం



మీకు అత్యంత ఇష్టం అయిన దాని కోసం బయటెంత గడ్డకట్టే చలి ఉన్నా ఉదయాన్నే లేవక మానరు. మీ లక్ష్యం బలంగా ఉన్నప్పుడు ఏ అవాంతరమూ మిమ్మల్ని నిరాశ పరచలేదు.

– మరియా షరపోవా, టెన్నిస్ క్రీడాకారిణి

శబ్దాలు



క్రమం తప్పని కొన్ని దినచర్యలు, ఫిట్‌నెస్, కొంచెం ధ్యానం, యోగా, ప్రాణాయామం ... నా ఆరోగ్య రహస్యం. వీటితో నాకు ఇష్టం లేని బయటి శబ్దాలను నా లోపలికి చొరబడకుండా ఆపగలుగుతాను.

– చేతేశ్వర్ పుజారా, క్రికెటర్

అనుభవం



నిజంగా నేర్చుకోవటం అన్నది గ్రాడ్యుయేషన్ తర్వాతే ప్రారంభమవుతుంది. ప్రపంచమే క్లాస్ రూమ్. పరిచయాలే ప్రొఫెషనల్ ఎక్స్‌పీరియన్స్. ఆరంభ ఉద్యోగాలను జీతం కోసం చేయకండి! అనుభవం కోసం చేయండి!!

– రాజీవ్ మెమానీ, 'ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఇ.వై.) ఇండియా' చైర్మన్

పొరపాటు



ఎక్కువగా ప్లాన్ చెయ్యకండి. చాలామంది చేసే పొరపాటే ఇది. అస్థిరత పెరుగుతున్న ఈ ప్రపంచంలో అతిగా ప్లాన్ చెయ్యటం వల్ల, అందులోనే ఉండిపోయి అవకాశాలను గమనించటం మానేస్తాం.

– దారా ఖోస్రోషాహి, 'ఉబర్' సీఈవో

ఏఐకి మించి...



ఏఐ అద్భుతమైనవెన్నో చెయ్యగలదు. మ్యూజిక్‌ని క్రియేట్ చెయ్యగలదు. కానీ ఫన్నీగా ఉండటం తెలీదు. నేను చెప్పేదేమిటంటే – ఏఐకి కూడా సాధ్యం కాని దాంట్లో మీరు ఎక్స్‌పర్ట్ అయ్యుండాలని!

– టీనా ఫే, హాస్య నటి

భారత్‌కు పరీక్షా సమయం

విశ్లేషణ



టంకశాల అశోక్

భారత ప్రభుత్వం పలు దేశాలతో సంబంధాల అభివృద్ధికి శీఘ్రగతిన చేస్తున్న ప్రయత్నాలు, చూపుతున్న స్వతంత్ర ధోరణి అమెరికాతో తలెత్తిన సమస్యల వల్ల తాత్కాలికమా? లేక దీర్ఘ కాలంలో 'బ్రిక్స్' వేదికగా బహుళ ధ్రువ ప్రపంచ వ్యవస్థే సరైన ప్రత్యామ్నాయమనే గుర్తింపు మౌలికమైన రీతిలో కలిగినందువలనా? ఈ కీలకమైన ప్రశ్నపై స్పష్టత అవసరం. ఎన్నెన్ని లోపాలు ఉన్నా వర్ధమాన ప్రపంచంలోని అగ్ర దేశాలలో భారతదేశం ఒకటి. ప్రపంచం ఆర్థికంగా, రాజకీయంగా, వ్యూహాత్మకంగా కూడా ఒక చౌరస్తా వంటి పరిస్థితిలోకి వచ్చి చేరింది. ప్రపంచాన్ని అన్ని విధాలుగా కొన్ని శతాబ్దాల పాటు శాసించిన పాశ్చాత్య దేశాలు బలహీనపడుతుండటం ఒకవైపు కనిపిస్తున్నది. నెమ్మదిగా బలపడుతూ, స్వతంత్ర ధోరణిలో ముందుకు పోజూస్తున్న వర్ధమాన దేశాల ధోరణి మరోవైపు ఆవిష్కృతమవుతున్నది. అటువంటపుడు భారతదేశం ఎక్కడ నిలిచి ఏ పాత్ర వహించగలదన్నది చరిత్రాత్మక నిర్ణయం కానున్నది.

తాత్కాలికమా? దీర్ఘ కాలికమా?

భారతదేశం వివిధ కారణాల వల్ల గత పాతిక సంవత్సరాలుగా అమెరికన్ శిబిరానికి సన్నిహితంగా ఉంటూ వచ్చింది. ఇటీవలి కాలంలో బలహీనపడుతున్న అమెరికాకు తన పట్ల, ప్రపంచం పట్ల దృష్టి మారి గతం కన్నా భిన్నమైన విధానాలను రూపొందించుకుంటున్నది. ఈ కొత్త పరిస్థితి భారతదేశానికి ఒక పరీక్షగా మారిందన్నది గుర్తించవలసిన విషయం. అమెరికా విధానాలలోని మార్పుల వల్ల వాణిజ్య సుంకాల రూపంలో, వాణిజ్య ఒప్పందపు చర్చల రూపంలో, ఇతరత్రా కూడా ఎదురవుతున్న ఆర్థిక రంగ సమస్యలు కనిపిస్తున్నవే! ఇవి గాక, ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న అనేక చర్యల ప్రభావాలు భారతదేశంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉండబోతున్నాయి. ఉదాహరణకు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ), ఐసీజే, ఐసీసీ, యూఎన్ఓ, డబ్ల్యూహెచ్ఓ, యునిసెఫ్ మొదలైన సంస్థలను బలహీనపరచటమో, వాటి నుంచి ఉపసంహరించుకోవటమో అమెరికాకు నిత్యకృత్యంగా మారింది.

అటువంటపుడు ప్రభుత్వం అమెరికాతో ఏర్పడిన సమస్యలు తాత్కాలికమని, క్రమంగా వెనుకటి స్థితి ఏర్పడగలదనే అవగాహనతో ముందుకు పోతుందా అన్నది ఒక ప్రశ్న. దీని అర్థం అమెరికాతో మైత్రికి బదులు వైరం ఏర్పడాలని ఎంతమాత్రమూ కాదు. కానీ, తగిన స్పృహ, జాగ్రత్తలు లేని మైత్రికీ, అవి ఉండే మైత్రికీ తేడా ఉంటుంది. అదే సమయంలో రెండు దేశాల మధ్య ఇటీవల తలెత్తిన



◆ స్వల్పకాలిక, మధ్యకాలిక ప్రయోజనాల కోసం అమెరికా వైపు చూడవలసి రావటం ఎంత అవసరమో, దీర్ఘకాలిక దృష్టితో 'బ్రిక్స్' వంటి ప్రత్యామ్నాయాలు, బహుళ ధ్రువ ప్రపంచాలను లక్ష్యంగా పెట్టుకోవటం కూడా అంతే అవసరం. ఏక కాలంలో ఈ రెండింటితో ఎట్లా వ్యవహరిస్తారన్నది దౌత్యనీతిపై ఆధారపడి ఉంటుంది.

సమస్యలు పరిష్కారం కావటం అవసరం. అందువల్ల కలిగే మేలు చాలానే ఉంటుంది. అందులో వ్యూహాత్మకమైనవి, దేశ రక్షణకు సంబంధించినవి కూడా ఉంటాయి.

అయితే, స్వల్పకాలిక, మధ్యకాలిక ప్రయోజనాల కోసం అమెరికా వైపు చూడవలసి రావటం ఎంత అవసరమో, దీర్ఘకాలిక దృష్టితో 'బ్రిక్స్' వంటి ప్రత్యామ్నాయాలు, బహుళ ధ్రువ ప్రపంచాలను లక్ష్యంగా పెట్టుకోవటం కూడా అంతే అవసరం. ఏక కాలంలో ఈ రెండింటితో ఎట్లా వ్యవహరిస్తారన్నది దౌత్యనీతిపై ఆధారపడి ఉంటుంది. వాస్తవానికి అటువంటి సంతులనం అవసరమని జైశంకర్ విదేశాంగ మంత్రి అయిన కొత్తలోనే 'ది ఇండియా వే' పుస్తకంలో సూచించారు. కానీ, అప్పటికన్నా పాశ్చాత్య ప్రపంచపు బలహీనతలు పెరిగాయి. ముఖ్యంగా ట్రంప్ విధానాలతో పరిస్థితులు గణనీయంగా మారుతున్నాయి. అందువల్ల, ప్రత్యామ్నాయాల వైపు లోగడకన్నా మరింత ఎక్కువ దృష్టి పెట్టవలసిన అవసరం ఏర్పడుతున్నది.

బ్రిక్స్ కరెన్సీ అనకుండానే...

పోతే, ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు కొన్నింటిని చూద్దాము. అవి – ట్రంప్ సుంకాలు, జిన్‌పింగ్‌తో జైశంకర్ సమావేశం, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఢిల్లీకి రావడం, ఈ నెలాఖరున బీజింగ్‌లో జరిగే 'షాంఘై సహకార సంస్థ' శిఖరాగ్ర సమావేశానికి మోదీ వెళ్లనున్నట్లు ప్రకటన, ట్యారిఫ్‌లకు జంకబోమంటూ దేశ స్వావలంబనకు పిలుపునిచ్చి జీఎస్టీ స్లాబ్‌లను నాలుగు నుంచి రెండింటికి ప్రభుత్వం తగ్గించటం వంటివి. ఇవన్నీ జాబితా వలె రాసుకోవటం ఎందుకంటే, ఈ పరిణామాలు కొద్ది కాలంలోనే అమెరికా చర్యలకు స్పందనగా జరిగినటువంటివి. వాటన్నిటికి తగు ప్రాముఖ్యం ఉంది.

వీటిమధ్య చాలా ముఖ్యమైనది ఒకటి జరిగింది. అది – అంతర్జాతీయ వాణిజ్యంలో రూపాయి మారకపు చెల్లింపులకు సంబంధించిన నిబంధనలను రిజర్వ్ బ్యాంక్ సడలించటం. ప్రైవేట్ కంపెనీలు ఇతర దేశాలతో జరిపే లావాదేవీలలో రూపాయి కరెన్సీ వినియోగానికి ప్రత్యేకంగా వోస్ట్రో అకౌంట్లు తెరవాలి. అందుకు స్థానిక బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ అనుమతి అవసరమయేది. ఆ నిబంధనను రిజర్వ్ బ్యాంక్ ఇపుడు ఎత్తివేసింది. అందువల్ల వాణిజ్యం సులభతరం అవుతుందనేది సరేసరి. కానీ, అంతకుమించిన విశేషం ఉంది. ఇంతకుముందు వలె డాలర్‌పై ఆధారపడనక్కర లేకపోవటం! డాలర్‌కు బదులు 'బ్రిక్స్' దేశాలు పరస్పరం గానీ, ఇతర దేశాలతో గానీ తమ సొంత కరెన్సీలలో చెల్లింపులు చేసుకోవాలని, ఆ విధంగా డాలర్ బలహీన పడుతుందన్నది ఆ సంస్థ తీర్మానం. డాలర్‌కు ప్రత్యామ్నాయంగా 'బ్రిక్స్' కరెన్సీ అనకుండానే వారు ఈ వ్యూహాన్ని ఎంచుకున్నారు. ఇండియా కూడా అటువంటి చెల్లింపులు కొన్ని చేస్తున్నా, డాలర్‌కు తాము వ్యతిరేకం కాదంటూ వచ్చింది. ధోరణి ఇదే విధంగా కొనసాగితే, కొందరు విమర్శకులు ఎత్తి చూపుతున్నట్లు బ్రెజిల్, చైనాల వలె భారత్ కూడా అమెరికాపై ఎదురు సుంకాలు విధించటం, డబ్ల్యూటీఓకు ఫిర్యాదు చేయటం వంటి చర్యలు తీసుకోగలదేమో చూడవలసి ఉంటుంది.

వచ్చే సంవత్సరం ఒక ముఖ్యమైన పరిణామం చోటు చేసుకోనుంది. బ్రిక్స్ 18వ శిఖరాగ్ర సమావేశం 2026లో ఢిల్లీలో జరిగి, ఆ సంస్థకు భారతదేశం అధ్యక్షత వహించనుంది. అందువల్ల ఈ దేశంపై ఎటువంటి బాధ్యతలు ఏర్పడతాయో ఊహించవచ్చు. ఇప్పటికే ఒక కొత్త ధోరణిలో ముందుకు వెళ్లవలసి వస్తున్న భారత ప్రభుత్వం ఆ మార్పును స్వల్పకాలికానికి పరిమితం చేయగలదా, లేక దీర్ఘకాలికం, మౌలికం చేయవచ్చునా అన్నది పెద్ద ప్రశ్న అవుతున్నది. ఈ పరిణామాలకు కొసమెరుపు 23వ తేదీ నాటి జైశంకర్ వ్యాఖ్యలు. తన జీవితంలో ట్రంప్ వంటి అధ్యక్షుడిని చూడలేదని, ఇండియా ఉత్పత్తులను వారికి కావాలంటే కొనవచ్చు, లేదా మానవచ్చునని, మాకు వేరే మార్కెట్లు ఉన్నాయని అన్నారాయన. ఆత్మవిశ్వాసం కలిగి స్వతంత్రంగా వ్యవహరిస్తే ఇట్లాగే ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

నేటికీ నెరవేరని స్వప్నాలు

తెలంగాణలో కొత్త విశ్వవిద్యాలయాల డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. రాష్ట్రం ఏర్పడి దశాబ్దం దాటినా, ఉన్నత విద్యారంగంలో సక్రమమైన సమతౌల్యం సాధించడంలో ప్రభుత్వం పూర్తిస్థాయి ఫలితాలను చూపలేక పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, ఇతర ప్రజా సంఘాలవారు... పెరుగుతున్న ఆకాంక్షలు, జనాభా ఒత్తిళ్లకు అనుగుణంగా రాష్ట్ర ఉన్నత విద్యా మౌలిక సదుపాయాలు లేవని వాదించే పౌర సమూహాలను ఏకం చేస్తున్నారు.

తెలంగాణ అవతరణ అనంతరం నిర్మల్, వనపర్తి, గద్వాల్, మహబూబాబాద్, కామారెడ్డి వంటి జిల్లాల్లో విశ్వవిద్యాలయాల లేమి కారణంగా విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వలస వెళ్ళక తప్పడం లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు హైదరాబాద్ లేదా ఇతర రాష్ట్రాల్లో చదవడానికి ఆర్థికంగా వెసులుబాటు ఉన్న స్థితిలోనూ లేరు. ఫలితంగా అనేక మంది ప్రతిభావంతులైన యువకులు ఉన్నత విద్యను వదులుకోవాల్సిన పరిస్థితి వస్తోంది

తాజా విద్యా ఉద్యమాలకు నిర్మల్ జిల్లా... కేంద్రంగా మారింది. నిర్మల్ పట్టణంలో 'జ్ఞాన సరస్వతి విశ్వవిద్యాలయం' ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాలుగా విద్యార్థి సంఘాల, పదవీ విరమణ చేసిన విద్యావేత్తల మద్దతుతో స్థానికులు ఒత్తిడి చేస్తున్నారు. ఉత్తర తెలంగాణలో విశ్వవిద్యాలయం లేకపోవడాన్ని వీరు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. నిర్మల్‌లో ఇటీవల ఏర్పడిన



◆ నూతన విశ్వవిద్యాలయాల స్థాపన కేవలం విద్య గురించే కాదు, అవకాశాల పెంపుదలతో పాటు ప్రాంతీయ న్యాయానికి సంబంధించినది. ఇది అణగారిన వర్గాలకు విద్యను దగ్గర చేసి స్థానిక అభివృద్ధికి బీజం వేస్తుంది.

'నిర్మల్ విశ్వవిద్యాలయ సాధన సమితి' నిరంతరం సంతకాల సేకరణ, సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వ దృష్టిని ఆకర్షిస్తోంది.

జోడెఘాట్‌లో జరిగిన 'ఆజాదీ 70 – యాద్ కరో కుర్బానీ' కార్యక్రమానికి హాజరైన అప్పటి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ సైతం నిర్మల్ యూనివర్సిటీ ఏర్పాటుకు సానుకూలం వ్యక్తం చేశారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు.

ఇది వైఎస్ కల!

నిర్మల్ కేంద్రంగా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఇప్పటిది కాదు. ఉన్నత విద్య అందరికీ అందాలనే సదాశయంతో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి 2009లో ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో ఎన్నికలు రావడం... విశ్వవిద్యాలయ ఏర్పాటు జీవో జారీకి అడ్డంకిగా మారింది. అదే సంవత్సరం హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్ఆర్ మరణించడంతో యూనివర్సిటీ అంశం తెరమరుగైంది.

2014లోనే ఉమ్మడి రాష్ట్రంలో 12 కొత్త విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని 'రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్' (రూసా) కింద రూ. 2,600 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు కూడా పంపింది. అందులో నిర్మల్‌లోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలను ఉన్నతీకరించాలని నిర్ణయించారు. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రెండు రాష్ట్రాలూ రూ.1,300 కోట్లతో విడివిడిగా రూసాకు ప్రతిపాదనలు పంపాయి. తదనంతర కాలంలో జరిగిన పరిణామాలతో తెలంగాణకు రావాల్సిన ఐదు యూనివర్సిటీల ఏర్పాటు నిలిచిపోయింది.

నిజానికి విశ్వవిద్యాలయాల స్థాపన కేవలం విద్య గురించి మాత్రమే కాదు, అవకాశాల పెంపుదలతో పాటు ప్రాంతీయ న్యాయానికి సంబంధించినది. నూతన విశ్వవిద్యాలయాల ఏర్పాటు డ్రాపౌట్ రేట్లను తగ్గించడంతోపాటు, అణగారిన వర్గాలకు విద్యను దగ్గర చేసి స్థానిక అభివృద్ధికి బీజం వేస్తుంది.


– జయప్రకాశ్ అంకం । కామారెడ్డి ప్రభుత్వ కళాశాల

తెలుగు జిలుగులు

ఇన్ బాక్స్

'తీరి బంగారు పండెడు తెలుగు నేల/ తేట నీటిలో ప్రవహించు తెలుగు నదులు/ తెలుగు వాణిని ప్రకటించు తెలుగు గిరులు/ తలుచుకొన్నంత నా మేను పులకరించు' అంటూ వేదుల సత్యనారాయణ తెలుగును అభివర్ణించారు. మన అమ్మ భాషనే జాతీయ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి 'సుందర తెలుంగు' అన్నారు. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా ప్రశంసలందుకొన్న మన భాషను 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు ప్రశంసించారు.

56 అక్షరాలు, గుణింతాలు, సంయుక్తాక్షరాలు, ద్విత్వాక్షరాలు ఉన్న తెలుగు ఎన్ని ధ్వనులనైనా పలకడానికి వీలుగా ఉంటుంది. అన్నిటినీ మించి తెలుగు 'అజంత' భాష. అంటే ప్రతి పదం కూడా అచ్చుతో పూర్తవుతుంది. ఆ కారణంగా తెలుగు గీతి గుణం కలిగి ఉంది. అంటే పాటకి లయకి లొంగుతుందన్నమాట. ఆ కారణంగానే ఎక్కువ మంది వాగ్గేయకారులు (అన్నమయ్య, త్యాగరాజు, రామ దాసు వంటివారు) తమ తమ కీర్తనలను తెలుగులోనే రచించారు. గుణింతాల ఆధారంగా వాక్యాలు, అద్భుతమైన తెలుగు భాషకి ప్రాణాధారం.



గిడుగు రామమూర్తి

తెలుగులో 'రాఘవ పాండవీయం' అనే ద్వ్యర్థి కావ్యం ఉంది. దీనిని పింగళి సూరన రాశాడు. ఇందులో ప్రతి శ్లోకంలోనూ రామాయణం, మహా భారతాలను సమాంతరంగా చెబుతాడు. తెలుగు భాషకు మాత్రమే సొంత మైన ప్రత్యేకత మరొక టుంది. అదే 'అవధానం'. ఏక కాలంలో అనేకాంశాలను ఛందోబద్ధమైన పద్యం రూపంలో క్రమం తప్పకుండా గుర్తు పెట్టుకొని చెప్పగలగటమే అవధానం. ఇందులో 'ధారణ' ప్రక్రియ అమోఘం.

క్రమంగా మనం చక్కటి సామెతలు, పద్యాలు, గద్యాలను కోల్పోతున్నాం. గైడ్లు, టెస్టు పేపర్ల మీద ఆధారపడటం పెరిగిపోయింది. దాంతో తెలుగు నీరసిస్తోంది. 'అమ్మ' భాష నుంచే పిల్లల్లో నైతికత, మానవీయత అలవడతాయి. ఈ నేపథ్యంలో వ్యవహార తెలుగు భాషకై తపించిన గిడుగు రామమూర్తిని ఆయన జయంతి రోజున స్మరించుకుందాం.

– వేదుల జనార్దనరావు

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డేటా పాయింట్

'భారత్ చాలా మంచి దేశం'



మన దేశం గురించి ప్రపంచ దేశాల్లో ఏమనుకుంటున్నారు? ప్యూ రిసెర్చ్ సెంటర్ జనవరి 8 – ఏప్రిల్ 26 మధ్య 'స్ప్రింగ్ 2025 గ్లోబల్ యాటిట్యూడ్ సర్వే' నిర్వహించింది. 24 దేశాల్లో చేసిన ఈ సర్వేలో భారత్ గురించి సదభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కెన్యా, స్వీడన్, ఇండోనేషియా వంటి దేశాల్లో 50 శాతానికిపైగా మనకు అనుకూలంగా మాట్లాడారు.


దేశాల వారీగా

	అనుకూలం	వ్యతిరేకం
కెన్యా	65	27
ఇజ్రాయెల్	60	27
యూకే	60	29
జపాన్	58	38
జర్మనీ	57	31
ఇటలీ	54	34
ఫ్రాన్స్	50	34
అమెరికా	49	48
టర్కీ	25	56
ఆస్ట్రేలియా	45	54

(అంకెలు శాతాల్లో)

మనిషికి శత్రువులు

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

**మహాయోగాధి రూఢోపి లోభానృత విమోహితః
పీడ్యతే నాశమాప్నోతి జాగరూకో భవేత్తతః**

ఎంతటి మహాయోగి అయినా లోభం వల్లా, అసత్యం వల్లా మోహితుడు కావటానికి అవకాశమున్నది. చివరికి ఈ వ్యామోహంతో పీడితుడై నాశనం పొందుతాడు. అందుకని వ్యామోహ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మనిషికి కామ క్రోధాదులు మహా శత్రువులు. అందుకనే వానిని అరిషడ్వర్గం అన్నారు. ఇప్పుడు లోభం, అనృత భాషణం కూడా శత్రువులే! లోభం వల్ల నీచమైన భావాలు పుడతాయి. సంకుచిత మనస్తత్వం కలుగుతుంది. అంతేకాక మనిషిలోని మానవత్వాన్ని ఈ లోభం పెంచకపోగా తుంచి వేస్తుంది. అంటే పశుధర్మం ప్రవేశిస్తుందన్న మాట!

ఇక అసత్య భాషణం వల్ల వచ్చే అనర్థం చెప్పనక్కరలేదు. ఒక్కసారి అసత్యమాడితే, దాన్ని కప్పిపుచ్చుకోవటానికి మరో అబద్ధం ఆడాల్సి వస్తుంది. ఈ విధంగా అబద్ధాల దొంతర పెరుగుతుంది. ఒక అబద్ధాన్ని ఛేదించటం ప్రారంభిస్తే, తీగ కదిలిస్తే డొంకంతా కదిలినట్లు ఈ అబద్ధాల కొక్కెములు ఊడిపోతాయి. అప్పుడా మనిషి నలుగురిలో అవమానింపబడి నవ్వుల పాలు కాక తప్పదు. అసత్యం మనిషిని అధర్మ మార్గంలో నడిపి నీచునిగా తయారు చేస్తుంది. ధర్మానికి దూరం చేస్తుంది. అందుకనే శ్రుతి 'సత్యం వద' అనే పరమ ధర్మాన్ని ప్రబోధిస్తోంది.

లుబ్ధులకు ఎప్పుడూ సత్ఫలితాలు దొరకవు. 'శత్రువుల్లో మహా శత్రువేది?' అనే ప్రశ్నకు **'కామశ్చ కోపానృత లోభతృష్ణాః'** అని శంకరులు సమాధానం చెప్పారు. సత్య సంభాషణం మనిషిని స్వచ్ఛంగా తయారు చేస్తుంది. గంగాజలం లాగా పవిత్రం చేస్తుంది. సత్యసంధులైన హరిశ్చంద్రాదులు సత్యాన్ని వ్రతంగా స్వీకరించి చరిత్ర ప్రసిద్ధులయ్యారు. **సత్యమేవేశ్వరో లోకే సత్యః ధర్మః ప్రతిష్ఠితః / సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరంపదం** ప్రపంచంలో సత్యమే దైవం. సత్యములోనే ధర్మమున్నది. సమస్తం సత్యమే మూలంగా కలది. అలాంటి సత్యాని కంటే ఉచ్చస్థితి లేదు అని అర్థం.

మరో రెండ్రోజులు వర్షాలు

అల్పపీడనంతో రాష్ట్రాన్ని ముంచెత్తిన వానలు

- నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు 69.17 సెం.మీ వర్షపాతం
- ప్రస్తుతం అత్యంత చురుగ్గా నైరుతి రుతుపవనాలు

సాక్షి, హైదరాబాద్: వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు కూడా అత్యంత చురుకుగా కదులుతున్నాయి. వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లో కొనసాగిన తీవ్ర అల్పపీడనం వాయువ్య దిశలో కదిలి గురువారం దక్షిణ ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో తీరాన్ని దాటింది. ప్రస్తుతం మధ్య ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో అల్పపీడనంగా కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల చక్రవాత ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

సగటున 5.08 సెంటీమీటర్ల వర్షపాతం...

బుధ, గురువారాల్లో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటున 5.08 సెంటీమీటర్ల వర్షం కురిసింది. గురువారం రాత్రి వరకు చూస్తే 2.5 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా 10 జిల్లాల్లో అధికం, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఆగస్టు 28 నాటికి రాష్ట్రంలో సగటున 55.19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 69.17 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 25 శాతం అధికంగా వర్షాలు కురిసినట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. మరో రెండ్రోజుల పాటు కురిసే వర్షాలతో రాష్ట్రంలో సగటు వర్షపాతం ఈ సీజన్ మొత్తంలో కురవాల్సిన సాధారణ వర్షపాతానికి సమానమవుతుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

బుధ, గురువారాల్లో జిల్లాల వారీ అత్యధిక వర్షపాతం (సెం.మీ.లలో)

జిల్లా	వర్షపాతం
కామారెడ్డి	19.25
మెదక్	14.90
నిర్మల్	12.55
సిద్దిపేట	9.91
నిజామాబాద్	8.49
ఖమ్మం	8.44
ములుగు	7.75
కరీంనగర్	7.05

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
కామారెడ్డి	అర్గొండ	43.35
నిర్మల్	అక్కాపూర్	32.33
మెదక్	సర్దనా	31.60
కామారెడ్డి	ఐడీఓసీ కామారెడ్డి	29.50
కామారెడ్డి	తాడ్వాయి	28.08
నిర్మల్	వడ్యాల్	27.79
కామారెడ్డి	భిక్కనూరు	27.90
మెదక్	నాగపూర్	27.73
కామారెడ్డి	పాతరాజాపేట	24.73
నిర్మల్	విశ్వనాథపేట	24.13
నిర్మల్	ముజిగి	23.15
మెదక్	చేగుంట	23.05
కామారెడ్డి	లింగంపేట	22.33
మెదక్	రామాయంపేట	20.80
మెదక్	మెదక్	20.68
కామారెడ్డి	దోమకొండ	20.20

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- మెదక్, కామారెడ్డి జిల్లాల వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే


వరదలపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/పెద్దపల్లి/మెదక్‌జోన్: భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తక్షణమే అంచనాలు తయారు చేసి అత్యవసర నిధులతో పనులు చేపట్టాలని సూచించారు. వరదల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం వరదలతో అతలాకుతలమైన కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. భారీ వర్షాలతో బుధ, గురువారాల్లో పోటెత్తిన వరదలతో కామారెడ్డి, మెదక్ జిల్లాలో అపార నష్టం వాటిల్లిందని సీఎంకు రెండు జిల్లాల కలెక్టర్లు నివేదించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద హెలికాప్టర్ దిగి వరదల పరిస్థితిపై సమీక్షించారు. అనంతరం నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులను ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డిలో హెలికాప్టర్ దిగి జిల్లా కలెక్టర్‌తో సమీక్షించాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించకపోవటంతో సాధ్యం కాలేదు. దీంతో మెదక్ జిల్లా చేరుకుని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం హెలికాప్టర్‌ను మెదక్ ఎస్పీ కార్యాలయంలో దించి జిల్లాలో వరదల పరిస్థితిపై అక్కడే సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వరద పరిస్థితిని కలెక్టర్ సీఎంకు నివేదించారు. వరద సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం బాగా పని చేసిందని సీఎం కితాబిచ్చారు. సమీక్షలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎంపీ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు. మెదక్ నుంచే సీఎం కామారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి వరద పరిస్థితులపై ఆరా తీశారు. సత్వరం సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరద నష్టంపై అత్యవసరంగా కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. గురువారం ఉదయం తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కతో కలిసి వరద పరిస్థితిపై సమీక్షించారు. హైదరాబాద్ నగరంతోపాటు అన్నిచోట్లా శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వినాయక మండపాల వద్ద విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లతో భక్తులకు ప్రమాదం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్‌ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. చెరువులు, కుంటలకు గండ్లు పడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఆస్పత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవడంతోపాటు అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌బృందాల సాయం తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు.

మామ స్వాతిముత్యం.. అల్లుడు ఆణిముత్యం

మామ స్వాతిముత్యం.. అల్లుడు ఆణిముత్యంలా రూ.లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఎన్నో లోపాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. గురువారం పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిందని, ఏనాడో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టే ప్రస్తుతం తెలంగాణకు వరప్రదాయినిగా మారిందని అన్నారు. మామ, అల్లుడు కాళేశ్వరం ప్రాజెక్టును గొప్పగా నిర్మించామని చెప్పుకుంటున్నారని, వాళ్లలా తాము 80 వేల పుస్తకాలు చదవలేదని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై సెటైర్ వేశారు. యూరియాపై ఎప్పటికప్పుడు బఫర్ స్టాక్ డిస్‌ప్లే చేస్తున్నామని సీఎం తెలిపారు. తదుపరి పంటలకు సైతం కొందరు రైతులు యూరియాను నిల్వ చేసుకోవడంతో కొరత ఏర్పడిందని చెప్పారు. సీఎం వెంట మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఉన్నారు.


సిరిసిల్ల జిల్లా నర్మాలలో వరద బాధితులను పరామర్శించి వెళ్తున్న కేంద్రమంత్రి సంజయ్‌కి రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ ఎదురుపడ్డారు. సంజయ్‌ను చూడగానే ఆయన కాన్వాయ్ వద్దకు కేటీఆర్ వచ్చారు. వాహనం దిగి కేటీఆర్ వద్దకు వచ్చిన బండి సంజయ్ అభివాదం చేశారు. బాగున్నారా? అంటూ ఒకరికొకరు పలకరించుకున్నారు. కష్టపడుతున్నావంటూ కేంద్రమంత్రిని ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆ తర్వాత నర్మాల బాధితులను పరామర్శించేందుకు వెళ్లారు.

కొమ్ములగొండి

- ఒళ్లంతా కొమ్ముల కవచం
- కొన్ని ఏకంగా మీటర్ పొడవు!
- చరిత్రలోనే అతి బలిష్టమైన జీవి


ఎకిలీస్. గ్రీకు రచయిత హోమర్ సృష్టించిన అజరామర ఇతిహాస ద్వయంలో మొదటిదైన ఇలియాడ్‌లో కథానాయకుడు. ప్రపంచ ఇతిహాస చరిత్రలోనే వీరత్వానికి తిరుగులేని ప్రతీకలనదగ్గ పాత్రల్లో సాటిలేనివాడు. గ్రీకు యోధులందరిలోనూ అగ్రగణ్యుడు. 'ఎకిలీస్ షీల్డ్'గా పిలిచే అతని దివ్య కవచం కూడా అంతటి ప్రసిద్ధమైనదే. కర్ణుని కవచాన్ని తలపించే ఆ షీల్డ్ కారణంగా ఎకిలీస్ జీవితపర్యంతమూ ఎవరి చేతుల్లోనూ ఓటమి కాదు కదా, కనీసం ఎదురన్నది కూడా ఎరగని మహావీరునిగా నిలిచాడు. ఇదంతా క్రీస్తుపూర్వం 12వ శతాబ్దం, అంటే నేటికి సుమారు 3,200 ఏళ్ల క్రితం నాటి గాథ. అయితే అంతకు చాలాకాలం క్రితమే, సరిగ్గా చెప్పాలంటే ఏకంగా 16.5 కోట్ల ఏళ్లకు పూర్వమే ఎకిలీస్ షీల్డ్‌ను కూడా తలదన్నేంతటి సహజ కవచంతో రొమ్ము విరుచుకు సంచరించిన, సకల జీవజాలానికీ సింహస్వప్నమై నిలిచిన జీవి ఒకటుంది! అదే స్పైకోమెల్లస్ అనే రాక్షసబల్లి. బహుశా మానవాళికి ఇప్పటిదాకా తెలిసిన డైనోసార్లలోకెల్లా అత్యంత భీకరమైనది, బలిష్టమైనది, భయానకమైనది, అజేయమైనది అదేనంటే అతిశయోక్తి కాదు!!/

'కత్తుల'రత్తయ్య!

2,500 కి.మీ పై చిలుకు విస్తరించిన దట్టమైన అట్లాస్ పర్వత శ్రేణుల్లో నేటి మొరాకో తీరంలోని బులెమేన్ అనే చిన్నపాటి పట్టణ సమీపంలో 16.5 కోట్ల ఏళ్ల క్రితం ఈ స్పైకోమెల్లస్ సంచరించినట్టు సైంటిస్టులు బుధవారం వెల్లడించారు. అక్కడ దొరికిన శిలాజాలను లోతుగా పరిశీలించిన మీదట వారు ఈ మేరకు నిర్ధారణకు వచ్చారు. దీన్ని ఒకరకంగా ఆ కాలపు కత్తుల రత్తయ్య అని చెప్పొచ్చు. ఎందుకంటే ముళ్లపందిని తలపించే రీతిలో దాని ఒంటిపై పక్కటెముకల నిండా పొలుసులను తలపించే కొమ్ములే. అయితే అవి సాదాసీదా కొమ్ములు కావు! అత్యంత పదునైన కత్తులు కూడా వాటిముందు దిగదుడుపే. కొన్నైతే ఏకంగా మీటర్ పొడవుతో, చూస్తేనే పై ప్రాణాలు పైకే పోయేలా ఉంటాయి! ''కానీ మెడ, వీపు భాగంలో అంత పెద్ద కొమ్ములతో స్వీయరక్షణ ఎలా సాధ్యమన్నది అర్థం కాని విషయం''అంటూ ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం సకశేరుక శిలాజ శాస్త్రవేత్త సూజన్ మెయిడ్‌మెంట్ ఆశ్చర్యం వెలిబుచ్చారు. ''ఇప్పటిదాకా మనకు తెలిసిన సకల జీవజాతుల్లోనూ ఇంతటి విచిత్ర, బలిష్ట ప్రాణి మరోటి లేదు''అని ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హాం యూనివర్సిటీకి చెందిన శిలాజ శాస్త్రవేత్త, అధ్యయన సహ సారథి రిచర్డ్ బట్లర్ విస్మయం వ్యక్తం చేశారు. దీని వివరాలను నేచర్ జర్నల్ తాజా సంచికలో ప్రచురించారు.

శాకాహార 'రాకాసి'!


- 13 అడుగుల పొడవు, దాదాపు 2,000 కిలోల బరువైన శరీరం స్పైకోమెల్లస్ సొంతం.
- యాంకిలోసార్స్‌గా పిలిచే కవచ రాక్షసబల్లుల్లో అత్యంతపురాతన జీవి ఇదేనట.
- ఇంతా చేస్తే ఇది పక్కా శాకాహారి! భారంగా అడుగులేసేదట.
- మాంసాహార డైనోసార్ల బారినుంచి కాపాడుకోవడంతో పాటు ఆడ డైనోసార్లను ఆకర్షించేందుకు కూడా ఈ పొలుసులు వాటికి బ్రహ్మాండంగా పనికొచ్చేవట.
- జత కోసం స్పైకోమెల్లస్‌ల నడుమ పోటీలో గెలుపోటములు దాదాపుగా ఈ కొమ్ముల తాలూకు బలం మీదే ఆధారపడేవట.
- మెడ నుంచి మొదలై వీపు పొడవునా ఒకదాని పక్కన ఒకటిగా వ్యాపించిన అనేక వెన్నెముకలు దీని ప్రత్యేకత!
- దీని తోక భాగంలో ఉండే పొడవైన కొమ్ము వెనక నుంచి వచ్చే శత్రువులను కాచుకునేదట.
- స్పైకోమెల్లస్‌లు యాంకిలోసార్స్ కుటుంబానికి చెందిన డైనోసార్లు. వీటికి తోక భాగంలో కొమ్ములు పుట్టుకొచ్చింది ఇప్పటిదాకా భావిస్తున్న దానికంటే 3 కోట్ల ఏళ్లముందేనని స్పైకోమెల్లస్ శిలాజాన్ని పరీక్షించిన మీదట సైంటిస్టులు తేల్చారు.
- స్టెగోసార్స్ అనే మరో శాకాహార డైనోసార్లకు యాంకిలోసార్స్ సమకాలీకులు. అంటే జురాసిక్ యుగం నాటివి.
- అవి అంతరించాక కూడా ఇవి చాలాకాలం పాటు మనుగడ సాగించాయి.
- 6.6 కోట్ల ఏళ్ల క్రితం భూమిని ఢీకొన్న గ్రహశకలం దెబ్బకు డైనోసార్ల యుగంతో పాటు యాంకిలోసార్స్ కూడా సమూలంగా అంతరించిపోయాయి.
- యాంకిలోసార్స్ కుటుంబంలోకెల్లా ఇప్పటిదాకా తెలిసిన అతి పెద్ద స్పైకోమెల్లస్ ఏకంగా 8 మీటర్ల పొడవున్నట్టు తేలింది! అది నేటి ఉత్తర అమెరికా పశ్చిమ ప్రాంతంలో సంచరించినట్టు అక్కడ దొరికిన శిలాజాన్ని బట్టి నిర్ధారణ అయింది.
- 2021లో స్పైకోమెల్లస్ తాలూకు పక్కటెముక భాగపు శిలాజం దొరికింది. 2023లో దొరికిన ప్రస్తుత శిలాజంలో పూర్తి అస్థిపంజరం లేదు. ముఖ్యంగా తల భాగం మిస్సయింది. అయినా దీనికి సంబంధించి చాలా వివరాలు, విశేషాలను అది బయట పెట్టిందంటూ సైంటిస్టులు సంబరపడుతున్నారు.



\- సాక్షి, నేషనల్ డెస్క్

75 ఏళ్లకే దిగిపొమ్మని చెప్పలేదు

- పదవీ విరమణకు పరిమితి విధించలేదు
- అలాంటి నిబంధన ఆర్‌ఎస్‌ఎస్‌లో లేదు
- సంఘ్ ఆదేశించినంత కాలం పని చేస్తూనే ఉంటాం
- బీజేపీ–సంఘ్ మధ్య ఎలాంటి విభేదాలు లేవు
- బీజేపీకి కేవలం సలహాలు మాత్రమే ఇస్తాం
- నిర్ణయాలు ఈ పార్టీ నేతలే తీసుకుంటారు
- ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: పదవుల నుంచి దిగిపోవడానికి 75 ఏళ్ల నిబంధన తమ సంస్థలో లేదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) అధినేత మోహన్ భగవత్ స్పష్టంచేశారు. 75 ఏళ్ల వయసు వచ్చినవారు పదవుల నుంచి కచ్చితంగా తప్పుకోవాలని తాను ఏనాడూ చెప్పలేదని అన్నారు. తద్వారా ప్రధాని నరేంద్ర మోదీ పదవీ విరమణపై జరుగుతున్న చర్చకు తెరదించారు. సంఘ్‌లో తామంతా స్వచ్ఛంద సేవకులమని భగవత్ చెప్పారు. సంఘ్ పెద్దలు చెప్పింది చేస్తామని, పని చేయడానికి వయసుతో నిమిత్తం లేదని వ్యాఖ్యానించారు. అప్పగించిన పనిని తిరస్కరించడానికి వయసును సాకుగా చూపే అలవాటు తమకు లేదన్నారు. ఇష్టం ఉన్నా లేకపోయినా అప్పగించిన పని చేస్తామన్నారు. తనకు 80 ఏళ్ల వయసు వచ్చినప్పుడు 'శాఖ'కు వెళ్లి పనిచేయాలని ఆదేశిస్తే తప్పకుండా ఆ పని పూర్తి చేస్తానని ఉద్ఘాటించారు. త్వరలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో వివిధ రంగాల ప్రముఖులతో మోహన్ భగవత్ సమావేశమయ్యారు. ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో మూడు రోజులపాటు ఈ భేటీలు జరిగాయి. గురువారం మీడియాతో భగవత్ మాట్లాడారు. తాను గానీ, మరొకరు గానీ పదవీ విరమణ చేయాల్సిందేనని తాను ఆదేశించలేదని వ్యాఖ్యానించారు. జీవితంలో ఏ సమయంలో రిటైర్ కావడానికైనా సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. సంఘ్ ఆదేశించినంత కాలం పని చేస్తూనే ఉంటామన్నారు.

మరో ఉద్యమ ఆలోచన లేదు

కాశీ, మథుర కోసం అయోధ్య తరహాలో ఉద్యమం నడిపే ఆలోచన లేదనిమోహన్ భగవత్ వెల్లడించారు. అయోధ్యలో రామాలయం కోసం ఉద్యమించామని, అనుకున్న లక్ష్యం సాధించామని తెలిపారు. మరో ఉద్యమంలో పాల్గొనబోమని పేర్కొన్నారు. కాశీ, మథుర, అయోధ్య హిందువులకు పవిత్రమైన క్షేత్రాలని చెప్పారు. కాశీ, మథుర ఉద్యమం కోసం ఎవరైనా సాయం కోరితే తమ కార్యకర్తలు ముందుకొస్తారని సూచించారు. ప్రతిచోటా ఆలయం కోసం శోధించాల్సిన అవసరం లేదన్నారు. కాశీ, మథురను హిందువులు దక్కించుకుంటే అది మంచి పరిణామం అవుతుందన్నారు.

అఖండ భారత్...

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సంఘ్ చురుగ్గా పాల్గొన్నదని, దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించిందని మోహన్ భగవత్ తేల్చిచెప్పారు. కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అప్పట్లో దేశమంతా గాంధీజీ వెనుక నడిచిందని, దేశ విభజనను అడ్డుకోవడానికి ఆ సమయంలో సంఘ్‌కు ఉన్న బలమెంత? అని ప్రశ్నించారు. అఖండ భారత్ అనేది 'మార్పులేని సత్యం' అని చెప్పారు. రాజకీయ అంశంగానే దీన్ని మదిలో పెట్టుకోవాలన్నారు.

మతం వ్యక్తిగత విశ్వాసం

బీజేపీకి సంబంధించిన కీలక నిర్ణయాలు ఆర్‌ఎస్‌ఎస్ తీసుకుంటోందన్న విమర్శలను మోహన్ భగవత్ కొట్టిపారేశారు. తాము కేవలం సూచనలు ఇస్తుంటామని, నిర్ణయాలు బీజేపీ నేతలే తీసుకుంటారని తేల్చిచెప్పారు. బీజేపీతో సంఘ్‌కు ఎలాంటి విభేదాలు లేవన్నారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. 'శాఖలు' నడిపించడం తమ విధి అని, ప్రభుత్వాలను నడిపించడం బీజేపీ బాధ్యత అంటూ వ్యాఖ్యానించారు. మతం ఆధారంగా ఇతరులపై దాడి చేయడాన్ని సంఘ్ సమర్థించబోదని పేర్కొన్నారు. దేశంలో ఇస్లాం మతం ఉండకూడదని హిందూ ఆలోచనావిధానం చెప్పడం లేదన్నారు. మతం అనేది వ్యక్తిగత విశ్వాసమని, దాని వెనుక ప్రలోభం గానీ, బలవంతం గానీ ఉండకూడదని సూచించారు. ఇస్లాం మతానికి మన దేశంలో ఎప్పటికీ స్థానం ఉంటుందన్నారు.

కనీసం ముగ్గుర్ని కనండి

భారతీయులు కనీసం ముగ్గురు పిల్లలను కనాలని భగవత్ విజ్ఞప్తిచేశారు. సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉన్న సమాజాలు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. పరిమితంగా ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకోవడంతోపాటు జనా భా స్థిరీకరణ కోసం ముగ్గురు సంతానంతో సరిపెట్టుకోవాలని విన్నవించారు. ఆంగ్ల భాషకు సంఘ్ వ్యతిరేకం కాదన్నారు. భారతీయులు మాతృభాషతో పాటు కనీసం మూడు భాషలు నేర్చుకోవాలని సూచించారు. దేశమంతటా అందరినీ అనుసంధానించే భాష ఒకటి ఉండాలన్నారు. అది ఆంగ్ల భాష కాకూడదని చెప్పారు. అనుసంధాన భాషపై ప్రజలంతా ఉమ్మడిగా నిర్ణయం తీసుకోవాలన్నారు. భారత్‌ను, ఇక్కడి సంప్రదాయాలను చక్కగా అర్థం చేసుకోవడానికి సంస్కృత భాష దోహదపడుతుందని వివరించారు.

జిన్‌పింగ్..ముర్ము..మోదీ!

రహస్య లేఖతో మెరుగుపడ్డ భారత్ - చైనా సంబంధాలు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల కొరడా ఝళిపిస్తున్న వేళ ఓ లేఖ భారత్–చైనాల సంబంధాలను మలుపుతిప్పింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఓ లేఖ రాశారు. భారత్‌తో సంబంధాలను మెరుగుపర్చుకోవాలనే ఆకాంక్షను ఆయన అందులో వ్యక్తం చేశారు. లేఖను రాష్ట్రపతి ముర్ము ప్రధాని మోదీకి అందజేశారు. భారత్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి తమకు ఈ విషయం తెలిపినట్లు బ్లూమ్‌బర్గ్ తాజా కథనంలో పేర్కొంది. అమెరికాతో కుదుర్చుకున్న ఎలాంటి ఒప్పందమైనా అది అంతిమంగా చైనా ప్రయోజనాలకు హానికల్గిస్తుందని జిన్‌పింగ్ ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేసినట్లు వెల్లడించింది. ద్రౌపదీ ముర్ముకు మార్చిలో జిన్‌పింగ్ ఒక లేఖ రాసినట్లు రెండు దేశాల మీడియాల్లోనూ వచ్చింది. అయితే, ఆ లేఖ ఇదేనా అనే విషయం స్పష్టం కాలేదు. అనంతర పరిణామాల్లో రెండు దేశాలు తమ మధ్య సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు పలు చర్యలను ప్రకటించాయి. కైలాస్–మానస సరోవర్ యాత్ర మార్గాన్ని భారత తీర్థయాత్రికుల కోసం చైనా తెరవగా చైనా పర్యాటకుల కోసం భారత్ వీసాల జారీని ప్రారంభించింది. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సేవలు సైతం మొదలయ్యాయి. మార్చిలో జిన్‌పింగ్ రాసిన లేఖ తర్వాత, ట్రంప్ టారిఫ్‌ల బాదుడు మొదలుకాక మునుపే భారత్, చైనాల మధ్య దౌత్యపరమైన చర్చలు, సంప్రదింపులు మొదలైనట్లు బ్లూమ్‌బర్గ్ కథనం విశ్లేషించింది. మరోవైపు, ట్రంప్ టారిఫ్‌ల విధానం అమెరికా–భారత్ మధ్య అంతరాన్ని పెంచింది. దీనికితోడు భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరగాల్సిన అణు యుద్ధం తన జోక్యంతోనే ఆగిందంటూ ట్రంప్ పదేపదే చెప్పుకోవడాన్ని భారత్‌కు అస్సలు రుచించలేదు. అప్పటి వరకు చైనాకు దగ్గరయ్యే విషయాన్ని అంత సీరియస్‌గా ఆలోచించని భారత్ జూన్ తర్వాతే చైనాతో సంబంధాల మెరుగుపై దృష్టిపెట్టిందని బ్లూమ్‌బర్గ్ కథనం విశ్లేషించింది. గతేడాది లద్దాఖ్‌లోని ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి సైన్యాలను పాక్షికంగా ఉపసంహరించుకోవాలని రెండు దేశాలు అంగీకారానికి రావడం కూడా చైనాపై సానుకూలంగా ఆలోచించేందుకు దారి చూపిందని తెలిపింది. ఇదే త్వరలో చైనాలో జరిగే ఎస్‌సీవో శిఖరాగ్రం సందర్భంగా జిన్‌పింగ్, మోదీల ముఖాముఖీకి మార్గ సుగమం చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు. భారత్ కంటే ముందుగా చైనాపైనే ట్రంప్ 145 శాతం టారిఫ్‌లను ప్రకటించారు. అయితే, ఆ దేశంతో అమెరికా వైఖరి మరోలా ఉంది. టారిఫ్‌లకు తాత్కాలిక విరామం ప్రకటించిన అమెరికా ప్రస్తుతం ఆ దేశంతో వాణిజ్య చర్చలు జరుపుతోంది. కీలక ఖనిజాల సరఫరా వంటివి చైనా చేతుల్లో ఉండటంతో ట్రంప్ ఆ దేశంతో జాగ్రత్తగా డీల్ చేస్తున్నారు.

అమెరికా కాటన్‌పై డ్యూటీ రద్దు అన్యాయం



- మోదీ ప్రభుత్వ నిర్ణయం రైతులకు శరాఘాతం
- 50% టారిఫ్ వెయ్యాల్సిందే: కేజ్రీవాల్ డిమాండ్

న్యూఢిల్లీ: అమెరికా నుంచి దిగుమతయ్యే పత్తిపై 11 శాతం పన్నును తొలగించడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తప్పుబట్టారు. ప్రధాని మోదీ నిర్ణయం ఫలితంగా మన రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని తెలిపారు. మన రైతులతోపాటు వ్యాపారాలు సైతం దెబ్బతింటాయన్నారు. 'ట్రంప్ టారిఫ్ బెదిరింపులతో ఇతర దేశాలు భయపడటం లేదు. అమెరికా ఉత్పత్తులపైనా ఆ దేశాలు భారీగా టారిఫ్‌లను ప్రకటించాయి. మనం కూడా అదే బాటలో వెళ్లాలి. అమెరికా మనపై 50 శాతం టారిఫ్‌లు వేస్తే, మనం 100 శాతం విధించాలి. దీనికి దేశమంతా ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తుంది. మనది 140 కోట్ల ప్రజలున్న దేశం. ఎవరూ మనల్ని చులకన చేయలేరు'అని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అమెరికా కాటన్ ఉత్పత్తులపై డ్యూటీని తొలగిస్తున్నట్లు ఆగస్టు 18న కేంద్ర ఆర్థిక శాఖ తెలపడంపై కేజ్రీవాల్ ఈ మేరకు స్పందించారు. 'అమెరికా నుంచి వచ్చే కాటన్ ఉత్పత్తులపై మనం 11 శాతం డ్యూటీ విధించాలి. దీనివల్ల, మన దేశంలో తయారయ్యే కాటన్ ఉత్పత్తుల ధర అమెరికా ఉత్పత్తుల కంటే తక్కువగా ఉంటుంది. కానీ, మోదీ ప్రభుత్వం సెప్టెంబర్ 30వ తేదీ వరకు డ్యూటీని రద్దు చేసింది. మన కాటన్‌తో పోలిస్తే అమెరికా కాటన్ చీప్‌గా మనవాళ్లకు అందుబాటులోకి వస్తుంది. దీంతో, దాన్నే ఎక్కువగా కొని ఉంచుకుంటారు. మన పత్తి అక్టోబర్‌లో మార్కెట్‌లోకి వచ్చే సమయానికి ఇక్కడ కొనేవారెవరూ ఉండరు'అని కేజ్రీవాల్ వివరించారు. తెలంగాణ, పంజాబ్, విదర్భ, గుజరాత్ రైతులపై కేంద్రం నిర్ణయం ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. అందుకే అమెరికా కాటన్‌పై మన ప్రభుత్వం కూడా 50 శాతం టారిఫ్‌ను ప్రకటించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 7వ తేదీన గుజరాత్‌లోని చోటిలాలో ఇదే విషయమై తమ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించనుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అక్కడి రైతులకు వివరిస్తామని చెప్పారు.

31న జిన్‌పింగ్‌తో మోదీ భేటీ

వచ్చే నెల 1న పుతిన్‌తో సమావేశం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 31, వచ్చే నెల 1వ తేదీల్లో చైనాలో పర్యటించబోతున్నారు. తియాంజిన్ నగరంలో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా ఈ నెల 31వ తేదీన చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో మోదీ సమావేశమవుతారు. ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. భారత్–చైనా సంబంధాలు, పరస్పర సహకారంతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై వారు చర్చించే అవకాశం ఉంది. అలాగే వచ్చే నెల 1వ తేదీన రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో నరేంద్ర మోదీ భేటీ అవుతారు. భారత్–అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు ఒత్తిడికి లోనవుతున్న నేపథ్యంలో చైనా, రష్యా అధినేతలతో భారత ప్రధానమంత్రి ప్రత్యేకంగా సమావేశం కాబోతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాన్ని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. రష్యా నుంచి ముడి చమురు కొంటున్నందుకు భారత ఉత్పత్తులపై ట్రంప్ ప్రభుత్వం ఏకంగా 50 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. మరోవైపు భారత్–చైనా మధ్య సంబంధాలు క్రమంగా బలపడుతున్నాయి. భారత్‌పై అమెరికా విధించిన భారీ టారిఫ్‌లను జిన్‌పింగ్ తప్పుపట్టారు. ప్రధాని మోదీ చైనాలో పర్యటిస్తుండడం ఏడేళ్ల తర్వాత ఇదే మొదటిసారి కావడం విశేషం. ఆయన చివరిసారిగా 2018లో చైనాలో పర్యటించారు. వూహాన్ సిటీలో షీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, మోదీ–పుతిన్ మధ్య జరగబోయే ద్వైపాక్షిక భేటీకి విశేషమైన ప్రాధాన్యం ఉంది. ఇటీవలి కాలంలో ఇండియాకు మరింత దగ్గరయ్యేందుకు పుతిన్ ప్రయత్నిస్తున్నారు. ఉక్రెయిన్‌పై దండయాత్ర ప్రారంభించిన తర్వాత రష్యాపై పశ్చిమ దేశాలు కఠిన ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే భారత్, చైనాల నుంచి మరింత సహకారాన్ని పుతిన్ కోరుకుంటున్నారు. తియాంజిన్‌లో మోదీ, జిన్‌పింగ్, పుతిన్ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు రష్యా ప్రభుత్వం ఇటీవల సంకేతాలిచ్చింది.

ఇది మోదీ యుద్ధం



రష్యా–ఉక్రెయిన్ యుద్ధంపై ట్రంప్ సలహాదారు వ్యాఖ్య

వాషింగ్టన్: సుంకాలు పెంచుకుంటూ పోయినా రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు విషయంలో భారత్ వైఖరి స్థిరంగా ఉండటంతో అమెరికాకు పాలు పోవడం లేదు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొత్తం భారత్ వల్లే జరుగుతుందంటూ అమెరికా నేతలు వింత వాదనలు చేస్తున్నారు. ఇది మోదీ యుద్ధమంటూ వైట్‌హౌస్ సలహాదారు పీటర్ నవారో ఆరోపించారు. భారత్, రష్యన్ చమురును రాయితీపై కొనుగోలు చేయడం మాస్కో దూకుడుకు ఆజ్యం పోస్తోందని, అది అమెరికన్ పన్ను చెల్లింపుదారులపై భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం భారత్ ఆపేస్తే దిగుమతుల సుంకాలపై 25% తగ్గింపు పొందొచ్చని సూచించారు. ఓ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నవారో మాట్లాడుతూ.. ఆయా దేశాల్లో శాంతికి మార్గం న్యూఢిల్లీ ద్వారానే సాధ్యమన్నారు. భారత వస్తువులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50% సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో నవారో ఈ వ్యాఖ్యలు చేశారు. మాస్కో యుద్ధ ప్రయత్నాలకు భారత్ సహకారమందిస్తోందని నవారో ఆరోపించారు. 'రష్యన్ చమురును డిస్కౌంట్‌తో భారత్ కొనుగోలు చేయడం వల్ల రష్యా తన యుద్ధానికి నిధులు సమకూర్చుకుంటోంది. దానిని మరింత మంది ఉక్రేనియన్లను చంపడానికి ఉపయోగిస్తోంది. భారత్ చేస్తున్నదానివల్ల అమెరికా పౌరులు నష్టపోతున్నారు' అని తెలిపారు. ''నాకు ఆశ్చర్యంగా ఉంది. ఎందుకంటే మోదీ గొప్ప నాయకుడు. భారత్‌లో పరిణతి చెందిన ప్రజాస్వామ్యం ఉంది. పరిణతి చెందిన వ్యక్తులు దేశాన్ని నడుపుతున్నారు. అయినా నాకు బాధ కలిగించే విషయం ఏమిటంటే.. సుంకాల గురించి పట్టించుకోకపోవడం, ఎవరి నుంచైనా చమురు కొనుగోలు చేసుకోవచ్చు. ఇది మా సార్వభౌమాధికారం అంటున్నారు' అని నవారో వ్యాఖ్యానించారు.

అమెరికా స్కూలులో కాల్పులు.. ఇద్దరు చిన్నారులు మృతి 17 మందికి గాయాలు

మిన్నియాపొలిస్: అమెరికాలోని మిన్నియాపొలిస్ నగరంలోని ఓ స్కూలులో బుధవారం ఉదయం ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 17 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో 14 మంది చిన్నారులే కావడం గమనార్హం. అనంతరం ఆగంతకుడు తనను తాను కాల్చుకుని చనిపోయాడు. గాయపడిన 6–15 ఏళ్ల మధ్య చిన్నారులకు ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు. అనన్సియేషన్ కాథలిక్ చర్చిలో కాల్పులకు పాల్పడిన వ్యక్తిని 23 ఏళ్ల రాబిన్ వెస్ట్‌మన్‌గా గుర్తించారు. అతడికి ఎలాంటి నేరచరిత్ర లేదని అధికారులు వివరించారు.

తుపాకీపై 'న్యూక్ ఇండియా'

మిన్నియాపొలిస్ కేథలిక్ చర్చి స్కూలులో హంతకుడు కాల్పులకు వాడిన ఒక తుపాకీపై 'న్యూక్ ఇండియా'అని రాసుంది. వెస్ట్‌మన్ తన వద్ద ఉన్న ఆయుధాలను చూపుతున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. అతడి చేతిలో ఉన్న తుపాకీల్లో ఒక దానిపై న్యూక్ ఇండియా అనీ, మరో దానిపై మాషా అల్లా అనీ, ' మరో గన్‌పై ఇజ్రాయెల్ ఓడిపోవాల్సిందే' అని రాసి ఉంది.

ఎన్డీయేకు 324.. 'ఇండియా'కు 208

ఇండియా టుడే-సీ ఓటర్ మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 324 సీట్లు లభిస్తాయని ఇండియా టుడే–సీ వోటర్ 'మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే'లో తేలింది. విపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమికి కేవలం 208 స్థానాలు దక్కే అవకాశం ఉందని సర్వే వెల్లడించింది. ఈ ఏడాది జూలై 1 నుంచి ఆగస్టు 14 దాకా ఈ సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా.. దేశవ్యాప్తంగా వివిధ లోక్‌సభ నియోజకవర్గాల్లో 54,788 మందిని ప్రశ్నించారు. సీవోటర్ రెగ్యులర్ ట్రాకర్ డేటా ద్వారా మరో 1,52,038 మంది అభిప్రాయాలు సేకరించారు. మొత్తం 2,06,826 మంది వ్యక్తి చేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. తాజాగా సర్వే నివేదిక విడుదల చేశారు. దేశంలో ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయే మళ్లీ ఘన విజయం సాధించడం తథ్యమని సర్వే తేల్చింది. పార్టీల పరంగా చూస్తే బీజేపీకి సొంతంగా 260 సీట్లు, కాంగ్రెస్‌కు సొంతంగా 97 సీట్లు వస్తాయని వెల్లడయ్యింది. 2024 ఎన్నికల్లో ఎన్డీయేకు 44 శాతం ఓట్లు లభించగా, ఇప్పుడు 46.7 శాతం ఓట్లు లభిస్తాయని సర్వే పేర్కొంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 543 స్థానాలకు గాను బీజేపీ కేవల 240 స్థానాలు గెలుచుకుంది. మెజార్టీకి 32 సీట్లు తక్కువొచ్చాయి. దాంతో మిత్రపక్షాల సాయంతో కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మొత్తంగా ఎన్డీయేకు ఇప్పుడు 293 సీట్లున్నాయి. ఇక విపక్ష ఇండియా కూటమి గత ఎన్నికల్లో 234 సీట్లు సాధించింది.

ఉక్రెయిన్ నడిబొడ్డున రష్యా దాడి

- దౌత్య కార్యాలయాలుండే ప్రాంతంపై క్షిపణి దాడి
- 18 మంది మృతి, 50 మందికి గాయాలు
- రష్యా రాయబారికి ఈయూ, యూకే సమన్లు

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని కీలక ప్రాంతాలపై రష్యా బుధవారం రాత్రి భారీ గగనతల దాడులకు తెరతీసింది. యూరోపియన్ యూనియన్, బ్రిటిష్ కౌన్సిల్ కార్యాలయాలున్న భవనాలపై క్షిపణలు, డ్రోన్లతో విరుచుకుపడింది. దాదాపు 9 గంటలపాటు కీవ్‌లో సైరన్లు ఆగకుండా మోగుతూనే ఉన్నాయని స్థానికులు తెలిపారు. జనం తమకు దగ్గర్లోని సబ్‌వే స్టేషన్లలో తలదాచుకున్నారు. ఉదయం 7 గంటలకు ఆల్‌క్లియర్ అంటూ అధికారులు ప్రకటించేదాకా షెల్టర్లలో బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈ దాడుల్లో కనీసం 18 మంది చనిపోగా మరో 50 మంది వరకు గాయాలపాలయ్యారు. మృతుల్లో నలుగురు చిన్నారులున్నారని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. మరణాలు పెరిగే అవకాశముందని పేర్కొంది. మొత్తం 598 డ్రోన్లు, 31 క్షిపణులను రష్యా తమపైకి ప్రయోగించిందని పేర్కొంది. కీవ్ నగరంలోని 10 జిల్లాల పరిధిలోని 33 ప్రాంతాల్లో డ్రోన్లు, క్షిపణులు విధ్వంసం సృష్టించాయంది. ఒక షాపింగ్ మాల్ సహా కనీసం 100 భవనాలు దెబ్బతినగా, వెయ్యి వరకు కిటికీలు ముక్కలయ్యాయని తెలిపింది. పలు బహుళ అంతస్తుల నివాస భవనాలు దెబ్బతిన్నాయి. ఆఫీసులు, రవాణా కార్యాలయం, డజన్లకొద్దీ కార్లు నుజ్జయ్యాయి. కీవ్‌లోని ఈయూ మిషన్‌కు 50 మీటర్ల దూరంలో 20 సెకన్ల వ్యవధిలో రెండుదాడులు జరిగాయని ఉక్రెయిన్ ఆర్మీ పేర్కొంది. దాడుల్లో మిషన్ సిబ్బంది ఎవరూ గాయపడలేదని స్పష్టం చేసింది. రష్యా చర్య వియన్నా ఒప్పందానికి పూర్తి విరుద్ధమని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహా పేర్కొన్నారు. శుక్రవారం సంతాప దినంగా పాటిస్తామని తెలిపారు. వినోద కార్యక్రమాల రద్దుతోపాటు, జాతీయ జెండాలను అవనతం చేస్తామన్నారు. కాగా, దాడులకు నిరసనగా బ్రస్సెల్స్‌లోని రష్యా రాయబారికి సమన్లు జారీ చేసినట్లు ఈయూ తెలిపింది. ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కలిసి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దృష్టికి తీసుకెళ్లామని ఈయూ ప్రెసిడెంట్ ఉర్సులా తెలిపారు. కీవ్‌లోని బ్రిటిష్ కౌన్సిల్ భవనం దెబ్బతినడంపై యూకే ప్రధాని స్టార్మర్ రష్యాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులు, పౌరుల ఉసురుతీస్తూ శాంతికి అధ్యక్షుడు పుతిన్ విఘాతం కల్గిస్తున్నారని మండిపడ్డారు. తమ దేశంలోని రష్యా రాయబారికి సమన్లు జారీ చేసినట్లు యూకే విదేశాంగ మంత్రి ల్యామీ చెప్పారు. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలయ్యాక చేపట్టిన అతిపెద్ద దాడుల్లో ఇదొకటని విశ్లేషకులు చెబుతున్నారు. సైనిక– పారిశ్రామిక సముదాయాలు, సంస్థలు, వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఈ దాడులు చేపట్టామని రష్యా పేర్కొంది. స్పెషల్ మిలటరీ ఆపరేషన్ కొనసాగుతుందని, ఇప్పటికీ శాంతి చర్చలపై నమ్మకంతో ఉన్నామని క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ పేర్కొన్నారు. ట్రంప్, పుతిన్ అలాస్కాలో ముఖాముఖి భేటీ ముగిసిన రెండు వారాలకే రష్యా భీకర దాడులకు దిగడం గమనార్హం.

బిహార్‌లోకి ముగ్గురు పాక్ ఉగ్రవాదులు

రాష్ట్రంలో హై అలర్ట్

పట్నా: పాకిస్తాన్ నుంచి ముగ్గురు ఉగ్రవా దులు బిహార్‌లోకి ప్రవేశించారన్న నిఘా వర్గాల నివేదికలతో రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్‌కు చెందిన ముగ్గురు నేపాల్ సరిహద్దు గుండా బిహార్‌లోకి చొరబడ్డారని అధికారులు ప్రకటించారు. వారి ఫొటోలు, పేర్లతో పాటు ఇతర వివరాలను ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మధుబని, సీతామర్హి, సుపాల్, అరారి యా, తూర్పు, పశ్చిమ చంపారన్ జిల్లాలతో సహా సరిహద్దు ప్రాంతాలలో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. ఉగ్రవాదులు రావల్పిండికి చెందిన హస్నైన్ అలీ, ఉమర్‌కోట్‌కు చెందిన ఆదిల్ హుస్సేన్, బహవల్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఉస్మాన్‌గా అధికారులు గుర్తించారు. వీరు ఆగస్టు రెండో వారంలో ఖట్మండూకు చేరుకుని, గత వారం బీహార్‌లోకి ప్రవేశించారని నిఘా నివేదికలు తెలిపారు. అనుమానితుల పాస్‌పోర్ట్ సంబంధిత వివరాలను ప్రధాన కార్యాలయం సరిహ ద్దు జిల్లాల్లోని పోలీసులకు పంపించారు. భద్ర తా సంస్థలకు నిఘా పెంచాలని, అనుమా నాస్పద కార్యకలాపాల ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా నిఘా విభాగాలకు సూచించింది. ఈ మేరకు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలా పాలు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సంభాల్‌లో 15 శాతానికి పడిపోయిన హిందువులు

- 1947లో 45 శాతం హిందువులు ఉండేవారు
- ముస్లింల జనాభా ప్రస్తుతం 85 శాతానికి చేరింది
- గత ఏడాది జరిగిన హింసాకాండపై త్రిసభ్య కమిటీ నివేదికలో వెల్లడి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో జరిగిన హింసాకాండపై దర్యాప్తు చేపట్టిన త్రిసభ్య కమిటీ తమ నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఇటీవల సమర్పించింది. 450 పేజీల ఈ రిపోర్టులో పలు కీలక అంశాలను ప్రస్తావించింది. 2024 నవంబర్ 24న జరిగిన హింసతోపాటు దాని పూర్వాపరాలు వెల్లడించింది. సంభాల్‌లో హిందువుల జనాభా 15 శాతానికి పడిపోయినట్లు స్పష్టంచేసింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇక్కడ జనాభా స్థితిగతుల్లో భారీ మార్పులు వచ్చాయని, మత రాజకీయాలు కొనసాగుతున్నాయని పేర్కొంది. సంభాల్‌లోని షాహీ జామా మసీదులో సర్వే చేయాలని స్థానిక కోర్టు ఆదేశించడంతో పట్టణంలో గత ఏడాది హింస చెలరేగిన సంగతి తెలిసిందే. ఆ మసీదు ప్రాంగణంలో గతంలో హిందూ ఆలయం ఉండేదని పేర్కొంటూ కొందరు కోర్టును ఆశ్రయించారు. సర్వే కోసం వచ్చిన బృందంతో కొందరు నిరసనకారులు వాగ్వాదానికి దిగారు. ఇది క్రమంగా తీవ్ర ఘర్షణకు దారితీసింది. రాళ్ల దాడిలో 20 మందికిపైగా పోలీసులు గాయపడ్డారు. పలు వాహనాలను నిరసనకారులు దహనం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం హైకోర్టు మాజీ న్యాయమూర్తి దేవేంద్ర ఆరోరా నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ నివేదికలోని అంశాలివీ...

- సంభాల్‌లో 1947 తర్వాత 15సార్లు ఘర్షణలు జరిగాయి. 1947, 1948, 1953, 1958, 1962, 1976, 1978, 1980, 1990, 1992, 1995, 2001, 2019, 2024లో హింసాకాండ చోటుచేసుకుంది.
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో సంభాల్‌లో హిందువులు 45 శాతం, ముస్లింలు 55 శాతం ఉండేవారు. ఇప్పుడు హిందువుల జనాభా 15 నుంచి 20 శాతానికి పడిపోయింది. ముస్లింల సంఖ్య 85 శాతానికి చేరుకుంది. తరచుగా జరుగుతున్న ఘర్షణలు, బుజ్జగింపు రాజకీయాలు ఇందుకు దోహదం చేశాయి.
- 2024 నవంబర్ 22న సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జియా ఉర్ రెహమాన్ బార్క్ చేసిన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో సంభాల్‌లో ఘర్షణ మొదలైంది. నలుగురు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడంతో ఘర్షణలు విస్తరించలేదు.
- అల్–ఖైదా, హర్కత్–ఉల్–ముజాహిదీన్ తదితర ఉగ్రవాద సంస్థలకు సంభాల్‌లో గతంలో స్థావరాలు ఉండేవి. ఇక్కడ అక్రమ ఆయుధాలు, మాదక ద్రవ్యాల ముఠాలకు కొదవలేదు.
- సంభాల్‌లో 68 పుణ్యక్షేత్రాలు, 19 పవిత్ర బావులు ఉండేవి. అవి చాలావరకు ఆక్రమణకు గురయ్యాయి.



గద్వాల జిల్లా అయిజలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు



మిరుదొడ్డిలో యూరియా టోకెన్ల కోసం వర్షంలో గొడుగులు పట్టుకొని క్యూ కట్టిన రైతులు

నంగునూరు రైతు ఆగ్రోసేవా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు



సనత్‌నగర్-వాడీ మధ్య 3వ, 4వ రైల్వేలైన్

రూ. 5,012 కోట్లతో 173 కి.మీ. మేర ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని సనత్‌నగర్, కర్ణాటకలోని వాడీ మధ్య రూ. 5,012 కోట్లతో 173 కి.మీ. మేర 3వ, 4వ రైల్వేలైన్‌ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తెలంగాణ-కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్ట్‌తోపాటు బిహార్, గుజరాత్, అస్సాంకు చెందిన నాలుగు రైల్వే ప్రాజెక్ట్‌లకు ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 12,328 కోట్లతో ఈ ప్రాజెక్ట్‌లను చేపట్టనున్నట్లు ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం(సీసీఈఏ) ప్రకటించింది. ఈ నిర్ణయంతో రైల్వే నెట్‌వర్క్‌లో కొత్తగా 565 కి.మీ. లైన్ అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది.

సెప్టెంబర్ 2న ఉద్యోగ జేఏసీతో ప్రభుత్వం చర్చలు

డిప్యూటీ సీఎం భట్టి స్వయంగా ఆహ్వానించారన్న ఉద్యోగ నేతలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల సాధన కోసం తెలంగాణ ఉద్యోగ జేఏసీ (టీజీఈజేఏసీ) ప్రకటించిన ఉద్యమ కార్యాచరణపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. సెప్టెంబర్ 2న చర్చలు జరిపేందుకు టీజీఈజేఏసీ ప్రతినిధులను ఆహ్వానించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వయంగా చర్చలకు ఆహ్వానించారని, సచివాలయంలోని తన చాంబర్‌కు పిలిపించి చర్చలకు సమ్మతించినట్లు టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భట్టితోపాటు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సీనియర్ అధికారులు బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా, రఘునందన్‌రావు, లోకేశ్‌కుమార్, కృష్ణభాస్కర్‌లను కూడా కలిసినట్లు వెల్లడించారు. కాగా, సెప్టెంబర్ 1న తలపెట్టిన పాత పెన్షన్ సాధన పోరాట సభ వేదికను నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్‌లో ఉన్న తెలుగు లలిత కళా తోరణం నుంచి బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవనం (కళ్యాణ మండపం)కు మార్చినట్లు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు ప్రకటించారు.

ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించండి: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాహనదారులు పోలీసుల సూచనల ప్రకారం ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని డీజీపీ జితేందర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి ఆ యా జిల్లాలకు దారిమళ్లింపు చేపట్టినట్లు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ టోల్‌గేట్ సమీపంలోని ఎన్‌హెచ్ 44 కు వాహనాల రాకపోకలను సజావుగా నడిపించడానికి ఇరువైపులా ట్రాఫిక్ మళ్లింపులు చేసినట్టు తెలిపారు.

హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ రూట్‌లో..
- **భారీ వాహనాల కోసం:** డైవర్షన్ పాయింట్ మేడ్చల్ చెక్‌పోస్టు
- **అనురించాల్సిన మార్గం:** మేడ్చల్-సిద్దిపేట-కరీంనగర్-జగిత్యాల-కోరుట్ల-మెట్‌పల్లి-ఆర్మూర్-ఆదిలాబాద్
- **తేలికపాటి వాహనాల కోసం:** డైవర్షన్ పాయింట్.. తూప్రాన్
- **అనుసరించాల్సిన మార్గం:** మేడ్చల్-తూప్రాన్-సిద్దిపేట-కరీంనగర్-జగిత్యాల-కోరుట్ల-మెట్‌పల్లి-ఆర్మూర్-ఆదిలాబాద్

ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ రూట్‌లో...
- **డైవర్షన్‌పాయింట్:** కొండాపూర్ బ్రిడ్జి (నిర్మల్)
- **అనుసరించాల్సిన మార్గం:** కొండాపూర్ (నిర్మల్)-మమ్డ-ఖానాపూర్-మెట్‌పల్లి-జగిత్యాల-కరీంనగర్-హైదరాబాద్

పుచ్చలపల్లి సుందరయ్య మేనల్లుడి ఆత్మహత్య



ఖమ్మంక్రైం: ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, దివంగత పుచ్చలపల్లి సుందరయ్య మేనల్లుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఏపీలోని నెల్లూరుకు చెందిన దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి (77) పుచ్చలపల్లికి మేనల్లుడు. చంద్రశేఖర్‌రెడ్డి భార్య కొన్నేళ్ల క్రితం మృతిచెందగా ఆయన అమెరికాలో ఉన్న ఇద్దరు కూతుళ్ల వద్ద కొంతకాలం ఉన్నారు. ఆపై హైదరాబాద్ వచ్చి వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. కాగా, ఆయన జీవితంపై విరక్తి చెందినట్లు తెలుస్తుండగా, కొన్నిరోజుల క్రితం కాశీ యాత్రకు కూడా వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో బుధవారం ఖమ్మంలో రైలు దిగి స్టేషన్‌కు కొద్దిదూరాన ఉన్న మామిళ్లగూడెం ప్రాంతంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన వద్ద లభించిన సెల్‌ఫోన్, ఆధార్ కార్డ్‌లోని వివరాల ఆధారంగా బంధువులకు సమాచారం ఇవ్వగా, వారు మృతదేహాన్ని తీసుకెళ్లారు.

వానలోనూ క్యూ కట్టిన రైతులు

- సిద్దిపేట జిల్లాలో యూరియా కోసం పాట్లు
- ఉమ్మడి పాలమూరులో అవే ఇక్కట్లు
- చెన్నూరులో ఓ రైతుకు ఫిట్స్

మిరుదొడ్డి/నంగునూరు/చెన్నూర్‌రూరల్, మహబూబ్‌నగర్ నెట్‌వర్క్: జోరువానలోనూ యూరియా కోసం రైతులు బారులు తీరారు. బుధవారం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి యూరియా లారీ వస్తుందని తెలియడంతో వేల సంఖ్యలో రైతులు తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తడిసి ముద్దవుతూనే గొడుగులు పట్టుకొని టోకెన్ల కోసం క్యూ కట్టారు.

- నంగునూరు ఆగ్రోసేవా కేంద్రానికి యూరియా వస్తుందని తెలియడంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు తెల్లవారు జామునే వచ్చి క్యూలైన్‌లో నిలబడ్డారు. జోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా రాత్రి వరకు నిరీక్షించారు.
- మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం దుగ్నేపల్లి గ్రామంలో రైతు బొంబురపు రాజిరెడ్డి యూరియా కోసం వరుసలో నిలబడి ఉండగా ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి రైతులు 108లో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా యూరియా కష్టాలు తీరడం లేదు. జడ్చర్లలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. దేవరకద్ర, మూసాపేట, చిన్నచింతకుంట మండలాల్లోనూ ఇదే పరిస్థితి. నారాయణపేట జిల్లా మద్దూరు పీఏసీఎస్ వద్ద రైతులు ఆందోళనకు దిగారు. వనపర్తి జిల్లా ఆత్మకూర్ పీఏసీఎస్ వద్ద పోలీసుల పహారాలో యూరియా పంపిణీ చేపట్టారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ, కల్వకుర్తిలో పీఏసీఎస్, తిమ్మాజిపేటలోని ఆగ్రో కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి ఎదురుచూశారు. లింగాల మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు రెండు లారీల యూరియా రావడంతో రైతుల సంఖ్య పెరిగి తోపులాటకు దారి తీసింది.
- జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో తోపులాట, ఉద్రిక్తత నేపథ్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గట్టులోనూ రైతులు భారీగా తరలిరావడంతో పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు. వడ్డేపల్లిలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రైతులు ఉదయం నుంచి రాత్రి వరకు కడుపు మాడ్చుకొని క్యూలైన్లలో నిల్చున్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో యూరియా కోసం వచ్చిన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

కూలిన స్తంభాలు... నీళ్లలో సబ్‌స్టేషన్లు

- వరద ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాల్లో అలముకున్న అంధకారం
- వందలాది కిలోమీటర్ల పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు... యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణకు అధికారుల చర్యలు
- మరో 3–4 రోజుల దాకా సరఫరా పునరుద్ధరణ సాధ్యంకాకపోవచ్చని అంచనా

సాక్షి, హైదరాబాద్/మిరుదొడ్డి (దుబ్బాక)/తొగుట (దుబ్బాక): వరద ప్రభావిత ప్రాంతాల్లోని చాలా గ్రామాల్లో అంధకారం అలముకుంది. సబ్ స్టేషన్లలోకి నీళ్లు చేరడం, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్‌శాఖకు భారీ నష్టం వాటిల్లింది. వరదల నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసిన అధికారులు సరఫరా పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. అయినా మరో 3–4 రోజుల వరకు విద్యుత్ పునరుద్ధరణ సాధ్యం కాకపోవచ్చని అధికార వర్గాలు అంటున్నాయి. మరోవైపు ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు ముషారఫ్ ఫారూఖీ, కర్నాటి వరుణ్‌రెడ్డి తాజా పరిస్థితిని గురువారం మీడియాకు వెల్లడించారు. కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్ ప్రాంతాల్లో వరుణ్‌రెడ్డి పర్యటించారు. కరీంనగర్ సర్కిల్ ఆఫీసులో లోడ్ మానిటరింగ్ సెల్‌ను పరిశీలించి విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్ల పనితీరు, స్తంభాలు, లైన్ల పనితీరును పర్యవేక్షించారు. కాగా, క్షేత్రస్థాయి నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు.



సిద్దిపేట జిల్లా వెంకట్రావుపేట వనం చెరువు మధ్యన స్తంభానికి పిన్ ఇన్సులేటర్ బిగిస్తున్న జేఎల్‌ఎం మల్లేశం

పలు జిల్లాల్లో 'విద్యుత్' నష్టం ఇలా..

- మెదక్ జిల్లాలో వరద ప్రభావానికి కొన్నిచోట్ల సబ్‌స్టేషన్లలోకి నీళ్లు చేరాయి. 33 కేవీ ఫీడర్లు 11, 11 కేవీ ఫీడర్లు 175, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 262 సహా 971 విద్యుత్ స్తంభాలకు నష్టం వాటిల్లింది. వందల కి.మీ. మేర విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి.
- నల్లగొండ, గద్వాల్, యాదాద్రి, సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల పరిధిలో వరదల ప్రభావానికి 33 కేవీ ఫీడర్లు 39, 11 కేవీ ఫీడర్లు 296, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 280, 1,357 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. మరోవైపు ఉత్తర ప్రాంత విద్యుత్ సంస్థ పరిధిలోని కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ సర్కిల్ పరిధిలో 108 విద్యుత్ స్తంభాలు నేలకూలగా వాటిల్లో 87 స్తంభాలను అధికారులు పునరుద్ధరించారు. అలాగే 21 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా అన్నింటినీ బాగుచేశారు. అయితే 86 ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునగగా వాటిలో ఆరింటిని పునరుద్ధరించారు.

ప్రాణాలకు తెగించి వాగులోకి వెళ్లి..

9 గ్రామాలకు ఉద్యోగుల వెలుగులు

భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడంతో విద్యుత్‌ఉద్యోగులు ప్రాణాలకు తెగించి సరఫరా పునరుద్ధరించారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట- భూంపల్లి మండలం ఖాజీపూర్ పరిధిలోని 33/11 కేవీ ఫీడర్ లైన్‌కు సంబంధించిన విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో కాసులాబాద్, రుద్రారం, మల్లుపల్లి, జంగపల్లి, వీరారెడ్డిపల్లి, మదన్నపేట, బేగంపేట, అల్మాస్‌పూర్, ఖాజీపూర్, గుర్రాలపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్‌సీ చంద్రమోహన్, డీఈ రామచంద్రయ్య, ఏడీ గంగాధర్, ఏఈ కనకయ్యలు తమ సిబ్బందితో కలిసి వాగులోకి వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో తొమ్మిది గ్రామాలకు సరఫరాను పురుద్ధరించారు. మరోవైపు తొగుట మండలం వెంకట్రావుపేట వనం చెరువు మధ్యలో ఉన్న ఓ విద్యుత్ స్తంభానికి పిన్ ఇన్సులేటర్ ఊడి పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో జేఎల్‌ఎం మల్లేశం చెరువులోకి ఈదుకుంటూ వెళ్లి స్తంభంపైకి చేరుకొని.. పిన్ ఇన్సులేటర్‌ను బిగించాడు. దీంతో సరఫరా పునరుద్ధరణ అయింది. జేఎల్‌ఎం మల్లేశంను అధికారులు అభినందించారు.



వాగులోకి వెళ్లి విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరిస్తున్న సిబ్బంది



కామారెడ్డి సమీపంలో పంట పొలాల్లో ఇసుక మేటలు

పంటలకు తీవ్ర నష్టం

- భారీ వర్షాలతో ఒక్క కామారెడ్డి జిల్లాలోనే లక్ష ఎకరాల వరకు నష్టం జరిగినట్టు అంచనా
- నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, భూపాలపల్లి జిల్లాల్లో నీట మునిగిన వరి, పత్తి

సాక్షి, హైదరాబాద్: కుండపోత వానలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలు జిల్లాల్లో వరి, పత్తి, సోయాబీన్ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరదల ప్రభావం అధికంగా ఉన్న కామారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పంట పొలాలన్నీ వరదతో మునిగిపోయాయి. వరద నుంచి తేరుకున్న పొలాల్లో ఇసుకమేటలు కనిపించాయి. ఒక్క కామారెడ్డి జిల్లాలోనే లక్షకు పైగా ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు తెలుస్తోంది. అయితే వ్యవసాయ అధికారులు మాత్రం 87వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్టు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇచ్చారని సమాచారం.

- కామారెడ్డి, బిక్కనూరు, రాజంపేట, దోమకొండ, బీబీపేట, లింగంపేట, నాగిరెడ్డి పేట, ఎల్లారెడ్డిలతోపాటు నిజాంసాగర్, మహ్మద్‌నగర్ లలో పంట నష్టం అధికంగా ఉంది. మంజీర నది ప్రభావంతో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేటల్లో నష్ట ప్రభావం అధికంగా ఉండగా, పోచారం ప్రాజెక్టు నిండిపోయి, పొంగిపొర్లడంతో రాజంపేట మండలంలో అధికశాతం పంటలు నీట మునిగాయి. లింగంపేట మండలం కన్నాపూర్ గ్రామశివార్లలోని చెరువుకట్ట తెగడంతో 300 ఎకరాల పొలం పూర్తిగా నీట మునిగింది. లెండి ప్రాజెక్టు పరిధిలోని బిచ్కుంద, మద్నూర్, జుక్కల్ మండలాల్లో మరో 3,500 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.
- కామారెడ్డి తర్వాత అధికంగా పంట నష్టం జరిగిన జిల్లాల్లో మెదక్, నిర్మల్, భూపాలపల్లి జిల్లాలు ఉన్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.
- మెదక్ జిల్లాలో మంజీర పరీవాహక ప్రాంతం 40 కిలోమీటర్ల మేర ఉండగా, మంజీర పొంగిపొర్లడంతో ఇరుపక్కల ప్రాంతాల పొలాలు నీటమునిగాయి. రేగుడు, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, టేక్మల్ మండలాల్లోని పలు గ్రామాల్లో పత్తి, వరి పంటలకు భారీ నష్టం వాటిల్లినట్టు అధికారులు చెబుతున్నారు. మెదక్ జిల్లాలో 6,000 ఎకరాల మేర పంట నష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు.
- భూపాలపల్లిలో భారీ వర్షాలు లేకపోయినా, గోదావరి వరదతో మోరంచవాగు పొంగడంతో భూపాలపల్లి, ఘనపురం మండలాల్లో సుమారు 2వేల ఎకరాల్లో పంట నీట మునిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు పంపిన ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. అయితే నష్టం అధికంగానే ఉన్నట్టు క్షేత్రస్థాయి పరిశీలనను బట్టి తెలుస్తోంది.
- నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, మహబూబాబాద్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ములుగు తదితర జిల్లాల్లో కురిసిన వర్షాల ప్రభావం కూడా పత్తి, వరి పంటలపై పడినట్టు వ్యవసాయ శాఖ చెబుతోంది. అయితే భారీ స్థాయిలో నష్టం జరిగిన దాఖలాలు లేవని, జరిగిన నష్టాన్ని అంచనా వేసే పనిలో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.
- ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో పత్తితోపాటు సోయాబీన్, కూరగాయల పంటలు కూడా దెబ్బతిన్నాయి.

మంత్రి తుమ్మల సమీక్ష

రాష్ట్రంలో బుధ, గురువారాల్లో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంటనష్టంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ బి.గోపితో కలిసి జిల్లాల్లో జరిగిన నష్టంపై ఆరా తీశారు.

పేలుళ్లకు పోలీసులు అనుమతివ్వడమా?

జూబ్లీహిల్స్‌లో కొండరాళ్ల బ్లాస్టింగ్‌లపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు


సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ నివాస ప్రాంతంలో కొండరాళ్ల తొలగింపునకు పేలుళ్లు నిర్వహించేందుకు పోలీసు కమిషనర్ ఎలా అనుమతిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. బ్లాస్టింగ్ కోసం ఎంత మేర పేలుడు పదార్థాలు వాడాలి? ఎంత దూరం వరకు రాళ్లు ఎగిరిపడే అవకాశం ఉంటుంది? వంటి విషయాలపై పోలీసులకు అవగాహన ఉంటుందా అని అడిగింది. ఈ విషయంలో ఎలాంటి షరతులు విధిస్తారని ప్రశ్నించింది. డీఎస్‌ఆర్-ఎస్‌ఆర్ ప్రైమ్ స్పేసెస్ అనే నిర్మాణ సంస్థ జూబ్లీహిల్స్‌లో రాత్రీపగలూ లేకుండా పేలుళ్లు జరుపుతోందంటూ పత్రికల్లో వచ్చిన కథనాలపై విచారణ జరపాలంటూ హైకోర్టు జస్టిస్ భీమపాక నగేశ్ రాసిన లేఖను సుమోటో పిల్‌గా స్వీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. డీఎస్‌ఆర్-ఎస్‌ఆర్ ప్రైమ్ స్పేసెస్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 'జీహెచ్‌ఎంసీ, పర్యావరణ, పోలీసుశాఖ సహా అందరి అనుమతి తీసుకున్నాకే పేలుళ్లు చేపట్టాం. కాలుష్య నియంత్రణ మండలి అఫిడవిట్ కూడా దాఖలు చేసింది'అని చెప్పారు. అయితే పేలుళ్లకు అనుమతిచ్చే అధికారం పోలీసులకు ఉందా? అని సీజే ప్రశ్నించగా హైదరాబాద్ నగర పోలీసు చట్టంలోని సెక్షన్ 21 (ఎఫ్) (5) ప్రకారం బ్లాస్టింగ్‌లపై అనుమతిచ్చే అధికారం కమిషనర్ దేనని ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ బదులిచ్చారు. అయితే అర్ధరాత్రి వేళలోనూ పేలుళ్లు జరిపారా లేదా అనే అంశంపై కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. వాదనలు విన్న ధర్మాసనం భవిష్యత్తులోనూ ఈ తరహా ఉదంతాలు పునరావృతమయ్యే అవకాశం ఉన్నందున పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని ఏఏజీని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 16కు వాయిదా వేసింది.

వరదలపై మంత్రుల సమీక్ష

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో నలుగురు మంత్రులు తమ శాఖల పరిధిలోని పరిస్థితులపై సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో పరిస్థితులపై సమీక్షించారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులను సమీక్షించారు. జలాశయాలు, కాల్వలు, చెరువులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడా గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వరద పరిస్థితులు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. పలు జిల్లాల వైద్య శాఖ అధికారులతో ఆయన హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్షించారు. ఫోన్‌లో అధికారులకు పలు సూచనలు చేశారు.

సహాయక చర్యలపై వివరాలివ్వండి

- వరదలపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఎలాంటి సహాయక చర్యలు తీసుకున్నారో వివరాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని, అందులోని ముఖ్య అంశాలను తమ ముందు ఉంచాలని సూచించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ 2020లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)లో న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది.

వరదలపై కేంద్ర మంత్రుల ఆరా

పార్టీ నేతలు, కార్యకర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలి: రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రభావిత జిల్లాల్లో ఏర్పడిన పరిస్థితులపై కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, జేపీ.నడ్డా ఆరా తీశారు. కేంద్రం నుంచి అవసరమైతే మరిన్ని సహాయక చర్యలకు వీలుగా సిబ్బందిని, సామగ్రిని వెంటనే పంపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావుకు ఇద్దరు కేంద్ర మంత్రులు ఫోన్ చేసి వరదలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీజేపీ పోలింగ్‌బూత్ స్థాయి అధ్యక్షులు, ఆపై నాయకులతో రాంచందర్‌రావు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సహాయచర్యల్లో పాల్గొనాలని కోరారు.

పార్లమెంటుకు నీటి కేటాయింపులు చేసే అధికారం లేదు

- రాజ్యాంగంలో ఆర్టికల్ 262 ప్రకారం ఏర్పాటైన ట్రిబ్యునల్‌కే ఆ అధికారం
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ సర్కార్ వాదన
- నేడూ తుది వాదనలు వినిపించనున్న తెలంగాణ



సాక్షి, హైదరాబాద్: నీటి కేటాయింపులు చేసే అధికారం పార్లమెంటుకు లేదని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ సర్కార్ వాదించింది. రాజ్యాంగంలో ఆర్టికల్ 262 ప్రకారం ఏర్పాటైన నదీ జల వివాదాల ట్రిబ్యునల్‌కు మాత్రమే ఉందని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లో 11వ షెడ్యూల్లో సెక్షన్–10లో మిగులు నీటి ఆధారిత ప్రాజెక్టులకు కేటాయింపులు చేయాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించడాన్ని ఆక్షేపించింది. ఏపీ, తెలంగాణకు కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయడంపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ చైర్మన్‌గా జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తాళపత్ర సభ్యులుగా ఏర్పాటైన కేడబ్ల్యూడీటీ–2 విచారిస్తోంది. ఇందులోభాగంగా గురువారం తెలంగాణ సర్కార్ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ తుది వాదనలు విన్పించారు. శుక్రవారం కూడా వాదనలు విన్పించనున్నారు. కృష్ణా ప్రధాన పాయ నుంచి జూరాల, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి రోజుకు 4 నుంచి 6 టీఎంసీల వరకూ వినియోగించుకోవడానికి తెలంగాణ సర్కార్ ఆఫ్‌లైన్ రిజర్వాయర్లను రూపొందిస్తోందని, వాటికి నీటి కేటాయింపులు చేయాలని కోరారు.

శ్రీశైలం నుంచి చెన్నైకి పైపులైను వేస్తే..

శ్రీశైలం ప్రాజెక్టును జలవిద్యుత్ ప్రాజెక్టుగానే కేడబ్ల్యూడీటీ–1 అనుమతి ఇచ్చిందని తెలంగాణ సర్కార్ పేర్కొంది. చెన్నైకి తాగునీటి సరఫరాకు 1976–77లో కుదిరిన అంతర్రాష్ట్ర ఒప్పందం ప్రకారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రోజుకు 1,500 క్యూసెక్కుల చొప్పున లైనింగ్ చేసిన కెనాల్ ద్వారా 15 టీఎంసీలను తరలించాల్సి ఉండగా.. దాన్ని ఉల్లంఘించి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచిందని వివరించింది. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 1980లో 11,150 క్యూసెక్కులకు.. 2006లో 44 వేల క్యూసెక్కులకు.. 2020లో 88 వేల క్యూసెక్కులకు పెంచి 200 టీఎంసీలకుపైగా తరలిస్తోందని చెప్పింది. అయినా చెన్నైకి 15 టీఎంసీలు సరఫరా చేయడం లేదని తెలిపింది. చెన్నైకి 15 టీఎంసీలు సరఫరా చేయడానికి శ్రీశైలం లేదా ప్రకాశం బ్యారేజీ నుంచి పైపులైన్ వేయాలని.. దానికయ్యే వ్యయాన్ని భరించడానికి తాము సిద్ధమని తెలిపింది.

ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర అన్యాయం

ఉమ్మడి రాష్ట్రంలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ వివరించింది. నాగార్జున సాగర్ కుడి కాలువ కింద ఆయకట్టు 9.7 లక్షల ఎకరాలుగా 1954లో ప్రతిపాదిస్తే.. 1960లో 11.74 ఎకరాలకు పెంచింది. ఇది ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన తొలి అన్యాయంగా పేర్కొంది. తెలంగాణలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద ఆయకట్టు 6.6 లక్షల ఎకరాల నుంచి 6.02 లక్షల ఎకరాలకు తగ్గించారని పేర్కొంది. 1.2 లక్షల ఎకరాల్లో రెండో పంట కింద తడి పంటను తొలగించారని వివరించింది. దీనివల్ల తెలంగాణ ప్రాంతానికి నీటి అవసరం 111 టీఎంసీల నుంచి 100 టీఎంసీలకు తగ్గిందని చూపించారని పేర్కొంది. నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద ఏపీలో ఆయకట్టును 1.3 లక్షల ఎకరాల నుంచి 3.78 లక్షల ఎకరాలకు పెంచారని.. దాంతో నీటి వినియోగం 20.7 టీఎంసీల నుంచి 32.25 టీఎంసీలకు పెరిగిందని వివరించింది. శాస్త్రీయ అంచనాల ప్రకారం నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువ కింద ఏపీకి 84.64 టీఎంసీలు, తెలంగాణకు 164.2 టీఎంసీలు అవసరమని తమ సాక్షి అయిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పళనిస్వామి ప్రమాణపత్రం దాఖలు చేశారని పేర్కొంది.

ఓటరు జాబితా సవరణ వాయిదా వేయాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి బీఆర్‌ఎస్ లేఖ

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను బీఆర్‌ఎస్ కోరింది. ఈ మేరకు ఎమ్మెల్సీలు ఎల్.రమణ, డాక్టర్ శ్రావణ్ దాసోజు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు గురువారం ఒక లేఖను సమర్పించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఈ లేఖపై సంతకం చేశారు. ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను వాయిదా వేసి, పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి ప్రారంభించాలని కోరారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పనలో అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని కేటీఆర్ ఆరోపించారు. పార్టీ సీనియర్ నాయకులతో గురువారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



అడుగడుగునా నిఘా..

మహా నగరంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు 30 వేలమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. -12లో



హాట్.. హంట్!

వర్షాకాలంలో మనసు వెచ్చదనాన్ని కోరుకుంటుంది. వేడి వేడి పానీయాలను ఆస్వాదించాలని ఆరాటపడుతుంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 26.0/21.0

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురవొచ్చు. గరిష్టంగా 26, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

త్వరలోనే మూసీ మాస్టర్ ప్లాన్

గాంధీ సరోవర్ డిజైన్లు పరిశీలించిన సీఎం



సాక్షి, సిటీబ్యూరో: మూసీ రివర్ డెవలప్‌మెంట్ మాస్టర్ ప్లాన్‌పై కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. త్వరలోనే ప్లాన్ రూపుదిద్దుకోనుంది. ఈ మేరకు హెచ్ఎండీఏ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ, టీజీఐఐసీ అధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మూసీ నదీ పరీవాహకం అభివృద్ధి కావాలని సీఎం అధికారులను దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పర్యావరణహితంగా ఉండేలా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. గేట్ వే ఆఫ్ హైదరాబాద్, గాంధీ సరోవర్ అభివృద్ధితోపాటు జంక్షన్ల ఏర్పాటు, రోడ్ల అభివృద్ధిపై అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్ రహిత జంక్షన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ అభివృద్ధికి సంబంధించి పలు డిజైన్లను సీఎం పరిశీలించారు. అనంతరం మీరాలం చెరువు అభివృద్ధి, ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రణాళికల గురించి అధికారులు సీఎంకు వివరించారు. వీలైనంత త్వరగా డీపీఆర్‌లు సిద్ధం చేసి పనులు మొదలు పెట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు.

నిండుకుండల్లా జంట జలాశయాలు

భారీ వరద.. దిగువకు నీటి విడుదల

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులోని జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లు నిండుకుండల్లా మారాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు వరద ప్రవాహాలు పెరిగాయి. చేవెళ్ల, వికారాబాద్, శంకరపల్లి, ముమాన్ పల్లి, దోబీపేట్ ప్రాంతాల్లో కురిసే వర్షపునీరు మూసీ నది ద్వారా ఉస్మాన్‌సాగర్‌లోకి చేరుతోంది. చేవెళ్ల, అందాపూర్, కొత్వాల్‌పేట్, నర్కూడ, తాండూర్, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కురిసే వర్షం నీరు ఈసీ నది ద్వారా వచ్చి హిమాయత్ సాగర్‌లో కలుస్తోంది. గురువారం సాయంత్రం నాటికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టాలకు చేరాయి. దీంతో జలమండలి అధికారులు క్రస్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

గణేశ్ ఉత్సవాల్లో షీ-టీమ్స్ నిఘా

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో ఖైరతాబాద్ బడా గణేశుడితోపాటు నగరంలోని అనేక మండపాలకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇదే అదనుగా పోకిరీలు రెచ్చిపోతుంటారు. వినాయకుడిని చూడటానికి వచ్చే యువతులు, మహిళలపట్ల అసభ్యంగా, అభ్యంతరకరంగా ప్రవర్తిస్తుంటారు. ఈ నేపథ్యంలో నగర షీ-టీమ్స్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పోకిరీలపై నిఘా ఉంచడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఎవరైనా బాధితులుగా మారినా, వేధింపులపై సమాచారం ఉన్నా 100 లేదా 112కు ఫోన్ చేసి గానీ, 94906 16555 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా గానీ సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు.

సికింద్రాబాద్ నుంచి పలు రైళ్ల మళ్లింపు..

అక్టోబర్ 27 నుంచి నవంబర్ 26 వరకు అమలు



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనుల దృష్ట్యా పలు రైళ్లను చర్లపల్లి, నాంపల్లి, మల్కాజిగిరి స్టేషన్ల నుంచి నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే చర్యలు చేపట్టింది. సికింద్రాబాద్ నుంచి నడిచే పలు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను అక్టోబర్ 27 నుంచి నవంబర్ 26వ తేదీ వరకు మళ్లించనున్నారు. 18 రైళ్లను చర్లపల్లి నుంచి నడపనున్నారు. సికింద్రాబాద్-సిద్దిపేట మధ్య నడిచే డెమో, పుష్‌పుల్ రైళ్లు మల్కాజిగిరి నుంచి బయలుదేరుతాయి. సికింద్రాబాద్-పుణె(12025/12026) శతాబ్ది సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నాంపల్లి నుంచి బయలుదేరనుంది. సికింద్రాబాద్-సిల్చార్ (12513/12514)వీక్లీ సూపర్‌ఫాస్ట్, సికింద్రాబాద్-దర్భంగా (17007/17008)బై వీక్లీ, సికింద్రాబాద్-యశ్వంత్‌పూర్ (12735/12736) గరీబ్‌రథ్ ట్రై వీక్లీ సూపర్ ఫాస్ట్, సికింద్రాబాద్-అగర్తల (07030/07029) వీక్లీ స్పెషల్ ట్రైన్, సికింద్రాబాద్-ముజఫర్‌పూర్ (05293/05294) వీక్లీ స్పెషల్, హైదరాబాద్-రక్సల్ (07051/07052) వీక్లీ స్పెషల్ రైళ్లు చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించనున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా ప్రయాణికులు టెర్మినల్ స్టేషన్లను ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచించారు.





చూశారు.. తరించారు..

భారీగా తరలి వచ్చిన భక్తజనం


69 అడుగుల ప్రతిమ.. విశ్వశాంతి మహాశక్తికి ప్రతీక.. భక్తజనులు భారీగా తరలారు.. చూడాలని తలచారు.. చూసి తరించారు.. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఖైరతాబాద్ వినాయకుడి దివ్యదర్శనం కోసం హైదరాబాద్ నలుదిక్కుల నుంచి భక్తులు తండోపతండాలుగా కదిలివచ్చారు. పంచముఖ నాగేంద్రుడి నీడన కొలువుదీరిన మూడు ముఖాల గణేశుడిని కనులారా వీక్షించారు. మనసారా ఆనందపరవశమయ్యారు.

ఐటీలో మేటి.. 'స్మార్ట్'లో పిటీ

స్మార్ట్ సిటీస్‌లో హైదరాబాద్‌కు 109వ స్థానం

దేశంలోని స్మార్ట్‌సిటీ నగరాల ర్యాంకింగ్ ఇలా...

నగరం	ర్యాంకింగ్ రేటింగ్
ఢిల్లీ	104
ముంబై	106
హైదరాబాద్	109
బెంగళూర్	110



- భారతీయ నగరాల్లోనూ వెనుకబాటే
- మొదటి రెండు స్థానాల్లో ఢిల్లీ, ముంబై
- ప్రపంచ స్మార్ట్ సిటీస్ జాబితాను వెల్లడించిన ఐఎండీ
- ప్రజారవాణా, ట్రాఫిక్ సమస్యల వల్లే వెనుకబాటు

సాక్షి, సిటీబ్యూరో

ఐటీ హబ్‌గా పేరొందిన హైదరాబాద్ 'స్మార్ట్'గా వెనకబడి పోయింది. గ్లోబల్ సిటీ దిశగా పరుగులు తీస్తున్నప్పటికీ స్మార్ట్‌సిటీస్ జాబితాలో మాత్రం అట్టడుగునే ఉండిపోయింది. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ (ఐఎండీ) సంస్థ 2025వ సంవత్సరానికి తాజాగా ప్రపంచంలోని స్మార్ట్‌సిటీ నగరాల జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో హైదరాబాద్ 109వ స్థానానికే పరిమితమైంది. భారతీయ నగరాల పరంగా చూస్తే మనకు మూడోస్థానం దక్కింది. 104వ ర్యాంకుతో ఢిల్లీ మొదటి స్థానంలో నిలవగా, 106వ స్థానంతో ముంబై రెండో స్థానాన్ని దక్కించుకుంది. బెంగళూర్‌కు 110వ స్థానం లభించింది. ప్రజారవాణా సదుపాయాల కొరత, ట్రాఫిక్ రద్దీ వంటి సమస్యల కారణంగా హైదరాబాద్ వెనుకంజలో ఉన్నట్లు ఐఎండీ స్పష్టం చేసింది. మౌలిక సదుపాయాల విస్తరణ లేకపోవడం కూడా ఒక కారణమని పేర్కొంది. మెరుగైన సదుపాయాలు, సాంకేతిక రంగానికి అనువైన వాతావరణం, ప్రజారోగ్యం, సామాజిక భద్రత, ప్రజారవాణా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పటిష్టమైన పాలనా వ్యవస్థ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఐఎండీ స్మార్ట్‌సిటీ నగరాలకు ర్యాంకింగ్ ఇస్తోంది. ఈ జాబితాలో మొదటి 20 స్థానాల్లో భారతీయ నగరాలకు చోటు లభించకపోవడం గమనార్హం.

సుస్థిరమైన ప్రజారవాణా లేకపోవడమే...

హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తున్నా, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి ట్రిపుల్ ఆర్ వరకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టినా, అనేక అంతర్జాతీయ ఐటీ సంస్థలు, ఫార్మా దిగ్గజాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నా ఇందుకనుగుణంగా మౌలిక సదుపాయాలు లేకపోవడం సవాళ్లుగా మారాయి. ప్రజారవాణా సదుపాయాల విస్తరణ లేకపోవడం ప్రధాన లోపంగా ఉంది. మరోవైపు మెట్రోరైల్ విస్తరణకు నోచలేదు. మెట్రో విస్తరణలో ఢిల్లీ రెండు, మూడు దశల్లో ఉండగా హైదరాబాద్ 69 కిలోమీటర్లతో ఇంకా మొదటి దశలోనే ఉంది. సిటీ బస్సులు సైతం అరకొరగానే ఉన్నాయి. రవాణా వర్గాల అంచనా మేరకు ఔటర్ రింగ్‌రోడ్డు వరకు అంటే.. సుమారు 7,250 చ.కి.మీ. పరిధిలో రవాణా సదుపాయాలను పెంపొందించేందుకు కనీసం 8 వేల సిటీబస్సులు అవసరం. కానీ, 2,800 బస్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రవాణా సదుపాయాలను పెంపొందించేందుకు హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ హుమ్టా ఇప్పటికే కొన్ని ప్రణాళికలు రూపొందించింది. కూకట్‌పల్లి హైటెక్ సిటీ, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని మోనోరైల్, బస్ ర్యాపిడ్ సిస్టమ్ వంటి సదుపాయాల కల్పనకు ప్రణాళికలున్నా ఆచరణ దిశగా చర్యలు లేవు. దీన్ని దృష్టిలో ఉంచుకొని 'ఐటీ హబ్‌గా హైదరాబాద్ బలమైన స్థానం కలిగి ఉన్నప్పటికీ, స్మార్ట్‌సిటీస్ ర్యాంకింగ్‌లో మాత్రం మౌలిక సదుపాయాల లోపాలు, పాలనాపరమైన సవాళ్లు, సస్టైనబుల్ మొబిలిటీ వ్యవస్థలు వెనుకబాటును సూచిస్తున్నాయి'అని ఐఎండీ విశ్లేషించింది. ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం వంటి సమస్యలు కూడా స్మార్ట్ సిటీ లక్ష్యాలను సాధించడానికి అడ్డంకులుగా ఉన్నాయి.

మెరుగైన ర్యాంకింగ్‌కు అవకాశాలు...

అంతర్జాతీయంగా పేరొందిన ఐటి దిగ్గిజ సంస్థలు నగరంలో తమ కార్యాలయాలను నెలకొల్పేందుకు పోటీపడుతున్నాయి. స్టార్టప్‌లకు సైతం ప్రభుత్వం సముచిత ప్రోత్సాహాన్ని అందజేస్తోంది. డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతిని సాధిస్తోంది. భవిష్యత్తులో హైదరాబాద్‌కు మెరుగైన ర్యాంకింగ్ లభించేందుకు ఈ అంశాలు దోహదం చేసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

ప్రపంచంలోని స్మార్ట్ నగరాల్లో..

స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ నగరం గత ఏడాదితోపాటు ఈసారి (2025) కూడా ట్రిపుల్ ఏ రేటింగ్‌తో ప్రపంచంలోనే అత్యంత స్మార్ట్ సిటీగా నిలిచింది. ఆ తరువాత ఓస్లో (నార్వే), జెనీవా (స్విట్జర్లాండ్), వరుసగా రెండు, మూడోస్థానాల్లో ఉన్నాయి. మిడిల్ ఈస్ట్ నగరాలు దుబాయ్, అబుదాబి 4, 5 స్థానాల్లో నిలిచాయి. ఆ తరువాత వరుసగా లండన్ (బ్రిటన్), కోపెన్‌హాగన్ (డెన్మార్క్), కాన్‌బెర్రా (ఆస్ట్రేలియా), సింగపూర్, లౌసాన్ (స్విట్జర్లాండ్) నగరాలు ఉన్నాయి.

సర్కారు బడుల్లో యూకేజీ!

నాలుగేళ్లు నిండినవారికి ప్రవేశాలు

- స్కూల్‌కు ఒక ఇన్‌స్ట్రక్టర్, ఆయా
- గ్రేటర్ పరిధిలో 114 పాఠశాలల ఎంపిక

మహానగరంలోప్రీ ప్రైమరీ స్కూల్స్ ఇలా...

జిల్లా	ఎంపిక చేసిన స్కూల్
హైదరాబాద్	25
మేడ్చల్-మల్కాజిగిరి	24
రంగారెడ్డి జిల్లా	65

సాక్షి, సిటీబ్యూరో: సర్కారు బడుల్లో యూకేజీ క్లాస్ మొదలైంది. మహానగర పరిధిలో ఈ విద్యాసంవత్సరం సుమారు 114 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులకు విద్యాశాఖ అనుమతించింది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం తగ్గిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా చిన్నారులను మొదటి నుంచే ప్రభుత్వ విద్యావ్యవస్థలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో వీటిని ప్రవేశపెట్టింది. వాస్తవంగా ప్రీ ప్రైమరీ అంటే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ఉండాలి. అయితే ప్రభుత్వ బడుల్లో ప్రవేశపెట్టిన ప్రీప్రైమరీలో యూకేజీ మాత్రమే ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలంటే ఐదేళ్లు నిండాల్సి ఉంటుంది. దీని ప్రకారం యూకేజీలో ప్రవేశానికిగాను నాలుగేళ్లు నిండాల్సి ఉంది. ఒక్కో పాఠశాలలో 30 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పించనున్నారు. మహిళా సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖలతో విద్యాశాఖ సమన్వయంతో చిన్నారులకు ప్రవేశం కల్పించే విధంగా చర్యలు చేపట్టారు. ప్రవేశం కల్పించిన విద్యార్థి వివరాలను యు-డైస్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. దీనికోసం విద్యార్థుల జనన, నివాస, ఆధార్ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.



కనీస అభ్యసన నైపుణ్యాలు..

ప్రీ ప్రైమరీలో చేరిన విద్యార్థులకు కనీస అభ్యసన నైపుణ్యాలతో ప్రాథమిక స్థాయి చదువుకు కావాల్సిన సంసిద్ధత కార్యక్రమాలు చేపట్టనున్నారు. తద్వారా వచ్చే ఏడాది వారిని ఒకటో తరగతిలో సులభంగా చేర్చే అవకాశం ఉంటుంది. యూకేజీ సిలబస్‌ను ఎస్‌సీఈఆర్‌టీ నిపుణులతో తయారు చేయించారు. యూకేజీ విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ప్రతి స్కూల్‌కి ఒక ఇన్‌స్ట్రక్టర్(విద్యావాలంటీర్)తోపాటు చిన్నారుల బాగోగులు చూసుకునేందుకు ఒక ఆయాను కూడా తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తున్నారు. కనీసం ఇంటర్ పూర్తి లేదా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసిన తర్వాత వారికి శిక్షణ ఇవ్వనున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మహిళా సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంతోపాటు స్థానిక వైద్యాధికారి సాయంతో ఆరోగ్య పరీక్షలు కూడా క్రమం తప్పకుండా నిర్వహిస్తారు.

ఓయూ కాలనీలో రంగనాథ్ పర్యటన

వరద ముంపు నివారణ పనుల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: వరద ముంపు నివారణ పనుల పర్యవేక్షణకుగాను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం షేక్‌పేటలోని ఓయూ కాలనీలో పర్యటించారు. ఇటీవలి వర్షాలకు కాలనీ నీట మునిగింది. కాలనీలో వరద ముప్పును నివారిస్తూ చేపట్టిన కాలువల అనుసంధాన పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ ప్రాంతంలోని ఆదిత్యా నగర్, రాహుల్‌నగర్, బృందావన్ కాలనీ, సూర్య నగర్ కాలనీ మీదుగా సాగే వరద కాలువను మణికొండ మున్సిపాలిటీలోని ఆంబియన్స్ కోర్టు యార్డు గేటెడ్ కమ్యూనిటీ ముందు నుంచి వెళ్లే లైనుకు అనుసంధానం చేస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా పైపులైన్ వేసిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. షేక్‌పేట కొత్త చెరువు నుంచి ఆదిత్యనగర్ మీదుగా శాతం చెరువును అనుసంధానిస్తూ సాగే వరద కాలువపై పలుచోట్ల ఉన్న కబ్జాలను ఆయన పరిశీలించారు. వరద ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని, అవసరమైన చోట నాలా వాస్తవ వెడల్పు ఉండేలా విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ఓ యూ కాలనీలో వరద ముప్పు నివారణ చర్యలు చేపట్టిన రంగనాథ్‌కు స్థానిక కార్పొరేటర్ రాషెద్ ఫరాజుద్దీన్ శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా కమిషనర్ చొరవతోనే ఈ వరద కాలువ అనుసంధానం జరిగిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు.



జూబ్లీహిల్స్ రోడ్ 19లోనూ..

జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 19లోని నాలాను ఆక్రమించినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలోనూ రంగనాథ్ పర్యటించారు. నాలాను ఆక్రమించడమే కాకుండా సెల్లార్ కోసం గుంత తవ్వి ఇతర పనులు చేయకపోవడంతో చుట్టుపక్కల ఇళ్లకు ఇబ్బందిగా పరిణమించిందన్న విషయాన్నీ పరిశీలించారు. నాలా ఆక్రమణను ఉపేక్షించేది లేదని, ఇతరులకు ఇబ్బంది లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.

గ్రేటర్‌లో 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలు



బేగంపేటలో నిమజ్జన కొలను..

లక్డీకాపూల్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం సాఫీగా, వేగంగా సాగేందుకు జీహెచ్ఎంసీ 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి నిమజ్జన పాండ్ వద్ద ఒక ఇన్‌చార్జీ, నోడల్ అధికారితోపాటు ఓవరాల్ ఇన్‌చార్జీగా డిప్యూటీ కమిషనర్‌ను నియమించింది. క్రేన్లు, కంట్రోల్ రూమ్, మెడికల్ క్యాంపు, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేందుకు శానిటేషన్ సిబ్బందితోపాటు వాహనాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సిబ్బంది మూడు షిఫ్ట్‌ల్లో పని చేసేవిధంగా చర్యలు చేపట్టారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి ఏర్పాటు చేయనున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

- పలువురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం


చెల్లా చెదురైన వస్తువులు

ఆల్విన్‌కాలనీ/జగద్గిరిగుట్ట: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసమైన సంఘటన కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన రాజేష్ బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి ఆస్‌బెస్టాస్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం తెల్లవారుజామున ఇంట్లో గ్యాస్ లీకైంది. ఈ విషయం తెలియక ఉదయం రాజేష్ కుటుంబ సభ్యులు కరెంటు స్విచ్ ఆన్ చేయటంతో భారీ పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతకు రాజేష్ కుటుంబ సభ్యులతో పాటు పక్కనే నివాసం ఉంటున్న మణికంఠ, అతని భార్యతో సహా ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికుల ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్, హైడ్రా సిబ్బంది గాయపడిన వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద తీరుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జగద్గిరిగుట్ట సీఐ నరసింహులు బాధితులను పరామర్శించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

జీడిమెట్ల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మన్యం జిల్లాకు చెందిన సాయికుమార్ బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి దూలపల్లిలోని ఓ పరిశ్రమలో పని చేస్తూ స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. గురువారం ఉదయం అతను బైక్‌పై సూరారం నుంచి బాలానగర్ వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి జీడిమెట్ల డిపో వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరి ఉష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోజుకు 44 వేల ఉల్లంఘనలు!

- రాజధానిలో ఏడు నెలల్లో 98.2 లక్షల వైలేషన్స్
- విత్‌ఔట్ హెల్మెట్ వంటి ప్రమాదకరమైనవే అధికం
- గత ఏడాదిని మించిపోనున్న ఈ 'ట్రాఫిక్ కేసులు'


అత్యంత ప్రమాదకరమైనవే అధికం...

సాక్షి, సిటీబ్యూరో: జంక్షన్‌లోని ఓ మార్గంలో వస్తున్న వాహనాలు ఆగాలంటూ సిగ్నల్‌లో రెడ్ లైట్ పడిందంటే... మరో మార్గంలో ప్రయాణిస్తున్న వాహనాలు వెళ్లాలంటూ గ్రీన్‌లైట్ పడుతుంది. ఇలాంటి సందర్భంలో రెడ్ లైట్ పడిన మార్గంలోని వాహనాలు స్టాప్‌లైన్ దాటి ముందుకు వచ్చినా... సిగ్నల్ జంప్ చేస్తూ దూసుకుపోవాలని ప్రయత్నించినా... ఆ ప్రభావం గ్రీన్‌లైట్ ఉన్న మార్గంలో వచ్చే వాహనాలపై ఉండి ట్రాఫిక్ జామ్ అవుతుంది.

◆ నగరంలో ట్రాఫిక్ జామ్స్ ఏర్పడటానికి మౌలిక వసతుల లేమి, ఆక్రమణలు, సిబ్బంది కొరతతో పాటు... వాహనచోదకులు చేసే ఉల్లంఘనలూ ఓ కారణమని చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు. అలాంటిది రాజధానిలోని మూడు కమిషనరేట్లలో కలిపి సరాసరిన రోజుకు 44 వేల ఉల్లంఘనలు నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి–జూలై మధ్య నమోదైన వైలేషన్స్ సంఖ్య 92.8 లక్షలుగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

రహదారి భద్రతకు సంబంధించిన నిబంధనలు అనేకం ఉన్నాయి. పోలీసులు, నిపుణులు వీటిని మూడు రకాలుగా విభజిస్తారు. వాహన చోదకుడికి ముప్పుగా పరిణమించేవి, ఎదుటి వారికి ముప్పుగా పరిణమించేవి, వాహన చోదకుడితో పాటు ఎదుటి వారికీ ముప్పుగా పరిణమించేవి. వీటిలో మూడో కోవకు చెందిన వాటినే ట్రాఫిక్ విభాగం అధికారులు ఎక్కువ తీవ్రంగా పరిగణిస్తారు. సిగ్నల్ జంపింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, డ్రంక్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్... తదితరాలన్నీ వీటి కిందికి వస్తాయి. రాజధానిలోని మూడు కమిషనరేట్లలో నమోదవుతున్న ఉల్లంఘనల్లో ఇవి కూడా పెద్ద సంఖ్యలోనే ఉంటున్నాయి. ఇక్కడ ఉన్న వాహనాల సంఖ్యలో ద్విచక్ర వాహనాలే 80 శాతం వరకు ఉంటాయి. ఈ నేపథ్యంలోనే వాటికి సంబంధించిన హెల్మెట్ లేకుండా వాహనం నడపటం (విత్‌ఔట్ హెల్మెట్) ఉల్లంఘనపై జారీ అయిన ఈ-చలాన్లే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ ఏడాది తొలి ఏడు నెలల్లో నమోదైన చలాన్ల గణాంకాల ఆధారంగా వీటి సంఖ్య గత ఏడాది కంటే ఎక్కువ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఇవీ ఉల్లంఘనల గణాంకాలు (లక్షల్లో):

కమిషనరేట్	2021	2022	2023	2024	2025(జూలై)
హైదరాబాద్	82.7	54.8	55.3	63.9	52.1
సైబరాబాద్	61.8	28.7	27.8	26.5	23.1
రాచకొండ	24.5	25.1	24.7	27.8	17.6

పూర్తిగా నాన్ కాంటాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్...

ట్రాఫిక్ విభాగం అధికారులు ఉల్లంఘనులకు చెక్ చెప్పడానికి జరిమానాలు విధిస్తుంటారు. దీన్నే సాంకేతిక పరిభాషలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌గా పిలుస్తారు. ఒకప్పుడు కేవలం కాంటాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానం అమలులో ఉండేది. క్షేత్రస్థాయి విధుల్లో ఉండే ట్రాఫిక్ పోలీసులు తమ వద్ద ఉండే చలాన్ పుస్తకాలను వినియోగించి ఉల్లంఘనులకు జరిమానాలు విధించే వారు. దీనివల్ల కొన్ని సందర్భాల్లో అపశృతులు, ఘర్షణలు చోటు చేసుకునేవి. ఆపై కొన్నేళ్లుగా పూర్తిస్థాయిలో నాన్-కాంటాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో ట్రాఫిక్ ఉల్లంఘనులకు జరిమానా విధింపు మొత్తం ఈ-చలాన్ ద్వారా జరిగిపోతుంది. క్షేత్రస్థాయిలో ఉండే పోలీసులు, సీసీ కెమెరాల ద్వారా తీసిన ఫొటోల ఆధారంగా కంట్రోల్ రూమ్‌లోని సర్వర్ వీటిని జారీ చేస్తుంటుంది. ఉల్లంఘనల నమోదు పెరడగానికి ఇదీ ఓ కారణంగా మారింది.

మూసీ నదిలో యువకుడి గల్లంతు


మహ్మద్ సలీం (ఫైల్)

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ వద్ద మూసీ ప్రవాహంలో ఓ యువకుడు గల్లంతైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంకర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సలీం (32) కూలీగా పని చేస్తున్నాడు. గురువారం తాగిన మత్తులో అతను ఈత కొట్టేందుకు మూసీ నదిలోకి దూకాడు. నదిలో ప్రవాహం ఉధృతంగా ఉండటంతో గల్లంతయ్యాడు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి గాలింపు చేపట్టారు.

యువతితో అసభ్య ప్రవర్తన..

ఇద్దరు యువకుల రిమాండ్.

బంజారాహిల్స్: తనతో పనిచేస్తున్న ఉద్యోగితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఇద్దరు యువకులు తమ బైక్‌ను అడ్డగించి తనను దుర్భాషలాడటమేగాక తాను వేసుకున్న డ్రెస్‌పై కామెంట్లు చేస్తూ న్యూసెన్స్‌కు పాల్పడ్డారంటూ ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఇద్దరు యువకులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బేగంపేటలో నివసించే ఓ యువతి ఈ నెల 22న ఆరోగ్యం బాగోలేకపోవడంతో తనతో పనిచేస్తున్న యువకుడితో కలిసి బైక్‌పై ఆస్పత్రికి వెళ్తుంది. అయితే కార్వానాకు చెందిన సోహైల్, రిజ్వాన్‌ఖాన్ అనే ఇద్దరు యువకులు బైక్‌పై ఆమెను వెంబడించి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో అడ్డగించారు. ఇతర మతస్తుడితో ఎందుకు వెళుతున్నావంటూ ఆమెను నిలదీశారు. మెడికల్ ఎమెర్జెన్సీ ఉండడంతో ఆస్పత్రికి వెళ్తున్నానని, తనతో పనిచేస్తున్న ఉద్యోగి ఆస్పత్రికి తీసుకువెళ్తున్నాడని ఆమె బతిమిలాడినా వినిపించుకోకుండా దర్భాషలాడారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు పరారీలో ఉన్న నిందితులిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పెయింటర్ దారుణ హత్య..

సనత్‌నగర్: ఓ పెయింటర్ హత్యకు గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తాను పనిచేసే చోట మహిళతో చనువుగా ఉండడాన్ని గుర్తించిన ఆమె భర్త, కుటుంబ సభ్యులు చితకబాదడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన బబ్లూ (22) నగరానికి వలసవచ్చి పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భరత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మేస్త్రీ రాజారామ్‌తో పాటు అతని భార్య, మామ రవీందర్, అత్త కౌసల్య, బాబాయి రాజేంద్రలు కూడా అదే భవనంలో కార్మికులుగా పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. బుధవారం రాత్రి రాజారామ్ భార్య బబ్లూతో కలిసి ఉండటాన్ని గుర్తించాడు. ఈ విషయాన్ని మామ రవీందర్, బంధువులకు చెప్పడంతో అందరూ కలిసి బబ్లూపై దాడి చేయడంతో అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని వాచ్‌మెన్ మల్కాజిగిరిలో ఉంటున్న బబ్లూ సోదరుడికి చెప్పడంతో అక్కడికి వచ్చిన అతను బబ్లూను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బూబ్లూ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రాజారామ్, రవీందర్, కౌసల్య, రాజేంద్రలను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ కేసులో సహకరిస్తాం

మహీంద్రా యూనివర్సిటీ వీసీ డాక్టర్ యాజుల మేడూరి

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లి లోని మహీంద్రా యూనివర్సిటీలో గంజాయి, డ్రగ్స్ పట్టుబడిన ఘటనపై దర్యాప్తులో పోలీసులకు పూర్తిగా సహకరిస్తామని యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ యాజుల మేడూరి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాము క్రమశిక్షణ, నిజాయితీ, చట్టానికి గౌరవం వంటి అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్నామన్నారు. ఇటీవల కొందరు విద్యార్థులకు నార్కోటిక్స్ కేసులో ప్రమేయం ఉన్నట్లు వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. మత్తు పదార్థాల వినియోగం, కలిగి ఉండటం లేదా పంపిణీ చేయడాన్ని విశ్వవిద్యాలయం ఖండిస్తుందని, తమ యూనివర్సిటీ జీరో టాలరెన్స్ పాలసీని అనుసరిస్తుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే, లేదా తమ విద్యార్థి సమాజం భద్రత, సంక్షేమాన్ని ప్రమాదంలోకి నెట్టే ఏ చర్యకైనా విశ్వవిద్యాలయ నియమావళి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు తాము పూర్తిగా సహకరిస్తున్నామన్నారు. తమ సంస్థ విలువలు, సమగ్రతను కాపాడటానికి అవసరమైన ప్రతి చర్య తీసుకుంటూ, సురక్షితమైన, బాధ్యతాయుతమైన, క్రమశిక్షణతో కూడిన క్యాంపస్ వాతావరణాన్ని కొనసాగించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల ఎదురయ్యే పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.. విద్యార్థులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వర్సిటీ విలువలను కాపాడాలని కోరారు.

కన్న కొడుకులనే కడతేర్చింది..

- వాటర్ టబ్బులో ముంచి చంపిన వైనం
- సౌదీలో హైదరాబాదీ మహిళ ఘాతుకం


యూసుఫ్ అహ్మద్ (ఫైల్)


మహ్మద్ సాధిక్ అహ్మద్ (ఫైల్)


మహ్మద్ ఆదిల్ అహ్మద్ (ఫైల్)

గోల్కొండ: ఓ మహిళ తన ముగ్గురు కొడుకులను కడతేర్చిన సంఘటన సౌదీ అరేబియాలోని అల్‌కోబర్ నగరంలో చోటు చేసుకుంది. నిందితురాలు హైదరాబాద్ నగరానికి చెందినది కావడం గమనార్హం. వివరా లు ఇలా ఉన్నాయి... టోలిచౌకికి చెందిన సయ్యదా ఉమేరా అఫ్రీన్ భర్త సౌదీ అరేబియాలోని అల్‌కోబర్‌లో పని చేస్తున్నాడు. ఇదిలా ఉండగా కొన్ని నెలల క్రితం సయ్యదా ఉమేరా అఫ్రీన్ తన ముగ్గురు కుమారులతో భర్త వద్దకు వెళ్లింది. మంగళవారం రాత్రి ఆమె తన కుమారులు యూసుఫ్ అహ్మద్(3), మహ్మద్ సాదిక్ అహ్మద్(6), మహ్మద్ ఆదిల్ అహ్మద్(6) ఇంట్లోని వాటర్ టబ్బులో ముంచి చంపేసింది. అనంతరం తాను కూడా ఆత్మహత్యకు ఆత్మహత్యకు యత్నించింది. దీనిని గుర్తించిన ఆమె భర్త మహ్మద్ షానవాజ్ లేచి అఫ్రీన్‌ను రక్షించాడు. బుధవారం ఉదయం స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితురాలు అఫ్రీన్‌ను అదుపులోకి తీసుకోని విచారిస్తున్నారు. కాగా ఆమెకు గత కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగ్గా లేనట్లు తెలిసింది.

నెయ్యి దుకాణంలో అగ్నిప్రమాదం ..



పంజగుట్ట: నెయ్యి దుకాణంలో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన బుధవారం అమీర్‌పేట్‌లో చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో స్థానికులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. పంజగుట్ట పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమీర్‌పేట లోని ప్రధాన రహదారిపై ఉన్న దేవాలయం ముందు మంగళ అనే మహిళ మెట్రో పిల్లర్ నెంబర్ 1444 వద్ద బాలాజీ నెయ్యి, పూజా సామాగ్రి షాప్ నిర్వహిస్తుంది. బుధవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్ది సేపటికే షాపులోనుంచి మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫిల్మ్‌నగర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ ప్రాంతాల నుంచి వచ్చిన మూడు ఫైర్ ఇంజన్లు గంటసేపు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ దుకాణం పక్కనే ఉన్న సి.కె.ఫ్యాబ్రిక్స్ రెడిమెంట్ బట్టల దుకాణం కూడా మంటలు వ్యాపించి నష్టం వాటిల్లింది. సుమారు ఐదు లక్షల నష్టం వాటిల్లి ఉండవచ్చునని పంజగుట్ట పోలీసులు తెలిపారు.

భవనం పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య


జితేందర్ రెడ్డి(ఫైల్)

గచ్చిబౌలి: పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి లోనైన ఇంజినీరింగ్ విద్యార్థి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కర్నాటకకు చెందిన సువర్ణ భర్త చనిపోవడంతో నగరానికి వలస వచ్చి రాజేంద్రనగర్ మండలం, బండ్లగూడలో నివాసం ఉంటోంది. ఆమె పెద్ద కుమారుడు తూర్పు జితేందర్ రెడ్డి(23) ఇంజనీరింగ్, చిన్న కొడుకు హరీష్ రెడ్డి హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్నారు. ఇంజనీరింగ్ ఫైనలియర్‌లో జితేందర్ రెడ్డి నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. పార్ట్ టైం జాబ్ చేసుకుంటూ హాస్టల్ ఉండి చదువుకుంటానని తల్లికి చెప్పి వారం రోజుల క్రితం గౌలిదొడ్డిలోని పద్మశ్రీ గార్డెన్స్‌లోని హిల్ వ్యూ పీజీ హాస్టల్‌లో చేరాడు. మంగళవారం ఇంటికి వెళ్లిన జితేందర్ గురువారం మధ్యాహ్నం హాస్టల్‌కు తిరిగి వచ్చాడు. వచ్చి రావడంతోనే భవనం పైకి ఎక్కి ఐదవ అంతస్తు నుంచి దూకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2 లక్షలు ఇస్తేనే సర్టిఫికెట్లు ఇస్తారా?

- లేదంటే వారి జీవితాలతో ఆడుకుంటారా?
- సెప్టెంబర్ 2న వ్యక్తిగతంగా హాజరు కావాలి
- వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ యాజమాన్యానికి హెచ్ఆర్సీ ఆదేశం

సిటీ కోర్టులు : విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వడానికి రూ.2 లక్షలు డిమాండ్ చేస్తారా? లేదంటే సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారి జీవితాలతో ఆడుకుంటారా? అని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వెంకటేశ్వర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 2021-25 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులు నల్లగొండ జిల్లా చర్లపల్లిలోని వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో బీ ఫార్మసీ పూర్తి చేశారు. తమకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తుందని 9 మంది విద్యార్థులు మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఎం.ఫార్మసీ కోర్సులో ప్రవేశం పొందేందుకు అడ్మిషన్ పోర్టల్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడానికి సెప్టెంబర్ 2 చివరి తేదీ అని, ఆ లోపు చేయకుంటే తాము ఎం-ఫార్మసీకి అవకాశం కోల్పోతామని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు అడిగితే ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చాకే సర్టిఫికెట్లు ఇస్తామని, లేని పక్షంలో ఒక్కో విద్యార్థి రూ.2 లక్షలు చెల్లించాలని కళాశాల యాజమాన్యం డిమాండ్ చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై గురువారం కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిశోర్‌తో కూడిన బెంచ్ విచారణ చేపట్టింది. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేయడమేంటని కళాశాల యాజమాన్యంపై మండిపడింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యమైతే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారి భవిష్యత్‌ను దెబ్బతీస్తారా అని ప్రశ్నించింది. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం ఆర్టికల్ 21 ప్రకారం విద్యా హక్కును ఉల్లఘించడమే అని కమిషన్ అభిప్రాయపడింది. వెంటనే విద్యార్థులు సర్టిఫికెట్లు అందజేసి వచ్చే విచారణకు కళాశాల ప్రిన్సిపాల్, చైర్మన్ వ్యక్తిగతంగా కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ సమాచారాన్ని నల్లగొండ కలెక్టర్‌కు అందజేయాలని కమిషన్ కోర్టు అధికారులను ఆదేశిస్తూ తదుపరి విచారణ సెప్టెంబర్ 2కు వాయిదా వేసింది.

పంజాబ్ ప్రయాణికుడి వద్ద బుల్లెట్లు పట్టివేత


స్వాధీనం చేసుకున్న బుల్లెట్లు


నిందితుడు సుఖ్‌దీప్ సింగ్

శంషాబాద్: పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఓ ప్రయాణికుడి వద్ద బుల్లెట్లు లభ్యమైన సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కలకలం రేపింది. ఆర్‌జీఐఏ ఔట్‌పోస్ట్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పంజాబ్ రాష్ట్రం, భవానిగఢ్‌కు చెందిన సుఖ్‌దీప్ సింగ్ ఇండిగో విమానంలో గురువారం వయా ఢిల్లీ నుంచి అమృత్‌సర్ బయలుదేరే విమానంలో బోర్డింగ్ అవుతుండగా భద్రతాధికారులు అతడి లగేజీని పరిశీలించారు. అందులో 02.ఎంఎం నాలుగు రౌండ్లు, 0.7 ఎంఎం రెండు రౌండ్లు, 7.52 ఒక రౌండు ,7.62 ఒక రౌండు లభ్యమయ్యాయి. బుల్లెట్లకు సంబంధించిన ఎలాంటి డాక్యుమెంట్లు అతడి వద్ద లేకపోవడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాడు.ఈ నెల 22 తాను నాందేడ్ నుంచి గురుద్వార్‌కు బస్సులో ప్రయాణం చేసినట్లు అతడు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లేని చట్టం పేరు చెప్పి రూ.33 లక్షలు స్వాహా!

- డిజిటల్ అరెస్టు పేరుతో టోకరా
- బాధితుడు బోయిన్‌పల్లికి చెందిన వృద్ధుడు
- సైబర్‌క్రైం పీఎస్‌లో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో ఎక్కడా లేని చట్టం పేరు చెప్పిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన వృద్ధుడిని నిలువు దోపిడీ చేశారు. నేషనల్ సీక్రెట్స్ యాక్ట్ అంటూ డిజిటల్ అరెస్టు చేసి ఏకంగా రూ.33.4 లక్షలు కాజేశారు. దాదాపు 15 రోజుల పాటు దఫదఫాలుగా ఈ మొత్తం చెల్లించిన బాధితుడు ఎట్టకేలకు మోసపోయినట్లు గుర్తించాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన వృద్ధుడికి (73) గత నెలలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను కర్ణాటకకు చెందిన క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌ను మాట్లాడుతున్నానంటూ పరిచయం చేసుకున్నాడు. బాధితుడి ఆధార్ కార్డు దుర్వినియోగం అయ్యిందని, అశ్లీల సాహిత్యంతో పాటు మనుషుల అక్రమ రవాణా వ్యవహారంలో దానిని వినియోగించారని చెప్పాడు. ఈ మేరకు తమ వద్ద క్రిమినల్ కేసు నమోదైందని భయపెట్టాడు. ఇది నేషనల్ సీక్రెట్ యాక్ట్-1923కి సంబంధించిన అంశం కావడంతో తదుపరి విషయాలు తమ ఉన్నతాధికారి మాట్లాడతారంటూ చెప్పాడు. ఆపై ఐపీఎస్ అధికారి దయా నాయక్ పేరుతో మరో వ్యక్తి బాధితుడిని ఫోన్ చేశాడు. తాను ఎలాంటి నేరం చేయలేదని, ఆ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని బాధితుడు దయా నాయక్‌తో చెప్పాడు. అది నిరూపితం అయ్యే వరకు డిజిటల్ అరెస్టులో ఉండాలంటూ బాధితుడితో చెప్పిన ఇతగాడు ఆయన భార్యకూ దీనిని వర్తింపజేశాడు. తమ అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్లొద్దని, తాము చెప్పే వరకు ఈ విషయం మరొకరికి తెలియకూడదని షరతు విధించాడు. అప్పటికే తీవ్రంగా భయపడిన బాధితుడు, ఆయన భార్య అతడి మాటలు నమ్మారు. ఆపై అసలు కథ మొదలుపెట్టిన సైబర్ నేరగాళ్లు నిర్దోషిత్వం నిరూపించుకోవాలంటూ 'ఫండ్ వెరిఫికేషన్' విధానం అమలు చేయాలని, దీనికోసం తాము పేర్కొన్న బ్యాంకు ఖాతాల్లోకి రూ.15 లక్షలు చెల్లించాలని చెప్పాడు. పూర్వాపరాలు పరిశీలించిన తర్వాత కేసు మూసేయడంతో పాటు ఆ మొత్తం రీఫండ్ చేస్తామని నమ్మబలికారు. దీంతో బాధితుడు ఆ మొత్తం బదిలీ చేశారు. ఆపై మరికొన్ని పేర్లు చెబుతూ ఇంకొంత కాజేశారు. ఇలా గత నెల 25 నుంచి ఈ నెల 8 వరకు బాధితుడు మొత్తం రూ.33.4 లక్షలు డిపాజిట్ చేశారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. ప్రస్తుతం దేశంలో అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ అమలులో ఉంది తప్ప నేషనల్ సీక్రెట్స్ యాక్ట్ పేరుతో ఎలాంటి చట్టం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఖాళీ జాగా వేసేయ్ పాగా..

నకిలీ డాక్యుమెంట్లతో స్వాహా

- రూ.5 కోట్లు విలువ చేసే 3 ప్లాట్ల విక్రయం
- 8 మంది అరెస్టు
- పరారీలో మరో అరుగురు


పోలీసుల అదుపులో నిందితులు


స్వాధీనం చేసుకున్న నకిలీ పత్రాలు

కీసర: రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి ఓ బైక్ మెకానిక్ నకిలీ పత్రాలు సృష్టించి రూ. 5 కోట్లు విలువైన ఐదు ప్లాట్‌లను కొట్టేశాడు. అందులో మూడు ప్లాట్లను ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రాచకొండ ఎస్ఓటీ, కీసర పోలీసులు 8 మందిని అరెస్టు చేశారు., మరో అరుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపల్లికి చెందిన అరవింద్ బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అతను అదే ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వాపారులు సంపంగి సురేష్ , ఈగ హరిప్రసాద్‌లతో కలిసి ఖాళీ స్థలాలకు నకిలీ పత్రాలు రూపొందించి వాటిని విక్రయించి రూ. కోట్లు సంపాదించాలని పథకం పన్నాడు. ఇందులో భాగంగా అరవింద్ రాంపల్లి ప్రాంతంలోని ఖాళీ ప్లాట్లను గురిస్తాడు. అందులో మొదటి సేల్ డీడ్ మాత్రమే ఉన్న ప్లాట్‌లలో ఎలాంటి ఫెన్సింగ్ లేకుండా ఉన్న వాటిని ఎంచుకుంటాడు. సేల్ డీడ్‌లో ఉన్న పేరు, చిరునామాలను ఆరా తీసి యజమానుల వివరాలను సేకరించేవాడు. అనంతరం ఈసీ, సర్టిఫైడ్ సేల్ డీడ్ కాపీలను తీసి వాటి ద్వారా నకిలీ పత్రాలను సృష్టిస్తాడు. అనంతరం వాటిని విక్రయించి ఈ ముగ్గురు పంచుకునేవారు. వీరు ప్లాట్ యజమాని బతికి ఉండగానే అతను చనిపోయాడని, ఆయన భార్య కుడా మృతి చెందిందని, వారికి సంబంధించిన డెత్ సర్టిఫికేట్‌లను తయారు చేశారు. వారి వారసురాలిగా ఓ యువతికి డబ్బు ఆశ చూపించి ఆమెతో రూ. 75 లక్షల విలువ చేసే ప్లాట్‌ను విక్రయించారు. ఈ విషయం తెలుసుకున్న యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ ముఠా సభ్యులు 5 ప్లాట్లకు నకిలీ పత్రాలు రూపొందించి మూడు ప్లాట్లను విక్రయించినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది.ఈ వీరు రాంపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 281, 282, 283, 422, 403, 421, 560, 561, 281, 282, 283,లో 1800 గజాలకు సంబంధించిన ప్లాట్లకు నకిలీ పత్రాలు రూపొందించినట్లు తెలిపారు.ఈ ముఠాలో సభ్యులపై 11 కేసులు ఉన్నట్లు తెలిపారు. బీగూడెం అరవింద్, సంపంగిసురేష్, ఈగ హరిప్రసాద్ మహమ్మద్ హుస్సేన్, యంజాలశేఖర్ వీరమచినేని వనజలను పోలీసులు అరెస్టు చేశారు. అమరేంద్ర , మాణిక్, అహ్మద్,ముసుకు సునీల్ కుమార్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మహాగణపతికి 21 కిలోల లడ్డూ



ఖైరతాబాద్ : ప్రతీ సంవత్సరం ఖైరతాబాద్ మహాగణపతికి నైవేద్యంగా లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తూ వస్తున్న అడ్‌హక్ కమిటీ సభ్యుడు మహేష్ యాదవ్ వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్ మహాగణపతికి 21కిలోల లడ్డూను సతీసమేతంగా కలిసి సమర్పించాడు.

మహాగణపతి ప్రాంగణంలో మహిళ ప్రసవం



ఖైరతాబాద్: రాజస్థాన్ నుంచి ఖైరతాబాద్ మహాగణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఆట వస్తువులు విక్రయించేందుకు వచ్చిన మహిళకు బుధవారం ఉదయం ఖైరతాబాద్ మహాగణపతి క్యూలైన్ ప్రాంతంలో పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆమెను పక్కనే ఉన్న ప్రభుత్వాసుపత్రి గేటు లోపలికి తీసుకువచ్చారు. అంతలోనే హాస్పిటల్ సిబ్బంది స్ట్రెచర్ సిద్ధం చేస్తుండగా ప్రాంగణంలోనే ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే బిడ్డతో సహా తల్లిని హాస్పిటల్ లోపలికి తీసుకువెళ్లారు. పరీక్షించిన డాక్టర్లు తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని ఎలాంటి సమస్యలు లేవని తెలిపారు.

భక్తులకు ప్రసాదం పంపిణీ



ప్రసాదాన్ని భక్తులకు పంచుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రతి రోజు నిత్య ప్రసాద పంపిణీ చేపడుతున్నట్లు అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. నవరాత్రుల సందర్భంగా మహాగణపతి దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు క్యూ లైన్‌లో ప్రసాద పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పరిశీలించారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

బంజారాహిల్స్: ప్రజా సమస్యలపై షేక్‌పేట వార్డు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ డీఎంసీ సమ్మయ్య తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, వీధిదీపాలు, పారిశుద్ధ్యం, పార్కులు, కమ్యూనిటీ స్పేస్‌లు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను స్వీకరించి సంబంధిత అధికారుల సమక్షంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గడ్డం వెంకటస్వామికి సన్మానం



గడ్డం వెంకట్‌స్వామిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఫిలింనగర్: బీజేపీ నగర సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గడ్డం వెంకటస్వామిని జూబ్లీహిల్స్ ఫిలింనగర్ డివిజన్ గౌతమ్‌నగర్ చౌరస్తాలో గురువారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ముద్దంగుల శ్రీనివాస్, కొత్త నీరజ, వల్లెపు శంకర్, దండగుల శ్రీనివాస్, గణేష్‌యాదవ్, సీతల అనిల్‌కుమార్ కస్తూరి మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ శ్రీ సి.మల్లికార్జున్‌రెడ్డి తండ్రి శ్రీ సి.[illegible] రెడ్డి వారు హైదరాబాద్ జిల్లా, GHMC పరిధి, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హకీంపేట్ గ్రామంలోని సర్వే నం.102/1 మరియు షేక్‌పేట్ గ్రామంలో సర్వే నం. కొత్త 120 (పాత 403/1)లోని బ్లాక్ నం.2, వార్డు నం.8, జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ వద్ద గల 2018.00 చ.గజాలు లేదా 1688.00 చ.మీటర్ల విస్తీర్ణం, ప్లాట్ నం. 380 పై నిర్మించిన నం.8-2-293/82/A/380 కలిగిన మొత్తం ఇంటిని దాని చట్టబద్ధ యజమాని శ్రీమతి [illegible] భర్త [illegible], వయస్సు సుమారు 52 సంవత్సరాలు, వృత్తి: [illegible], నివాసం: ప్లాట్ నం. 24A, రోడ్ నం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500034 నుండి [illegible] అమ్మక ప్రతిఫలానికి కొనుగోలు చేయుటకు [illegible] సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది మరియు అతని పేరున ఆస్తి యొక్క తుది అమ్మక వ్యవహారం పూర్తి చేయు ప్రక్రియలో ఉన్నారు. దీనికి సంబంధించి, ఎవరైనా వ్యక్తి/వ్యక్తులు సదరు ఆస్తికి సంబంధించి ఏవిధమైన ఏదైనా ప్రయోజనం, టైటిల్, అభ్యంతరం కలిగి ఉంటే ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 15 రోజులలోగా అన్ని మద్దతు పేపర్లు, డాక్యుమెంట్లతో దిగువ సంతకందారుని సంప్రదించవలెను. పైన తెలిపిన విధంగా నిర్దేశిత సమయంలోగా ఎట్టి క్లెయిమ్, అభ్యంతరం అందనట్లయితే నా క్లయింట్ ముందుకు సాగుతారు మరియు అతని పేరున అమ్మక వ్యవహారం పూర్తి చేసుకుంటారు మరియు ఆ తరువాత అందిన ఎట్టి క్లెయిమ్ / అభ్యంతరములు పరిశీలించబడవు.

ఆస్తి షెడ్యూల్

హైదరాబాద్ జిల్లా, GHMC పరిధి, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హకీంపేట్ గ్రామంలోని సర్వే నం.102/1 మరియు షేక్‌పేట్ గ్రామంలో సర్వే నం. కొత్త 120 (పాత 403/1)లోని బ్లాక్ నం.2, వార్డు నం.8, జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ వద్ద గల 2018.00 చ.గజాలు లేదా 1688.00 చ.మీటర్ల విస్తీర్ణం, ప్లాట్ నం. 380పై నిర్మించిన నం.8-2-293/82/A/380 కలిగిన ఇల్లు యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం.381, దక్షిణం: ప్లాట్ నం.379, తూర్పు: [illegible], పశ్చిమం: 80 అ.వెడల్పు రోడ్ నం.10.

సం/- [illegible], అడ్వకేట్,
ఫ్లాట్ నం.501, [illegible], రోడ్ నం.4, [illegible], బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-68, సెల్ నం. 9346754089

మహాగణపతికి ఘనంగా తొలిపూజ



మహాగణపతికి తొలగిపూజ చేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఖైరతాబాద్: వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్ మహాగణపతికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తొలి పూజ నిర్వహించారు. 69 అడుగుల ఎత్తులో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనిమిస్తున్న మహాగణనాథుడికి బుధవారం ఉదయం 10.45 నిమిషాలకు గవర్నర్ తొలిపూజ నిర్వహించారు. తొలి పూజలో గవర్నర్‌తో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్‌లు పాల్గొన్నారు.

మహాగణపతికి పట్టు వస్త్రాలు

ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఖైరతాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మహాగణపతికి పట్టు వస్త్రాలు, 75 అడుగుల జంధ్యం, చేనేత కండువా, గరికమాలను సమర్పించారు. రాజ్‌దూత్ చౌరస్తా నుంచి గుర్రపు బగ్గీలో భారతీయ సాంప్రదాయ కళా నృత్యాలు, ఒగ్గు డోలు, కోలాటం ఆడుతూ మహాగణపతికి చెంతకు తీసుకువచ్చి మహాగణపతికి సమర్పించినట్లు సంఘం అధ్యక్షుడు కదారి శ్రీధర్ తెలిపారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా భారీ బందోబస్తు మధ్య గవర్నర్ తొలిపూజను నిర్వహించారు.

ఏకదంతుడికి ప్రత్యేక పూజలు



బంజారా యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన గణేష్ పూజల్లో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్..



దేవరకొండ బస్తీలోని అరుంధతీ వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

గల్లీగల్లీలో కొలువుదీరిన బొజ్జ గణపయ్యలు..

బంజారాహిల్స్: వాడవాడలా కొలువుదీరిన గణనాథుడికి భక్తులు వినాయకచవితి పర్వదినం రోజున ఘనంగా పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచే వినాయక మండపాల వద్ద భక్తుల కోలాహలం కనిపించింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్, సోమాజీగూడ, పంజగుట్ట, శ్రీనగర్‌కాలనీ, శ్రీకృష్ణానగర్, వెంకటగిరి, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథుల దివ్యరూపాన్ని తిలకించేందుకు భక్తజనసందోహం భారీగా తరలివచ్చారు. సాయంత్రం మండపాలను రంగురంగుల విద్యుద్దీపాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాత్రి బొజ్జగణపయ్యకు విశేష పూజలు జరిగాయి. మండపాల పరిసరాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరియగా చిన్నారుల కేరింతలు, యువతీ యువకుల నృత్యాలు, పెద్దల పూజాధికాల మధ్య జాతర వాతావరణం నెలకొంది. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

అంకితభావంతో సేవలందిస్తున్నాం

అపోలో జేఎండీ సంగీతారెడ్డి

బంజారాహిల్స్: వైద్యులు, ఉద్యోగుల అంకిత భావంతోనే ఇన్నేళ్ళుగా రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని అపోలో ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి అన్నారు. అపోలో ఆస్పత్రి 37వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఆస్పత్రి ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంగీతారెడ్డి మాట్లాడుతూ.. వైద్య రంగంలో ఎన్నో మార్పులు, ఎన్నో టెక్నాలజీలు వచ్చాయని వాటన్నింటిని వినియోగించుకుంటూ ఎప్పటికప్పుడు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నామని అన్నారు. ఈ సందర్భంగా వైద్యులకు, ఉద్యోగులను రీజినల్ సీఈవో తేజస్వి రావుతో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఎంఎస్ డాక్టర్ రవీందర్ బాబు, సీఓఓ శ్రీ హర్కరణ్ సహా సీనియర్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



వైద్యులు, ఉద్యోగులతో కార్యక్రమంలో పాల్గొన్న అపోలో జేఎండీ సంగీతారెడ్డి

కాంగ్రెస్ హయాంలోనే గిరిజనులకు న్యాయం

హిమాయత్‌నగర్ : నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనులకు సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ రంగాల్లో న్యాయం జరిగిందని మాజీ ఎంపీ ధరావత్ రవీందర్ నాయక్ తెలిపారు. బంజరాలను ఎస్టీలుగా గుర్తించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బంజారాల రిజర్వేషన్ స్వర్ణోత్సవ ప్రచార రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. బంజారా భారత్ కన్వీనర్ డాక్టర్ జగన్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో రథయాత్ర పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో బంజార భారత్ ప్రతినిధులు ఎస్.పి.నాయక్, డాక్టర్ రాజేశ్ నాయక్, బోన నాయక్, రాఘవా నాయక్ పాల్గొన్నారు.

ముదిరాజులకు సముచిత స్థానం కల్పించాలి

హిమాయత్‌నగర్ : రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ముదిరాజులకు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని కోరుతూ తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ ప్రతినిధి బృందం గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఇటీవల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రామచందర్ రావును శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 50 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లను బీజేపీ రాష్ట్ర కమిటీలో, అనుబంధ సంఘాల విభాగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. రామచందర్ రావు సానుకూలంగా స్పందించి ముదిరాజ్‌లకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సమర్థవంతమైన నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

శోభాయాత్రకు ఇబ్బంది లేకుండా...

బంజారాహిల్స్: రోడ్లపై గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని పోలీసులు భుజాలకెత్తుకున్నారు. శుక్రవారం నుంచి కొంతమంది నిర్వాహకులు గణేషుల నిమజ్జనానికి శ్రీకారం చుడుతుండగా ప్రధాన రహదారుల్లో గుంతలను గుర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసులు తమ పరిధిలోని గుంతలకు జీహెచ్‌ఎంసీ సిబ్బందిని పిలిపించి మరమ్మతులు చేయిస్తున్నారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి గురువారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14 జంక్షన్‌లో ప్రధాన రోడ్డులో 20కి పైగా గుంతలను సిమెంట్‌తో పూడ్చి మరమ్మతులు చేయించారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ ఎస్ఐలు దగ్గరుండి గుంతలను పూడ్చేందుకు జీహెచ్‌ఎంసీ సిబ్బందితో సమన్వయం చేసుకున్నారు. మరోవైపు లా అండ్ ఆర్డర పోలీసులు కూడా గురువారం పలుచోట్ల గుంతలను సిమెంట్‌తో పూడ్చే కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ సర్కిళ్ల పరిధిలో 375 చోట్ల ప్రధాన, అంతర్గత రహదారుల్లో గుంతలను గుర్తించడంతో పాటు గణేష్ నిమజ్జన శోభయాత్రల రూట్ నేపథ్యంలో గుంతలకు మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. ఈ ఐదు రోజుల్లో కనీసం 50 శాతం గుంతలను పూడ్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రజత కవచాలంకరణలో గణనాథుడు



బంజారాహిల్స్ శ్రీ విజయ గణపతి స్వామి



శ్రీ బాలగణపతి అలంకరణలో దైవసన్నిదానం వినాయకుడు...

బంజారాహిల్స్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని ఆయా ఆలయాల్లో నవరూపాల్లో అర్చకులు అలంకరిస్తున్నారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న శ్రీ విజయగణపతి స్వామి ఆలయంలో స్వామి వారిని ఆలయ అర్చకులు రజత కవచాలతో అలంకరించారు. 20 కేజీల వెండితో తయారు చేసిన వెండి కవచాలతో స్వామివారిని అలంకరించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయ చయనులు తెలిపారు. ఫిలింనగర్ దైవ సన్నిదానంలోని గణపతిని తొలిరోజు బాల గణపతి స్వామిగా అలంకరించారు. ఆలయంలో ఈ సందర్భంగా బాలారిష్ట దోష నివారణకు శ్రీ బాల గణపతి హోమం నిర్వహించారు.

పార్కు చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ మాయం

సనత్‌నగర్: ఇంటి ముందు పార్కు చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ చోరీకి గురైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్-7లోని అమోఘ అపార్ట్‌మెంట్స్‌లో నివసించే సుశీల్‌కౌల్ (26) ఈ నెల 23న సాయంత్రం 6.30 గంటలకు తన రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 బైక్ (ఎంహెచ్ 05 ఈసీ 9341)ను అపార్ట్‌మెంట్ వద్ద పార్కు చేశాడు. 25న ఉదయం 9.15 గంటలకు చూడగా, పార్కు చేసిన ప్రాంతంలో బైక్ కనిపించ లేదు. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్‌ట్యాప్‌లు మాయం

సనత్‌నగర్: రెండు ల్యాప్‌ట్యాప్‌లతో పాటు మొబైల్ ఫోన్, హార్డ్‌డిస్క్‌లు కనిపించకుండా పోయిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీనగర్ అవంతినగర్ లక్ష్మి రెసిడెన్సీకి చెందిన మహేంద్ర (27)ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు.ఈ నెల 23న రాత్రి రోజూ లాగానే నిద్రకు ఉపక్రమించాడు. మరుసటి రోజు తెల్లవారుజామున 4గంటలకు నిద్ర నుంచి మేల్కొని చూడగా,ఇంట్లోని డెల్ ల్యాప్‌ట్యాప్, హెచ్ ల్యాప్‌ట్యాప్, రియల్‌మీ8 మొబైల్ ఫోన్, హార్డ్‌డిస్క్‌లు కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి వాటిని దొంగతనం చేసి ఉంటారని మహేంద్ర భావించి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జర్దా పాకెట్లు స్వాధీనం - ఇద్దరి అరెస్టు

వెంగళరావునగర్ : ప్రభుత్వం నిషేధించిన జర్దా (పొగాకు)ను విక్రయిస్తున్న ఇద్దరిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 20 కిలోల జర్దా పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణ్‌నగర్ ప్రాంతంలో అనుమతి లేని జర్దా విక్రయిస్తున్నట్టుగా మధురానగర్ పీఎస్‌కు సమాచారం అందింది. దాంతో ఎస్ఐ పెట్రోలింగ్ నిర్వహించి, కళ్యాణ్‌నగర్ చౌరస్తా వద్ద ఉన్న ఏ.కె.పాన్ పాయింట్‌లో తన సిబ్బందితో పాటుగా సోదా చేశారు. ఈ క్రమంలో అనుమతి లేని 20 కిలోల 40 జర్దా పాకెట్లు లభించాయి. నిందితుడు మహ్మద్ అఖిల్‌ను అదుపులోనికి తీసుకున్నారు. అనంతరం అతని ద్వారా అతనికి సరఫరా చేసే ఎర్రగడ్డకు చెందిన విశాల్ మోదాని అనే వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. కాగా ప్రధాన పంపిణీ దారుడు బేగంబజార్‌కు చెందిన హీరాలాల్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మధురానగర్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం

వెంగళరావునగర్ : కళాశాలకు వెళ్ళిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. రహమత్‌నగర్‌లో నివసించే యాకూబ్ పాషా కుమారుడు అఫ్రోజ్ అబిడ్స్‌లోని కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. ఈనెల 23వ తేదీనాడు కాలేజీకి వెళ్ళిన అఫ్రోజ్ తిరిగి ఇంటికి రాలేదు. అనేక ప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేదు, దీంతో తండ్రి యాకూబ్ పాషా గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

మళ్లీ నీటమునిగిన వాక్‌వే



వర్షానికి కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో చేరిన నీరు

బంజారాహిల్స్: వరుసగా కురుస్తున్న వర్షాలకు బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో మరోసారి నీట మునిగింది. దీంతో వాక్‌వేలో రాకపోకలు నిలిచిపోయాయి. కేబీఆర్ పార్కును ఆనుకొని ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో గేట్ నెం.2 వద్ద పార్కులోపల ఉన్న కుంటనిండటంతో నీరు బయటికి వస్తోంది. ఈ వాక్‌వే నుంచి వరద నీరు గేట్ నెం.2 మీదుగా ప్రత్యేకంగా వేసిన పైప్‌లైన్ ద్వారా వరద నీటి కాల్వలో కలుస్తుంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు కేబీఆర్ పార్కులోపల ఉన్న 18 కిపైగా కుంటలు ఇప్పటికే పూర్తి స్థాయిలో నిండిపోయాయి. దీనికి తోడు పార్కులోని చెరువు కూడా నిండినట్లు అధికారులు తెలిపారు.


పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి

వెంగళరావునగర్ : సోషల్ మీడియా, ఓటీటీ కార్యక్రమాలు చిన్నారులపై ప్రభావాన్ని చూపకుండా తల్లిదండ్రులు తగిన విధంగా జాగ్రత్తలు వహించాలని బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి తెలియజేశారు. సంకల్ప ఫౌండేషన్ డైరెక్టర్ రోజీ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాంగణంలో ఉన్న చైల్డ్ రైట్స్ కమిషన్ ప్రధాన కార్యాలయంలో గురువారం సీతా దయాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు రూపుమాపడానికి సంకల్ప ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని తెలియజేశారు.

జై..బోలో గణేష్ మహరాజ్‌కీ



నందినగర్‌లో వీర భజరంగీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



భగత్‌సింగ్ కాలనీలో భగత్‌సింగ్ యువసేన ఆధ్వర్యంలో కుంకుమ గణపతిగా



ఫిలింనగర్ వినాయకనగర్‌లో ఆకు అలంకారంలో వినాయకుడు

ఎటుచూసినా ఏకదంతుడి నామస్మరణే...దిక్కులు పిక్కటిల్లేలా జై...బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ భక్తజనం జయజయ ధ్వానాలు పలుకుతుండగా...విద్యుత్ కాంతుల నడుమ ధగధగ మెరిసిపోతోన్న మండపాల్లో గణనాథుడు కొలువుదీరాడు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రథమ పూజాదీశుడికి ఘన స్వాగతం పలికారు. వాడవాడలా...వీధి వీధినా గణేష్ ఉత్సవ శోభ సంతరించుకుంది. గల్లీ గల్లీలో లంబోదరుడి సేవలో పునీతులవుతూ భక్తులు ఆధ్యాత్మిక జగత్తులో మునిగితేలుతున్నారు. బంజారాహిల్స్, జూబ్లిహిల్స్‌లో గణేష్ చతుర్థి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్ల అసోసియేషన్లు ప్రత్యేకంగా మండపాలను అలంకరించి బొజ్జ గణపయ్యకు విశేష పూజలు నిర్వహించారు. విభిన్న రూపాల్లో గణేషుడు మండపాల్లో దర్శనమిస్తున్నాడు.



మాగంటి కాలనీలో డమరుకంపై వినాయకుడు



వినాయక నగర్ బస్తీలో శ్రీరామావతారంలో వినాయకుడు



ఇందిరానగర్‌లో..



బోరబండ రాజ్‌నగర్‌లో..



ఎస్పీఆర్‌హిల్స్ రాజీవ్‌గాంధీనగర్ శాంతకూమార్

సాక్షి
శుక్రవారం । 29 । ఆగస్టు । 2025

జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా

బాలానగర్: రాష్ట్రంలో వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న నేపథ్యంలో జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే అన్ని పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ జి.కృష్ణమోహన్‌రావు తెలిపారు. పరీక్షలు నిర్వహించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు రెండు విమానాల మళ్లింపు

శంషాబాద్: కర్నాటకలోని శివమొగ్గకు వెళ్లాల్సిన రెండు విమానాలను ప్రతికూల వాతావరణం కారణంగా హైదరాబాద్‌కు మళ్లించారు. చెన్నై నుంచి శివమొగ్గ విమానాశ్రయానికి బుధవారం మధ్యాహ్నం బయలుదేరిన స్పైస్ జెట్ విమానంతో పాటు గోవా నుంచి శివమొగ్గ విమానాశ్రయానికి బయలుదేరిన విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. అక్కడి వాతావరణ అనుకూలంగా లేకపోవడంతో హైదరాబాద్‌లో ల్యాండ్ చేశారు. ఇందులో చెన్నై నుంచి బయలుదేరిన విమానాన్ని పూర్తిగా రద్దు చేయగా గోవా నుంచి వచ్చిన విమానం తిరిగి రీ షెడ్యూల్ చేసుకుని బయలుదేరినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి.

నాన్ ఫార్మర్ కోటాలో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నేడు

ఏజీవర్సిటీ: ఎప్‌సెట్ 2025 కన్వీనర్ కోటాలో ఎంపీసీ(స్ట్రీమ్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో నాన్ ఫార్మర్ కోటాలో మిగిలిపోయిన సీట్లకు శుక్రవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పీజేటీఏయూ రిజిస్ట్రార్ విద్యాసాగర్ తెలిపారు. ఈ కౌన్సెలింగ్ శుక్రవారం ఉదయం 10 గంటలకు పరీక్షల నియంత్రణ విభాగంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ స్పాట్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూసుకోవాలని తెలిపారు.

నేడు తెలుగు భాషపై జాతీయ సదస్సు

లిబర్టీ: తెలుగు భాష పరిరక్షణ సదస్సు 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెలంగాణ భవన్‌లో సదస్సు కొనసాగుతుందని పేర్కొన్నారు. వివరాలను గురువారం ఆయన తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు పొందిన భాషావేత్తలు సాహితీవేత్తలు కవులు, కళాకారులు తెలుగు భాషపై అపారమైన ప్రేమ పట్టున్న విద్యావేత్తలు పాల్గొని తెలుగు భాష పరిశోధనపై ప్రసంగిస్తారన్నారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలపై ఉందన్నారు. అంతేకాకుండా వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వారిపై బాధ్యత ఉందన్నారు.

బిగ్ గ్రీన్ గణేశా వేడుకలు

పాల్గొన్న ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్



కూకట్‌పల్లి: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని కూకట్‌పల్లిలోని అశోక వన్ మాల్‌లో 92.7 బిగ్ ఎఫ్ఎం నిర్వహించిన బిగ్ గ్రీన్ గణేశా వేడుకలు గురువారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఆస్కార్ విజేత, సినీ గేయ రచయిత చంద్రబోస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యావరణ అనుకూల పద్ధతులను పాటించాలని భక్తులను ప్రోత్సాహించారు. కార్యక్రమంలో వినోదాత్మక ఆటలు, పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్స్ వంటి వివిధ కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రముఖ సెలబ్రిటీలు, 92,7 ఎఫ్ఎం ఆర్జేలు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

రైలు బండి ఆగెనండి

భారీ వర్షాలతో పలుచోట్ల కొట్టుకుపోయిన పట్టాలు

- పలు స్టేషన్లలో గంటల తరబడి నిలిచిన రైళ్లు
- కొన్ని మార్గాల్లో పాక్షికంగా బంద్
- జోరుగా కొనసాగుతున్న మరమ్మతులు



సాక్షి, సిటీబ్యూరో: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా దక్షిణమధ్య రైల్వేలోని వివిధ ప్రాంతాల్లో రైళ్ల రాకపోకలు స్తంభించాయి. పలు మార్గాల్లో నడిచే రైళ్లను మళ్లించారు. కొన్నింటిని రద్దు చేశారు. కొన్ని మార్గాల్లో గురువారం సాయంత్రం పాక్షికంగా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని బిక్కనూరు నుంచి తిప్పాపూర్ మధ్య వరదల కారణంగా రైలు పట్టాలు కొట్టుకుపోయాయి. దీంతో నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్లే రైళ్లన్నింటినీ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. మేడ్చల్-నిజామాబాద్ మధ్య నడిచే రైళ్లు పలు స్టేషన్లలో నిలిచిపోయాయి. విశాఖపట్నం - నాందేడ్, కాచిగూడ - మెదక్ ప్యాసింజర్, నాందేడ్ - మేడ్చల్ ప్యాసింజర్, ముంబై - లింగంపల్లి దేవగిరి ఎక్స్‌ప్రెస్, భగత్‌కి కోఠి - కాచిగూడ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ - కరీంనగర్ డెము ప్యాసింజర్, భగత్ కి కోఠి(జోధ్‌పూర్)-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లు వివిధ స్టేషన్లలో గంటల తరబడి నిలిచిపోయాయి. నిజామాబాద్-కామారెడ్డి మార్గంలో నిలిచిపోయిన పలు రైళ్లను నిజామాబాద్ - పెద్దపల్లి - కాజీపేట - సికింద్రాబాద్ మార్గంలో మళ్లించారు. ముంబై నుంచి లింగంపల్లికి వచ్చే దేవగిరి ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట్- పెద్దపల్లి - నిజామాబాద్ మార్గం మీదుగా దారి మళ్లించారు. నిజామాబాద్-తిరుపతి మధ్య నడిచే రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. కాచిగూడ - మెదక్ ప్యాసింజర్ రైలును మీర్జాపల్లి నుంచి మెదక్ మధ్య పాక్షికంగా రద్దు చేశారు. సికింద్రాబాద్ - కాజీపేట - విజయవాడ మార్గంలో నడిచే నరసాపురం-నాగర్‌సోల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట టౌన్ - పెద్దపల్లి - నిజామాబాద్ మార్గం మీదుగా మళ్లించారు.

మరికొన్ని రైళ్ల మళ్లింపు ఇలా..

- నార్థేడ్- కాచిగూడ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు, నాగర్ సోల్- కాచిగూడ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-మన్మాడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను గురువారం పూర్ణా - పర్బని - పర్లి వైద్యనాథ్ - లాతూర్ రోడ్ - బీదర్ - వికారాబాద్ - సికింద్రాబాద్ మీదుగా నడిపారు.
- కాజీపేట్ - చర్లపల్లి - నిజామాబాద్ మార్గంలో నడిచే తిరుపతి - ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట టౌన్ - పెద్దపల్లి - నిజామాబాద్ మార్గంలో మళ్లించారు.
- నాంపల్లి - జైపూర్ మధ్య నడిచే బైవీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును కాజీపేట - పెద్దపల్లి - నిజామాబాద్ మీదుగా మళ్లించారు.
- నాందేడ్ - విశాఖపట్నం మధ్య నడిచే ట్రై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును పాక్షికంగా చర్లపల్లి నుంచి నాందేడ్ మధ్య రద్దు చేశారు. ఈ రైలు చర్లపల్లి నుంచి విశాఖపట్నం మధ్య యథాతథంగా నడుస్తుంది.
- సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్ - సికింద్రాబాద్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును కాగజ్‌నగర్ - కాజీపేట మధ్య పాక్షికంగా రద్దు చేశారు. ఈ ట్రైన్ కాజీపేట - సికింద్రాబాద్ మధ్య మాత్రమే నడవనుంది.
- భద్రాచలం - బల్లార్షా - సిర్పూర్ టౌన్ - భద్రాచలం సింగరేణి మెము ఎక్స్‌ప్రెస్ భద్రాచలం రోడ్డు నుంచి వరంగల్ మధ్య మాత్రమే నడవనుంది. కాజీపేట - బల్లార్షా/సిర్పూర్ టౌన్ - కాజీపేట మధ్య పాక్షికంగా రద్దు చేశారు.
- కాజీపేట్- బల్లార్షా ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.
- కరీంనగర్- సిర్పూర్ టౌన్, కరీంనగర్- బోధన్ మధ్య నడిచే పుష్‌పుల్ మెము ప్యాసింజర్ రైళ్లను రద్దుచేశారు.

పర్యాటక, ఆతిథ్య రంగంలో.. అవకాశాలు అపారం

పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మంత్రి జూపల్లి కృష్ణారావుకు జ్ఞాపిక అందజేస్తున్న నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ

రాయదుర్గం: పర్యాటక, ఆతిథ్య రంగంలో కొత్త ధోరణులపై దృష్టి పెట్టాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యార్థులు, అధ్యాపకులకు సూచించారు. గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్‌లో జాతీయ క్రీడా వారోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యాటక, ఆతిథ్య రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని, ప్రైవేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టాలని ఆయన సూచించారు. 'నిథమ్' విద్యా, శిక్షణ సంస్థను విద్యార్థులు, అధ్యాపకులు అగ్రగామి సంస్థగా నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. అంతర్జాతీయ విద్యార్థులు, పర్యాటకులను ఆకర్షించేలా నిథమ్‌ను తీర్చిదిద్దాలని, అందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. కొత్త విద్యా కార్యక్రమాలు, స్వల్పకాలిక, నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. విద్యా-శిక్షణ పరిధిని మరింత విస్తరించేందుకు కూడా చొరవ తీసుకోవాలన్నారు. ఉద్యోగ, పారిశ్రామిక అవకాశాలను విస్తరించాలని దిశానిర్దేశం చేశారు. క్యాంపస్‌లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నా ఆహ్లాదకర వాతావరణాన్ని మరింత తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి నిథమ్‌కు సంపూర్ణ సహకారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పర్యాటక, సాంస్కృతికశాఖ స్పెషల్ సీఎస్‌తో చర్చించి నిథమ్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని డైరెక్టర్‌కు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక, ఆతిథ్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని గుర్తుచేశారు. ప్రముఖ పర్యాటక కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించిందన్నారు. అలాగే రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి వాటికి ప్రపంచస్థాయిలో బ్రాండింగ్, ప్రచారం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పర్యాటక కేంద్రాలకు కనెక్టివిటీ పెంచి వసతి, సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. నిథమ్ క్యాంపస్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం చేస్తున్న కృషిని ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ, శ్రీకరా ఆస్పత్రి సీనియర్ డాక్టర్ పీఎల్ఎన్ పటేల్, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కట్టా సునీల్‌కు గౌరవ డాక్టరేట్



బంజారాహిల్స్: గ్లోబల్ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ కట్టా సునీల్ ఐకానిక్ పీస్ అవార్డ్ కౌన్సిల్-ఢిల్లీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. విద్యారంగంలో విశేష సేవలతో పాటు సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఈ గౌరవం తన ఒక్కరిది కాదని, గ్లోబల్ గ్రామర్ స్కూల్ సిబ్బంది విద్యార్థులు, తల్లిదండ్రుల కృషి ఫలితమని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్య, సామాజిక సేవా రంగాల్లో మరింత కృషి చేస్తానని తెలిపారు.

సకాలంలో మెరుగైన వైద్యం

నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప



వాస్క్యులరీ సర్జరీ వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తదితరులు

లక్డీకాపూల్: కాళ్ల నొప్పులు, నయంకాని పుండ్లతో బాధపడే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యాన్ని అందించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఈ క్రమంలో వాస్క్యులర్ సర్జరీ విభాగానికి అధునాతన సౌకర్యాలను కల్పించామన్నారు. ట్రామా బ్లాక్ 4వ అంతస్తులో వాస్కులర్ అండ్ ఎండోవాస్కులర్ సర్జరీ విభాగంలో ఏర్పాటు చేసిన డాక్టర్ క్యాబిన్లు, నర్సింగ్ స్టేషన్‌తో పాటు అధునాత సౌకర్యాలను గురువారం ఆయన రిటైర్డ్ ఎస్పీ ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరి బీరప్ప మాట్లాడుతూ.. రివాస్క్యులరైజేషన్ ప్రక్రియల ప్రభావాన్ని అంచనా వేయడంలో మాసిమో రూట్ బీఎఫ్ఎమ్ మానిటర్, అత్యాధునిక సెన్సార్ టెక్నాలజీ కీలకపాత్ర పోషించే రక్తనాళాల ఆరోగ్యాన్ని అంచనా వేసి పెరిఫెరల్ అర్టరీ డిసీజ్ వంటి వ్యాధులను నిర్ధారించడంలో వైద్యులకు సహకరించే రూ.11 లక్షల విలువైన బీఎఫ్ఎంతో పాటు సిస్టోలిక్ బ్లడ్ ప్రెషర్ - పల్స్ వాల్యూమ్ రికార్డింగ్, నియర్ - ఇన్‌ఫ్రారెడ్ స్పెక్ట్రోస్కోపీ పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సహకరించిన కోటివిటీ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రొ.నిమ్మ సత్యనారాయణ, డీన్ ప్రొ.లిజా రాజశేఖర్, వాస్క్యులర్ సర్జరీ విభాగాధిపతి డా.సందీప్ మహాపాత్ర, అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డా.లక్ష్మీభాస్కర్, డా.రాకేష్, డా.చరణ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, వాస్కులర్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ సందీప్ మహాపాత్ర, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్, డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

అడుగడుగునా నిఘా..!

- నిమజ్జనంలో 30వేల మంది పోలీసులు
- అన్ని శాఖల సమన్వయంతో భారీ భద్రత
- పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్



ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకుంటున్న సీపీ సీవీ ఆనంద్



సాగరతీరంలో నిమజ్జన ప్రాంతాలను పరిశీలిస్తూ..

ఖైరతాబాద్: మహా నగరంలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేందుకు 30 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ సీవీ ఆనంద్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన ఖైరతాబాద్ వినాయకుడి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖైరతాబాద్ మహాగణపతిని ప్రతి సంవత్సరం దర్శించుకోవడం ఆనవాయితిగా వస్తోందన్నారు. దాదాపు 25 సంవత్సరాలుగా తాను ప్రజలకు తెలుసని, సెంట్రల్ జోన్ డీసీపీగా, అడిషనల్ సీపీ ట్రాఫిక్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఇప్పటి వరకు 11సార్లు గణేష్ నిమజ్జనం బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు. వచ్చేనెల 6వ తేదీన నిమజ్జనానికి సిటీ పోలీస్ తరపున విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉత్సవాల నిర్వాహకులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, వివిధ ప్రభుత్వ శాఖలతో ఇప్పటికే సమన్వయ సమావేశాలు నిర్వహించామన్నారు. 11వేల దరఖాస్తులలో 10,900 గణేష్ మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు ఇచ్చామని, నగరంలో మిగిలిన సుమారు 15వేల విగ్రహాలను కూడా రికార్డుల్లోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ పోలీసు విభాగాల నుంచి దాదాపు 19వేల మంది పోలీసులు అందుబాటులో ఉన్నారని, ఇతర జిల్లాల నుంచి 8,500 మంది పోలీసులు, 42 ప్లాటూన్లు, 10వేల సీపీపీఎఫ్, అక్టోపస్ బృందాలు వస్తున్నాయని తెలిపారు. మొత్తం 30వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు.

- ఊరేగింపును సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, క్యూఆర్ కోడ్ ఆధారిత స్టిక్కర్లతో పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్ ఇస్తున్నప్పటికీ మండప నిర్వాహకులు వర్షాల కారణంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.
- మంటపాల వద్ద వలంటీర్లు తప్పనిసరిగా ఉండాలని, పగలు, రాత్రి పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎన్టీఆర్‌మార్గ్, పీపుల్స్ ప్లాజా ప్రాంతాల్లో నియంత్రణ కేంద్రాల ఏర్పాటు, నిమజ్జనం రోజు (సెప్టెంబర్ 6)న బంజారాహిల్స్‌లోని టీజీ ఐసీసీసీ వద్ద 24 గంటలు పనిచేసే విధంగా ఉమ్మడి నియంత్రణ కేంద్రం ఉంటుంది.
- హుస్సేన్‌సాగర్, మీరాలం ట్యాంక్, రాజన్న బావి, ఎన్టీఆర్ స్టేడియం వంటి ప్రాంతాల్లో ప్రస్తుతం 9 క్రేన్లు ఏర్పాటు చేశామని, జీహెచ్ఎంసీ, ఆర్‌అండ్‌బీ ఇతర శాఖల సమన్వయంతో నిమజ్జనం రోజు వాటి సంఖ్యను 40కి పెంచుతామని తెలిపారు.
- ఖైరతాబాద్ మహాగణపతిని ప్రతిరోజూ దాదాపు 60-70 వేల మంది సందర్శిస్తారని, ఈ సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
- అడిషనల్ సీపీ లా అండ్ ఆర్డర్ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, డీసీపీ ఎస్‌బీ కె.అపూర్వరావు, డీసీపీ సెంట్రల్ జోన్ కె.శిల్పవల్లి తదితర పోలీసు అధికారులతో కలిసి ఖైరతాబాద్ మండపానికి వచ్చే దారుల్లో బారికేడింగ్ వ్యవస్థను పరిశీలించారు. వినాయక విగ్రహాలు మూడవ రోజు నుంచి నిమజ్జనానికి వస్తాయి. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లోని నిమజ్జన పాయింట్లను పరిశీలించారు. శాంతియుతంగా ఉత్సవాలు కొనసాగేలా ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

అన్ని వర్గాలను విస్మరించిన కాంగ్రెస్

- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- వైన్ షాపుల్లో గౌడ కులస్తులకు 25 శాతం కేటాయించాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



గన్‌పార్కు ఎదుట ఆందోళన చేస్తున్న గౌడ సంఘాల నేతలు

నాంపల్లి: ఎన్నికల సమయంలో గౌడ్ కులస్తులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. వైన్స్ దుకాణాల్లో గౌడ్ కులస్తులకు 25 శాతం కేటాయించాలని కోరుతూ గౌడ సంఘాలు చేపట్టిన కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రసంగించారు. ఎన్నికల ముందు అమలు కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, కుల వృత్తులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. గడిచిన రెండేళ్ల కాలంలో గీత కార్మికులు ప్రమాదానికి గురై 1145 మంది చనిపోయారని, బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. వైన్ షాపుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం 15 శాతం ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 25 శాతం ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీ ప్రకారం వైన్‌షాపుల్లో 25 శాతం గౌడ కులస్తులకు కేటాయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ్ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, గౌడ కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలి వెంకన్నగౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్, బీసీ సమైక్య అధ్యక్షుడు ఎస్.దుర్గయ్య గౌడ్, జీబీఎస్ చీకటి ప్రభాకర్ గౌడ్, దామోదర్ గౌడ్, రాజు గౌడ్ పాల్గొన్నారు.

నగల వ్యాపారి కేసు సీసీఎస్‌కు బదిలీ

ఫిలింనగర్: తాకట్టు పెట్టిన నగలతో పాటు వడ్డీకి తీసుకున్న కోట్లాది రూపాయలతో ఉడాయించిన నగల వ్యాపారి చీటింగ్ కేసును ఫిలింనగర్ పోలీసులు గురువారం సీసీఎస్‌కు బదిలీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని గౌతంనగర్‌లో మాణిక్ జ్యువెలర్స్ పేరుతో మాణిక్ చౌదరి అనే పాన్‌బ్రోకర్ గత కొన్నేళ్లుగా వ్యాపారం చేస్తున్నాడు. తన వద్ద తాకట్టు పెట్టిన నగలకు అప్పు ఇచ్చేవాడు. కొంతకాలంగా బెట్టింగ్‌లకు, ఆన్‌లైన్ జూదానికి బానిసై కోట్ల రూపాయలు నష్టపోయాడు. తనవద్ద తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు, వడ్డీకి తీసుకున్న డబ్బులను బాధితులకు ఇవ్వకుండా ఇటీవల దుకాణం మూసేశాడు. దీంతో ఫిలింనగర్ పోలీసులకు ఈ మోసాలపై ఎనిమిది ఫిర్యాదులు అందాయి. వీటిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. తాజాగా దమ్మాయిగూడెంకు చెందిన రాధాకృష్ణ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాణిక్‌చౌదరికి వేర్వేరు బ్యాంకుల నుంచి 1.20 కోట్ల రుణాలను తానే ఇప్పించానని, అలాగే రూ.40 లక్షల వరకు చేబదులు ఇచ్చానని, గత రెండు నెలల నుంచి ఆయన కనిపించడం లేదని, ఈఎంఐలు కూడా చెల్లించడం లేదని పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఈ కేసును సీసీఎస్‌కు బదిలీ చేశారు. రోజురోజుకు మాణిక్‌చౌదరి చేసిన మోసాలపై ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తున్నాయని, వాటిని కూడా సీసీఎస్‌కు బదిలీ చేస్తామని పోలీసులు తెలిపారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలని అర్ధనగ్న ప్రదర్శన



మత్స్యభవన్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న రైతులు

నాంపల్లి: సరఫరా చేసిన చేపల బిల్లులను ప్రభుత్వం రెండేళ్లుగా చెల్లించడం లేదంటూ మాసబ్‌ట్యాంక్‌లోని మత్స్యభవన్ ఎదుట చేపపిల్లలను ఉత్పత్తి చేసే రైతులు గురువారం అర్ధ నగ్న ప్రదర్శన చేపట్టారు. తమ బిల్లులు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2023-24వ ఆర్థిక సంవత్సరానికి రూ.75 కోట్లు, 2024-25వ ఆర్థిక సంవత్సరానికి రూ.34 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని అన్నారు. ఇప్పటి వరకు రూపాయి కూడా చెల్లించలేదని రైతులు ఆరోపించారు. రైతుల ప్రభుత్వమని చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. చేపల ఉత్పత్తిలో తెలంగాణకు జాతీయ స్థాయిలో అవార్డు వచ్చినా.. ఆ చేపలను పంపిణీ చేసిన రైతులు మాత్రం బకాయిల కోసం నిరీక్షించాల్సి వస్తోందని ధ్వజమెత్తారు. తక్షణమే బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షంలో భారీ ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్, నేతలు సుధాకర్ ముదిరాజ్, మహేందర్ ముదిరాజ్, గోపాల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం తగదు

- ప్రభుత్వం వెంటనే స్పందించి స్కాలర్‌షిప్స్ చెల్లించాలి
- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సంక్షేమ భవన్ ఎదుట ఆందోళనలో ఆర్.కృష్ణయ్య

నాంపల్లి: రాష్ట్రంలో వంద బీసీ కాలేజీ హాస్టళ్లు, 119 గురుకుల కళాశాలలను మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లించాలని కోరుతూ మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ముట్టడికి విద్యార్థులు గురువారం హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన ఆయన సంక్షేమ భవన్ ఎదుట ప్రసంగించారు. స్కాలర్‌షిప్ ఫీజు బకాయిల చెల్లింపు పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. స్కాలర్‌షిప్ వస్తుందన్న కారణంగానే నిరుపేద విద్యార్థులు మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుతున్నారని, ప్రస్తుతం స్కాలర్‌షిప్‌లను చెల్లించకపోవడంతో విద్యార్థులు అష్టకష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు చెల్లించాలంటూ కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నారని, కోర్సు పూర్తయినా విద్యార్థులకు ఫీజు చెల్లించలేదన్న కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. విద్యా హక్కును రాష్ట్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం అనేక స్కీముల కోసం లక్షలాది కోట్లు అప్పు తెస్తోందని, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ పథకానికి రూ.6వేల కోట్లు అప్పు తెస్తే తప్పేంటని ప్రశ్నించారు. ఫీజుల స్కీములు ఎత్తివేయడానికి ట్రస్ట్ బ్యాంకును ఏర్పాటు చేసి దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామని కొత్త నాటకానికి తెరలేపారని, ఈ ప్రతిపాదనను అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆర్థిక శాఖ కమీషన్ల శాఖగా మారిందని, 10 నుంచి 15 శాతం కమీషన్లు తీసుకుని కాంట్రాక్టర్ల బిల్లును చెల్లిస్తోందని ఆరోపించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు అవినీతిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కాలేజీ వసతి గృహాల్లో, గురుకులాల్లో సీట్లు దొరక్క చాలామంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించాలంటే అదనంగా గురుకులాలు, హాస్టల్స్‌ను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు రామకృష్ణ, నంద గోపాల్, యస్.రవి కుమార్ యాదవ్, నిఖిల్, చందు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ చాంపియన్ చికితకు ఘనస్వాగతం



చికితకు స్వాగతం పలుకుతున్న మంత్రి వాకిటి శ్రీహరి తదితరులు

శంషాబాద్: ప్రపంచ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ తరఫున చరిత్ర సృష్టించిన తెలంగాణ బిడ్డ చికిత తానిపర్తికి శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత ఇటీవల కెనడాలో జరిగిన టోర్నమెంట్‌లో ప్రపంచ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్ అండర్-21 మహిళా విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో రాష్ట్ర క్రీడాశాఖమంత్రి వాకిటి శ్రీహరి, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఘనంగా స్వాగతం పలికి అభినందించారు. పలువురు క్రీడాకారులు, క్రీడాభిమానులు కూడా ఘనంగా స్వాగతం పలికారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శుక్రవారం, 29, ఆగస్టు, 2025



'సౌండ్ ఆఫ్ సెలబ్రేషన్స్' విడుదల

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆడియో ఉత్పత్తుల బ్రాండ్ జేబీఎల్ ఇండియా.. సౌండ్ ఆఫ్ సెలబ్రేషన్స్ గీతాన్ని విడుదల చేసింది. మన పండుగలకు, సంగీతానికీ ఉన్న అనుబంధాన్ని, విశిష్టతను చాటిచెప్పే డిజిటల్ ప్రచారంలో ఇది భాగమని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు తెలిపారు. గణేశ్ చతుర్థి సందర్భంగా ఉత్సాహభరిత ఢోల్ వాయిద్యం, దుర్గా పూజ లయబద్ధమైన ఢాక్, ఓనంలో వినిపించే చెండ వరకూ.. ప్రతి ప్రాంతపు శబ్దాలను మేళవిస్తూ రూపొందిన గీతాన్ని డిజిటల్ వేదికగా విడుదల చేశామని, ఈ ట్రాక్‌లో ప్రముఖ సంగీత కళాకారులు ఎంసీ కూపర్, ఎంసీ గౌతీ, సంజీత భట్టాచార్య, శ్రేయా జైన్ పాల్గొన్నారని వివరించారు.





హాట్.. హాంట్..

వర్షాకాలంలో మనసు వెచ్చదనాన్ని కోరుకుంటుంది. వెచ్చని నీడతో పాటు వేడి వేడి పానీయాలను కూడా ఆస్వాదించాలని ఆరాటపడుతుంది. ఈ సీజన్‌కు అనుగుణంగా నగరవాసులను ఆకట్టుకునే క్రమంలో.. మాన్సూన్ కోసం నగర కేఫ్స్‌లో కొత్త అందాలను.. వాటి మెనూతో సరికొత్త రుచులను సంతరించుకుంటాయి. ముసురు పట్టిన వాతావరణంలో ముచ్చటైన వేడి వేడి రుచులను ఆస్వాదించే సిటిజనుల్లో ఎవరి రూటు వారికే సపరేట్.. అలా వెచ్చదనాన్ని అందించే పానీయాల్లో కొన్నింటి గురించి..

– సాక్షి, సిటీబ్యూరో

- కూల్ మాన్సూన్‌లో వెచ్చదనాల వేట
- టు హాట్.. కమ్ సూన్ అంటున్న సిటీ కేఫ్స్
- నగరవాసుల మాన్సూన్ ఫేవరెట్స్‌గా పలు వెరైటీలు
- ఈ సీజన్‌లో నగరవ్యాప్తంగా స్పెషల్ హాట్ ట్రీట్స్..
- చాక్లెట్, సుగంధ ద్రవ్యాల వెరైటీలకు ప్రత్యేక ఫ్యాన్స్
- పలు కేఫ్స్‌లో వేడి వేడిగా.. కొత్త తరహా రుచులు

వర్షాకాలంలో మరీ ముఖ్యంగా ఆస్వాదించే ఒక ముఖ్యమైన పానీయం చాయ్/ కాఫీ. ముసురు పట్టిందంటే చాలు ఈ దుకాణాలు జనంతో కిటకిటలాడిపోతాయి. వీటిని బంకమట్టితో తయారైన సంప్రదాయ పాత్రలైన కప్పులో అందిస్తారు. అలాగే అల్లం టీ (అద్రాక్ చాయ్) కూడా రుతుపవనాల సీజన్‌కు రుచికరమైన ఎంపిక. చాయ్‌తో మరిగించిన తురిమిన తాజా అల్లం అలరిస్తుంది. బంజారాహిల్స్‌లోని రోస్టరీ కాఫీ హౌస్ వీటికి పేరొందింది. అలాగే బంజారాహిల్స్‌లోనే ఉన్న రోస్ట్ సీసీఎక్స్‌లో అమెరికానో కూడా చాలా మంది ఫేవరెట్.

చాక్లెట్ వెరై'టీ'లు..

- జూబ్లీ హిల్స్ కేఫ్ వంటి కేఫ్స్‌లో డార్క్ చాక్లెట్‌తో తయారు చేసిన ఇటాలియన్ హాట్ చాక్లెట్ కూడా ఈ సీజన్‌లో పలువురి ఎంపిక. దీనిని కేవలం ఒక పానీయంగా మాత్రమే కాదు.. ఒక ఫుల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్ అంటారు దీని అభిమానులు.
- ఫిలింనగర్‌లోని ఆరోమలె కేరళ థీమ్‌తో రూపొందిన కేఫ్. మాన్సూన్‌లో అతిథుల కోసం తడవకుండా చినుకుల్ని ఆస్వాదించే స్పెషల్ సీటింగ్ దీని ప్రత్యేకత. ఈ కేఫ్ అందించే క్యాన్‌బెర్రీ బ్రూ టీసీ, బ్రౌనీ హాట్ చాక్లెట్ వంటి పానీయాలు కూడా హాట్ లవర్స్‌ని ఎట్రాక్ట్ చేస్తున్నాయి.
- గచ్చిబౌలి, జూబ్లీహిల్స్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న టైగర్ లిల్లీ కేఫ్ అండ్ బిస్ట్రోలో మిక్స్‌డ్ బెర్రీ మచ్చా పలువురి ప్రత్యేక ఎంపిక.
- బంజారాహిల్స్, కార్ఖానాల్లో ఉన్న మనం చాక్లెట్.. బ్రౌనీ హాట్ చాక్లెట్ రుచులకు నగరవాసులు, మరీ ముఖ్యంగా యువత ఫిదా అవుతున్నారు.



సూప్‌లు, సుగంధ ద్రవ్యాలు..

ఇదే విధంగా సూప్‌లు, టీలతో సహా వేడి లేదా గోరువెచ్చని ద్రవ పదార్థాలు వర్షాకాలంలో ఊరటనిస్తాయి. వెచ్చగా ఉండటానికి మాత్రమే కాక జీర్ణక్రియకు సైతం ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ సీజన్‌లో పానీయాల్లో అల్లం, పసుపు, తులసి వంటి సుగంధ ద్రవ్యాలను జోడించడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుందనీ, రోగనిరోధక శక్తిని పెంచుతుందనీ వైద్యులు చెబుతున్నారు. అలాంటి ఆరోగ్యకరమైన పానీయాలను కోరుకునే వారు కథా లాంటి హెర్బల్ 'టీ'ల ను ఎంచుకుంటున్నారు. ఈ కథా అనేది ఒక సంప్రదాయ భారతీయ పానీయం. దీనిని చాయ్ లేదా 'టీ'గా తీసుకుంటారు. దగ్గు, జలుబు సీజనల్ ఫ్లూ వైరస్‌లకు వ్యతిరేకంగా ప్రభావవంతంగా పనిచేస్తుందని భావిస్తారు. మూలికలు, సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన ఈ కథా.. సహజ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జ్వరం, గొంతు నొప్పికి ఉత్తమ నివారణగా ఎంచుకుంటారు. ఇది పూర్తిగా యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది.

పలు రకాల రుచులు, థీమ్‌లు..

- జూబ్లీహిల్స్‌లోని కేఫ్ ఉకుసా పెప్పర్ మింట్ హాట్ టాడీ పేరిట అందించే మాన్సూన్ స్పెషల్స్‌కు సైతం అధిక సంఖ్యలో ఫ్యాన్స్ ఉన్నారు.
- బేగంపేట్‌లో ఉన్న ఫన్నెల్ హిల్‌లో హాట్ చాక్లెట్ కూడా ఈ సీజన్‌లో నగర యువతను ఆకట్టుకుంటోంది.
- నీలోఫర్, పిస్తా హౌజ్‌లతో పాటు ఓల్డ్ సిటీలోని ఘాన్సీ బజార్‌లో ఉన్న నిమ్రా కేఫ్ వంటి ప్రదేశాలు, ఇరానీ చాయ్‌కి కూడా చాలా మంది అభిమానులు ఉన్నారు.
- జూబ్లీ హిల్స్‌లోని చాయ్ పానీ వేడి పానీయాలు స్నాక్స్ కాంబోకు ప్రసిద్ధి చెందింది. క్రిస్పీ సమోసాలు, పకోడాలు, వడా పావ్‌లతో పాటు వెరైటీ రుచుల టీలతో ఇక్కడ గెస్ట్స్ మాన్సూన్‌ను ఆస్వాదిస్తారు.
- బంజారాహిల్స్‌లో చాలా మందికి కల్చరల్ స్పేస్‌గానే పరిచయమున్న లామకాన్.. సమోసా వంటి స్నాక్స్‌కు మాత్రమే కాదు కడక్ చాయ్ వంటి ప్రత్యేక వెరై'టీ'లకు పేరొందింది.
- చాయ్ పకోడాకు బదులు హాట్ చాక్లెట్ క్రోయిసెంట్‌లను ఎంచుకునే వారు జూబ్లీహిల్స్‌లోని ఫోస్స్ చాక్లెట్‌ను సందర్శిస్తున్నారు. ఇటాలియన్ క్లాసిక్ హాట్ చాక్లెట్‌తో ఈ సీజన్‌కు ఫేమస్ అయ్యింది.



ఆవిష్కరణల పోటీ..
'ఎరైజ్ ఫర్ యు'..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ టెక్ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్, పియర్సన్ ఇండియా మైటీ స్టార్టప్ హబ్ సహకారంతో 'ఎరైజ్ ఫర్ యు' పేరిట జాతీయ స్థాయి ఇన్నోవేషన్ – ఎంట్రప్రెన్యూర్‌షిప్ చాలెంజ్ ప్రారంభించాయి. ఈ విషయాన్ని హెచ్‌సీఎల్ టెక్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శివశంకర్ తెలిపారు. ఈ చాలెంజ్‌లో దేశవ్యాప్తంగా 3,000కు పైగా క్యాంపస్‌లలో చదువుతున్న 1.5 లక్షల మంది విద్యార్థులు పాల్గొనున్నారని, తుది జాతీయ ఫైనల్స్ వచ్చే ఏడాది మార్చి 12–13 తేదీల్లో జరుగుతాయని వివరించారు. విద్యార్థుల్లో స్టార్టప్ దిశగా ఆత్మవిశ్వాసం పెంపొందించడం, వినూత్న ఆలోచనలకు వేదిక కల్పించడం, వికసిత భారత్ మిషన్‌కు బలమైన ఆవిష్కరణలను నిర్మించడం వంటి లక్ష్యాలతో నిర్వహించే ఈ పోటీలో గెలుపొందిన విజేతలకు రూ.10 లక్షల వరకూ గ్రాంట్‌లతో పాటు ఇతర ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. విద్యార్థులు www. ariseforyou. com ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.



- చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకుంటున్న ప్రదర్శన
- 'మేనేజ్ చేద్దాం' పేరుతో నిర్వహణ
- 65 చిత్రాలు, 25 స్కల్ప్చర్స్, రెండు ఇన్‌స్టాలేషన్స్
- అందుబాటులో 10 మంది అధ్యాపకులు వేసిన చిత్రాలు
- రానున్న రోజుల్లో ట్రావెల్ షో ఏర్పాట్లు

అద్భుతం.. అధ్యాపక 'చిత్రం'..

వారంతా అధ్యాపక వృత్తిలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు.. అందరిలా కేవలం ఉద్యోగానికే పరిమితమైపోవాలని అనుకోలేదు.. ఎప్పుడూ విధులతో, కుటుంబ బాధ్యతలతో తలమునకలై పోకుండా.. తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలనుకున్నారు. తమలోని ప్రత్యేకతను సమాజానికి చాటి చెప్పాలనుకున్నారు.. అదే తలంపుతో తమలో దాగివున్న నైపుణ్యానికి పదును పెట్టారు.. కఠోరమైన దీక్షతో, అంకితభావంతో కళకు పదునుపెట్టి క్రియేటివిటీతో వివిధ పద్ధతుల్లో చిత్రాలను రూపొందించారు. వీటిని మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనకు ఉంచారు.

– మాదాపూర్

'మేనేజ్ చేద్దాం' పేరుతో ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. 10 మంది చిత్రకళాకారులు వివిధ ఆర్ట్ కళాశాలల్లో విద్యను పూర్తి చేసుకుని, ఇంటర్నేషనల్ పాఠశాలలో, కళాశాలల్లో ఆర్ట్ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు. కేవలం ఉద్యోగానికి, కుటుంబానికే పరిమితం కాకుండా ఒక్కొక్కరూ ఒక్కో శైలిలో చిత్రాలను, స్కల్ప్చర్స్ తయారుచేసి ప్రదర్శిస్తున్నారు. ఆర్ట్ రంగంపై ఉద్యోగాల్లో స్థిరపడినవారు పూర్తి స్థాయిలో రాణించలేకపోతున్నారు. సమయం లేకపోవడం, ఉద్యోగ రిత్యా తమలోని సృజనాత్మకతను వెలికితీయలేకపోతున్నారని ఆరిస్ట్ సంతోష్ కొటగిరి తెలిపారు. ఆర్ట్ రంగంలో రాణించగలిగితే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రకృతితో మమేకమై చిత్రాలను వేయాలన్నారు. చిత్ర రంగంలో రాణించాలంటే ఆసక్తి, పట్టుదల, వేసే ప్రతి చిత్రంలో సృజనాత్మకత ఉండాలన్నారు. కళాకారులు గౌతమ్ వావిలాల, హరితరన్ షిండే, జయప్రకాశ్ వావిలాల, ఎంజీ పాషా, బెల్లం రాజారావు, రామకృష్ణ కొంగల, సంతోష్ కోటగిరి, శేఖర్‌షిండే, శ్రీనివాస్ టింగిర్‌కర్, వాసుదేవరావు నడిమింటి వేసిన చిత్రాలు, స్కల్ప్చర్స్, ఇన్‌స్టాలేషన్స్ ప్రదర్శిస్తున్నారు.





చిన్నారులను ప్రోత్సహించాలి..



ఉద్యోగానికే ఎందుకు పరిమితం కావాలి. మనం నేర్చుకున్న, ఎంచుకున్న రంగంలో మరింత సృజనాత్మకత ప్రదర్శించేందుకు ఉద్యోగం చేస్తూ కొంత సమయాన్ని కేటాయించి అనుకున్న విధంగా చిత్రాలను గీసి ప్రదర్శించాలనుకున్నాము. అంతర్జాతీయ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నాను. ఈ రంగంలో రాణించాలంటే ఆసక్తి, పట్టుదల ఉండాలి.

– శ్రీనివాస్ టింగిర్‌కర్, ఆర్టిస్ట్–అధ్యాపకుడు

ట్రావెల్ షో చేయాలని ఉంది..



ఆర్ట్ రంగాన్ని తాత్కాలికంగా నేర్చుకుంటే ప్రయోజనం లేదు. సరదాగా నేర్చుకోవడం వేరు. ఆసక్తి ఉండడం వేరు. ఇందులో గుర్తింపు పొందాలంటే పూర్తి స్థాయిలో నేర్చుకుని సందేశాత్మక చిత్రాలను వేయాలి. నేను ఆయిల్ పెయింటింగ్ చేస్తాను. వేసే ప్రతి చిత్రంలోనూ ఎదో ఒక సందేశం ఉండాలి. కళాకారుడికి మదిలోని భావాలను ప్రదర్శించే శక్తి ఉంటుంది. పూర్వకాలంలో వేసిన చిత్రాల ఆధారంగా ఎన్నో విషయాలను తెలుసుకున్నాను. గ్రూప్ షోలో భాగంగా ఢిల్లీ, బెంగళూరు, ముంబయి తదితర ప్రాంతాల్లో ట్రావెలింగ్ షో చేద్దామనుకుంటున్నా.

– సంతోష్ కోటగిరి, ఆర్టిస్ట్–అధ్యాపకుడు.

అందమైన అక్షరాలకు.. పొందికైన రూపాన్నిచ్చే కళ కాలిగ్రఫీ.. సిరాకు సృజనాత్మకతను జోడించి అక్షరాలకు ప్రాణం పోసే అరుదైన కళ ఇది.. ఇది కేవలం చేతిరాత మాత్రమే కాదు.. తెలుగువాడి నాడిగా పరిగణించేది.. భావాన్ని, భావోద్వేగాన్ని కలగలిపి అక్షరరూపాన్నిచ్చే అందమైన.. అద్భుతమైన కళ. ఇదే కళను ఒంటబట్టించుకున్నాడు నగరానికి చెందిన నవకాంత్ కరిడే. ఒకటి కాదు.. రెండు కాదు.. తాను ఎంచుకున్న కళలో విశ్వ వేదికలపై సత్తా చాటుతూ.. తెలుగు భాష ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేస్తున్నాడు.

– సనత్‌నగర్

అక్షర శిల్పి..
నవకాంత్..

కాలిగ్రఫీ కళలో ప్రత్యేకత చాటుతూ

సినిమా పోస్టర్ల నుంచి.. అంతర్జాతీయ వేదికలకు

మొట్టమొదటి తెలుగు కాలిగ్రఫీ కళాకారుడిగా గుర్తింపు

నేడు తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా

కాలిగ్రఫీ కళ ఒకటుందని కూడా తెలియని వయసు. కానీ అతనికి ఆ కళ స్వతహాగా అబ్బింది. పాఠశాలలో చదువుకునే రోజుల్లో అతని రాత శైలి మిగతా వారి కంటే భిన్నంగా ఉండేది. అక్షరాకృతుల్లో ఏదో భావోద్వేగం కొట్టొచ్చినట్లు కనిపించేది. దీనిని చూసి తరగతి గదిలో సహచర విద్యార్థులు సైతం తమ పుస్తకాలపై నవకాంత్‌తో పేర్లు రాయించుకునేందుకు పోటీ పడేవారు. ఈ క్రమంలోనే ముంబయికి చెందిన ప్రముఖ కాలిగ్రాఫర్ అచ్యుత్ పలావ్ రాసిన 'అక్షరాకృతి' అనే పుస్తకం అతనికి తారసపడింది. అచ్చం అందులో తన రాత శైలినే పోలిన విషయాలు ఉండడం ఆశ్చర్యపరిచింది. అప్పుడతనికి అర్థమైంది.. తాను రాసేది కాలిగ్రఫీ అని. ఇంకేం.. దీని గురించి లోతుగా తెలుసుకోవాలని ఆ పుస్తకం రాసిన అచ్యుత పలావ్‌ను వెతుక్కుంటూ ముంబయి రైలు ఎక్కాడు. ఎట్టకేలకు ఆయనను కలుసుకోవడమే కాదు.. ఆ కళలో శిక్షణ పొంది మరింత మెరుగులు దిద్దుకున్నాడు. అక్కడి నుంచి ఆ కళనే ఊపిరిగా చేసుకున్నాడు. తెలుగు భాషలో మొట్టమొదటి కాలిగ్రఫీ కళాకారుడిగా నిలిచాడు.



కాలిగ్రఫీ కళకు కాదేదీ అనర్హం..

పలువురు ఔత్సాహికుల కోసం.. అక్షరాలతో కూడిన గిఫ్ట్స్ రూపొందించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ తన స్వహస్తాలతో కాలిగ్రఫీ చేసిన పాకెట్ నోట్ బుక్స్, బ్యాడ్జ్, కీ చైన్స్, కప్పు, సాసర్.. పలు రకాల వస్తువులపై తెలుగు కీర్తిని ఇనుమడింపజేస్తూ.. తెలుగుకు ప్రాచుర్యం కల్పిస్తున్నారు.

కంప్యూటర్ యుగంలోనూ..

సాంకేతిక రంగం కొత్త పుంతలు తొక్కినా.. మనిషి మస్తిష్కపు ఆలోచనల ముందు దిగదుడుపేనని ఆయన కళా నైపుణ్యం చూస్తే అవగతమవుతుంది. కంప్యూటర్ యుగంలో ఎన్ని తెలుగు లిపిలో ఎన్ని శైలి రకాలు ఉన్నా.. ఆయన శైలి వేరు. అందుకే సినిమా వాళ్లు ఏరికోరి నవకాంత్‌తో అక్షరాలను డిజైన్ చేయించుకుంటారు. అలా అనేక సినిమాలకు టైటిల్స్ డిజైన్స్ చేశారు. హైదరాబాద్, బెంగళూరు, న్యూఢిల్లీ, ముంబయి, కేరళ, దక్షిణ కొరియా, నెదర్లాండ్స్ వంటి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తన కళను ప్రదర్శించి తెలుగు అక్షరాల వైభవాన్ని చాటారు. అనేక వర్క్‌షాపులను నిర్వహించారు.



మాతృభాషాభివృద్ధికి కృషి..

ఈ కళ ద్వారా దేశ, విదేశాల్లో మాతృ భాషకు తగిన గుర్తింపు తీసుకురావడం, ఈ కళను నలుగురికీ పరిచయం చేయడమే నా లక్ష్యం. ఇప్పటికే పలువురు ఈ కళను నేర్చుకునేందుకు ముందుకొస్తున్నారు. అయితే పూర్తి ధ్యాస లేకపోవడంతో రాణించలేకపోతున్నారు. ఈ కళను నలుగురికీ పంచి మాతృభాషాభివృద్ధికి నా వంతు కృషి చేస్తా.

– నవకాంత్, కాలిగ్రఫీ కళాకారుడు



లక్షల మందితో తెలంగాణను దిగ్బంధం చేస్తాం

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యల పరిష్కారానికి ఉద్యమం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం
- 30న సురవరం సంస్మరణ సభ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని


మాట్లాడుతున్న కూనంనేని

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమగ్రాభివృద్ధితో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో త్వరలోనే లక్షల మందితో తెలంగాణను దిగ్బంధం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతోనే రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో అతి తక్కువ వ్యయంతో పూర్తి కావాల్సిన అనేక ప్రాజెక్టులు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా కాళేశ్వరం ప్రధాన ఎజెండాగా వేల కోట్ల అప్పులు తెచ్చి మట్టిలో పోశారన్నారు. దశాబ్దాల కాలంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న లక్షలాది మంది నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పట్టాలను మంజూరు చేయాలన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు, సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను డిసెంబర్ 26న ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఈ ఫ్యాక్టరీని సాధించుకునేంత వరకు ఉద్యమం చేస్తామని కూనంనేని పేర్కొన్నారు. కాగా, సీపీఐ అగ్ర నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను ఈనెల 30న రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు కూనంనేని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని భావి తరాలకు అందించేందుకు హైదరాబాద్‌లో 'స్మృతి వనం'ఏర్పాటు చేయాలని చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ నేతలు పశ్య పద్మ, ఇ.టి.నరసింహ, నెల్లికంటి సత్యం తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కమీషన్ విడుదల చేయకుంటే 1 నుంచి షాపులు బంద్

- రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు

సాక్షి, హైదరాబాద్: రేషన్ డీలర్లకు రావలసిన కమీషన్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో సెప్టెంబర్ నెల రేషన్ పంపిణీని నిలిపివేస్తామని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు అన్నారు. గురువా రం సివిల్ సప్లై భవన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత ఐదు నెలల నుంచి రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులు, రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గన్నీబ్యాగ్‌ల డబ్బులు రావడంలేదని తెలిపారు. రేషన్ డీలర్లకు రూ.180 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందని ఆయన వెల్ల డించారు. వాటిని ఆగస్టు 31లోపు విడుదల చేయ కుంటే, సెప్టెంబర్ 1 నుంచి రేషన్ షాపులు మూ సివేసి, తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని తెలిపారు. అలాగే 2వ తేదీన ఆర్డీవో కార్యాలయాల ముందు, 3వ తేదీన కలెక్టర్ కార్యా లయాల ముందు ధర్నా చేస్తామన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకుంటే.. 4వ తేదీన అసెంబ్లీ ముట్టడి చేపడతామని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు.

కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

- అసెంబ్లీలో పీపీటీకి అవకాశం ఇవ్వాలని కోరిన బీఆర్ఎస్


మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ముఠా గోపాల్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై ప్రజలు, ఎమ్మెల్యేలకు ప్రధాన ప్రతిపక్షంగా పూర్తి వివరాలు తెలియజేస్తామని బీఆర్ఎస్ ప్రకటించింది. వాస్తవాలను ప్రజల ముందు పెట్టేందుకు అసెంబ్లీలో తమకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని కోరింది. ఇదే విషయంపై వినతిపత్రం ఇచ్చేందుకు తాము స్పీకర్ అపాయింట్‌మెంట్ కోరినా అందుబాటులోకి రాలేదని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ కార్యదర్శి తమ వినతి పత్రం తీసుకునేందుకు నిరాకరించారని వెల్లడించారు. పార్టీ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, ముఠా గోపాల్, సుధీర్‌రెడ్డితో కలిసి గురువారం బీఆర్ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

వాస్తవాలను ప్రజల ముందు పెడతాం

'బనకచర్ల లింకు పేరిట ఓ వైపు తెలంగాణ హక్కులను కాలరాసే ప్రయత్నం జరుగుతున్న నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌పాటు కాంగ్రెస్, బీజేపీ కాళేశ్వరంపై అపోహలు, అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమీషన్ నివేదికను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్‌పై ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వం బురద చల్లుతోంది. 30 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వాస్తవాలను, గణాంకాలు, ఆధారాలతో ప్రజలకు వివరిస్తాం' అని వేముల ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు.

ఆ 200 మందిని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లుగా నియమించండి

సాక్షి, హైదరాబాద్: 12 ఏళ్లుగా ఐసీడీఎస్‌లో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నవారికి న్యాయం దక్కింది. పిటిషన్ దాఖలు చేసిన 200 మందిని క్రమబద్ధీకరించాలని ఆదేశించింది. కాంట్రాక్టు విధానంలో నియామకమైన నాటి నుంచి ఉద్యోగ ప్రయోజనాలు వర్తింపజేయాలని స్పష్టం చేసింది. ఇవికాక మిగిలిన పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. 265 ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పోస్టుల కోసం ప్రభుత్వం 2013లో నోటిఫికేషన్ ఇచ్చింది. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారికి 15 శాతం వెయిటేజీ ఇచ్చింది. అయితే అప్పటికే ఏళ్లుగా పనిచేస్తున్న తమను కాదని, నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ అంగన్వాడీ టీచర్ మీరాబాయితోపాటు 200 మంది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది బొబ్బిలి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషన్లు దాఖలు చేసిన 200 మందిని క్రమబద్ధీకరించాలని ఆదేశాలు జారీ చేశారు.

వరద నష్టంపై నివేదిక ఇవ్వండి: సీఎస్

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి కె. రామాకృష్ణారావు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. పలు శాఖల కార్యదర్శులతో గురువారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మల్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల జిల్లాల్లో అధిక నష్టం జరిగిందని, ఇతర జిల్లాల్లోనూ గణనీయమైన నష్టం వాటిల్లిందని సీఎస్ తెలిపారు. నష్టాలను తెలిపే ఫొటోలు, వీడియోలు, మీడియా క్లిప్పింగులను ప్రాథమిక నివేదికకు జతచేయాలని సూచించారు. శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్ల పంపిన ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖను కోరారు. మరణించిన వారి కుటుంబాలకు నిబంధనల ప్రకారం ఎక్స్‌గ్రేషియా అందించాలని సూచించారు. సీఎం త్వరలో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

సీఎస్ సర్వీసు 7 నెలలు పొడిగింపు

▶ మొదటి పేజీ తరువాయి

రూల్స్–1960లోని రూల్–3ని ప్రయోగించడం ద్వారా ఏఐఎస్ (డీసీఆర్బీ) రూల్స్‌లోని 16(1) నిబంధనను సడలిస్తూ రామకృష్ణారావు సర్వీసును పొడిగించినట్టు కేంద్రం తెలిపింది. దీంతో వచ్చే ఏడాది మార్చి 31 వరకు రామకృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు. 1991 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన రామకృష్ణారావు గత ఏప్రిల్ 30న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన సుదీర్ఘకాలం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

పొడిగింపు పొందిన రెండో సీఎస్

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత తొలి సీఎస్‌గా పనిచేసిన రాజీవ్ శర్మ పదవీ కాలాన్ని ఒకసారి 3 నెలలు, ఆ తర్వాత మరో మూడు నెలలు పొడిగించేందుకు కేంద్రం అనుమతించింది. ఆ తర్వాత పదవీ కాలం పొడిగింపు పొందిన రెండో సీఎస్‌గా రామకృష్ణారావు నిలిచారు. గతంలో ఒక ప్రయత్నంలో మూడు నెలలు మాత్రమే సర్వీసు పొడిగించగా, రామకృష్ణారావు విషయంలో మాత్రం ఒకేసారి ఏడు నెలల సర్వీస్ పొడిగింపునకు కేంద్రం అనుమతించడం గమనార్హం.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 29-8-2025



కష్టాలనూ ఆడేసుకున్నారు

'మాది పేదకుటుంబం అయినా, నా దగ్గర విలువైన సంపద ఉంది' అంటూ ఉండేది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ ఓపీ జైషా. 'ఆ సంపద ఏమిటి?' అని అవతలి వ్యక్తి అడిగే లోపే... 'కష్టం, పట్టుదల' అని చెప్పేది జైషా. జైషా మాత్రమే కాదు...పేదరికంలో పుట్టి పెరిగిన ఎంతోమంది అమ్మాయిలు 'కష్టం, పట్టుదల' అనే విలువైన సంపదతో పేదరిక కష్టాలను అధిగమించారు. హాకీ నుంచి ఆర్చరీ వరకు ఎన్నో క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు పతాకాలు ఎగరేశారు.


ఓపీ జైషా

ఆకలి తట్టుకోలేక మట్టితిన్న అమ్మాయి

ఓపీ జైషా అయిదు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు. అసలే అంతంత మాత్రంగా ఉన్న కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఆకలి తట్టుకోలేక జైషా మట్టి తిన్న రోజులు కూడా ఉన్నాయి. పొద్దుటే లేచి కిలోమీటర్‌ల కొద్దీ దూరాలు నడిచి పాలు అమ్మేది.

'రేపు భోజనం ఎలా?' అనేది జైషా కుటుంబం ముందు ఉన్న ప్రధాన సవాలు.

అయినప్పటికీ ఆటలపై తన ఆసక్తిని ఎప్పుడూ కోల్పోలేదు. కేరళకు చెందిన జైషా ప్రఖ్యాత ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్. మారథాన్‌లో నేషనల్ రికార్డ్ హోల్డర్.

'అవకాశాలు, అదృష్టాలు అనేవి ఎక్కడి నుంచో రావు. మన కష్టంలో నుంచే వస్తాయి' అంటుంది జైషా.

గురి తప్పని లక్ష్యం

రాంచీలో పుట్టి పెరిగిన దీపిక కుమారి తండ్రి ఆటోడ్రైవర్. చిన్నప్పుడు చెట్టు పైనున్న మామిడి కాయలను గురి తప్పకుండా కొట్టేది. గురితప్పని ఆ ఉత్సాహమే దీపికను ఆర్చరీ వైపు అడుగులు వేసేలా చేసింది. ట్రైబల్ స్పోర్ట్స్ అకాడమీలో చేరిన దీపిక కుమారికి రోజుకు మూడు పూటలా భోజనం దొరికేది. పేదరికం నేపథ్యం నుంచి వచ్చిన దీపికకు అదే లగ్జరీగా అనిపించేది. కష్టాల్లో సైతం వెరవని ధైర్యం, అంకితభావంతో ఎన్నో విజయాలు సాధించింది దీపిక. కామన్ వెల్త్ గేమ్స్ (2010)లో బంగారు పతకాన్ని గెలుచుకుంది.


దీపిక కుమారి

'కొన్ని సంవత్సరాల క్రితం చాలామందికి ఆర్చరీ అంటే ఏమిటో తెలియదు. ఇప్పుడు పిల్లలు కూడా ఆర్చరీ గురించి మాట్లాడుతున్నారు. నాకు ఆర్చరీపై ఆసక్తి కలగడానికి మీరే స్ఫూర్తి అని పిల్లలు చెబుతున్నప్పుడు ఎంతో సంతోషంగా ఉంటుంది' అంటుంది దీపిక కుమారి.

పరుగు ఆపొద్దు


సోహినీ ఛటోపాధ్యాయ

'ఐ బికమ్ ఏ రన్నర్' పేరుతో పుస్తకం రాసింది సోహినీ ఛటోపాధ్యాయ. అంతర్జాతీయ స్థాయిలో మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎనిమిది మంది ప్రసిద్ధ ఉమెన్ రన్నర్‌ల స్ఫూర్తిదాయక జీవిత కథలు ఈ పుస్తకంలో ఉన్నాయి. 1952 ఒలింపిక్స్‌లో మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహించిన మేరీ డిసౌజా, బ్యాంకాక్ ఆసియన్ గేమ్స్(1970)లో బంగారు పతకం గెలుచుకున్న కమల్‌జిత్ సంధు, పీటీ ఉషా, శాంతి సౌందర్యరాజన్, పింకీ ప్రమానిక్, దూతీ చంద్‌లాంటి క్రీడకారుల జీవితవిశేషాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ విజేతలకు క్రీడా ప్రయాణం అనేది నల్లేరు మీద నడక కాలేదు. 'ఆర్థిక కష్టాలు' కొందరికీ, 'అమ్మాయిలకు ఆటలెందుకు!' అనే ఈసడింపులు మరికొందరికీ... ఇలా రకరకాల సవాళ్లు ఎదురయ్యాయి. అయినా వారు పరుగు ఆపలేదు. ఆటలకు పేదరికాన్ని దూరం చేసే శక్తి ఉందనే విషయాన్ని కూడా ఈ పుస్తకం ద్వారా చాటిచెప్పింది సోహిని. 'పేదరికం నుంచి బయటపడడానికి ఆటలు నాకు ఉపకరించాయి' అంటుంది ఒలింపియన్ లలిత బాబర్.

వెక్కిరింపులు ఎదురైనా...


బింద్యారాణిదేవి

మణిపుర్‌లోని పేద కుటుంబంలో పుట్టిన బింద్యారాణిదేవికి చిన్నప్పటి నుంచి ఆటలు అంటే ఇష్టం. ఎత్తు తక్కువగా ఉండడం వల్ల వెయిట్‌లిఫ్టింగ్‌ను ఎంపిక చేసుకుంది. అంతకు ముందు తైక్వాండో సాధన చేసేది.

'ఎందుకు తల్లీ ఈ కష్టాలు, బరువులు ఎత్తడాలు....' అనేవాళ్లు చుట్టుపక్కల వాళ్లు. ఎవరి మాట ఎలా ఉన్నా తనకు మాత్రం పెద్ద కలలు ఉండేవి.

'మహా అంటే జిల్లా స్థాయి వరకు వెళ్లగలవు' అనే వెక్కిరింపుల మాట ఎలా ఉన్నా జిల్లా స్థాయి దాటి అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది రాణిదేవి. థాయ్‌లాండ్‌లో జరిగిన ఐడబ్ల్యూఎఫ్ వరల్డ్ కప్(2024)లో కాంస్య పతకం గెలుచుకుంది. ఐడబ్ల్యూఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ వరల్డ్ కప్‌లో మహిళల 55 కేజీ ఈవెంట్‌లో పతకం గెలుచుకున్న తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించింది. కామన్‌వెల్త్ గేమ్స్‌లో సిల్వర్ మెడల్ గెలుచుకుంది.

'ప్రతికూల మాటలు ఎన్ని వినబడినా లక్ష్యసాధనలో దృఢంగా ఉండాలి' అంటుంది బింద్యారాణి దేవి.

మైదాన ఆటలే మేలు



పిల్లల ప్రపంచానికి ఆన్‌లైన్ ఆటలు దగ్గరయ్యాయి. మైదాన ఆటలు దూరం అయ్యాయి. ఆన్‌లైన్ ఆటలతో పోల్చితే మైదానాల్లో ఆడే ఆటల వల్ల పిల్లలకు అనేక రకాలుగా మేలు జరుగుతుందని చెబుతున్నారు నిపుణులు. మైదాన క్రీడలు పిల్లలకు వ్యాయామంలా పనిచేస్తాయి. మెదడును చురుగ్గా ఉంచుతాయి. ఒత్తిడిని దూరం చేస్తాయి. నలుగురిలో త్వరగా కలిసిపోయే స్వభావాన్ని పెంచుతాయి. కుంగుబాటును దూరం పెట్టి చురుగ్గా ఉండేలా చేస్తాయి. శరీరంపై నియంత్రణ ఉండేలా చేస్తాయి.

ఆకలి రోజుల నుంచి టోక్యో వరకు

రోజుకు రెండు పూటలా కడుపు నిండా తింటే, ఆ కుటుంబానికి ఆరోజు ఘనమైన రోజులా ఉండేది. అలాంటి కడు పేద కుటుంబంలో పుట్టిన భావనా జాట్ ఆర్థిక కష్టాలను అధిగమించి 'రేస్ వాకర్'గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది. టోక్యో 2020 ఒలింపిక్స్ కోసం అర్హత సాధించిన తొలి భారతీయ మహిళా రేస్ వాకర్‌గా చరిత్ర సృష్టించింది.

రాజస్థాన్‌లోని కబ్రా అనే చిన్న గ్రామానికి చెందిన భావనా జాట్ పేదరికపు సమస్యలకు ఎప్పుడూ భయపడలేదు. కలలకు తెరవేయలేదు.


భావనా జాట్

విరిగిపోయిన హాకీ స్టిక్‌తో...



రాణి రాంపాల్

ఆసియన్ గేమ్స్ (2018) మహిళల హాకీ జట్టుకు సారథ్య బాధ్యతలు నిర్వహించిన రాణి రాంపాల్ పేదింటి బిడ్డ. హరియాణకు చెందిన రాణి ఇల్లు ఎండొచ్చినా, వానొచ్చినా సమస్యే అన్నట్లుగా ఉండేది. విద్యుత్ సదుపాయం ఉండేది కాదు. దోమలు వీరవిహారం చేసేవి. రాణికి హాకీపై ఆసక్తి చిన్నప్పటి నుంచే మొదలైంది. తన ఇంటికి సమీపంలోని హాకీ అకాడమీలో ప్లేయర్స్ ప్రాక్టీస్ చేస్తుంటే గంటల తరబడి చూస్తుండేది. ఎక్కడో దొరికిన విరిగిపోయిన హాకీ స్టిక్‌తో వారిని అనుకరిస్తూ ఉండేది.

'నాకు హాకీలో శిక్షణ ఇవ్వండి' అని హాకీ అకాడమీ వారిని అడిగితే తిరస్కరించారు.

'ఆ సమయంలోనే నన్ను నేను నిరూపించుకోవాలనుకున్నాను' అంటున్న రాణి తన కలను నిజం చేసుకుంది. హాకీలో అంతర్జాతీయ స్థాయిలో మెరిసింది.

విధి నిర్వహణలో నదీ తలొంచింది

ఉన్న ఊర్లో ఆసుపత్రి లేక మరో ఊరిలో ఉన్న ఆసుపత్రికి వెళ్లడానికి సరైన రోడ్డు సౌకర్యమూ లేక నిండు గర్భిణులను, పచ్చి బాలింతలను మంచాల మీద పొరుగూరి ఆసుపత్రికి మోసుకెళ్లే దృశ్యాలనెన్నిటినో మీడియాలో చూసుంటాం, చదివుంటాం! కాని ప్రాథమిక వైద్య సేవలు అందించే ప్రభుత్వ సిబ్బందే అవసరార్థుల ముంగిటికి వెళ్లడం అరుదు. అదీ వానల్లో .. పొంగుతున్న వాగులు, వంకల, నదులను దాటుకుంటూ! ఆ అరుదైన దృశ్యం హిమాచల్‌ప్రదేశ్, మండి జిల్లాలోని స్వార్ గ్రామంలో కనిపించింది. ఆ సాహసి పేరు కమలాదేవి. వయసు నలభై ఏళ్లు. వివరాలు..



హిమాచల్‌ప్రదేశ్‌లోని పధార్‌కి చెందిన కమలాదేవి సుధార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ వర్కర్‌గా పనిచేస్తోంది. నిరవధికంగా కురుస్తున్న వానలతో హిమాచల్‌లోని మండి జిల్లా అతలాకుతలమవుతోంది. ఈ క్రమంలోనే ఆ జిల్లాలోని స్వార్ గ్రామంలో ఓ పసిబిడ్డకు వాక్సిన్ వేయాల్సిన తేదీ వచ్చింది. పొంగుతున్న నదులు, వాగులు, వంకలు దాటుకుంటూ ఆ బాలింతరాలు తన బిడ్డను తీసుకుని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వరకు వచ్చే పరిస్థితి కనిపించలేదు. దాంతో డ్యూటీలో ఉన్న కమలాదేవి తానే ఆ బాలింతరాలింటికి వెళ్లి బిడ్డకు వాక్సిన్ ఇవ్వాలని నిశ్చయించుకుంది. మెడికల్ కిట్‌ను తన బ్యాక్‌ప్యాక్‌లో పెట్టుకుని బయలుదేరింది. బాలింతరాలి గ్రామానికి వెళ్లాలంటే మధ్యలో ఉన్న నదిని దాటాలి. ఆ నది పొంగిపొర్లుతోంది. ఏమాత్రం అధైర్యపడక.. తన బ్యాక్‌ప్యాక్‌ని సరిచేసుకుని, చెప్పులను చేత పట్టుకుని.. నది మధ్యలో ఉన్న పెద్దపెద్ద రాళ్ల మీద నుంచి దూకుతూ నది దాటేసింది. బాలింతరాలి ఇల్లు చేరుకుని బిడ్డకు వాక్సిన్ వేసేసింది. అయితే.. ఆమె నది దాటుతున్న సాహసాన్ని ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. అది వైరల్ అయ్యి.. వీడియోలో కమలాదేవిని పోల్చుకున్న వాళ్లు ఆమెకు ఫోన్ చేసి చెప్పే దాకా ఆ విషయం ఆమెకు తెలియదు. 'అలా ముంచుకొస్తున్న నదిని దాటావ్.. భయం వేయలేదా?' అంటూ ఆమెను మందలించారు స్నేహితులు.



'ఏమో నాకేం భయమనిపించలేదు. బిడ్డకు వాక్సిన్ వేయాల్సిన డేట్ అది.. ఎలాగైనా ఆ ఇల్లు చేరుకుని మందు వేయాలన్న ఆరాటమే ఉండింది కానీ.. వాన, వరద గురించిన ఆలోచన రాలేదు. డ్యూటీ ముఖ్యమనుకున్నాను.. చేశాను' అని చెప్పింది కమలాదేవి. ఈ వైరల్ వీడియో ఆమె సీనియర్ దీపాలీ శర్మకు చేరింది. కమలాదేవి డ్యూటీ మైండ్‌ను ప్రశంసించింది కానీ.. అలా రిస్క్ తీసుకున్నందుకు కంగారు పడింది. 'కమలాదేవి సాహసాన్ని, డ్యూటీ మైండ్‌ని మెచ్చుకోకుండా ఉండలేం. అలాగని ప్రమాదకర పరిస్థితుల్లో హెల్త్‌వర్కర్స్ అలా తమ ప్రాణాలను పణంగా పెట్టడాన్నీ ప్రోత్సహించలేం. అత్యవసర పరిస్థితి గురించి ముందే చెబితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే వీలుంటుంది కదా!' అంది దీపాలీ శర్మ.

నిజమే.. అందుకే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మీద ప్రభుత్వాలు దృష్టిపెట్టి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూసుకోవాలని అభిప్రాయపడుతున్నారు ఈ వైరల్ వీడియో వీక్షించిన నెటిజన్లు.

ఫ్యాషన్

టైమ్‌లెస్ క్లాసిక్

నిరాడంబరతను చాటుకోవాలన్నా ... విలాసవంతంగా కనిపించాలన్నా క్లాసీ లుక్‌తో ఆకట్టుకోవాలన్నా... ఎలాగైనా... ఏ వయసు అయినా ప్రతి సందర్భానికి అతికినట్టుగా ఆహార్యాన్ని అద్భుతంగా చూపుతుంది ఐవరీ కలర్. ఇటీవల భారతీయ ఫ్యాషన్ రంగంలో పేస్టల్ కలర్స్ అగ్రస్థానంలో ఉండగా వాటిలో ఐవరీ ఎప్పుడూ ఒక విలక్షణమైన స్థానంలోనే ఉండి ప్రతి మదిలోనూ రాయల్ లుక్‌గా కొలువుదీరుతోంది.





ఐవరీకి లేస్ అల్లికలు తోడైతే విరిసిన కలువ పూల అందం గుర్తుకు వస్తుంది. ప్రింట్లు తోడైతే ఆధునిక హస్తకళల అద్భుతం కళ్లముందు నిలుస్తుంది. వెల్వెట్, కాటన్‌లోనే కాదు కంచిపట్టులోనూ ఐవరీ కలర్ రిచ్‌నెస్‌ను కళ్లకు కడుతుంది.

- ఐవరీ కాటన్ డ్రెస్‌కి లేయర్లు జత కలిసిన ఫ్రాక్ లేదా లెహంగా డిజైన్స్ ఎప్పటికీ ట్రెండ్‌లో ఉంటాయి.
- రాయల్ లుక్‌తో అట్రాక్ట్ చేయడమే ఐవరీ సహజ లక్షణం. అందుకే, వివాహ వేడుకలలో ఐవరీ కలర్ డ్రెస్సులు ఆహూతుల మదిలో చెరిగిపోని ముద్రను వేస్తాయి.
- రన్ వే నుంచి రెడ్ కార్పెట్ సందడి వరకు, వివాహాల నుంచి పండగ కార్యక్రమాల వరకు,

సెలిబ్రిటీ ఛాయిస్

రెడ్ కార్పెట్‌కు విలక్షణమైన అందాన్ని తీసుకు రావడానికి, పండగల వంటి వివిధ సందర్భాలలో తమ రిచ్‌నెస్‌ను, సౌకుమార్యాన్ని చాటుకోవడానికి సినిమా తారలు ఎంచుకునే రంగుగా ఐవరీ స్థిరపడిపోయింది. అందుకే, సబ్యసాచి, తరుణ్ తహ్లియాని వంటి భారతీయ ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు ఐవరీ రంగుతో విలక్షణమైన డిజైన్లు రూపొందించి, అందరి మనసులను ఆకట్టుకుంటూ ఉంటారు. బాలీవుడ్ మాత్రమే కాదు టాలీవుడ్‌లోనూ ఐవరీ విభిన్న స్టైల్స్‌తో ఆధునికతను మన కళ్లకు కడుతూనే ఉంది.



సామాన్యుల నుంచి సెలిబ్రిటీల వరకు ఐవరీని అందంగా ధరించడం చూస్తుంటాం. లేత రంగుతో ఉండే ఈ ఔట్‌ఫిట్స్‌ను ఏ సందర్భంలోనైనా ధరించవచ్చు. అయితే, ఈ రంగుపై ఏదీ అతిగా ఉండకూడదు. అది హెవీ ఎంబ్రాయిడరీ లేదా డిజిటల్ ప్రింట్లు, లేయర్లు, ఇతర ఫ్యాబ్రిక్స్.. కాంట్రాస్ట్ అయినా సరే...

స్టైలిష్ గౌన్లు, ఇండో వెస్ట్రన్ గౌన్లు, లెహంగాలు, చీరలు, అనార్కలీలు.. ఏ డ్రెస్ అయినా ఐవరీ కలర్ చాలా అందంగా కనిపిస్తుంది.

- క్లాసిక్ ఐవరీలో విభిన్నమైన షేడ్స్ ఉంటాయి. స్కిన్‌టోన్ ఆధారంగా తగిన షేడ్‌ను ఎంచుకోవడం ముఖ్యం. సరైన షేడ్‌తో పాటు ఐవరీ షేడెడ్ దుస్తులలో సరైన స్టైల్‌ను ప్రదర్శించడం కూడా ముఖ్యం.
- ఆధునికతనూ, చక్కదనాన్ని తెలియజేసే సామర్థ్యం ఐవరీకి ఉండటం వల్ల ఫ్యాషన్‌లో ట్రెండింగ్ రంగుగా కొనసాగుతోంది. ప్రస్తుత ట్రెండ్‌లలో మోనోక్రోమ్ దుస్తులు, టైలర్డ్ ట్రౌజర్లు, సిల్క్ సెపరేట్‌లు, రిఫైన్డ్ ఔటర్‌వేర్, రకరకాల థీమ్‌లతో సహా వివిధ రూపాల్లో ఐవరీ ఉంది.



ఐవరీని ఎలా ధరించాలంటే...

- వైడ్-లెగ్ ఐవరీ ప్యాంటు, రిబ్‌డ్ టర్టిల్ నెక్‌తో ట్రెంచ్ కోట్ వంటి ఐవరీ పీసెస్ జత చేయడం ద్వారా మోడర్న్ రూపాన్ని సృష్టించవచ్చు.
- రిచ్ లుక్ కోసం లేస్-ట్రిమ్డ్ స్లిప్ స్కర్ట్‌తో జత చేసిన ఐవరీ సిల్క్‌టాప్‌తో డ్రెస్‌ను ఎలివేట్ చేయవచ్చు.
- జీన్స్ లేదా ట్రౌజర్‌లకు ఐవరీ టాప్స్‌ను ధరించవచ్చు. క్లాసిక్, చిక్ లుక్ కోసం బ్లాక్ ప్లాట్స్‌ని ధరించవచ్చు.
- ఫార్మల్, ఈవెనింగ్ వేర్‌గా ఐవరీ-రంగు గౌన్లు, అనార్కలీ సూట్‌లను ఎంచుకోవచ్చు.

వెడ్డింగ్ కలర్

వధూవరుల దుస్తులకు ఐవరీ సరైన ఎంపికగా ఎప్పుడూ ముందుంటుంది. వధువు లెహంగా లేదా చీర, వరుడి ధోతీ-కుర్తా ... వంటి దుస్తులు వివాహ వేడుకలో వారి బంధంలోని స్వచ్ఛతను సూచిస్తుంది.

బులియన్

(బంగారం 10 గ్రా. : వెండి కిలో)
ఆగస్టు 28న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,03,110	1,04,960	1,02,060	1,04,280	1,02,450	1,02,600
బంగారం (22 క్యారెట్లు)	95,370	93,900	94,050	96,870	94.250	94,050
వెండి	1,20,000	1,19,400	1,30,000	1,19,800	1,19,000	.1,30,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ఐటీలా క్రీడా సంస్కృతి రావాలి

- స్పోర్ట్స్ హబ్ బోర్డు తొలి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష
- క్రీడా రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచన
- భేటీలో పాల్గొన్న కపిల్ దేవ్, పుల్లెల గోపీచంద్, బైచుంగ్ భూటియా, ఉపాసన తదితరులు



గురువారం హైదరాబాద్‌లో జరిగిన భేటీలో స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో అభినవ్ బింద్రా, బైచుంగ్ భూటియా, కపిల్ దేవ్, వీటా దానీ, పుల్లెల గోపీచంద్, రవికాంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: క్రీడావిధానం, క్రీడల ప్రోత్సాహానికి సంబంధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతి ఒక్కరూ తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలన్నదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదిక కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సంబంధించి కొత్తగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ హబ్ బోర్డు తొలి సమావేశం గురువారం జరిగింది. ఈ భేటీలో పాల్గొన్న సీఎం రేవంత్.. ప్రభుత్వ ఆలోచనలు, ప్రణాళికలను వివరించారు. తెలంగాణలో ఐటీ సంస్కృతి ఉందని, ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో ఉండాలని కోరుకుంటున్నారని, అదే తరహాలో క్రీడా సంస్కృతి రావాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు గతంతో పోలిస్తే బడ్జెట్‌ను 16 రెట్లు పెంచామన్న సీఎం... క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆటల ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు స్పోర్ట్ హబ్ బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. క్రీడారంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించామని సీఎం రేవంత్ తెలిపారు. ఇకపై గ్రామ స్థాయి మొదలు రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేస్తామని ప్రకటించారు. క్రీడా పరికరాలపై పన్నులను తగ్గించేలా కేంద్రంతో మాట్లాడతామన్న ఆయన.. తమ స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా కోర్సులు ప్రవేశపెడతామని బోర్డు సభ్యులకు వివరించారు. వచ్చే మూడేళ్లలో సాధించాల్సిన లక్ష్యాలపై బోర్డు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఖేలో ఇండియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, ఒలింపిక్స్ ఇలా దేశంలో ఏ క్రీడా ఈవెంట్ నిర్వహించే అవకాశం వచ్చినా వాటిలో తెలంగాణకు ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, ట్రైనర్‌లకు శిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళికల రూపకల్పన, అమలుకు సబ్ కమిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. తెలంగాణ స్పోర్ట్ హబ్ బోర్డులో సభ్యులైన పారిశ్రామికవేత్తలు సంజీవ్ గోయెంకా, ఉపాసన కామినేని, వీటా దానీ, చింతా శశిధర్... మాజీ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్, బైచుంగ్ భూటియా, కపిల్‌దేవ్, అభినవ్ బింద్రా, రవికాంత్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొని ప్రభుత్వానికి తగిన సూచనలు అందించారు. సమావేశంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ కేవీస్ శ్రీనివాస రాజు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీబాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హబ్ బోర్డు సూచనలివే

వివరాలు సాక్షి ప్లస్‌లో..

త్వరగా ఎన్నికలకు వెళ్లటమే మేలు!

ప్రభుత్వ పరంగా జీఓ ఇచ్చి ముందుకెళ్లటం వైపే మొగ్గు..?

- సీఎంతో మంత్రుల కమిటీ భేటీలో మెజారిటీ అభిప్రాయం
- ప్రభుత్వానికి మూడు సిఫారసులు చేసిన మంత్రుల కమిటీ
- విస్తృతంగా చర్చ జరిగినా తుది నిర్ణయానికి రాలేకపోయిన నేతలు
- మరింత లోతుగా చర్చించేందుకు మరోసారి భేటీకి నిర్ణయం
- కేబినెట్ సమావేశంలోనూ చర్చించాలని తీర్మానం



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో కాంగ్రెస్ పార్టీ వైఖరి ఇంకా తేలలేదు. ఢిల్లీలో న్యాయ నిపుణులతో సంప్రదింపులతోపాటు గత రెండు రోజులుగా జరిగిన మంత్రుల బృందం భేటీ.. సీఎం, పీసీసీ అధ్యక్షుల సమక్షంలో జరిగిన చర్చల్లోనూ తుది నిర్ణయానికి రాలేకపోయారు. ఈ నేపథ్యంలో మరో రెండుమూడు రోజుల తర్వాతే పార్టీ వైఖరి స్పష్టమవుతుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

తొందరపాటు వద్దు

స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో సంప్రదింపుల కోసం పీసీసీ ఏర్పాటు చేసిన మంత్రుల బృందం మూడు ప్రత్యామ్నాయాలను పార్టీ ముందుంచినట్టు తెలిసింది. ఈ మూడింటిని గురువారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో జరిగిన సమావేశంలో మంత్రుల బృందం వివరించింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రుల బృందం సభ్యులు మల్లు భట్టి విక్రమార్క, ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ధనసరి సీతక్కలు పాల్గొన్నారు. మూడు ఆప్షన్లపై చర్చించినా తుది నిర్ణయానికి రాలేకపోయారని తెలిసింది. అయితే, మెజారిటీ నాయకులు మాత్రం ప్రత్యేక జీవో ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తేనే మంచిదని అభిప్రాయపడ్డారు. బీసీ వర్గాలకు న్యాయం చేసే విషయంలో హడావుడిగా నిర్ణయం తీసుకునేదాని కంటే పార్టీ పరంగా ఎలా ముందుకెళ్లాలన్న దానిపై మరింత కూలంకషంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ నెల 30న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ ఈ అంశంపై చర్చించి మంత్రుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. బుధవారం గాంధీభవన్‌లో మంత్రుల బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, సీతక్క, వాకిటి శ్రీహరి, పార్టీ నేతలు వి.హనుమంతరావు, పి. వినయ్‌కుమార్, ఈరవత్రి అనిల్ పాల్గొని ఢిల్లీ న్యాయ నిపుణులు ఇచ్చిన అభిప్రాయాల మేరకు మంత్రుల బృందం చేయాల్సిన సిఫారసులపై చర్చించారు.

మంత్రుల బృందం సిఫారసులివే..!

- స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేస్తూ రాష్ట్రపతి ఆమోదానికి పంపిన ఆర్డినెన్సుకు మరో నెలరోజుల్లో మూడు నెలలు పూర్తవుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదం విషయంలో రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు కేసు కూడా ఈలోపు ఓ కొలిక్కి వస్తుంది. అప్పటివరకు వేచి చూస్తే బాగుంటుంది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున ప్రభుత్వ పక్షాన కొంత గడువు కోరుతూ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయాలి. ఆర్డినెన్సు ఆమోదం విషయంలో కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ పోరాటం చేయాలి.
- వేచి చూసే అవకాశం లేకపోతే ప్రభుత్వ పరంగానే బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ప్రత్యేక జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలి. ఈ ఉత్తర్వులపై ఎవరైనా కోర్టులకు వెళితే కులగణన ఆధారంగా వచ్చిన శాస్త్రీయ గణాంకాలను కోర్టు ముందుంచి పోరాడాలి. కోర్టులు కూడా వెంటనే నిర్ణయం తీసుకోకుండా కేవియట్ దాఖలు చేయాలి. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లాలి.
- ఈ రెండు ప్రతిపాదనలు కాదంటే పార్టీ పరంగానే 42 శాతం రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలి.

సింఘ్వి సలహానే సరైందా..?

గురువారం సీఎం రేవంత్ సమక్షంలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో వీలున్నంత త్వరగా ఎన్నికలు నిర్వహించడమే మంచిదనే అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. అయితే, పార్టీ పరంగా మరింత దృఢంగా వ్యవహరించాలని, బీసీ వర్గాలకు న్యాయం చేసే విషయంలో వెనక్కు తగ్గవద్దనే చర్చ కూడా వచ్చింది. ఈ నేపథ్యంలో పార్టీ ఎంపీ, న్యాయ కోవిదుడు అభిషేక్ మనూ సింఘ్వి ఇచ్చిన సలహా మేరకు సుప్రీంకోర్టులో కేసు తేలేవరకు వేచి ఉండడమే మంచిదనే అభిప్రాయం వ్యక్తమైనట్టు తెలిసింది. ఎన్నికలకు వెళ్లాల్సి వస్తే ప్రభుత్వ పరంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి వెళ్లాలని ఎక్కువ మంది అభిప్రాయపడ్డట్లు సమాచారం.

'విద్యుత్' ఉద్యమంపై బుల్లెట్

బషీర్‌బాగ్ కాల్పులకు పాతికేళ్లు

- ప్రజాఉద్యమంగా మారిన విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమం
- కాల్పుల ఘటనతో నాటి చంద్రబాబు పాలనకు చరమగీతం



సాక్షి, హైదరాబాద్: బషీర్‌బాగ్ షహీద్‌చౌక్.. విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమానికి సాక్షీభూతంగా నిలుస్తోంది. సరిగ్గా పాతికేళ్ల క్రితం.. 2000 సంవత్సరం ఆగస్టు 28న ఉమ్మడి ఏపీ సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో హైదరాబాద్ నడిబొడ్డున బషీర్‌బాగ్‌లో పోలీస్ కాల్పుల్లో ముగ్గురు నేలకొరిగారు. ఈ కాల్పుల ఘటనతో నాటి చంద్రబాబు ప్రజావ్యతిరేక పాలనకు 'కౌంట్‌డౌన్' మొదలైంది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలు, రైతులను తీవ్ర నిర్లక్ష్యం చేసిన పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్రకరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాంటి భయానక పరిస్థితుల్లోనూ రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని ఆదుకునే దిశగా చంద్రబాబు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అనేక జిల్లాల్లో కరువు తీవ్రత పెరిగినా పట్టించుకోలేదు.

ఇదీ నేపథ్యం...

ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి విద్యుత్ సంస్కరణల అమల్లో భాగంగా ప్రైవేటీకరణ విధానాలతో ప్రజలపై పెనుభారాన్ని పెంచేలా విద్యుత్ చార్జీలను పెంచుతూ చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజలు, రాజకీయపార్టీలు, సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను చంద్రబాబు పట్టించుకోలేదు. దీనిని వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, ఇతర వామపక్షపార్టీలు ప్రారంభించిన విద్యుత్‌చార్జీల పెంపుదల వ్యతిరేక ఉద్యమానికి పీసీసీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరావు, డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారు.

వైఎస్ నిరవధిక దీక్షతో ప్రజా ఉద్యమంగా...

కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి వైఎస్.రాజశేఖరరెడ్డి ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నిరవధిక నిరాహారదీక్షకు దిగారు. దీంతో ఈ పోరాటం రాష్ట్రవ్యాప్తంగా ఊపందుకొని ప్రజాఉద్యమంగా రూపుదాల్చింది. చార్జీల పెంపుదల నిర్ణయంపై అసంతృప్తిని వ్యక్తంచేస్తూ సీఎం చంద్రబాబుకు నాడు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కేసీఆర్ లేఖ రాశారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా వామపక్షాలు, కాంగ్రెస్ వేర్వేరుగా చేపట్టిన 'చలో అసెంబ్లీ'పై బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద చంద్రబాబు ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. తీవ్ర ఉద్రిక్తతల మధ్య నిరసనకారులు ముందుకు సాగే ప్రయత్నం చేయగా, పోలీసులు కాల్పులకు దిగడంతో రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి తూటాలకు బలయ్యారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసిన కేసీఆర్ మలిదశ తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమం, పోలీసుకాల్పుల ఘటనలు పరోక్షంగా టీఆర్ఎస్ ఏర్పాటుకు కారణమయ్యాయి.

విద్యుత్ అమరవీరుల స్మారకార్థం 'షహీద్‌చౌక్'

2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు ఆధ్వర్యంలోని టీడీపీ చిత్తుగా ఓడిపోయింది. పాదయాత్రతో ప్రజల హృదయాల్లో నిలిచిన డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ఎల్బీస్టేడియంలో ప్రజల సమక్షంలో ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అక్కడికక్కడే నిండు సభలో వ్యవసాయరంగానికి ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తూ తొలి సంతకంపై వైఎస్ సంతకం చేశారు. అనంతరం బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ కింద పోలీసుకాల్పుల్లో ముగ్గురు మరణించిన చోట విద్యుత్ అమరవీరుల స్మారకార్థం 'షహీద్ చౌక్'ను ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి ప్రతీ ఏడాది ఆగస్టు 28న చంద్రబాబు పాలనలో కాల్పుల ఘటనను గుర్తు చేసుకుంటూ ముగ్గురు విద్యుత్ ఉద్యమ అమరవీరులకు వామపక్షాలు, ప్రజాసంఘాలు, సంస్థలు నివాళులు అర్పిస్తూ వస్తున్నాయి. గురువారం షహీద్‌చౌక్ వద్ద విద్యుత్ అమరవీరులకు జోహార్ జోహార్, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడుదాం అంటూ వామపక్షపార్టీల నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆనాటి విద్యుత్ ఉద్యమం నేటికీ స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.

సాక్షి సినిమా


సంప్రదాయంగా...



● చిరంజీవి

వినాయక చవితి పండగని పురస్కరించుకుని చిరంజీవి ప్రత్యేక పోస్టర్‌ని రిలీజ్ చేసింది 'మన శంకరవరప్రసాద్ గారు' యూనిట్. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఈ సినిమాలో నయనతార హీరోయిన్. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా ఈ సినిమా నుంచి చిరంజీవి ట్రెడిషనల్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''చిరంజీవిగారు నటిస్తున్న పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు'. 2026 సంక్రాంతికి మా సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

మాస్ డ్యాన్స్



● రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'పెద్ది'. ఈ సినిమా కోసం వెయ్యిమంది డ్యాన్సర్స్‌తో కలిసి స్టెప్స్ వేస్తున్నారు రామ్‌చరణ్. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ మైసూరులో ఆరంభమైంది. రామ్ చరణ్‌పై ఓ పాటని తెరకెక్కిస్తున్నారు. ''ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ మ్యాసివ్ సాంగ్ షూటింగ్‌ని మైసూరులో ప్రారంభించాం. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్న ఈ పాటలో వెయ్యి మందికిపైగా డ్యాన్సర్లు పాల్గొంటున్నారు. ఈ పాట విజువల్ ఫీస్ట్‌లా ఉంటుంది. తన ట్రేడ్‌మార్క్ ఎనర్జీ, గ్రేస్‌తో రామ్‌చరణ్ వేస్తున్న మాస్ స్టెప్స్ ఈ సాంగ్‌ని హైలైట్‌గా నిలపడం ఖాయం'' అని చిత్ర యూనిట్ తెలిపింది. 2026 మార్చి 27న రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు.

తెలుగుకి స్వాగతం



● వీవీ వినాయక్, 'దిల్' రాజు, జున్ హ్యున్ జీ

''నేను తెరకెక్కిస్తున్న 43వ చిత్రం 'వేదవ్యాస్'. ఒక కొరియన్ హీరోయిన్‌ని తొలి సారి తెలుగులో పరిచయం చేస్తున్నాం. నా లైఫ్‌లో ఎన్ని సినిమాలైతే చేయగలనో అన్నింటినీ ప్రతాప్ రెడ్డిగారితో చేస్తాను'' అని దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న 'వేదవ్యాస్' సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఈ చిత్రంతో సౌత్ కొరియన్ నటి జున్ హ్యున్ జీ టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. కె. అచ్చిరెడ్డి సమర్పణలో కాంగ్రెస్ పార్టీ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు నిర్మాత కిరణ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇవ్వగా, డైరెక్టర్ అనిల్ రావిపూడి గౌరవ దర్శకత్వం వహించారు. 'కంగ్రాట్యులేషన్స్. వెల్‌కమ్ టు టాలీవుడ్' అంటూ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజు... జున్ హ్యున్ జీకి బొకే అందించగా, ఆమె 'థాంక్యూ సర్' అనటాన్ని తొలి సన్నివేశంగా చిత్రీకరించారు. కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ– ''ఎస్వీ కృష్ణారెడ్డిగారి మీద అభిమానంతోనే నిర్మాతను అయ్యాను. ఆయనతో మరిన్ని చిత్రాలు చేయాలని ప్లాన్ చేస్తున్నాం'' అని తెలిపారు. కె. అచ్చిరెడ్డి మాట్లాడుతూ–''వేదవ్యాస్' కృష్ణారెడ్డిగారి డ్రీమ్ ప్రాజెక్ట్. ఈ సినిమాలో హీరో ఎవరనేది మరో వారం పది రోజుల్లో వెల్లడిస్తాం'' అని చెప్పారు. ''భారతీయ సంస్కృతి నేర్చుకుని ఈ సినిమాలో నటిస్తుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు జున్ హ్యున్ జీ.

గాడ్స్ అండ్ సోల్జర్!



● రాజ్ తరుణ్

రాజ్ తరుణ్ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా తెరకెక్కుతోంది. 'గోలీసోడా', గోలీసోడా–2' చిత్రాల దర్శకుడు, ప్రముఖ కెమెరామేన్ విజయ్ మిల్టన్ దర్శకత్వం వహిస్తున్నారు. రఫ్ నోట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని 'గాడ్స్ అండ్ సోల్జర్' అనే టైటిల్‌ని ఫిక్స్ చేశారు మేకర్స్. హీరోలు విజయ్ సేతుపతి, విజయ్ ఆంటోని, ఆర్య, విశ్వక్ సేన్ 'గాడ్స్ అండ్ సోల్జర్' టీజర్‌ని తమ 'ఎక్స్' అకౌంట్ వేదికగా షేర్ చేశారు. ఈ చిత్రంతో రాజ్ తరుణ్ తమిళంలోకి ఎంట్రీ ఇస్తున్నారు. విజయ్ మిల్టన్ మాట్లాడుతూ– ''మా టైటిల్ టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ టీజర్‌తో మా మూవీపై ఆడియన్స్‌లో అంచనాలు పెరిగాయి. మా చిత్రం తెలుగు, తమిళ భాషల్లో అందరి అంచనాలను అందుకునేలా ఉంటుంది'' అన్నారు. ఈ సినిమాకి సంగీతం: శ్యామ్ సీఎస్, కెమెరా: విజయ్ మిల్టన్.

అది బోనస్ – తేజ సజ్జా



● రితిక, తేజ, కార్తీక్, మనోజ్, శ్రియ

''మన తెలుగు ప్రేక్షకుల సపోర్ట్ వల్లే ఈరోజు ఇక్కడ ఉన్నాను. నా సినిమా ఇతర భాషల వారికి నచ్చితే అది బోనస్'' అని తేజ సజ్జా చెప్పారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తేజ సజ్జా, రితికా నాయక్ జంటగా నటించిన చిత్రం 'మిరాయ్'. మనోజ్ మంచు, జగపతిబాబు, శ్రియా శరణ్ ఇతర పాత్రలు పోషించారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 12న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తేజ సజ్జా మాట్లాడుతూ– ''మిరాయ్' కోసం వంద శాతం ఎఫర్ట్ పెట్టాను. చాలా క్లీన్ ఫిలిం. పిల్లలు, కుటుంబమంతా కలిసి చూడొచ్చు'' అని తెలిపారు. మనోజ్ మంచు మాట్లాడుతూ– ''మిరాయ్'లో నాది బలమైన పాత్ర. ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అవ్వాలి'' అని చెప్పారు. ''మా సినిమాని చూసి ఎంజాయ్ చేస్తారు'' అన్నారు కృతీ ప్రసాద్. ''చాలా సిన్సియర్‌గా తీసిన సినిమా ఇది'' అని కార్తీక్ ఘట్టమనేని పేర్కొన్నారు. ''తెలుగు సినిమా పరిశ్రమ గర్వపడేలా చేస్తుంది 'మిరాయ్''' అని టీజీ విశ్వప్రసాద్ తెలిపారు.

రక్తంతో రాసిన ఘటనలు..!



● రిచర్డ్ రిషి

పద్నాలుగో శతాబ్దం నేపథ్యంలో రూపొందుతున్న ద్విభాషా (తెలుగు, తమిళ్) చిత్రం 'ద్రౌపతి–2'. రిచర్డ్ రిషి, రక్షణ ఇందుసూదన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు మోహన్ .జి దర్శకుడు. నేతాజీ ప్రొడక్షన్స్ తరపున చోళ చక్రవర్తి, జి.ఎం. ఫిల్మ్ కార్పొరేషన్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''14వ శతాబ్దంలోనే మొఘల్ చక్రవర్తులు తమిళనాడులోకి ప్రవేశించారు. రక్తంతో రాసిన చారిత్రక ఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నాం. దక్షిణ భారత దేశానికి చెందిన హోయసాల చక్రవర్తి మూడవ వీర వల్లాలర్, సేంద మంగలాన్ని పాలించిన కడవరాయుల రాజులు, వీరత్వం, త్యాగం వంటి అంశాలు కీలకంగా ఉంటాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా విడుదల కానుంది.

ఆస్కార్ నామినేషన్ ఎంట్రీ బరిలో పాపా బుకా

- పీఎన్‌జీ దేశం నుంచి తొలి సినిమాగా రికార్డ్
- మలయాళ దర్శకుడు బిజుకుమార్ దామోదరన్ దర్శకత్వంలో 'పాపా బుకా'
- తమిళ దర్శక-నిర్మాత పా. రంజిత్ సహ నిర్మాత



రెండో ప్రపంచ యుద్ధంలో భారతదేశ సైనికులు పీఎన్‌జీలో (పాపువా న్యూ గినియా దేశం) పోరాడిన చరిత్ర గురించి చాలామందికి తెలియకపోవచ్చు. ఈ యుద్ధం నేపథ్యంలో రూపొందిన 'పాపా బుకా' చిత్రం ఆ చరిత్రను తెలియజేసింది. నాటి యుద్ధం ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. కారణం... 'పాపా బుకా' చిత్రం అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 98వ ఆస్కార్ అకాడమీ అవార్డుల నామినేషన్ ఎంట్రీకి అర్హత సాధించడమే. 'సైరా, వీట్టిలెక్కుల వళి, పేరరియాదవర్, వెయిల్‌మరంగళ్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన మలయాళ దర్శకుడు బిజుకుమార్ దామోదరన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రాన్ని పాపువా న్యూ గినియాకు చెందిన నోయెలీన్ తౌలా ఉనమ్‌తో పాటు ఇండియాకు చెందిన అక్షయ్ కుమార్ పరిజా, ప్రకాశ్ బేర్ నిర్మించారు. రజనీకాంత్‌తో 'కబాలి, కాలా' వంటి చిత్రాలతో పాటు పలు చిత్రాలకు దర్శకత్వం వహించి, నిర్మించిన ప్రముఖ తమిళ దర్శక–నిర్మాత పా. రంజిత్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న పాపువా న్యూ గినియా దేశంలోని థియేటర్లలో విడుదల కానుంది. ఈ దేశం నుంచి ఆస్కార్ నామినేషన్ ఎంట్రీకి అర్హత సాధించిన తొలి సినిమాగా 'పాపా బుకా' రికార్డు సృష్టించింది.

సరిహద్దు సహకారానికి ఓ చిహ్నం: బిజు దామోదరన్



''పీఎన్‌జీ 50వ స్వాతంత్ర్య సంవత్సరంలో ఆ దేశం నుండి పంపుతున్న తొలి ఆస్కార్ చిత్రంగా 'పాపా బుకా' నిలవడం ఓ గౌరవం. ఈ చిత్రం భారతదేశం, పాపువా న్యూ గినియా మధ్య ఉమ్మడి చరిత్రలకు ఓ నివాళి. సరిహద్దు సహకారానికి ఓ చిహ్నం'' అని దర్శకుడు బిజు దామోదరన్ పేర్కొన్నారు. కాగా బిజు దర్శకత్వం వహించిన చిత్రాల్లో 'వీటిలెక్కుల వళి, పేరరియాదవర్, వలియ చిరక్కుళ్ళ పక్షిగళ్' జాతీయ అవార్డులు సాధించాయి. ఇంకా ఈ చిత్రాలతో పాటు వేరు పలు చిత్రాలకు ఆయన అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు.

రెండు దేశాలకు దక్కిన గౌరవం ఇది: పా. రంజిత్



''అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 98వ ఆస్కార్ అకాడమీ అవార్డులకు 'పాపా బుకా' అధికారికంగా ఎంపికైంది. భారతదేశం నుండి నిర్మాతల్లో ఒకరిగా, రెండు దేశాల సహ నిర్మాణంలో భాగం కావడం మా నీల్ ప్రొడక్షన్స్‌కి దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఈ కథని ప్రపంచ వేదిక వరకు తీసుకెళ్లడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ దక్కిన గౌరవం ఇది. 'పాపా బుకా' ద్వారా ప్రశంసలు దక్కించుకోవడం రెండు దేశాలకి ఓ గౌరవం'' అని పా. రంజిత్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

పాపువా న్యూ గినియా ఆస్కార్ సెలక్షన్ కమిటీ చైర్మన్ డాన్ నైల్స్ మాట్లాడుతూ– ''పీఎన్‌జీకి ఇది ఒక చరిత్రాత్మక క్షణం. 'పాపా బుకా' మన కథలు, సంప్రదాయాలను ప్రతిబింబించే సినిమా. ఆస్కార్ అకాడమీ అవార్డుల వేదిక ద్వారా ఈ చిత్రాన్ని ప్రపంచానికి అందించనున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది'' అని తెలిపారు.

ఆస్కార్ అవార్డుతోనూ రికార్డ్?

పాపువా న్యూ గినియా దేశం నుంచి ఆస్కార్ నామినేషన్ ఎంట్రీకి అర్హత సాధించిన తొలి సినిమాగా 'పాపా బుకా' రికార్డు సృష్టించింది. మరి... నామినేషన్ దక్కించుకుంటుందా లేదా? అనేది ఈ డిసెంబర్ 16 (తేదీ అటూ ఇటూ అయ్యే అవకాశం ఉంది)న తెలిసిపోతుంది. ఎందుకంటే నామినేషన్‌కి పంపించే చిత్రాల షార్ట్ లిస్ట్‌ని ఆ రోజు ప్రకటించాలనుకుంటోంది ఆస్కార్ అవార్డు కమిటీ. ఒకవేళ నామినేషన్ దక్కించుకుంటే 'పాపా బుకా' ఆస్కార్ కూడా గెలుచుకుని, రికార్డ్ సాధిస్తుందా? అనేది మార్చి 15 (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 16) న జరిగే ఆస్కార్ అవార్డు వేడుకలో తెలిసిపోతుంది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
29-8-2025

స్టాక్‌ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
706	211
80,080	24,501

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	21,683	△	94
డోజోన్స్	45,574	△	9
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,225	▽	31
డాక్స్	24,051	△	5
షాంఘై	3,844	△	43
నికాయ్	42,829	△	309

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్	ఎస్‌బీఐ	87.12	88.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.00	119.91
€	యూరో	ఎస్‌బీఐ	100.70	103.46
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.74	60.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.63	57.87
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.91	69.61
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.47	23.97
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.95	24.21
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.36	13.19

కొనసాగిన టారిఫ్‌ టెన్షన్‌

ముంబై: అమెరికా విధించిన 50% సుంకాలు అమల్లోకి రావడంతో గురువారం దేశీయ స్టాక్‌ మార్కెట్‌ దాదాపు ఒకశాతం నష్టపోయింది. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశాయి.

- రెండో రోజూ సూచీలు డీలా
- రూ.9.69 లక్షల కోట్ల సంపద ఆవిరి



సెన్సెక్స్‌ 706 పాయింట్లు నష్టపోయి 80,080 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 211 పాయింట్లు కోల్పోయి 24,501 వద్ద ముగిశాయి. సూచీలకిది రెండోరోజూ నష్టాల ముగింపు. బలహీనంగా మొదలైన సూచీలు రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. వినిమయ మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 774 పాయింట్లు క్షీణించి 80,013 వద్ద, నిఫ్టీ 230 పాయింట్లు కోల్పోయి 24,482 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. డాలర్‌ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలహీనపడి 87.58 వద్ద స్థిరపడింది. టారిఫ్‌ సంబంధిత అనిశ్చితులతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- సూచీల పతనంతో రెండు రోజుల్లో రూ.9.69 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. దీంతో బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్‌ విలువ రూ.445.17 లక్షల కోట్లకు దిగివచ్చింది. గురువారం ఒక్కరోజే రూ.4 లక్షల కోట్ల మేర సంపద ఆవిరైంది.
- ట్రాన్స్‌ఫార్మర్‌ ఉపకరణాల తయారీ సంస్థ మంగళ్‌ ఎలక్ట్రానిక్స్‌ లిస్టింగ్‌ నిరాశపరిచింది. ఇష్యూ ధర (రూ.561)తో పోలిస్తే బీఎస్‌ఈలో అరశాతం డిస్కౌంట్‌ రూ.558 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో 6% క్షీణించింది, చివరికి 4.50% నష్టంతో రూ. 534 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్‌ విలువ రూ.1,475.31 కోట్లుగా నమోదైంది.

4 నెలల గరిష్టానికి ఐఐపీ

జూలైలో 3.5 శాతం వృద్ధి • జూన్‌లో 1.5 శాతం



న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) జూలైలో బలపడింది. నాలుగు నెలల గరిష్ఠ స్థాయిలో 3.5 శాతంగా నమోదైంది. జూన్‌లో ఈ రంగం వృద్ధి 1.5 శాతంగా ఉంది. ఈ ఏడాది మార్చిలో నమోదైన 3.9% వృద్ధి రేటు క్రితం గరిష్ఠంగా ఉండడం గమనార్హం.

- తయారీ రంగంలో వృద్ధి జూలైలో 5.4 శాతానికి పుంజుకుంది. క్రితం ఏడాది ఇదే నెలలో ఇది 4.7 శాతంగా ఉంది.
- మైనింగ్‌ ఉత్పత్తి మాత్రం మైనస్‌ 7.2 శాతానికి తగ్గిపోయింది. క్రితం ఏడాది ఇదే నెలలో 3.8 శాతం వృద్ధి నమోదైంది.
- విద్యుదుత్పత్తి 0.6 శాతం వృద్ధికి పరిమితమైంది.
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్‌–జూలై 4 నెలల కాలంలో పారిశ్రామికోత్పత్తి 2.3% వృద్ధి చెందింది. క్రితం ఏడాది ఇదే కాలంలో 5.4% వృద్ధితో పోల్చితే సగం తగ్గిపోయింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
ఎయిర్‌లైన్స్.. నష్టాలు డబుల్!
బిలియన్‌ డాలర్ల గ్రో ఐపీవోకు సెబీ ఓకే..

ఎగుమతిదారులకు అండ!

- టారిఫ్‌ ప్రభావిత రంగాలకు సాయంపై కేంద్రం దృష్టి
- రుణాలపై మారటోరియం
- ఎగుమతులకు ప్రోత్సాహకాలు



న్యూఢిల్లీ: భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించడంతో దేశీ ఎగుమతిదారులకు మద్దతుగా నిలించేందుకు కేంద్రం కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. రుణాలపై మారటోరియం (చెల్లింపులపై తాత్కాలిక విరామం), ఎగుమతి ప్రోత్సాహకాలను అందించడంపై దృష్టి సారించినట్టు ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. తమకు తక్కువ రేట్లపై రుణసాయం అందించాలని ఎగుమతిదారులు ఎప్పటి నుంచో కోరుతుండగా, వారి డిమాండ్లను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించిందంటూ.. ఈ దిశగా సానుకూల నిర్ణయాలు వెలువడనున్నట్టు ఆ అధికారి చెప్పారు. ఎగుమతులను వైవిధ్యం చేసుకోవడం, మరిన్ని దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, ఆర్థిక పరమైన మద్దతు చర్యలకుతోడు దేశీ మార్కెట్‌ విస్తరణ ద్వారా యూఎస్‌ టారిఫ్‌ల ప్రభావం అధిగమించేలా చూడనున్నట్టు వివరించారు. ముఖ్యంగా అమెరికా టారిఫ్‌ల ప్రభావం ఎక్కువగా ఉండే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ)ల ఉద్యోగులకు ప్రత్యక్ష నగదు సాయాన్ని సైతం పరిశీలిస్తున్నట్టు సమాచారం. 'ప్రోత్సాహకాలను ఎలా అందించాలన్నది పరిశీలించాల్సి ఉంది. ఇందుకు ఎంత మొత్తం కేటాయించాలి. రుణ హామీ, తనఖా లేని రుణ పరిమితి పెంపును తొలుత ప్రకటించొచ్చు' అని ఆ అధికారి తెలిపారు. 2025–26 బడ్జెట్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.25,000 కోట్లను ఎగుమతి ప్రోత్సాహకాల కింద ప్రకటించింది.

రాయితీ రుణాలు..

రుణాలపై వడ్డీ రాయితీని తిరిగి ఐదేళ్ల కాలానికి తీసుకురావాలని ఎగుమతిదారులు కోరుతుండడం గమనార్హం. మూలధన అవసరాలకు వీలుగా రుణాల లభ్యతను పెంచడం, ఏడాది పాటు రుణాల అసలు, వడ్డీ చెల్లింపులపై మారటోరియం తదితర సాయాన్ని అందించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సూచనలను ప్రభుత్వం పరిశీలిస్తోందని, టారిఫ్‌ల కారణంగా ఏర్పడే నష్టం తాత్కాలికమేనని ప్రభుత్వ అధికారి పేర్కొన్నారు. ముఖ్యంగా అమెరికా ఎగుమతులపై ఎక్కువగా ఆధారపడిన రొయ్యలు, టెక్స్‌టైల్స్‌, తోలు, రత్నాభరణాల పరిశ్రమల నుంచి ఎక్కువ ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర వాణిజ్య శాఖ ఎగుమతిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ, తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 4 నెలల్లో అమెరికాకు భారత్‌ నుంచి ఎగుమతులు 21 శాతం పెరిగి 33.53 బిలియన్‌ డాలర్లుగా ఉన్నాయి. 2024–25లో ఎగుమతులు 86.5 బిలిన్‌ డాలర్లుగా నమోదయ్యాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌ మొత్తం వస్తు ఎగుమతులు 437 బిలియన్‌ డాలర్లలో 20% అమెరికాకే వెళ్లాయి. మరోవైపు సవాళ్లతో కూడిన ఈ తరుణంలో ఎగుమతిదారుల ఆందోళనలను పరిష్కరిస్తామంటూ కేంద్ర ఆర్థిక శాఖ హామీ ఇచ్చినట్టు భారతీయ ఎగుమతిదారుల సమాఖ్య (ఎఫ్‌ఐఈవో) ప్రకటించింది.

టెక్స్‌టైల్స్‌కు కష్టకాలం..!

- పావు శాతం ఎగుమతులపై ప్రభావం
- వజ్రాలు, టైర్‌ పరిశ్రమకూ ఇబ్బందే..
- విధానపరమైన మద్దతుకు డిమాండ్‌



న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌ల కారణంగా అధిక ప్రభావం పడే టెక్స్‌టైల్స్‌, వజ్రాల పాలిషింగ్‌, టైర్ల పరిశ్రమలు ప్రభుత్వం నుంచి విధానపరమైన సాయం కోరుతున్నాయి. ముఖ్యంగా అమెరికా 50 శాతం టారిఫ్‌లు దేశీ టెక్స్‌టైల్స్‌ పరిశ్రమపై అధిక ప్రభావం చూపించనుంది. మొత్తం టెక్స్‌టైల్స్‌ ఎగుమతుల్లో పావు శాతంపై వచ్చే ఆరు నెలల పాటు టారిఫ్‌ల ప్రభావం ఉంటుందని పరిశ్రమ పేర్కొంది. దేశ వస్త్ర ఎగుమతులకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న విషయాన్ని గుర్తు చేసింది. టారిఫ్‌ల కారణంగా ఆర్డర్లు రద్దు అవుతున్నట్టు తెలిపింది. వచ్చే డిసెంబర్‌ 31 వరకు సుంకాల్లేకుండా కాటన్‌ దిగుమతులకు ప్రభుత్వం అనుమతించడం, దేశీ టెక్స్‌టైల్స్‌ పరిశ్రమకు ఉపశమనం ఇవ్వనున్నట్టు కాన్ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియన్‌ టెక్స్‌టైల్స్‌ ఇండస్ట్రీ (సీఐటీఐ) సెక్రటరీ జనరల్‌ చంద్రిమా ఛటర్జీ చెప్పారు. దీనివల్ల వ్యయాలు తగ్గి కొంత పోటీతత్వం లభిస్తుందన్నారు. 'వచ్చే 6 నెలలు 20–25% టెక్స్‌టైల్స్‌ ఎగుమతులపై ప్రభావం పడొచ్చు' అని చెప్పారు. 50% టారిఫ్‌లు టెక్స్‌టైల్స్‌, వస్త్ర పరిశ్రమకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నట్టు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అప్పారెల్‌ ఎక్స్‌పోర్ట్‌ ప్రమోషన్‌ కౌన్సిల్‌ (ఏఈపీసీ) చైర్మన్‌ సుధీర్‌ శక్రి తెలిపారు. 2024–25లో టెక్స్‌టైల్స్‌, అప్పారెల్‌ పరిశ్రమ ఆదా యం 179 బిలియన్‌ డాలర్లుగా ఉంటే, ఇందులో ఎగుమతులు 37 బిలియన్‌ డాలర్లుగా ఉన్నాయి.

30 శాతం వ్యాపారంపై ప్రభావం: అమెరికా టారిఫ్‌ల కారణంగా సహజ వజ్రాల పాలిషింగ్‌ పరిశ్రమ 28–30% మేర (12.5 బిలియన్‌ డాలర్లు) ఆదాయం కోల్పోవచ్చని క్రిసిల్‌ రేటింగ్స్‌ వెల్లడించింది. 2024–25లో దేశ సహజ వజ్రాల పాలిషింగ్‌ పరిశ్రమ ఆదాయం 16 బిలియన్‌ డాలర్లుగా ఉన్నట్టు తెలిపింది. అమెరికా, చైనాలో డిమాండ్‌ బలహీనపడడం, ల్యాబ్‌లో తయారైన కృత్రిమ వజ్రాల నుంచి పోటీతో గత మూడు ఆర్థిక సంవత్సరాల నుంచి దేశీ సహజ వజ్రాల పాలిషింగ్‌ పరిశ్రమ ఆదాయం 40% మేర తగ్గినట్టు క్రిసిల్‌ రేటింగ్స్‌ వివరించింది. పాలిష్డ్‌ వజ్రాల పరిశ్రమకు 80 శాతం ఆదాయం ఎగుమతుల నుంచే వస్తోందని.. భారత ఎగుమతుల్లో 35 శాతం వాటాతో అమెరికా కీలక మార్కెట్‌గా ఉన్నట్టు గుర్తు చేసింది.

టైరు... బేజారు!

భారత టైర్ల పరిశ్రమకు అమెరికా భారీ టారిఫ్‌లు పెద్ద ప్రతికూలమని ఆటోమొబైల్‌ టైర్ల తయారీదారుల సంఘం (ఏటీఎంఏ) పేర్కొంది. ప్రభుత్వం నుంచి విధానపరమైన మద్దతు కోసం డిమాండ్‌ చేసింది. అధిక శాతం టైర్ల ఎగుమతులపై 50 శాతం టరిఫ్‌లు అమలు కానుండగా, కొన్నింటికి 25 శాతం టారిఫ్‌ వర్తించనుంది. భారత టైర్ల ఎగుమతుల్లో ఒక్క అమెరికా వాటాయే 17% ఉండడం గమనార్హం. 2024–25లో మొత్తం టైర్ల ఎగుమతుల విలువ రూ.25,000 కోట్లుగా ఉంది.

అమెరికా టారిఫ్‌ బెదిరింపులకు లొంగకూడదు

మారుతీ చైర్మన్‌ ఆర్‌సీ భార్గవ పిలుపు



న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌ల బెదిరింపులకు భారత్‌ తలొగ్గరాదని ఆటోమొబైల్‌ దిగ్గజం మారుతీ సుజుకీ చైర్మన్‌ ఆర్‌సీ భార్గవ చెప్పారు. ఇలాంటి వాటికి ప్రజలంతా ఐక్యంగా ఎదురు నిలవాలని, దేశ గౌరవాన్ని కాపాడుకోవాలని ఆయన పేర్కొన్నారు. కంపెనీ 44వ వార్షిక సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న సందర్భంగా భార్గవ ఈ విషయాలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ దౌత్యపరమైన అంశాల్లో తొలిసారిగా టారిఫ్‌లను ప్రయోగించడం ద్వారా సంప్రదాయ విధానాలు, సంబంధాల విషయంలో దేశాలను పునరాలోచనలో పడేశారన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వానికి మద్దతుగా నిల్చి, దేశ పరువు ప్రతిష్టలను కాపాడుకోవాల్సిన బాధ్యత భారతీయులపై ఉందని భార్గవ తెలిపారు. అమెరికా మార్కెట్లో మన ఉత్పత్తులకు డిమాండ్‌ పడిపోయేలా, ట్రంప్‌ సర్కారు భారత ఎగుమతులపై సుంకాలను ఏకంగా 50 శాతానికి పెంచేసిన సంగతి తెలిసిందే. మరోవైపు, దేశీయంగా వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంలో సంస్కరణలు వేగవంతమైన వృద్ధికి, ఉద్యోగాల కల్పనకి దోహదపడుతుందని భార్గవ తెలిపారు. సంస్కరణలతో చిన్న కార్లపై జీఎస్‌టీ 18%కి తగ్గుతుందని ఆశిస్తున్నామని, అయితే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదే జరిగితే చిన్న కార్ల మార్కెట్‌ మళ్లీ పుంజుకోగలదని భార్గవ చెప్పారు.

స్కూటర్లకు ప్రత్యామ్నాయంగా చిన్న కార్లు..

దేశ జనాభాలో సింహభాగం ప్రజలు వ్యక్తిగత అవసరాల కోసం అత్యంత రిస్కులతో కూడుకున్న ద్విచక్ర వాహనాలపైనే ఆధారపడుతుంటారని భార్గవ చెప్పారు. ఈ నేపథ్యంలో స్కూటర్లకు ప్రత్యామ్నాయంగా ఉండే చిన్న కార్లను ప్రవేశపెట్టే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. 1950లలో 'కీయి' కార్లను ప్రవేశపెట్టడం ద్వారా జపాన్‌ ఇలాంటి సమస్యను పరిష్కరించిందని తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్

సింధు సంచలనం

ప్రపంచ రెండో ర్యాంకర్‌ వాంగ్‌ జి యిపై గెలుపు

- క్వార్టర్‌ ఫైనల్లోకి భారత స్టార్‌ షట్లర్‌
- డబుల్స్‌లో సాత్విక్‌–చిరాగ్‌ జోడీ ముందంజ



పారిస్‌: సత్తాకు సవాల్‌గా నిలిచిన మ్యాచ్‌లో భారత స్టార్‌ షట్లర్‌ పీవీ సింధు తన ప్రతాపాన్ని చూపించింది. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా సాధికారిక ఆటతీరుతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. తద్వారా ప్రపంచ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రపంచ రెండో ర్యాంకర్‌ వాంగ్‌ జి యి (చైనా)తో గురువారం జరిగిన మహిళల సింగిల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్‌ సింధు 21–19, 21–15తో గెలిచింది. 48 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధు రెండు గేముల్లోనూ నిలకడగా ఆడింది. గతంలో వాంగ్‌ జి యిపై రెండుసార్లు గెలిచి, రెండుసార్లు ఓడిపోయిన సింధు ఐదో ప్రయత్నంలో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. తొలి గేమ్‌లో ఒకదశలో 6–2తో ముందంజ వేసిన సింధు... ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని 11–6కు పెంచుకుంది. ఈ దశలో వాంగ్‌ జి యి వరుసగా ఆరు పాయింట్లు నెగ్గి 12–11తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత వాంగ్‌ జి యి 19–17తో తొలి గేమ్‌ సొంతం చేసుకునేందుకు రెండు పాయింట్ల దూరంలో నిలిచింది. అయితే సింధు ఆందోళన చెందకుండా, తన అనుభవాన్నంత రంగరించి ఆడి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి తొలి గేమ్‌ను 21–19తో దక్కించుకుంది. రెండో గేమ్‌ ఆరంభంలో ఇద్దరూ హోరాహోరీగా పోరాడారు. స్కోరు 6–6 వద్ద సింధు ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఐదు పాయింట్లు సాధించి 11–6తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం వాంగ్‌ జి యి తేరుకొని ఆధిక్యం అంతరం ఒక పాయింట్‌కు తగ్గించింది. స్కోరు 12–11 వద్ద సింధు మళ్లీ విజృంభించి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 16–11తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న సింధు విజయాన్ని ఖాయం చేసుకుంది. క్వార్టర్‌ ఫైనల్లో తొమ్మిదో ర్యాంకర్‌ పుత్రి కుసుమ వర్దిని (ఇండోనేసియా)తో సింధు ఆడుతుంది.

పురుషుల డబుల్స్‌ విభాగంలో సాత్విక్‌ సాయిరాజ్‌–చిరాగ్‌ శెట్టి (భారత్‌) జోడీ క్వార్టర్‌ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ప్రిక్వార్టర్‌ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంక్‌ సాత్విక్‌–చిరాగ్‌ ద్వయం 19–21, 21–15, 21–17తో ప్రపంచ ఆరో ర్యాంక్‌ లియాంగ్‌ వె కెంగ్‌–వాంగ్‌ చాంగ్‌ (చైనా) జోడీని బోల్తా కొట్టించింది. మరోవైపు మిక్స్‌డ్‌ డబుల్స్‌ విభాగంలో ధ్రువ్‌ కపిల–తనీషా క్రాస్టో (భారత్‌) జోడీ కూడా సంచలన విజయంతో క్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఐదో ర్యాంక్‌ జంట టాంగ్‌ చున్‌ మాన్‌–సెయింగ్‌ సుయెట్‌ (హాంకాంగ్‌)తో జరిగిన ప్రిక్వార్టర్‌ ఫైనల్లో ధ్రువ్‌–తనీషా జోడీ 19–21, 21–12, 21–15తో గెలిచింది.

ప్రణయ్‌కు నిరాశ

పురుషుల సింగిల్స్‌ విభాగంలో 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌ కాంస్య పతక విజేత, భారత స్టార్‌ ప్రణయ్‌ పోరాటం ముగిసింది. రెండో రౌండ్‌లో ప్రపంచ 34వ ర్యాంకర్‌ ప్రణయ్‌ 8–21, 21–17, 21–23తో ప్రపంచ రెండో ర్యాంకర్‌ ఆంటోన్సెన్‌ (డెన్మార్క్‌) చేతిలో ఓడిపోయాడు. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్‌ మూడు మ్యాచ్‌ పాయింట్లు చేజార్చుకోవడం గమనార్హం.



విన్నర్స్‌ ట్రోఫీతో 12 జట్ల కెప్టెన్‌లు

విశాఖతీరంలో కబడ్డీ కూత

నేటి నుంచి ప్రొ కబడ్డీ లీగ్‌ 12వ సీజన్‌

- తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌తో తమిళ్‌ తలైవాస్‌ 'ఢీ'
- రాత్రి 8 గంటల నుంచి స్టార్‌ స్పోర్ట్స్‌, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

విశాఖ స్పోర్ట్స్‌: భారత్‌లో ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌ (ఐపీఎల్‌) తర్వాత ఆ స్థాయిలో కాకపోయినా... చెప్పుకోదగిన స్థాయిలో అభిమానుల్ని సంపాదించుకున్న లీగ్‌ ప్రొ కబడ్డీ లీగ్‌ (పీకేఎల్‌). గత 11 ఏళ్లుగా కబడ్డీ ప్రేక్షకుల్ని విశేషంగా అలరిస్తున్న పీకేఎల్‌ 12వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. నేడు 'జాతీయ క్రీడా దినోత్సవం' రోజున ఉక్కు నగరం విశాఖపట్నంలో కబడ్డీ కూత మొదలు కానుంది. ప్రతీ రోజు రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. తొలి పోరు తెలుగు టైటాన్స్‌, తమిళ్‌ తలైవాస్‌ మధ్య జరుగుతుంది. తర్వాత రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్‌తో పుణేరి పల్టన్‌ తలపడుతుంది. గత సీజన్లలా కాకుండా కొత్త షోకులతో ఈ సీజన్‌ పోటీలు జరుగుతాయి. మ్యాచ్‌ 'టై'తో కాకుండా ఫలితంలో ముగించేందుకు టై–బ్రేకర్‌ను తీసుకొచ్చారు. లీగ్‌ దశ తర్వాత పాయింట్ల పట్టికలో తొలి 4 జట్లు కాకుండా మొత్తం 8 జట్లు టైటిల్‌ రేసులో ఉండేలా ప్లే ఆఫ్స్‌ను మార్చారు. ఫుట్‌బాల్‌లో పెనాల్టీ షూటౌట్‌ తరహా ఐదు రెయిడ్‌ల షూటౌట్‌ను ఇకపై చూడొచ్చు.

జయజయధ్వానాలతో...

సీజన్‌ ప్రారంభానికి ముందు గురువారం లీగ్‌లో పాల్గొనే 12 ఫ్రాంచైజీల కెప్టెన్లు భారత సాయుధ బలగాలకు జేజేలు పలికారు. ఇందులో భాగంగా విశాఖ తీరంలో ఉన్న 'ఐఎన్‌ఎస్‌ కుర్సురా' జలాంతర్గామిని 12 జట్ల కెప్టెన్లు సందర్శించారు. ఈ సబ్‌మెరైన్‌ 1971లో జరిగిన భారత్‌–పాకిస్తాన్‌ యుద్ధంలో భారత్‌ విజయంలో కీలక పాత్ర పోషించింది.

హైదరాబాద్‌లో 'కూత' లేదు

ఈ సీజన్‌ లీగ్‌ దశను నాలుగు వేదికల్లో నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో ఒక్క మ్యాచ్‌ను ఏర్పాటు చేయలేదు. తెలుగు టైటాన్స్‌ ఆడే మ్యాచ్‌లన్నీ వైజాగ్‌కు తరలించారు. ఈ అంచె పోటీలు సెప్టెంబర్‌ 11న ముగిశాక... జైపూర్‌లో 12 నుంచి 28 వరకు జరుగుతాయి. ఆ మరుసటి రోజే చెన్నై అంచె పోటీలు మొదలై అక్టోబర్‌ 10న ముగుస్తాయి. ఆఖరి లీగ్‌ దశ పోటీలు ఢిల్లీలో 11 నుంచి 23 వరకు జరుగుతాయి.

బరిలో 12 ఫ్రాంచైజీలివే...

తెలుగు టైటాన్స్‌, బెంగాల్‌ వారియర్స్‌, బెంగళూరు బుల్స్‌, దబాంగ్‌ ఢిల్లీ, గుజరాత్‌ జెయింట్స్‌, హరియాణా స్టీలర్స్‌, జైపూర్‌ పింక్‌పాంథర్స్‌, పట్నా పైరేట్స్‌, పుణేరి పల్టన్‌, తమిళ్‌ తలైవాస్‌, యు ముంబా, యూపీ యోధాస్‌.

లీగ్‌ దశలో 108 మ్యాచ్‌లు

మారిన ఫార్మాట్‌లో 12వ సీజన్‌ను నిర్వహిస్తారు. లీగ్‌ దశలో 108 మ్యాచ్‌లు జరుగుతాయి. 12 ఫ్రాంచైజీలు 18 మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి. గెలిచిన జట్టుకు 2 పాయింట్లు. ఓడితే పాయింట్‌ ఉండదు. బోనస్‌ పాయింట్‌ను ఎత్తేశారు. కొత్త టై–బ్రేక్‌ పద్ధతిలో స్కోరు సమమైతే గోల్డెన్‌ రెయిడ్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

విడివిడిగా దుబాయ్‌కు...

సెప్టెంబర్‌ 4న చేరనున్న టీమిండియా

న్యూఢిల్లీ: ఆసియా కప్‌ టి20 క్రికెట్‌ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత పురుషుల క్రికెట్‌ జట్టు సభ్యులు సెప్టెంబర్‌ 4న దుబాయ్‌కు చేరుకోనున్నారు. జట్టుగా కాకుండా ఒక్కొక్క ఆటగాడు తమ సొంత నగరాల నుంచి విడివిడిగా దుబాయ్‌కు వెళ్లనున్నారు. సెప్టెంబర్‌ 4న అందరూ చేరుకున్న తర్వాత 5 నుంచి టీమ్‌ ప్రాక్టీస్‌ మొదలవుతుంది. 10న భారత జట్టు ఆతిథ్య యునైటెడ్‌ అరబ్‌ ఎమిరేట్స్‌ (యూఏఈ)తో తమ తొలి మ్యాచ్‌ ఆడనుంది. సాధారణంగా విదేశాల్లో ఆడేందుకు వెళ్లే ముందు టీమ్‌ మొత్తం ముంబైలో ఒక్క చోటికి ఒకే సారి ప్రయాణించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి మాత్రం దీనిని మార్చినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆటగాళ్ల సౌకర్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు సభ్యుడొకరు వెల్లడించారు. 'తమ అనుకూలత ప్రకారం కొంత మంది ముంబై నుంచే వెళతారు. కానీ అందరినీ అక్కడికే పిలవడంలో అర్థం లేదు. పైగా ఇతర అంతర్జాతీయ వేదికలతో పోలిస్తే దుబాయ్‌ స్వల్ప దూరమే. కాబట్టి అందరికీ తమ ప్రయాణాన్ని ఎంచుకునే అవకాశం కల్పించాం' అని ఆయన చెప్పారు. ఆసియా కప్‌కు ఎంపికైన 15 మంది సభ్యులు కొందరు ప్రస్తుతం విరామంలో ఉండగా, మరి కొందరు దులీప్‌ ట్రోఫీ దేశవాళీ టోర్నీలో ఆడుతున్నారు. ఈ టోర్నీ కోసం స్టాండ్‌బైగా ఎంపికైన క్రికెటర్లు దుబాయ్‌కు వెళతారా లేదా అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు.

- సింక్‌ఫీల్డ్‌ కప్‌ చెస్‌ టోర్నీ రన్నరప్‌ ప్రజ్ఞానంద
- ఆసియా షూటింగ్‌ చాంపియన్‌షిప్‌ వివరాలు
- యూఎస్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టోర్నీ ఫలితాలు

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్‌ స్పోర్ట్స్‌ ఈ-పేపర్‌లో

ప్రపంచ 'బెర్త్‌' లక్ష్యంగా...

ఆసియాకప్‌ హాకీ టోర్నీ బరిలో భారత జట్టు

- నేడు తొలి పోరులో చైనాతో 'ఢీ'
- మధ్యాహ్నం 3 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఆసియాకప్‌ ట్రోఫీతో ఎనిమిది జట్ల కెప్టెన్‌లు

రాజ్‌గిర్‌ (బిహార్‌): వచ్చే ఏడాది బెల్జియం–నెదర్లాండ్స్‌ వేదికగా జరిగే ప్రపంచకప్‌ టోర్నీకి అర్హత సాధించాలనే లక్ష్యంతో... నేడు మొదలయ్యే ఆసియా కప్‌లో భారత పురుషుల హాకీ జట్టు బరిలోకి దిగనుంది. ఆసియా కప్‌ విజేత జట్టు ప్రపంచకప్‌ టోర్నీకి నేరుగా అర్హత పొందుతుంది. శుక్రవారం మొదలయ్యే ఆసియా కప్‌ పూల్‌ 'ఎ' తొలి మ్యాచ్‌లో చైనాతో భారత్‌ తలపడుతుంది. ఇటీవల జరిగిన యూరోపియన్‌ అంచె ప్రొలీగ్‌లో భారత్‌ పేలవ ప్రదర్శనతో నిరాశపరిచింది. 8 మ్యాచ్‌లాడితే ఏకంగా ఏడింట పరాజయాన్నే మూటగట్టుకుంది. అయితే తాజా ఆసియా కప్‌ పరిస్థితులను ఐరోపా జట్లు, పరిస్థితులతో పోల్చలేం. కానీ అక్కడ తలెత్తిన లోటుపాట్లను మాత్రం ఇక్కడా కొనసాగిస్తే మాత్రం మూల్యం తప్పదు. హర్మన్‌ప్రీత్‌ సింగ్‌ సారథ్యంలో భారత్‌ డిఫెన్స్‌లో దుర్భేద్యంగా మారాలి. పెనాల్టీ కార్నర్లను గోల్‌గా మలిచే నైపుణ్యాన్ని పెంచుకోవాలి. గోల్‌కీపింగ్‌ కూడా పటిష్టం కావాలి. రిటైరైన దిగ్గజ గోల్‌కీపర్‌ శ్రీజేశ్‌ స్థానంలో ఆడుతున్న కృషన్‌ బహదూర్‌ పాఠక్‌, సూరజ్‌ కర్కేరా ఇంకా చాలా మెరుగవ్వాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇలా అన్ని రంగాల్లో మెరుగైతేనే మేటి జట్లను నిలువరించగలం. యూరోపియన్‌ అంచెలో ఎదురైన పరాజయాల భారాన్ని తగ్గించుకోగలం. మిడ్‌ఫీల్డ్‌లో రాజిందర్‌ సింగ్‌, రాజ్‌ కుమార్‌ పాల్‌, మన్‌ప్రీత్‌, హార్దిక్‌ సింగ్‌, వివేక్‌ సాగర్‌లు మరింత బాధ్యత కనబరిస్తేనే ఆసియా కప్‌లో ప్రత్యర్థి జట్లపై పైచేయి సాధిస్తాం. ఆసియా కప్‌లో భారత్‌, చైనాలున్న పూల్‌ 'ఎ'లో జపాన్‌, కజకిస్తాన్‌ మిగతా జట్లు కాగా... పూల్‌ 'బి'లో దక్షిణ కొరియా, మలేసియా, బంగ్లాదేశ్‌, చైనీస్‌ తైపీ జట్లున్నాయి.

టీజీసీఎస్‌బీ పనితీరు భేష్



- సైబర్ నేరాల నియంత్రణపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రశంస
- అన్ని రాష్ట్రాలు ఈ విధానాలు పాటించేలా చూడాలని కేంద్రానికి సూచన

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) పనితీరును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రశంసించింది. 'సైబర్ నేరాలు – ధోరణులు, రక్షణలు, నియంత్రణ'అనే అంశంపై పార్లమెంటుకు ఇటీవల సమర్పించిన నివేదికలో బీజేపీ ఎంపీ రాధా మోహన్‌దాస్ అగర్వాల్ నేతృత్వంలోని కమిటీ టీజీసీఎస్‌బీ పనితీరును ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఆన్‌లైన్ బెదిరింపుల నుంచి పౌరులను రక్షించడంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్న రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర, కేరళతోపాటు తెలంగాణ ఉన్నట్టు తెలిపింది. దేశమంతటా సైబర్ నేర నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ పద్ధతులను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని సూచించింది. ఏప్రిల్, 2024 నుంచి టీజీసీఎస్‌బీ 472 కేసులు నమోదుచేసి, 160 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేయడాన్ని కమిటీ ప్రశంసించింది. వివిధ సైబర్ నేరాలలో పాల్గొన్న 800 మందికి పైగా నేరస్థులను గుర్తించడంతోపాటు రూ.283 కోట్ల విలువైన మోసాలను నిరోధించడంలో టీజీసీఎస్‌బీ చురుకైన పాత్ర పోషించినట్టు తెలిపింది. సైబర్‌నేరాల కట్టడికి జాతీయస్థాయి చట్టాల అవసరాన్ని నొక్కి చెబుతూ, ఇందుకు హోం మంత్రిత్వ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

జపాన్ పరిశోధకుల కోసం

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

- టీ వర్క్స్‌తో టోహోకోకి సంస్థ ఒప్పందం
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి



మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఎంవోయూ పత్రాలు చూపిస్తున్న టోహోకోకి గ్లోబల్ బిజినెస్ హెడ్ టకుయా, టీ వర్క్స్ సీఈఓ జోగిందర్

సాక్షి, హైదరాబాద్: జపాన్ పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధకుల కోసం 'టీ వర్క్స్'లో ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. సెమీ కండక్టర్ల తయారీలో కీలకమైన కెమికల్, మెకానికల్ పాలిషింగ్ (సీఎంపీ) టెక్నాలజీని స్థానికంగా అందుబాటులోకి తెచ్చేందుకు జపాన్‌కు చెందిన 'టోహోకోకి సెయిసాకుషో'సంస్థ ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ సంస్థ భారత్‌లో తొలిసారి రూ.8 కోట్ల పెట్టుబడితో సీఎంపీ ప్యాడ్ హబ్‌ను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో టోహోకోకి, టీ వర్క్స్ మధ్య గురువారం ఒప్పందం కుదిరింది. టోహోకోకి సంస్థ గ్లోబల్ బిజినెస్ హెడ్ టకుయా నిషిమురా, టి వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. సెమీ కండక్టర్ పరిశ్రమకు విడిభాగాలు అందించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. ప్రస్తుత ఒప్పందం వల్ల రాష్ట్రంలో సీఎంపీ ప్యాడ్‌లను సొంతంగా తయారు చేసుకునే సాంకేతిక నైపుణ్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. సీఎంపీ ప్యాడ్‌ల తయారీ రంగంలో సుమారు 300 మంది నిపుణులను తయారు చేయడం లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

న్యాయ శాఖ కార్యదర్శిగా పాపిరెడ్డి



ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర న్యాయ శాఖ కార్య దర్శిగా మహబూబ్‌నగ ర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి బి.పాపిరెడ్డి నియమితు లయ్యారు. హైకోర్టు సిఫార్సు మేరకు ఆయనను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూ టేషన్‌పై వచ్చే పాపిరెడ్డి.. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఏడాదిపాటు ఆ విధుల్లో కొనసా గుతారని పేర్కొన్నారు. గతంలో న్యాయ శాఖ కార్యదర్శిగా పనిచేసిన తిరుపతి డిప్యూటేషన్ ముగియడంతో గత వారం రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో తాత్కాలిక ఇన్‌చార్జిగా న్యాయశాఖ అదనపు కార్యదర్శి సునీతకు బాధ్య తలు అప్పగించిన విషయం తెలిసిందే. పాపిరె డ్డి స్వగ్రామం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డబిల్‌పూర్. 2001లో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి బా ర్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యా రు. 2005లో కార్మిక చట్టాలపై ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. 2013 వరకు హైదరాబాద్ సివిల్, క్రిమినల్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. 2012లో జిల్లా న్యాయమూర్తిగా ఎంపికయ్యా రు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు (2013–17), నందిగామ (2017–18), విశాఖపట్నం సీబీఐ కోర్టులో (ఆగస్టు, 2018–డిసెంబర్ 2018) జడ్జిగా పనిచేశారు. 2019 నుంచి తెలంగాణ కేడర్‌లో విధులు ప్రారంభించారు. 2019- 20లో మెదక్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జిగా పదోన్నతి పొందారు. హైదరాబాద్‌లో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి (2022–23)గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జిగా ఉన్నారు.

మెడికల్ సర్టిఫికెట్లకు రూ. లక్ష లంచం

ముగ్గురిని అరెస్ట్ చేసిన సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్ : మెడికల్ డి క్యాటరైజేషన్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు రూ.లక్ష లంచం తీసుకున్న కేసులో సీబీఐ అధికారులు ముగ్గురిని అరెస్టు చేశారు. విజయవాడ రైల్వే హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ హస్మత్ అలీ, సీనియర్ ప్యాసింజర్ ట్రైన్ మేనేజర్ శివనాగప్రసాద్‌తోపాటు ఎస్‌కే.రసూల్‌ను అరెస్ట్ చేసి బుధవారం విజయవాడలోని సీబీఐ కోర్టులో హాజరుపరిచారు. రూ.90 వేలు, రూ.10 వేలు రెండు దఫాలుగా జరిపిన ఆన్‌లైన్ పేమెంట్స్‌ను సీబీఐ స్వాధీనం చేసుకుంది. రైల్వేశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు మెడికల్ డి క్యాటరైజేషన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రసూల్.. రైల్వే ఉద్యోగులైన హస్మత్ అలీ, శివనాగ ప్రసాద్ కలిసి అవినీతికి పాల్పడుతున్నట్టు సీబీఐ గుర్తించింది. సంచాలన్ భవన్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న రసూల్ తన స్నేహితుడు అలీబాబాతో కలిసి ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీనివాస్ సత్యనారాయణ ద్వారా ఫిట్ సర్టిఫికెట్ జారీ చేయించేందుకు యత్నించినట్టు తేలింది. సమాచారం అందుకున్న విశాఖపట్నం జోన్ సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ మేరకు విశాఖపట్నం సీబీఐ డీఎస్పీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లాలాగూడలోని రైల్వే హాస్పిటల్‌లో సోదాలు చేశారు. అంబులెన్స్ పార్కింగ్ ప్రాంతంలో ఎస్‌కే.రసూల్‌ను అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ పేమెంట్స్‌పై రసూల్ ఇచ్చిన సమాచారం ఆధారంగా శివనాగ ప్రసాద్, హస్మత్ అలీలను కూడా అరెస్ట్ చేశారు. అలీబాబా, డాక్టర్ సత్యనారాయణలను ఈ కేసులో సాక్షులుగా చేర్చారు.

భారతీయుల్లో వీసా గుబులు

విద్యార్థి వీసాకు నాలుగేళ్ల పరిమితి విధించే యోచనలో అమెరికా

సాక్షి, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలతో అక్కడున్న భారత విద్యార్థులు వణికిపోతున్నారు. వీసా గడువును పరిమితం చేయాలంటూ తీసుకున్న తాజా నిర్ణయం మరింత ఆందోళన కల్గిస్తోంది. ప్రస్తుతం అమెరికాలో విద్యార్థులకు ఎలాంటి నిర్దేశిత గడువు లేదు. ఇప్పుడు దీన్ని నాలుగేళ్లకు కుదించాలని ప్రభుత్వం చేసిన ప్రతిపాదన మన విద్యార్థుల్లో గుబులు రేపుతోంది. ఎంఎస్ కోసం వెళ్లిన విద్యార్థులు రెండేళ్లల్లో కోర్సు పూర్తి చేసి.. ఆ తర్వాత ఉద్యోగం కోసం వెతుక్కుంటారు. కనీసం మూడేళ్లల్లో ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడతారు. అప్పుడు వారికి హెచ్1బీ వీసా వస్తుంది. కొంతకాలం ఉద్యోగం చేయడానికి అవకాశం లభిస్తుంది. ఇప్పుడు వీసా గడువును నాలుగేళ్లకు తగ్గించడంతో ఎంఎస్ పూర్తయ్యాక, ఉద్యోగానికి అవసరమైన శిక్షణ, ఉద్యోగం వెతుక్కునే సమయం ఉండదని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికే పార్ట్ టైం ఉద్యోగాలకు కోత పడ్డాయి. ట్రంప్ నిర్ణయాలతో భారత్‌లో ఉంటున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ గుబులు పెరుగుతోంది.



తగ్గుతున్న అవకాశాలు

అమెరికాలో భారత విద్యార్థులు ప్రధానంగా పార్ట్ టైం ఉద్యోగాలపైనే ఆశలు పెట్టుకుంటారు. 2019కి ముందుతో పోలిస్తే 2023లో ఈ అవకాశాలు 40 శాతం తగ్గినట్లు విదేశాంగ శాఖ అధ్యయనంలో గుర్తించారు. ఈ దేశానికి అగ్రరాజ్యానికి ఏటా 3 లక్షల మంది భారతీయులు వెళ్తుంటే, వారిలో 1.25 లక్షల మంది తెలుగువారే ఉండటం గమనార్హం. కరోనా తర్వాత ఏ దేశం నుంచి వచ్చిన విద్యార్థి అయినా పార్ట్ టైం ఉద్యోగం కోసం పోటీపడాల్సి వస్తోంది. దీంతో అవకాశాలకు భారీగా గండి పడింది. అమెరికాతో పోలిస్తే కెనడాలో 30 శాతం ఫీజులు తక్కువ ఉంటాయి. అయితే ఇటీవల కెనడాలోనూ అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. వీసా నిబంధనల్లో మార్పులు వచ్చాయి. 2020–21లో చదువు పూర్తి చేసిన వారికి పార్ట్‌టైం ఉద్యోగాలు వచ్చే పరిస్థితి తగ్గింది. బ్రిటిష్, ఆస్ట్రేలియాలోనూ విద్యార్థులకు ప్రతికూల పరిస్థితులే కన్పిస్తున్నాయి.

ఏటా రూ.5.86 లక్షల కోట్లు

అమెరికాలో రెండేళ్లుగా ఖర్చులు పెరిగాయి. రూపాయి మారక విలువతో పోలిస్తే యూనివర్సిటీ ఫీజులూ పెరిగాయి. సాధారణంగా ఏదో ఒక పార్ట్ టైం ఉద్యోగం చేసుకుంటూ విద్యార్థులు నెట్టుకొస్తారు. ట్రంప్ వచ్చిన తర్వాత ఈ అవకాశం లేకుండా పోయింది. దీంతో ఇండియాలో ఉన్న తల్లిదండ్రులను డబ్బు కోసం ఆశ్రయిస్తున్నారు. అమెరికాకు పంపేటప్పుడే అప్పులు చేసిన తల్లిదండ్రులు మళ్లీ అప్పులు తేవడం కష్టంగా ఉంటోంది. ఏటా పర్యాటకులతో కలిపి 13 లక్షల మంది భారతీయులు విదేశాలకు వెళ్తున్నారు. 2025లో ఈ సంఖ్య 15 లక్షలకు చేరింది. భారత్ నుంచి విదేశాలకు చదువుల కోసం వెళ్లే వారిలో 38 శాతం తెలంగాణ, ఏపీ వారే ఉన్నారు. 2019లో విదేశీ విద్యకు భారతీయులు చేసిన ఖర్చు రూ.3.10 లక్షల కోట్లు. 2022 నాటికి ఇది 9 శాతం పెరిగి రూ. 3.93 లక్షల కోట్లకు చేరింది. 2024లో ఖర్చు సుమారు 10 శాతం మేర పెరిగి, రూ. 4.32 లక్షల కోట్లకు చేరింది. ఇటీవల కాలంలో రూపాయి విలువ ఊహించని విధంగా పతనమవ్వడంతో 2025లో విదేశాలకు వెళ్లే విద్యార్థులపై 14 శాతం అదనపు భారం పడే వీలుంది. అంటే, రూ. 5.86 లక్షల కోట్ల మేర విదేశీ విద్య భారం ఉండొచ్చని విదేశాంగ శాఖ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఫీజు తలచుకుంటేనే...

విదేశీ విశ్వవిద్యాలయాల్లో ట్యూషన్ ఫీజులు తలుచుకుంటే భారత విద్యార్థులు వణికిపోతున్నారు. విదేశాలకు వెళ్లే ముందు అమెరికా వర్సిటీల ఫీజు సగటున రూ.24 లక్షలుగా అంచనా వేసుకున్నారు. డాలర్ ముందు రూపాయి నేల చూపులు చూడటంతో ఇప్పుడు కనీసం రూ.2.40 లక్షలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. కెనడాలో రూ.1.60 లక్షలు, ఆస్ట్రేలియాలో రూ.1.80 లక్షలు, బ్రిటన్‌లో రూ.2 లక్షలకు పైగా అదనపు వ్యయం సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు వసతి ఖర్చులు ఏకంగా 10–15 శాతం పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఇతర సంక్షోభాల నేపథ్యంలో జీవన వ్యయం ఏకంగా 22 శాతం పెరిగింది. దీంతో విద్యార్థుల అంచనాలు తారుమారయ్యాయి. అమెరికాలో రూ.43 లక్షలతో ఎంఎస్ పూర్తవుతుందని అంచనా వేసుకుంటే, ఇప్పుడది రూ.52 లక్షల వరకూ వెళ్లిందని అంటున్నారు. ఆర్థిక పరిస్థితి ఇలా ఉంటే.. వీసా కాలపరిమితి తగ్గించడంతో భవిష్యత్‌లో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన మొదలైంది.

వీసా కుదిస్తే ఎలా..

ఎంఎస్ పూర్తయ్యే వరకూ ఉద్యోగం చేయకూడదు. ఎంఎస్ అయ్యాక ఉద్యోగానికి అవసరమైన శిక్షణ తీసుకుంటారు. అప్పటికే మూడున్నరేళ్లు పూర్తవుతుంది. మిగిలిన ఆరు నెలల్లో ఉద్యోగం రాకపోతే హెచ్–1బీ వీసా రాదు. కాబట్టి భారత్‌కు వెళ్లాలి. నేను ఎంఎస్ పూర్తి చేసి ఆరు నెలలైంది. రూ.40 లక్షల అప్పు చేశాను. మరో రెండేళ్లు ఉద్యోగం రాకపోతే అప్పు రెట్టింపవుతుంది. అమెరికా ఆంక్షల వల్ల నలిగిపోతున్నాం.

– మందన బాల శేఖర్
(అమెరికాలో భారత విద్యార్థి)

ఇది అన్యాయం

ట్రంప్ వచ్చిన తర్వాత ఐటీ రంగం పరిస్థితి మారిపోయింది. ప్రతి కంపెనీలోనూ అనుభవం అడుగుతున్నారు. విద్య పూర్తి చేసిన వెంటనే అనుభవం ఎలా వస్తుంది. అనుభవం కోసం కనీసం ఏడాది ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉండాలి. వీసా కాలపరిమితి కుదిస్తే విద్యార్థులు నష్టపోతారు.

– పరమేశ్వర్ త్రిపాఠి
(అమెరికాలో భారత కన్సల్టెన్సీ నిర్వాహకుడు)

విదేశీ విద్యకు అవుతున్న సగటు వ్యయం (రూ. లక్షల్లో)

దేశం	వర్సిటీ ఫీజు	వసతి	ఇతరాలు	మొత్తం
అమెరికా	24.90	9.90	8.30	43.10
ఆస్ట్రేలియా	18.20	10.70	13.20	42.10
బ్రిటన్	21.50	8.05	7.70	37.25
కెనడా	16.60	8.30	7.40	32.30

ఏ సంవత్సరంలో ఎంతమంది భారతీయులు ఏ దేశానికి వెళ్లారంటే..

సంవత్సరం	అమెరికా	కెనడా	ఆస్ట్రేలియా	బ్రిటన్	ఇతర దేశాలు	మొత్తం
2019	1,93,124	2,17,410	75,791	52,545	5,51,130	10,90,000
2022	2,10,000	2,00,000	1,00,009	1,50,000	5,20,379	11,80,388
2025	3,00,000	2,50,000	1,70,000	1,70,000	6,10,000	15,00,000

(అంచనా)

విద్యార్థి వీసా నాలుగేళ్లే!

▶ మొదటి పేజీ తరువాయి

కేవలం 90 రోజుల వీసాకు మాత్రమే అనుమతిస్తారు.

గత ఏడాది 16 లక్షల మంది విదేశీ విద్యార్థులు

2024లో ఎఫ్–వీసాలపై దాదాపు 16 లక్షల మంది అంతర్జాతీయ విద్యార్థులు అమెరికా వచ్చారు. అలాగే, దాదాపు 3,55,000 మంది కల్చరల్ ఎక్స్చేంజ్ సందర్శకులు, 13వేల మంది జర్నలిస్టులు అమెరికాకు వచ్చారు. 'విదేశీ విద్యార్థులు, ఇతర వీసా హోల్డర్లు అమెరికాలో నిరవధికంగా ఉండటానికి చాలాకాలంగా అనుమతి ఉంది. దీనివల్ల భద్రతాపరమైన ముప్పు తలెత్తుతోంది. పన్ను చెల్లింపుదారుల డబ్బు వృథాగా ఖర్చవుతోంది. అమెరికా పౌరులకు ఇది నష్టాన్ని కలిగిస్తోంది. ఈ ప్రతిపాదిత కొత్త నిబంధనలు వీసా హోల్డర్లు అమెరికాలో ఉండే సమయాన్ని పరిమితం చేస్తాయి. దుర్వినియోగం ఆగిపోతుంది. విదేశీ విద్యార్థులను పర్యవేక్షించడానికి ప్రభుత్వంపై భారం తగ్గుతుంది' అని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతినిధి ఒకరు తెలిపారు. అయితే దీనిపై ప్రజల అభిప్రాయాలకు 30 రోజుల గడువు ఉంటుంది.

అప్పట్లో పెద్దఎత్తున వ్యతిరేకత

డొనాల్డ్ ట్రంప్ మొదటి పదవీకాలం 2020లో కూడా ఇలాంటి ప్రతిపాదనే వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 4,300కి పైగా సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అంతర్జాతీయ విద్యావేత్తల సమూహమైన ఎన్‌ఏఎఫ్‌ఎస్‌ఏ దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది. దానిని విరమించుకోవాలని విజ్ఞప్తి చేసింది. అయితే.. బైడెన్ ప్రభుత్వం దానిని ఉపసంహరించుకుంది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక వలసదారులపై అణచివేత తీవ్రం చేసిన విషయం తెలిసిందే. ఆ చర్యల్లో భాగంగానే ఈ కొత్త ప్రతిపాదన వచ్చింది. ఇప్పటికే వేలాది మంది విద్యార్థి వీసాలు, గ్రీన్ కార్డులు రద్దయ్యాయి. లక్షలాది మంది వలసదారులు చట్టపరమైన హోదా కోల్పోయారు.

ఎయిర్‌పోర్టు సేవల నిర్వాహకులతో

యూఎస్ కాన్సుల్ జనరల్ భేటీ



సాక్షి, హైదరాబాద్ : రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సేవలందిస్తున్న విమానాశ్రయ సేవల నిర్వాహకులతో యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ గురువారం సమావేశమయ్యారు. కాన్సులేట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో లారా విలియమ్స్ పలు అంశాలపై వారితో చర్చించారు. ప్రధానంగా విదేశాలలో ఉన్న అమెరికా పౌరుల భద్రతపై ఈ భేటీలో చర్చించినట్లు లారా విలియమ్స్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఎత్తివేత

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రకాల చెక్‌పోస్టులను ఎత్తేస్తూ రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రవాణా సరుకు వాహనాలకు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి సులభంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అందులో భాగంగా పలు రాష్ట్రాల్లో వీటిని తొలగించారు. చెక్‌పోస్టులు కాకుండా ఆన్‌లైన్‌లో తాత్కాలికంగా అనుమతులు పొందడానికి మోటార్ వెహికిల్ ట్యాక్స్‌ను ఆన్‌లైన్‌లోనే చెల్లించే విధానం అమలులోకి తీసుకొస్తున్నట్టు తెలిపారు. పొరుగు రాష్ట్రాలతోనూ, రాష్ట్ర రవాణా శాఖ, జిల్లాల సరిహద్దుల్లోని గూడ్స్, ప్యాసింజర్ వాహనాలకు ప్రవేశాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి ప్రచారం కల్పించాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్దనున్న ఎంవీఐలు, అసిస్టెంట్ ఎంవీఐ సిబ్బందిని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి మారుస్తున్నట్టు వికాస్‌రాజ్ వెల్లడించారు. పన్నులు ఎగవేసే వాహనాలపై ప్రత్యేక నిఘా వేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చెక్‌పోస్టులు పూర్తిగా తొలగించినా, ఆరునెలల పాటు మొబైల్ స్క్వాడ్‌లు పనిచేస్తాయని చెప్పారు.

మిగిలిపోయిన బీటెక్ సీట్లకు నేడు కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ 'ఈఏపీసెట్– 2025'కన్వీనర్ కోటాలో ఎంపీసీ స్ట్రీమ్ లోని బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో నాన్ ఫార్మర్ కోటాలో మిగిలిపోయిన సీట్లకి శుక్రవారం ఉదయం 10 గంటలకు స్పాట్ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఇ.సీహెచ్ విద్యాసాగర్ ప్రకటించారు. రాజేంద్రనగర్‌లోని పీజేటీఏయూ పరీక్షల నియంత్రణ విభాగంలో ఈ కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. స్పాట్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం అభ్యర్థులు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www. pjtau.edu.in ని సందర్శించవచ్చని రిజిస్ట్రార్ సూచించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

కల్యాణ కానుక... ఎప్పుడందేనో!

నెలలు గడుస్తున్నా తేలని అర్హత

- తహసీల్దార్ కార్యాలయాల్లోనే నెలలపాటు పెండింగ్
- ఈ ఏడాది ఇప్పటివరకు 1,22,555 దరఖాస్తులు
- వీటిలో అర్హతలు తేల్చి, మంజూరీ చేసినవి 28,817
- తహసీల్దార్ కార్యాలయాల్లో 61,377 పెండింగ్
- అర్హత నిర్ధారణ స్థాయిలో ఉన్నవి 21,694



సాక్షి, హైదరాబాద్: కల్యాణ కానుక పథకం లబ్ధిదారుల దరఖాస్తులకు నెలలు గడుస్తున్నా మోక్షం లభించటం లేదు. కొన్ని వేల దరఖాస్తులు కనీసం పరిశీలనకు కూడా నోచుకోవడం లేదు. లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ప్రయోజనం ఉండటం లేదు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి సాయం అందించాలన్న సదుద్దేశంతో ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లక్ష్యం క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది.

పరిశీలనకే రాని సగం దరఖాస్తులు

ఈ ఏడాదిలో ఇప్పటివరకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద రాష్ట్రవ్యాప్తంగా 1,22,555 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 61,377 దరఖాస్తులు కనీసం పరిశీలన కూడా పూర్తి చేసుకోలేదు. ఈ పథకాల కోసం ముందుగా ఈపాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేయాలి. ఆ దరఖాస్తులు సంబంధిత తహసీల్దార్ కార్యాలయానికి చేరతాయి. వాటిని తహసీల్దార్ స్థాయిలో పరిశీలన చేసి, క్షేత్రస్థాయిలో మళ్లీ పరిశీలించిన తర్వాత రెవెన్యూ సిబ్బంది ఇచ్చే నివేదిక ఆధారంగా మంజూరీకి సిఫారసు చేస్తారు. స్థానిక ఎమ్మెల్యే అనుమతితో ఆర్డీఓ స్థాయిలో అర్హతను నిర్ధారిస్తారు. ఆ తర్వాత లబ్ధిదారుకు ఆర్థికసాయం చెక్కును అందిస్తారు. అయితే, దరఖాస్తులు మొదటి దశలోనే నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 73,923 దరఖాస్తులు రాగా.. గతేడాది క్యారీఫార్వర్డ్ చేసినవి 48,632 కలిపి మొత్తం 1,22,555 ఉన్నాయి. ఇందులో 61,377 దరఖాస్తులు ఇంకా పరిశీలన దశలోనే ఉన్నాయి. రెవెన్యూ సిబ్బంది పనిభారంతో ఈ దరఖాస్తుల పరిశీలన నెమ్మదించిందని అధికారులు చెబుతున్నారు. పరిశీలించిన వాటిలో అర్హత నిర్ధారణ స్థాయిలో 21,694 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 28,817 దరఖాస్తులకు అర్హత నిర్ధారణ పూర్తయ్యింది. వీటిలో దాదాపు 10 వేల మందికి చెక్కులు పంపిణీ చేయగా, మరో 18 వేల దరఖాస్తుదారులకు త్వరలో చెక్కులు పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది 422 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి.

నిధులున్నా నిర్లక్ష్యమే

రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కోసం సంబంధిత శాఖలకు బడ్జెట్‌లో రూ.1,000 కోట్లకు పైగా కేటాయించింది. దీంతో అందుబాటులో ఉన్నంత మేరకు నిధులు విడుదల చేయాలని సంక్షేమ శాఖలు భావించాయి. బడ్జెట్ విడుదలకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ నత్తనడకన సాగుతుండడంతో తీవ్ర ఆలస్యమవుతోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి బడ్జెట్ డిమాండ్ 1,225.15 కోట్లు ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ.110.10 కోట్ల విలువైన చెక్కులు మాత్రమే లబ్ధిదారులకు అందించారు.

కేటగిరీలవారీగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బకాయిలు (రూ.కోట్లలో)

సంక్షేమ శాఖ	రిజిస్ట్రేషన్లు	పెండింగ్ (తహసీల్దార్)	పెండింగ్ (ఫర్ శాంక్షన్)	శ్రాంక్షన్	బడ్జెట్ డిమాండ్ (రూ.కోట్లలో)
బీసీ	66,600	32,151	13,276	19,507	665.76
మైనారిటీ	22,993	10,354	2,753	3,662	229.94
ఎస్సీ	18,419	10,004	3,092	3,468	184.08
ఎస్టీ	14,543	8,868	2,573	2,180	145.37
మొత్తం	1,22,555	61,377	21,694	28,817	1,225.15

బీజేపీ డీఎన్ఏలోనే గలీజ్ ఆలోచనలు

- సామ రామ్మోహన్ రెడ్డి
- పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

సాక్షి, హైదరాబాద్: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌పై బీజేపీ ఎమ్మెల్యేల అనుచిత వ్యాఖ్యలు వారి స్థాయికి తగవని టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్ కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ డీఎన్ఏలోనే గలీజ్ ఆలోచనలు ఉన్నాయని, వాటిని పీసీసీకి ఆపాదిస్తున్నారని ధ్వజమెత్తారు. పీసీసీ అధ్యక్షుడు తాను ఉండే మహాలక్ష్మి మెడోస్‌లో అయినా, ఎమ్మెల్యే క్వార్టర్‌లో అయినా ప్రజలకు, కార్యకర్తలకు బహిరంగంగానే అందుబాటులో ఉంటారని, వాస్తవాలను తెలుసుకోకుండా బట్టకాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది బీజేపీ చిల్లర రాజకీయం అని, గతంలో బీజేపీ ప్లీనరీని హైదరాబాద్‌లో పెట్టుకొని, హోటళ్లలో ఎవరెవరు, ఏం చేశారో తాము మాట్లాడితే బాగుండదని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు తన పాదయాత్రలో బీజేపీ నీచపు రాజకీయాలను, తెలంగాణకు చేస్తున్న ద్రోహాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళుతున్నందున అక్కసుతో ఆయనను వ్యక్తిగతంగా బద్నాం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు బెయిల్

సాక్షి, హైదరాబాద్: అవినీతి ఆరోపణలతో 45 రోజులకుపైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష వ్యక్తిగత బాండ్‌తోపాటు ఇద్దరు పూచీకత్తులను ట్రయల్‌కోర్టులో సమర్పించాలని ఆదేశించింది. ప్రతీ సోమవారం ఉదయం 11 గంటలకు సంబంధిత ఎస్‌హెచ్‌వో ముందు 8 వారాలపాటు లేదా చార్జిషీట్ దాఖలు చేసే వరకు (ఏది ముందైతే అది) అవసరమైనప్పుడల్లా హాజరుకావాలని స్పష్టం చేసింది. ఐపీఎల్ టికెట్ల వ్యవహారంలో వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన సీఐడీ అధికారులు.. జగన్మోహన్‌రావును గత నెలలో అరెస్టు చేసిన విషయం విదితమే. చట్టవిరుద్ధంగా తనను అరెస్టు చేశారని, బెయిల్ మంజూరు చేయాలంటూ జగన్మోహన్‌రావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. దర్యాప్తు అధికారి ఇప్పటికే 18 మంది సాక్షులను విచారించారని, చాలా సాక్ష్యాలను సేకరించారని అభిప్రాయపడ్డారు. పిటిషనర్‌కు మరింత జైలుశిక్ష విధించడం అనవసరమని వ్యాఖ్యానిస్తూ.. బెయిల్ మంజూరు చేశారు.

3న 'ఏఐ'పై జర్నలిస్టులకు వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ)పై జర్నలిస్టులకు వచ్చే నెల 3న వర్క్‌షాప్ నిర్వహించనున్నామని తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి ఎస్. వెంకటేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తెలంగాణ మీడియా అకాడమీలో ఈ వర్క్‌షాప్ ఉంటుందన్నారు. ఆసక్తిగల జర్నలిస్టులు వచ్చే 2వ తేదీలోగా 7093600977 నంబర్‌కు వాట్సాప్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

హైదరాబాద్-ఢిల్లీ మధ్య సీఎంను ఫుట్‌బాల్‌లా తిప్పుతున్నారు

బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఎద్దేవా

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అధిష్టానం హైదరాబాద్-ఢిల్లీ మధ్య ముఖ్యమంత్రిని ఫుట్‌బాల్‌లా తిప్పుతోందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఎద్దేవా చేశారు. ఇది కాంగ్రెస్‌లోని అంతర్గత విభజనకు, రేవంత్‌రెడ్డి ప్రస్తుత పరిస్థితికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ తెలంగాణ నుంచి 'బిహార్ ట్యాక్స్' వసూలుకు సీఎంను ఒక పావులా తిప్పుతోందని ఆయన ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒకవైపు ప్రకృతి వైపరీత్యం కారణంగా ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తున్న సమయంలో కాంగ్రెస్ నేతలు మాత్రం ఓటు చోరీ అంటూ కొత్త ప్రచారం ఎంచుకున్నారని మండిపడ్డారు.

రాజ్యాంగం కోసం నిలబడే వ్యక్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

అందుకే ఉపరాష్ట్రపతిగా ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు: వామపక్షాలు

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగం కోసం నిబద్ధతతో నిలబడే వ్యక్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అని వామపక్ష పార్టీలు కొనియాడాయి. రాజ్యాంగంపట్ల నిబద్ధతగల అత్యున్నత న్యాయనిపుణులలో ఒకరైన ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయాలని పిలుపునిచ్చాయి. కాంగ్రెస్ తెలంగాణ ఎంపీల కన్వీనర్ మల్లు రవితో కలిసి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో సీపీఐ జాతీయ నేతలను కలిసి ఎన్నికల్లో తనకు అనుకూలంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కార్యదర్శి నారాయణ, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బాబీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం డి. రాజా మీడియాతో మాట్లాడుతూ దేశం మితవాద, మతతత్వ ఫాసిస్ట్ శక్తుల ముప్పును ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో సమాఖ్య పాలనా వ్యవస్థపై దాడి జరుగుతున్న వేళ ఉపరాష్ట్రపతి ఎన్నిక చాలా కీలకంగా మారిందన్నారు. దేశం క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ఈ ఎన్నిక ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఈ సమయంలో రాజ్యాంగ విలువలను, రాజ్యాంగ నైతికతను సమర్థంగా నిర్వహించే వ్యక్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. అందుకే ఆయనకు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. 'ఉపరాష్ట్రపతి పదవికి ధన్కడ్ ఎందుకు రాజీనామా చేశారో? ఈ అంశం అనేక ప్రశ్నలకు తావిస్తుంది. దీనిపై ఇప్పటివరకు కేంద్రం వద్ద సమాధానం లేదు. ఇప్పుడు ఆయన ఎక్కడ ఉన్నారో... ఏమి చేస్తున్నారో... ఆయనకు ఏమి జరిగిందో తెలియదు' అని రాజా వ్యాఖ్యానించారు.

స్పోర్ట్స్ హబ్ బోర్డు సూచనలివే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో క్రీడల అభివృద్ధికి కొత్తగా ఏర్పాటైన స్పోర్ట్స్ హబ్ బోర్డు గురువారం జరిగిన తొలి సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వానికి కీలక సూచనలు చేసింది. అవి ఏమిటంటే..

- ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా చేస్తే ఫలితాలు వాటంతట అవే వస్తాయని దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ అభిప్రాయపడ్డారు.
- ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా వ్యాయామ ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని మాజీ ఒలింపిక్ షూటింగ్ గోల్డ్ మెడలిస్ట్ అభినవ్ బింద్రా అన్నారు.
- గ్రామస్థాయి నుంచి దశలవారీగా పోటీలు ఉంటే మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందని మాజీ బ్యాడ్మింటన్ స్టార్, ప్రముఖ కోచ్ పుల్లెల గోపీచంద్ సూచించారు.
- క్రీడా యూనివర్సిటీలో ఫిజియోథెరపిస్ట్ కోర్సులను ప్రారంభించాలని హీరో చిరంజీవి కోడలు, ప్రముఖ ఆంత్రప్రెన్యూర్ ఉపాసన కామినేని కోరారు.
- ప్రపంచంలోనే ప్రముఖ కంపెనీల సీఈఓలు ఇక్కడి నుంచే ఉన్నారు కాబట్టి వారి సేవలను క్రీడాభివృద్ధికి ఉపయోగించుకోవచ్చని.. క్రీడా సామగ్రిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచితే మెరుగైన ఫలితాలు వస్తాయని శశిధర్ సూచించారు.
- ఇంగ్లండ్ తరహాలో అన్ని క్రీడల్లో లీగ్‌లు నిర్వహిస్తే బాగుంటుందని భారత మాజీ ఫుట్‌బాల్ స్టార్ బైచుంగ్ భూటియా అభిప్రాయపడ్డారు.
- ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న స్టేడియాలను సమర్థంగా వినియోగించుకోవడం ముఖ్యమని రవికాంత్‌రెడ్డి చెప్పారు.

దొంగ ఓట్ల 'పంచాయితీ'

తెలంగాణలోనూ కుంపటి రాజేసిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

బిహార్‌లో వర్కవుట్ అవుతోందనే అంచనాల నేపథ్యంలోనేనా?

- తిప్పికొట్టేందుకు కమలనాథుల యత్నాలు
- రాజకీయ కాక రేపుతున్న ఎంపీ డీకే.అరుణ కామెంట్స్



సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికలు సమీపిస్తున్నవేళ రాష్ట్రంలో దొంగ ఓట్ల పంచాయితీ రాజుకుంటోంది. రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతోనే గెలిచారన్న అనుమానాలున్నాయని, ఇందుకు తగిన ఆధారాలు కూడా తమ వద్ద ఉన్నాయంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. బీజేపీ లక్ష్యంగా మహేశ్‌గౌడ్ ప్రయోగించిన ఈ ఓట్‌చోరీ అస్త్రం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

వ్యూహాత్మకంగానే...!

టీపీసీసీ చీఫ్ వ్యూహాత్మకంగా ఈ వ్యాఖ్యలు చేశారని, బీజేపీని టార్గెట్ చేశారని రాజకీయ వర్గాలంటున్నాయి. ఓట్‌చోరీ ఆరోపణల తర్వాత బిహార్‌లో రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్‌చోరీ పాదయాత్ర రాజకీయంగా మేలు చేస్తోందనే భావనలో కాంగ్రెస్ పార్టీ ఉంది. తెలంగాణలో కూడా వర్కవుట్ అవుతుందనే అంచనాల నేపథ్యంతోపాటు అన్ని రాష్ట్రాల్లో బీజేపీకి దొంగ ఓట్ల పార్టీగా ముద్ర వేయాలనే ఏఐసీసీ వ్యూహంలో భాగంగానే నేరుగా బీజేపీ ఎంపీలను టార్గెట్ చేసి మహేశ్‌గౌడ్ మాట్లాడారనే చర్చ జరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్, ఈ-కార్ రేసింగ్ తదితర అంశాల్లో బీఆర్ఎస్ ఇమేజ్‌ని దెబ్బతీయగలిగామని కాంగ్రెస్ భావిస్తోందని, దీనికి తోడు బీజేపీని కూడా సందిగ్ధావస్థలోకి నెట్టడమే ఆ పార్టీ ముందున్న తక్షణ కర్తవ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వ్యూహాల్లో భాగంగానే మహేశ్‌గౌడ్ వ్యాఖ్యలు కనిపిస్తున్నాయని రాజకీయ వర్గాలంటున్నాయి. ఈ అంశంపై రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేత ఒకరు మాట్లాడుతూ 'తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ అంచనా వేస్తోంది. బీఆర్ఎస్ వైఖరి కూడా అదే విధంగా ఉంది. కారు పార్టీ నేతలు కమలం పార్టీ వైపు చూస్తున్నారు. కొందరు ఇప్పటికే వెళ్లిపోగా, మరికొందరు బీజేపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీని ఆదిలోనే నిలువరించాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన విషయంలో ఆయా వర్గాల దృష్టిలో బీజేపీని దోషిగా నిలబెట్టగలిగాం. ఇప్పుడు ఆ పార్టీ దొంగ ఓట్లతో గెలుస్తోందనే అభిప్రాయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లగలగాలి. అప్పుడే రాజకీయంగా మాకు ప్రయోజనం ఉంటుంది. అందులో భాగంగానే మా అధ్యక్షుడు కమలం పార్టీని గురిపెట్టి ఓట్‌చోరీ అస్త్రాన్ని ఎక్కుపెట్టారు.' అని వ్యాఖ్యానించారు.

టిట్ ఫర్ టాట్

మహేశ్‌గౌడ్ వ్యాఖ్యలను బీజేపీ కూడా సీరియస్‌గా తీసుకుంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావుతోపాటు ఎంపీలు డీకే.అరుణ, ధర్మపురి అర్వింద్‌లు ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ఓటమిని ఒప్పుకోకుండా సాకులు చెప్పుకుంటోందని, మరి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన 8 మంది ఎంపీలు కూడా దొంగ ఓట్లతోనే గెలిచారా అని వారు ప్రశ్నించారు. దొంగ ఓట్లు ఇప్పుడు లేవని, గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వారి ప్రధాన మంత్రుల హయాంలోనే దొంగ ఓట్లు ఉండేవని, ఇప్పుడు కూడా దొంగ ఓట్లున్నాయని వారు భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. డీకే.అరుణ చేసిన సవాల్ రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. తెలంగాణలో దొంగ ఓట్ల సంగతి వెంటనే తేల్చాలని, అప్పుడు దొంగలెవరో.. దోషులెవరో తేలుతుందని, దొంగే దొంగా దొంగా అని అరిచినట్టు మతి భ్రమించి మాట్లాడుతున్నారంటూ బీజేపీ ఫైర్ బ్రాండ్ చేసిన వ్యాఖ్యలు రెండు జాతీయ పార్టీల నడుమ రాజకీయ వేడి పుట్టిస్తున్నాయి. అయితే, ఈ దొంగ ఓట్ల పంచాయితీ ఇంతటితో ఆగిపోయేది కాదని, రాహుల్‌గాంధీ యాత్రకు సంఘీభావంగా బిహార్‌కు వెళ్లిన కాంగ్రెస్ నేతలు రాష్ట్రానికి తిరిగి వచ్చిన తర్వాత ఈనెల 30న జూబ్లీహిల్స్ వేదికగా జరిగే ఓట్ చోరీ-గద్దీ చోడో సభతో మరింత ముదురుతుందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పేదల కోసం సంక్షేమ కార్యక్రమాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన 'అందుబాటులో ప్రజా ప్రతినిధులు'కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వివిధ సమస్యలపై పేదల నుంచి వినతిపత్రాలు తీసుకుని, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రుణమాఫీ సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి మొదటి దఫాలో 3,500 ఇళ్లు ఇస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, కనీసం రేషన్ కార్డుల్లో పేర్ల మార్పు కూడా చేయలేదని అన్నారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ మాత్రమే గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. లక్ష కోట్ల రూపాయలు వెచ్చించి కాళేశ్వరం కట్టిన పాత పాలకులు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును మాత్రం పూర్తి చేయలేదని, దక్షిణ తెలంగాణను పూర్తిగా విస్మరించారని ఆయన ధ్వజమెత్తారు.

ప్రతిదాన్నీ రాజకీయం చేయడమే హరీశ్‌రావు పని

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: ప్రకృతి వైపరీత్యాలను కూడా రాజకీయం చేసే నీచ సంస్కృతి నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు బయటకు రావాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. సీఎల్‌పీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హరీశ్‌రావుకు రాజకీయాలే పరమావధిగా మారాయని, ప్రతి విషయాన్ని రాజకీయం చేసి బాధితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల ఏకంగా 40 సెంటిమీటర్ల వర్షం కురిసిందని, ప్రభుత్వం ముందు జాగ్రత్తగా రెడ్ అలర్ట్ ప్రకటించిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయ కార్యక్రమాలు చేపట్టిందని, మంత్రులు, కలెక్టర్లు, అధికారులు, పోలీసులు క్షేత్రస్థాయిలో ఉండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పరిస్థితి ఈ స్థాయిలో ఉంటే హరీశ్‌రావు మాత్రం రాజకీయ విమర్శలు మొదలు పెట్టారని విమర్శించారు. హెలికాప్టర్ వాడటం లేదని ఆయన విమర్శిస్తున్నారని, వాతావరణం సహకరించకపోవడం వల్లనే హెలికాప్టర్ వాడలేదని వివరించారు. ప్రభుత్వం రంగంలోకి దిగి ఆర్మీ హెలికాప్టర్‌ను ఇప్పటికే తీసుకొచ్చిందని, హరీశ్‌రావుకు చేతనైతే బాధితులకు అండగా నిలబడాలని అన్నారు.

వర్షాలతో రైతులు అల్లాడుతుంటే ఆటలపై సమీక్షలా?

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వర్షాలతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే సీఎం, మంత్రులు మాత్రం ఆటలపై సమీక్షలు జరుపుతున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చాలా రోజుల నుంచి హెచ్చరిస్తున్నా.. ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. ఇంతకుముందు యూరియా దొరకక, ఇప్పుడు వందలాది ఎకరాల్లో పంటలు నీటి మునిగితే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. యూరియా ఇవ్వకుండా, వర్షాలతో ఇబ్బందిపడినా రైతులను ఆదుకోని సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల రాజీనామా చేయాలని సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

చేప పిల్లల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

రైతుల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రెండేళ్ల కిందట సరఫరా చేసిన చేప పిల్లల పెండింగ్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వాన్ని మత్స్య రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మాసబ్‌ట్యాంక్ మత్స్యభవన్ ముందు రైతులు అర్ధనగ్న ఆందోళన చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 75 కోట్లు, 2024-25కు సంబంధించి రూ.34 కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్లులకోసం అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రభుత్వం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. తక్షణమే తమ బకాయిలు చెల్లించాలని, లేకపోతే కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు

- జూనియర్ అసిస్టెంట్ నుంచి సీటీవోల వరకు అనుమతినిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- పరిపాలనా సౌలభ్యం కోసం 239 పోస్టులకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: వాణిజ్య పన్నుల శాఖలో ప్రత్యేక బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. పరిపాలనా సౌలభ్యంతో పాటు ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 239 పోస్టుల్లో బదిలీలకు అనుమతినిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎం.రిజ్వీ ఈనెల 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం సీటీవో (2), డీసీటీవో (20), ఏసీటీవో (49), సీనియర్ అసిస్టెంట్లు (66), జూనియర్ అసిస్టెంట్ల (102) పోస్టులకు బదిలీలు జరగనున్నాయి. ఈ బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు నాలుగేళ్ల తర్వాత ఓ కొలిక్కి వచ్చింది. వాస్తవానికి, విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ద్వారా ఎక్కువ ఆదాయం వచ్చే సర్కిళ్లు.. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత కొన్ని నిర్వీర్యమయిపోయాయి. అక్కడ పన్ను ఎక్కువగా వచ్చే పరిస్థితి లేకపోవడంతో కొందరు ఉద్యోగులను డిప్యూటేషన్లపై ఇతర సర్కిళ్లలో నియమించారు. దీంతో పాటు గతంలో ఉన్న సరిహద్దు చెక్‌పోస్టుల సిబ్బందిని కూడా ఇదే పద్ధతిలో వినియోగించుకునేవారు. అయితే, ఆయా ఉద్యోగుల టీఏ, డీఏ, ఇతర అలవెన్సుల విషయంలో ఇబ్బందులు ఏర్పడేవి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని పోస్టులకు నేరుగా బదిలీ ఉత్తర్వులు ఇవ్వడం, విడిపోయిన సర్కిళ్లలో సిబ్బందిని పూర్తిస్థాయిలో సర్దుబాటు చేయడం కోసం జీఎస్టీ కమిషనర్ కె. హరిత చూపిన చొరవతో ప్రభుత్వం అనుమతినిచ్చిందని ఆ శాఖ వర్గాలు చెపుతున్నాయి.

మా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దండు రామచందర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమకు నామమాత్రపు వైద్య సదుపాయాలు అందిస్తున్నారని.. అతితక్కువ పెన్షన్ ఉంటోందన్నారు. నల్ల బంగారాన్ని జాతికి అందించిన ఉద్యోగులపట్ల నిర్లక్ష్యం తగదన్నారు. తమ సంక్షేమం గురించి అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం కలగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

నేడు పెనుమాక జరీబు రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు

తాడికొండ : ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్డీఏ) పరిధిలో భూ సమీకరణ కింద భూములిచ్చిన పెనుమాక జరీబు రైతులకు శుక్రవారం రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించనున్నారు. విజయవాడ లెనిన్ సెంటరులోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సా.4 గంటల నుంచి ఈ–లాటరీ నిర్వహిస్తున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 52 మంది రైతులకు 84 ప్లాట్లను కేటాయిస్తామని.. వీటిలో 51 రెసిడెన్షియల్ ప్లాట్లు కాగా 33 కమర్షియల్ ప్లాట్లు అని పేర్కొంది. సంబంధిత రైతులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కార్యాలయం తెలిపింది.

రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచండి

చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతులకు అవసరమైన యూరియాతోపాటు ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం సీఎంను.. రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కలిశారు. తెలంగాణలో ఏపీ స్థానికత, ఏపీలో తెలంగాణ స్థానికత కలిగిన హోంగార్డులు వారి స్వరాష్ట్రాలకు బదిలీ కాకపోవడంతో వారు చాలా అవకాశాలు కోల్పోతున్నారని రామకృష్ణ చెప్పారు. కానిస్టేబుల్ సెలెక్షన్స్ విషయంలో వీరికి రెండు రాష్ట్రాల్లోనూ సమస్యలు ఎదురవుతున్నాయని.. వీరిని వారి స్వరాష్ట్రాలకు బదిలీ చేయించేలా చొరవ తీసుకోవాలని కూడా వారు సీఎంను కోరారు.

గొర్రెల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి

సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని, వారి రక్షణ, సంక్షేమానికి చట్టం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను గురువారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో గొర్రెలు, మేకలు దాదాపు 3.5 కోట్ల వరకు ఉన్నాయని, వాటిపై 42 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవనం గడుపుతున్నాయన్నారు. ప్రతి పెంపకందారునికి 50శాతం రాయితీతో రూ.5 లక్షలు రుణం అందించాలని, షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ 70శాతం నుంచి 90శాతం పెంచాలని, జీవాలకు ఉచిత బీమా కల్పించాలని లేఖలో కోరారు.

క్రీడా ప్రోత్సాహకాల నిధులు విడుదల

సాక్షి, అమరావతి: క్రీడా ప్రోత్సాహకాల నిధులు రూ.4.90 కోట్లు విడుదల చేసినట్టు శాప్ చైర్మన్ రవినాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తద్వారా 43 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు లబ్ధి చేకూరినట్టు చెప్పారు.

పదోన్నతులకు ముందే రిక్వెస్ట్ బదిలీలు చేయండి

ప్రభుత్వానికి ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతుల కల్పనకు ముందే రిక్వెస్ట్ బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. పాత విధానం ప్రకారమే ఏడీ, పీడీ విభాగాల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ పదోన్నతులు కలిపించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదర్, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రానికి మరో 10,350 టన్నుల యూరియా

మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు మరో 10,350 టన్నుల యూరియాను రాష్ట్రానికి కేంద్రం కేటాయించిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) కంపెనీ ద్వారా ఈ ఎరువులను గంగవరం పోర్టులో దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. తక్షణ అవసరం ఉన్న ప్రాంతాలకు ఈ యూరియాను సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావును మంత్రి ఆదేశించారు. సెప్టెంబర్ నెల మొదటి వారంలో కాకినాడ పోర్టుకు మరో 25 వేల టన్నులకు తక్కువ కాకుండా యూరియా సరఫరాకు కేంద్రం హామీ ఇచ్చినట్టు మంత్రి వెల్లడించారు.

అర్హత ఉన్న అందరికీ పింఛన్ అందాలి: సీఎస్

సాక్షి, అమరావతి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పింఛన్ అందించాలని, లేకపోతే సంబంధిత జిల్లా కలెక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రతినెలా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా, మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా 1.35 లక్షల మందికి నోటీసులు జారీ చేశామని, వారిలో 88,319 మంది అప్పీలు చేసుకున్నట్లు వివరించారు. నెలరోజుల్లో అప్పీళ్లన్నీ పరిష్కరించాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

మహారాష్ట్ర గడ్డ... షెల్ కంపెనీల అడ్డా..!

గడిచిన 27 నెలల్లో 8,329 షెల్ కంపెనీల గుర్తింపు



5,873 షెల్ కంపెనీలతో రెండో స్థానంలో ఢిల్లీ.. ఏపీలో 760 షెల్ కంపెనీల గుర్తింపు

27నెలల్లో దేశవ్యాప్తంగా 40,944 షెల్ కంపెనీలను రద్దు చేసిన కేంద్రం

రాష్ట్రం	రద్దయిన టాప్ 13 షెల్ కంపెనీలు
మహారాష్ట్ర	8,329
ఢిల్లీ	5,873
కర్ణాటక	4,803
తెలంగాణ	3,086
ఉత్తరప్రదేశ్	2,838
తమిళనాడు	2,771
పశ్చిమబెంగాల్	2,216
గుజరాత్	2,097
హరియాణా	1,677
రాజస్థాన్	1,291
కేరళ	1,213
మధ్యప్రదేశ్	1,023
ఆంధ్రప్రదేశ్	760

సాక్షి, అమరావతి: అక్రమ వ్యాపారాలు/తాత్కాలిక వ్యాపార అవసరాల కోసం ఏర్పాటు చేసే షెల్ కంపెనీలకు మహారాష్ట్ర అడ్డాగా మారింది. దేశంలోనే అత్యధిక షెల్ కంపెనీలు మహారాష్ట్రలో ఉన్నట్లు కేంద్ర గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కంపెనీ ఏర్పాటు చేసిన తర్వాత వరుసగా రెండేళ్లు ఎటువంటి వ్యాపార లావాదేవీలు నిర్వహించకపోయినా, దరఖాస్తులు సమర్పించకపోయినా అటువంటి కంపెనీలను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ షెల్ కంపెనీలుగా గుర్తించి రద్దు చేస్తుంది. గడిచిన 27నెలల్లో దేశవ్యాప్తంగా 40,944 షెల్ కంపెనీలను గుర్తించి రద్దు చేసినట్లు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయమంత్రి హర్ష్ మల్హోత్రా రాజ్యసభలో వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై15 నాటికి దేశవ్యాప్తంగా 40,944 కంపెనీల గుర్తింపును రద్దు చేసినట్లు తెలిపారు. ఇందులో అత్యధికంగా ఒక్క మహారాష్ట్రలోనే 8,329 కంపెనీలుండటం గమనార్హం. ఆ తర్వాతి స్థానంలో 5,873 కంపెనీలతో ఢిల్లీ నిలిచింది.

4వస్థానంలో తెలంగాణ

దొంగ కంపెనీల ఏర్పాటులో కర్ణాటక మూడోస్థానంలో నిలవగా తెలంగాణ నాలుగోస్థానంలో నిలిచింది. కర్ణాటకలో గడిచిన 27 నెలల్లో 4,803, తెలంగాణలో 3,086 షెల్ కంపెనీలను గుర్తించి రద్దు చేసినట్లు కేంద్రం పేర్కొంది. ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, గుజరాత్ రాష్ట్రాల్లో రెండువేలకుపైనే షెల్ కంపెనీలున్నాయి. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో 760 షెల్ కంపెనీలను గుర్తించి రద్దు చేసింది. మిగిలిన రాష్ట్రాల్లోను మరికొన్ని కంపెనీలను రద్దుచేసినట్టు కేంద్రం వివరించింది.

మా తెలుగు తల్లికి మల్లెపూదండ...

ప్రపంచంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాషల్లో 15వ స్థానం

భారత్‌లో 81 మిలియన్ల మంది మాట్లాడే అతి పెద్ద భాషగా 4వ స్థానం

నేడు తెలుగు భాషా దినోత్సవం



సాక్షి,అమరావతి: మా తెలుగు తల్లికి మల్లెపూదండ.. మా కన్న తల్లికి మంగళారతులు..అంటూ తెలుగు భాషను..తెలుగు తల్లినీ తలుచుకుంటూ..ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు జరుపుకునే పండుగ ప్రపంచ తెలుగు భాషా దినోత్సవం. వ్యావహారిక భాషా ఉద్యమ నాయకుడు, తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి గ్రాంథికంలో ఉన్న తెలుగును వ్యవహారికంలోకి మార్చేందుకు ఉద్యమించి, విజయం సాధించారు. ఆయన జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటాం. తెలుగు భాషను ప్రోత్సహించడం, తెలుగు ప్రజలలో భాషా చైతన్యాన్ని పెంపొందించడం. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం.

మాతృభాషను సంరక్షించుకుంటేనే భవిష్యత్తు

కేంద్ర హోం శాఖ సర్వే ఆఫ్ ఇండియాతో కలిసి నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం..దేశ వ్యాప్తంగా 19,500 కంటే ఎక్కువ భాషలు, మాండలికాలు ఉన్నట్లు తేలింది. అయితే వీటిలో చాలా వరకూ అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. ఉపాధి అవకాశాలు ప్రపంచంలో ఏ మూలనున్నా వెదికి పట్టుకుంటున్న ఈ రోజుల్లో వివిధ భాషలు నేర్చుకోవడం సర్వసాధారణం. వాటిలో ఆంగ్ల భాష అభ్యాసం అత్యంత అవసరం. దానిని నేర్చుకుంటూనే మాతృ భాషను కూడా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని భాషాభిమానులు, పలువురు పండితులు చెబుతున్నారు. మాతృభాష ద్వారానే మనోవికాసం సాధ్యమని తెలుగు భాషా పండితులు పలు సందర్భాల్లో స్పష్టం చేస్తున్నారు.

మూలభాష మన తెలుగు

ప్రాచీన భాష వాడుక నుంచి కాల క్రమంలో కొత్త భాషలను సృష్టించడం ద్వారా భాషా కుటుంబాలు ఏర్పడ్డాయి. అలా ఏర్పడ్డ ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదే మన తెలుగు. అన్ని భాషలకూ మూలభాషగా తెలుగు గుర్తింపు పొందింది. మన తెలుగును ఆంగ్లేయులు సైతం కొనియాడారు. భాషేతర కవులు తెలుగును కీర్తించారు. సి.పి.బ్రౌన్ తెలుగు తాళపత్ర గ్రంథాలను అనువదించారు. వెనీస్‌కు చెందిన వర్తకుడు నికోలో డా కాంటి తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా వ్యవహరించారు. శ్రీకృష్ణదేవ రాయలు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్నారు. అంతేకాదు ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక ప్రజలు మాట్లాడే భాషల్లో 15 వ స్థానంలో తెలుగు భాష నిలిచింది. మన దేశంలో దాదాపు 81 మిలియన్ల మంది తెలుగు మాట్లాడుతున్నారు. అంటే దేశంలో మాట్లాడే నాలుగో అతి పెద్ద భాషగా మన తెలుగు స్థానం దక్కించుకుంది.

ప్రపంచవ్యాప్తంగా వెలుగులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనే కాకుండా, దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో, వివిధ దేశాల్లో తెలుగువారు విస్తరించి కొన్ని దేశాల్లో ప్రత్యేక సంఘాలుగా ఏర్పడ్డారు. పలు దేశాలు రక్షిత (అధికార) భాషగా కూడా తెలుగును గుర్తించాయి. కొన్ని దేశాల పాఠశాలల్లో ఐచ్ఛిక భాషగానూ అందిస్తున్నాయంటే, తెలుగు భాష, ఆ భాష మాట్లాడే ప్రజల గొప్పదనం అర్థం అవుతుంది.

టీటీడీ చైర్మన్‌గా కొనసాగే అర్హత బీఆర్ నాయుడికి లేదు

తన టీవీ చానల్‌లో బూతుబొమ్మలు ఆడించిన నీచుడు

న్యూజెన్ ఆయిల్ పేరుతో ప్రజల్ని దగా చేసిన మోసగాడు

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డి



సాక్షి, అమరావతి: అత్యంత పవిత్రమైన టీటీడీ చైర్మన్‌గా కొనసాగే అర్హత బీఆర్ నాయుడు వంటి నీచుడికి లేదని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డి మండిపడ్డారు. బుధవారం మీడియాకు విడుదల చేసిన వీడియోలో ఆయన మాట్లాడుతూ.. శ్రీవారిపై భక్తిప్రపత్తులు లేని, దుర్మార్గ మనస్తత్వం కలిగిన బీఆర్ నాయుడికి టీటీడీ చైర్మన్ పదవి అప్పగించిన నాటినుంచీ తిరుమల పవిత్రత మంటగలవడం ప్రారంభమైందన్నారు. టీవీ చానల్ నడుపుతూ అర్ధరాత్రి బూతుబొమ్మలను ప్రసారం చేసిన దుర్మార్గమైన వ్యక్తికి టీటీడీ చైర్మన్ పదవి కట్టబెట్టి సీఎం చంద్రబాబు మహాపాపం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూజెన్, ఆర్థోజెన్ వంటి ఆయిల్స్‌ను ప్రజలకు అంటగట్టి లూటీ చేసిన మోసగాడు అతడని ధ్వజమెత్తారు. తిరుమల కొండపై రాజకీయాలు మాట్లాడుతున్న నికృష్టుడు బీఆర్ నాయుడని ఆక్షేపించారు. ఒక్క క్షణం కూడా ఆ పదవిలో కొనసాగే అర్హత అతడికి లేదని, తక్షణం పదవి నుంచి తొలగించి హిందువుల మనోభావాలు, శ్రీవారి పవిత్రత దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వల్ల తిరుమల పవిత్రతకే కళంకం కలుగుతోందని, నిత్యం అపచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొండమీద బెల్ట్ షాపులు, మాంసాహారం, అన్యమత ప్రచారం, గోమాతల మృత్యువాత, భోజనంలో నాసిరకం పదార్థాలు, మద్యం సేవించి కొండపై వీరంగాలు జరుగుతున్నాయన్నారు. వీటిని నియంత్రించడంలో బీఆర్ నాయుడు విఫలమయ్యారని విమర్శించారు.

వ్యాపార అవసరాల కోసం వాడుకుంటున్నాడు

కనీస వ్యక్తిత్వం, నైతిక విలువలు లేని బీఆర్ నాయుడికి తిరుమల కొండపై అడుగు పెట్టే అర్హతే లేదని వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వ్యాపార అవసరాల కోసం శ్రీవారి సన్నిధిని, టీటీడీ పదవిని వాడుకుంటున్నాడన్నారు. తాజాగా ఓ స్టార్ హోటల్‌కు టీటీడీకి చెందిన విలువైన స్థలాన్ని అప్పగించాడని అన్నారు. మద్యం, మాంసాహారం అమ్మే ఈ హోటల్‌కు శ్రీవారి ఆస్తులను ఎలా కట్టబెట్టాడో బీఆర్ నాయుడు చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ క్లబ్ వేదికగా తన ఇద్దరు కుమారులతో వీఐపీలు, వ్యాపారులకు శ్రీవారి సేవలు చేయిస్తామని రప్పించుకుని వారి ద్వారా తన వ్యాపార అవసరాలను తీర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దొంగల ముఠాగా ఏర్పడి తిరుమల పవిత్రతను తమ స్వార్థానికి, వ్యాపార అవసరాలకు వాడుకుంటున్న నీచుడు బీఆర్ నాయుడని విమర్శించారు. కొండపై వీఐపీ టికెట్ల బ్లాక్ మార్కెట్ దందా నడుపుతున్నాడని, టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి వంటి వారు ఢిల్లీకి శ్రీవారి లడ్డూను తీసుకువెళితే అక్కడి వారు తినబోమని చెప్పినట్లు మాట్లాడించడం బీఆర్ నాయుడు దివాళాకోరుతనానికి నిదర్శనం కాదా అని నిలదీశారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో తిరుమలలో ఏం జరిగిందో.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏం జరుగుతోందోన్న విషయంపై సీబీఐ విచారణకు సిద్ధమా అని సవాల్ చేశారు. బీఆర్ నాయుడి అసమర్థత, నిర్లక్ష్యం వల్ల ఆరుగురు భక్తులు మృతి చెందారని, అటువంటి వ్యక్తిని తక్షణం పదవి నుంచి తప్పించి, టీటీడీ పవిత్రతను కాపాడాలని డిమాండ్ చేశారు.

వక్రతుండాయ.. విభిన్న రూపాయ



అనంతపురం నగరంలోని చిన్మయి నగర్‌లో ఏర్పాటుచేసిన ఆపరేషన్ సిందూర్ వినాయకుడు



విశాఖ రెల్లివీధిలో బైక్ మెకానిక్ రూపంలో ఏర్పాటుచేసిన గణనాథుడు



అనంతపురం బోయవీధిలో ఏర్పాటుచేసిన గరుడపక్షి వినాయకుడు

చంద్రబాబు పచ్చి అవకాశవాది

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

సాక్షి, న్యూఢిల్లీ: రాజకీయాల్లో చంద్రబాబు పచ్చి అవకాశవాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగువాడైన జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి విషయంలో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని మండిపడ్డారు. ఓడిపోయే వ్యక్తిని నిలబెట్టడం ఏమిటని ఇటీవల చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తెలుగు వ్యక్తికి మద్దతు తెలిపి గెలిపించడంలో తప్పేంటని ప్రశ్నించారు. చంద్రబాబును జైల్లో పెట్టిన తర్వాత బీజేపీకి లొంగిపోయాడని విమర్శించారు. గురువారం ఢిల్లీలోని ఏపీ/తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగానికి, రాజ్యాంగ వ్యతిరేక శక్తులకు మధ్య జరుగుతున్న పోరాటంలో చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

'ఎర్ర' ధర నిర్ధారణ బృందంలో మంత్రి నాదెండ్ల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఎర్రచందనం ధర నిర్ధారణ కోసం ఇప్పటికే ఏర్పాటు చేసిన మంత్రుల బృందంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కూడా సభ్యునిగా చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

టారిఫ్‌లతో ఏపీ రొయ్య రైతులకు తీవ్ర నష్టం

చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరిన ఏపీ చాంబర్స్

సాక్షి, అమరావతి: అమెరికాకు ఎగుమతి చేసిన భారత్ రొయ్యలపై ఆ దేశ ప్రభుత్వం 50 శాతం టారిఫ్‌లు విధించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని ఏపీ చాంబర్స్ ఆవేదన వ్యక్తం చేసింది. దేశంలోనే అతిపెద్ద రొయ్య ఎగుమతిదారుగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో రొయ్య సాగు రంగం 2.8 కోట్ల మందికి జీవనోపాధి కల్పిస్తోందని, ఈ టారిఫ్‌తో వీరి జీవనోపాధి ప్రమాదంలో పడిందని పేర్కొంది. దీనిపై కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర వాణిజ్య, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖలను ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు కోరారు. దేశీయ వినియోగం పెంచేందుకు కృషి చేయడంతో పాటు ఈ రంగాన్ని ఆదుకోవాలని గురువారం లేఖ రాశారు.

తలనొప్పే.. పెద్ద 'తలనొప్పి..'



ప్రతి నలుగురిలో ఒకరికి దీర్ఘకాలిక తలనొప్పి, మైగ్రేన్

ఢిల్లీ ఎయిమ్స్, జీబీ పంత్ ఆస్పత్రి వైద్యుల అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: ఆధునిక జీవన శైలి, ఆహారపు అలవాట్లతో రోజు రోజుకు ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ప్రత్యేకించి చదువుకునే పిల్లల నుంచి పెద్దల వరకూ అందరిలోనూ ప్రస్తుతం 'తలనొప్పి' సమస్య సర్వసాధారణంగా మారిపోయింది. మరికొందరి జీవితాలను పార్శ్వపు నొప్పి (మైగ్రేన్) తీవ్రంగా బాధిస్తోంది. పెద్దల్లో ప్రతి నలుగురిలో ఒకరు దీర్ఘకాలిక తలనొప్పి, మైగ్రేన్ సమస్యతో సతమతం అవుతున్నారని ఢిల్లీ ఎయిమ్స్, గోవింద్ వల్లభ్ (జీబీ) పంత్ ఆస్పత్రి వైద్యులు సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనలో తేలింది. 'జర్నల్ ఆఫ్ హెడేక్ అండ్ పెయిన్' శీర్షికన ఈ ఫలితాలు ఇటీవలే ప్రచురితమయ్యాయి.

అధ్యయనానికి సంబంధించి కొన్ని ముఖ్యాంశాలు..

- ఎంపిక చేసిన కొన్ని గృహాల్లోని 18–65 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన 2,066 మంది ఆరోగ్య పరిస్థితిపై అధ్యయనం ప్రాతిపదికన ఈ ఫలితాలు వెలువడ్డాయి.
- ఉదయం మేల్కొనే సమయంలో 5.5 శాతం మంది తలనొప్పితో బాధపడుతున్నారు.
- మైగ్రేన్ సమస్య పురుషులతో పోలిస్తే మహిళల్లో అధికంగా ఉంది.
- చికాకు, ఆందోళన, పని ఒత్తిడి.. తలనొప్పి, మైగ్రేన్ సమస్యను దీర్ఘకాలికంగా మార్చేస్తున్నాయి.

మందులు అతిగా వాడడం వల్లే...

చిన్నపాటి తలనొప్పికే చాలా మంది మందులు వాడటానికి అలవాటు పడుతుంటారు. వైద్యులను సంప్రదించకుండా ఉపశమనం కోసం అతిగా మందుల వాడకంతో తలనొప్పి ఒక సైకిల్‌గా మారుతోంది. దీనివల్లే 4.5 శాతం మంది దీర్ఘకాలిక తలనొప్పిని ఎదుర్కొంటున్నారు. తలనొప్పి ప్రతి నెలా 15 రోజులు, అంతకంటే ఎక్కువ కాలం పాటు పునరావృతమయితే దానిని దీర్ఘకాలిక సమస్యగా భావించాలి.


– ప్రొఫెసర్ డాక్టర్ దేబాశిష్ చౌదరి, న్యూరాలజీ విభాగాధిపతి, జీబీ పంత్ హాస్పిటల్

సామాజిక ఆర్థిక భారంగా...: డబ్ల్యూహెచ్‌వో

తలనొప్పి రుగ్మతలు సామాజిక ఆర్థిక భారంగా మారాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సైతం అభిప్రాయపడింది. ప్రపంచ జనాభాలో 40 శాతం మంది తలనొప్పి రుగ్మతలతో సతమతం అవుతున్నట్టు గతేడాది ప్రకటించింది. మైగ్రేన్, దీర్ఘకాలిక తలనొప్పి సమస్యతో ఉత్పాదకత తగ్గడంతో పాటు, వ్యక్తుల మధ్య సంబంధాలు దెబ్బతింటున్నాయని పేర్కొంది. తలపోటు, మైగ్రేన్ సమస్యలు మానసిక వైకల్యానికి దారితీస్తున్నాయని గ్లోబల్ హెల్త్ ఎస్టిమేట్స్–2019 నివేదిక స్పష్టం చేసింది.

ఆలస్యమైనా... అలరిస్తాం


- చిత్ర పరిశ్రమలో వరుస సినిమాల రిలీజ్‌లు వాయిదా
- ఇండస్ట్రీపై సమ్మె ప్రభావం
- వీఎఫ్‌ఎక్స్ పనులతో వాయిదా పడ్డ భారీ చిత్రాలు


చిరంజీవి

చిత్ర పరిశ్రమలో సినిమాల రిలీజ్‌లు వాయిదా పడటం సాధారణమే. కానీ రిలీజ్‌లు దగ్గర పడుతున్న తరుణంలో విడుదల వాయిదా పడుతున్న సినిమాల సంఖ్య ఇటీవలి కాలంలో టాలీవుడ్‌లో పెరిగింది. ఆగస్టు నెలలో సినీ కార్మికుల సమ్మె ఓ కారణమైతే, భారీ చిత్రాల వీఎఫ్‌ఎక్స్ వర్క్స్‌కి ఎక్కువ టైమ్ పట్టడం మరో కారణం... ఇలా పలు కారణాల వల్ల సినిమా రిలీజ్‌లు వాయిదా పడుతున్నాయి. కానీ అందరు మేకర్స్ చెబుతున్న మాట ఒకటే...'ఆలస్యమైనా... అలరిస్తాం' అని. అలా లేట్ అయినా లేటెస్ట్‌గా వస్తామంటున్న కొన్ని చిత్రాల గురించి ఓ లుక్ వేద్దాం.


ప్రభాస్


బాలకృష్ణ


రవితేజ

వేసవిలో విశ్వంభర

విశ్వంభర చిత్రం ఈ ఏడాది థియేటర్స్‌లోకి రావడం లేదు. ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవికి వాయిదా పడింది. సంక్రాంతి రిలీజ్ వాయిదా పడిన తర్వాత 'విశ్వంభర' చిత్రం ఈ ఏడాది చివర్లో అయినా రిలీజ్ అవుతుందని మెగా ఫ్యాన్స్ ఆశించారు. కానీ క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ అయ్యేది లేదంటూ 'విశ్వంభర' చిత్రం రిలీజ్‌ను వచ్చే వేసవికి వాయిదా వేశారు. వచ్చే ఏప్రిల్‌లో 'విశ్వంభర' చిత్రం విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. చిరంజీవి హీరోగా నటించిన ఈ చిత్రానికి 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించారు. త్రిష హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సోషియో ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ చిత్రంలో ఆంజనేయస్వామి భక్తుడు భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి కనిపిస్తారని, సురభి, ఇషా చావ్లా, రమ్య పసుపులేటి.. చిరంజీవి సిస్టర్స్‌గా కనిపిస్తారని, త్రిష ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. అలాగే ఈ సినిమాలో బాలీవుడ్ నటి మౌనీ రాయ్ ఓ స్పెషల్ సాంగ్ చేశారు. పధ్నాలుగు లోకాలు దాటి హీరో సత్యలోకానికి ఎలా చేరుకున్నాడు? అక్కడ హీరోయిన్‌ను ఎలా కలుసుకున్నాడు? అనే అంశాల నేపథ్యంలో 'విశ్వంభర' సినిమా కథనం సాగుతుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్ర దర్శకుడు వశిష్ఠ పేర్కొన్నాడు. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మించారు.

దసరా బరిలో లేదు

హీరో బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శీను కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'అఖండ 2: తాండవం'. ఈ సినిమాను ఈ దసరా ఫెస్టివల్ సందర్భంగా సెప్టెంబరు 25న రిలీజ్ చేయాలనుకున్నారు మేకర్స్. కానీ దసరా బరి నుంచి 'అఖండ 2' చిత్రం తప్పుకుంది. ఈ విషయాన్ని మేకర్స్ గురువారం అధికారికంగా ప్రకటించారు. వీఎఫ్‌ఎక్స్ పనులు, రీ-రికార్డింగ్ పనులతో పాటు మొత్తం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌కు మరింత సమయం పడుతుందని ఈ కారణంగా 'అఖండ 2' సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నామని, ఈ సినిమా ఎప్పుడొచ్చినా ఓ సెలబ్రేషన్‌లా ఉంటుందని చెబుతూ, 'అఖండ 2' సినిమా రిలీజ్ వాయిదాను గురువారం కన్ఫార్మ్ చేశారు మేకర్స్. కాగా ఈ చిత్రం డిసెంబరులో విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్‌లో రూపొందిన 'అఖండ' సినిమాకు సీక్వెల్‌గా 'అఖండ 2' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

సంక్రాంతి బరిలో...

వచ్చే సంక్రాంతి బరిలో 'ది రాజాసాబ్' చిత్రం నిలిచింది. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ ఫ్యాంటసీ హారర్ కామెడీ యాక్షన్ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటించగా, సంజయ్ దత్, వీటీవీ గణేశ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. తొలుత 'ది రాజాసాబ్' సినిమాను ఏప్రిల్ 10న రిలీజ్ చేయాలనుకున్నారు మేకర్స్. కానీ ఆ తర్వాత డిసెంబరు 5న రిలీజ్ చేస్తామంటూ ప్రకటించారు. తాజాగా 'ది రాజాసాబ్' సినిమాను 2026 జనవరి 9న రిలీజ్ చేస్తున్నట్లుగా ఈ చిత్రనిర్మాత టీజీ విశ్వప్రసాద్ కన్ఫార్మ్ చేశారు. దీంతో డిసెంబరు 5 నుంచి జనవరి 9కి 'ది రాజాసాబ్' సినిమా వాయిదా పడినట్లు, అధికారిక సమాచారం వెల్లడైంది. ఇక తాత-మనవడు నేపథ్యంలో ఈ సినిమా ప్రధాన కథనం సాగుతుందని, ఇటీవల ఓ సందర్భంలో ఈ చిత్రదర్శకుడు మారుతి స్పష్టం చేశారు. ఈ చిత్రంలో సంజయ్‌దత్- ప్రభాస్ తాత-మనవడు పాత్రల్లో కనిపిస్తారని, 'రాజా డీలక్స్' అనే ఓ భవనం నేపథ్యంలో ఈ సినిమా మేజర్ కథనం సాగుతుందని తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ హైదరాబాద్ షూటింగ్ షెడ్యూల్ పూర్తి కాగానే, సెప్టెంబరులో కేరళ వెళుతుంది చిత్ర యూనిట్. అక్కడ ప్రభాస్ పాత్ర తాలూకు ఇంట్రడక్షన్ సాంగ్ తీస్తారట. ఆ నెక్ట్స్ విదేశాల్లో హీరో - హీరోయిన్లపై చిత్రీకరించే డ్యూయెట్ సాంగ్‌లతో 'ది రాజాసాబ్' సినిమా షూటింగ్ ఆల్మోస్ట్ పూర్తవుతుందని తెలిసింది. ఫ్యాంటసీ హారర్ కామెడీ సినిమా కనుక, వీఎఫ్‌ఎక్స్-పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌పై స్పెషల్ కేర్ తీసుకుంటోందట చిత్రయూనిట్. టీజీ విశ్వప్రసాద్, కృతీప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.


రష్మికా మందన్నా, దీక్షిత్ శెట్టి


తేజ సజ్జా


సాయి దుర్గాతేజ్


భాగ్యశ్రీ, దుల్కర్ సల్మాన్


శివాని, మౌళి తనుజ్

మాస్ జాతర

రవితేజ కెరీర్‌లోని 75వ చిత్రం 'మాస్ జాతర'. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాతో భాను భోగవరపు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ధమాకా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల ఈ సినిమా కోసం మరోసారి జోడీ కట్టారు. అలాగే ఈ సినిమాలో మరోసారి తనకు అచ్చొచ్చిన పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు రవితేజ. ఇందులో రవితేజ లక్ష్మణ్ భేరి అనే రైల్వే పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. షూటింగ్ ఆల్మోస్ట్ పూర్తి కావొచ్చింది. అయితే ఈ వినాయక చవితి ఫెస్టివల్ సందర్భంగా రిలీజ్ కావాల్సిన 'మాస్ జాతర' చిత్రం వాయిదా పడింది. ఇటీవల ఇండస్ట్రీలో జరిగిన సమ్మె పరిస్థితులు, కొన్ని ఊహించని కారణాల వల్ల ఈ సినిమా రిలీజ్‌ను ఈ ఆగస్టు 27న రిలీజ్ చేయడం లేదని, త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. అయితే 'మాస్ జాతర' సినిమా రిలీజ్ వాయిదా పడటం ఇదేం తొలిసారి కాదు. నిజానికి ఈ సినిమాను తొలుత 2025 సంక్రాంతి రిలీజ్‌కి ప్లాన్ చేశారు. ఆ తర్వాత మే 9కి, ఆ నెక్ట్స్ ఆగస్టు 27కి రిలీజ్ ప్లాన్ చేశారు. కానీ ఈ తేదీల్లో రిలీజ్ కుదర్లేదు. ఈ క్రమంలో ఈ ఏడాది అక్టోబరు చివర్లో లేదా నవంబరు ప్రారంభంలో 'మాస్ జాతర' చిత్రం విడుదల కావొచ్చనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో నవీన్ చంద్ర విలన్‌గా చేస్తున్నారని తెలిసింది. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

హీరో వర్సెస్ డైరెక్టర్

ఒకరినొకరు ఎంతగానో అభిమానించుకునే ఓ హీరో, ఓ డైరెక్టర్ మధ్య ఎందుకు విభేదాలు ఏర్పడ్డాయి? అసలు వీరి మధ్య ఏం జరిగింది? అన్న అంశాలతో రూపొందిన పీరియాడికల్ చిత్రం 'కాంత'. ఈ సినిమాలో సూపర్‌స్టార్ చంద్రన్ పాత్రలో దుల్కర్ సల్మాన్, లెజెండరీ డైరెక్టర్ అయ్యా పాత్రలో సముద్ర ఖని నటించారు. ఈ సినిమాలో హీరోయిన్ పాత్రలో భాగ్యశ్రీ బోర్సే నటించారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. సెప్టెంబరు 12న రిలీజ్ అంటూ రిలీజ్ డేట్ కూడా ప్రకటించారు మేకర్స్. కానీ 1950 మద్రాస్ నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ సినిమా సెప్టెంబరు 12న రిలీజ్ కావడం లేదని ఫిల్మ్‌నగర్ సమాచారం. త్వరలోనే ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్‌ని ప్రకటించనున్నారు మేకర్స్. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోయ్ వర్గీస్ ఈ సినిమాను నిర్మించారు.

తొమ్మిది గ్రంథాల నేపథ్యంలో...

'హను-మాన్' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తర్వాత తేజ సజ్జా హీరోగా నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'మిరాయ్'. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, మంచు మనోజ్ విలన్ రోల్ చేశారు. జగపతిబాబు, శ్రియా శరణ్, జయరామ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో సూపర్ యోధ పాత్రలో తేజ సజ్జా, బ్లాక్‌స్వార్డ్ పాత్రలో మంచు మనోజ్ నటించారు. ఈ సినిమాను తొలుత ఆగస్టు 1న రిలీజ్ చేయాలనుకున్నారు. ఆ తర్వాత సెప్టెంబరు 5న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. కానీ తాజాగా వారం రోజులు ఆలస్యంగా... అంటే సెప్టెంబరు 12న రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సోషియో ఫ్యాంటసీ యాక్షన్ అండ్ మైథలాజికల్ అడ్వెంచరస్ చిత్రం ప్రధానంగా తొమ్మిది గ్రంథాలు, ఓ మ్యాజికల్ స్టిక్ నేపథ్యంలో సాగుతుందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది.

ప్రేమలో సంఘర్షణ

రష్మికా మందన్నా లీడ్ రోల్‌లో నటించిన తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఈ లవ్‌స్టోరీ చిత్రంలో దీక్షిత్ శెట్టి మరో లీడ్ రోల్‌లో నటించారు. రాహుల్ రవీంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి ఈ సినిమా నిర్మించారు. ఆల్రెడీ ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. అయితే ఈ సినిమాను సెప్టెంబరు 5న రిలీజ్‌కు రెడీ చేశారు మేకర్స్. కానీ ఈ సెప్టెంబరు 5న 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం విడుదల కావడం లేదని, త్వరలోనే మేకర్స్ నుంచి కొత్త విడుదల తేదీ వస్తుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రేమలో ఓ యువతి పడే సంఘర్షణ తాలూకు అంశాలతో ఈ చిత్ర కథనం సాగుతుందని తెలిసింది.

సంబరాలు ఎప్పుడు?

రాయలసీమ నేపథ్యంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా 'సంబరాల ఏటిగట్టు'. ఈ చిత్రంలో సాయి దుర్గాతేజ్ హీరోగా నటిస్తున్నారు. రోహిత్ కేపీని దర్శకుడిగా పరిచయం చేస్తూ, కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ సినిమాను గతంలో సెప్టెంబరు 25న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటంచారు. కానీ ఆ తర్వాత ఈ సినిమా రిలీజ్ గురించి, మరో అప్‌డేట్ లేకపోవడంతో ఈ మూవీ సెప్టెంబరు 25న రిలీజ్ కావడం లేదని తెలుస్తోంది. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ 75 శాతం పూర్తయిందని ఓ సందర్భంలో మేకర్స్ తెలిపారు. ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, సాయి కుమార్, అనన్య నాగళ్ల ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది.

కోచింగ్ సెంటర్ల నేపథ్యంలో...

చాలా సినిమాల రిలీజ్‌లు పోస్ట్‌పోన్ అవుతుంటే చిన్న చిత్రం 'లిటిల్ హార్ట్స్' రిలీజ్ మాత్రం ప్రీ పోన్ అయ్యింది. '90S మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్‌సిరీస్ ఫేమ్ మౌళి తనుజ్, శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీ 'లిటిల్ హార్ట్స్'. '90S మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ ఈ సినిమాను నిర్మించారు. సాయి మార్తాండ్ దర్శకత్వం వహించారు. కాగా ఈ సినిమాను తొలుత సెప్టెంబరు 12న రిలీజ్ చేయాలనుకున్నారు మేకర్స్. కానీ సెప్టెంబరు 5కి ఈ సినిమాను ప్రీ పోన్ చేశారు. ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి థియేటర్లలో రిలీజ్ చేస్తున్నారు. టీనేజ్ పిల్లల చదువు, లవ్‌స్టోరీ, కోచింగ్ సెంటర్లు.. వంటి అంశాల నేపథ్యంలో ఈ 'లిటిల్ హార్ట్స్' చిత్రం సాగుతుందని తెలుస్తోంది.

ఈ తరహాలో రిలీజ్ వాయిదా పడిన సినిమాలు, కొత్త రిలీజ్ డేట్‌లను కన్ఫార్మ్ చేసుకున్న సినిమాలు మరికొన్ని ఉన్నాయి.

- ముసిమి శివాంజనేయులు

శోభ... ఓ తాంత్రికురాలు


శిల్పా శిరోద్కర్

నల్లని చీర ధరించి, హోమగుండం ముందు కూర్చొని ఓ విచిత్రమైన ఎనర్జీతో తాంత్రిక శక్తులను సూచించే హావభావాలతో శిల్పా శిరోద్కర్ కనిపించారు. ఆమె ఇలా కనిపించనున్నది 'జటాధర' సినిమాలోనే. సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ చిత్రం ఇది. సోనాక్షీ సిన్హా, శిల్పా శిరోద్కర్, దివ్య ఖోస్లా నటిస్తున్నారు. కాగా శోభ పాత్రలో శిల్పా శిరోద్కర్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పాన్ ఇండియా ద్విభాషా (హిందీ, తెలుగు) చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణా అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, నిఖిల్ నందా, అరుణ అగర్వాల్, శిల్ప సింగాల్ నిర్మిస్తున్నారు.

టాలీవుడ్ ఎంట్రీ


స్పర్ష్ శ్రీవాస్తవ

బాలీవుడ్ యువ నటుడు, హిందీ హిట్ ఫిల్మ్ 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్ష్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఖరారైంది. హీరో నాగచైతన్య, 'విరూపాక్ష' ఫేమ్ దర్శకుడు కార్తీక్ వర్మ దండు కాంబినేషన్‌లో 'వృషకర్మ' (వర్కింగ్ టైటిల్) అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. నాగచైతన్య కెరీర్‌లోని ఈ 24వ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కాగా ఈ సినిమాలో స్పర్ష్ శ్రీవాస్తవ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. గురువారం (ఆగస్టు 28) స్పర్ష్ శ్రీవాస్తవ బర్త్ డే సందర్భంగా ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఇక స్పర్ష్ శ్రీవాస్తవకు తెలుగులో ఇదే తొలి చిత్రం కావడం విశేషం. ఈ చిత్రాన్ని బాపినీడు సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ పతాకాలపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్. బి నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా వేసిన ఓ భారీ సెట్‌లో ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ షూటింగ్ ఆరంభం కానుంది. నాగచైతన్యతో పాటు ఈ చిత్రం ప్రధానతారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారు దర్శకుడు కార్తీక్. ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.

ట్రిపుల్ ట్రీట్


విశాల్

ట్రిపుల్ ధమాకా ఇచ్చారు హీరో విశాల్. రవి అరసు దర్శకత్వంలో విశాల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మకుటం'. విశాల్ కెరీర్‌లోని ఈ 35వ సినిమాను సూపర్ గుడ్ ఫిల్మ్స్ పతాకంపై ఆర్‌బీ చౌదరి నిర్మిస్తున్నారు. సముద్రపు మాఫియా నేపథ్యంలోని ఈ సినిమాలో దుషార విజయన్, అంజలి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాలోని విశాల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో విశాల్ యంగ్ లుక్, మిడిల్ ఏజ్ లుక్, ఓల్డేజ్ లుక్‌లలో కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే మరిన్ని వివరాలను వెల్లడిస్తామని చిత్రయూనిట్ పేర్కొంది.

ఎయిర్‌లైన్స్.. నష్టాలు డబుల్!

- ఎఫ్‌వై 2026లో రూ.10,500 కోట్ల స్థాయిలో ఉండొచ్చు
- దేశీ విమానయాన పరిశ్రమపై ఇక్రా అంచనా
- భౌగోళిక–రాజకీయ, వాణిజ్య ఉద్రిక్తతలే కారణం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య వివాదాలు, భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతల కారణంగా దేశీ విమానయాన రంగం నష్టాలు రెట్టింపు స్థాయిలో ఉండొచ్చని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో నష్టాలు రూ. 5,500 కోట్ల స్థాయిలో ఉండగా ఈసారి రూ. 9,500–10,500 కోట్ల స్థాయిలో ఉండొచ్చని ఒక నివేదికలో పేర్కొంది. అయితే, 2022, 2023 ఆర్థిక సంవత్సరాల్లో వరుసగా నమోదైన రూ. 21,600 కోట్లు, రూ. 17,900 కోట్లతో పోలిస్తే తక్కువగానే ఉంటాయని వివరించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్య 4–6 శాతం వృద్ధితో 17.2–17.6 కోట్లుగా నమోదు కావచ్చని ఇక్రా తెలిపింది. ఇది గతంలో వేసిన 7–10 శాతం అంచనాల కన్నా తక్కువ కావడం గమనార్హం. 'ఒకవైపు విమానాల డెలివరీలు పెరుగుతున్న తరుణంలో ప్యాసింజర్ల రద్దీ తగ్గడం వల్ల భారతీయ ఏవియేషన్ పరిశ్రమ నష్టాలు 2025 ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 5,500 కోట్లతో పోలిస్తే 2026 ఆర్థిక సంవత్సరంలో మరింత పెరిగి రూ. 9,500 – 10,500 కోట్లకు చేరే అవకాశం ఉంది' అని ఇక్రా వివరించింది. సీమాంతర ఉద్రిక్తతలతో సర్వీసుల్లో అంతరాయాలు, ఫ్లయిట్ల రద్దు, ఎయిరిండియా విమాన దుర్ఘటన తర్వాత విమాన ప్రయాణాలపై సందిగ్ధతలు తదితర అంశాల వల్ల తొలి త్రైమాసికంలో ప్యాసింజర్ ట్రాఫిక్ వృద్ధి 4.4 శాతానికి పరిమితమైనట్లు తెలిపింది. అలాగే, రాబడులు కూడా 4–5 శాతం తగ్గాయని వివరించింది. సుదీర్ఘ కాలం పాటు వర్షాలు కొనసాగడంతో జూలై–ఆగస్టులో కూడా విమాన ప్రయాణాలపై ప్రభావం పడి ఉంటుందని, ఇక అమెరికా టారిఫ్‌లతో తలెత్తే వాణిజ్య ఉద్రిక్తతలు సైతం రాబోయే త్రైమాసికాల్లో వ్యాపార సెంటిమెంట్లను దెబ్బతీసి, ప్రయాణాలపై పునరాలోచనలో పడే పరిస్థితి ఏర్పడవచ్చని ఇక్రా తెలిపింది.

జూలైలో తగ్గిన ప్రయాణికులు..

దేశీయంగా జూలైలో విమాన ప్రయాణికుల రద్దీ 2.94 శాతం క్షీణించి 1.26 కోట్లకు పరిమితమైంది. గతేడాది జూలైలో 1.29 కోట్ల మంది దేశీ రూట్లలో ప్రయాణించారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) గణాంకాల ప్రకారం జనవరి–జూలై మధ్య కాలంలో ప్రయాణికుల సంఖ్య 9.77 కోట్లకు చేరింది. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన 9.23 కోట్లతో పోలిస్తే 5.9 శాతం పెరిగింది. జూలైలో ఎయిరిండియా గ్రూప్ మార్కెట్ వాటా 26.2 శాతంగా, ఇండిగో 65.2%, ఆకాశ ఎయిర్ 5.5 శాతం, స్పైస్‌జెట్ వాటా 2 శాతంగా ఉంది. ఇండిగో అత్యధికంగా 82.15 లక్షల మందిని, ఎయిరిండియా గ్రూప్ 33.08 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చాయి.

ఇండిగోలో వాటా విక్రయం

- 1.3 శాతం అమ్మిన గంగ్వాల్
- డీల్స్ విలువ రూ. 2,933 కోట్లు



న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఎయిర్‌లైన్స్ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌లో సహప్రమోటర్ రాకేష్ గంగ్వాల్ తాజాగా 1.3% వాటా విక్రయించారు. దీంతో ఇంటర్‌గ్లోబ్‌లో రాకేష్ గంగ్వాల్, అతని కుటుంబ ట్రస్ట్ సంయుక్త వాటా 7.81 శాతం నుంచి 6.51 శాతానికి క్షీణించింది. షేరుకి రూ. 5,814–5823 ధరల శ్రేణిలో 50.4 లక్షల షేర్లను తాజాగా అమ్మివేశారు. ముందురోజు ముగింపు ధర రూ. 6,050తో పోలిస్తే 4% డిస్కౌంట్‌లో షేర్లను విక్రయించారు. తద్వారా రూ. 2,933 కోట్లు అందుకున్నారు. ప్రస్తుతానికి షేర్ల కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. వెరసి ఈ ఏడాది ఇండిగోలో రూ. 14,497 కోట్ల విలువైన వాటా విక్రయించారు. 2022 ఫిబ్రవరి నుంచి రాకేష్, అతని కుటుంబ ట్రస్ట్ దశలవారీగా వాటాలను విక్రయిస్తున్న సంగతి తెలిసిందే.

బిజినెస్ రీల్

నెట్‌వర్క్ విస్తరణలో అమెజాన్

- 12 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు,
- 6 సార్టింగ్ సెంటర్లు ప్రారంభం



న్యూఢిల్లీ: పండుగ సీజన్ డిమాండ్‌కి తగ్గట్లు సర్వీసులు అందించే దిశగా ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ తన నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించింది. కొత్తగా 12 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు (స్మార్ట్ గిడ్డంగులు), ఆరు సార్టింగ్ సెంటర్లను ప్రారంభించింది. దీనితో దాదాపు ఒలింపిక్ గేమ్స్ స్థాయి 100 స్విమ్మింగ్ పూల్స్‌కి సమానమైన 86 లక్షల ఘనపుటడుగుల నిల్వ సామర్థ్యం అందుబాటులోకి వచ్చినట్లు కంపెనీ తెలిపింది. వైజాగ్, కృష్ణగిరి తదితర అయిదు నగరాల్లో తొలిసారిగా ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించింది. అలాగే త్రివేంద్రం, రాజ్‌పురా తదితర ఆరు ప్రాంతాల్లో సార్ట్ సెంటర్లను నెలకొల్పినట్లు తెలిపింది. కొనుగోలుదారులకు మరింత వేగంగా ఉత్పత్తులను అందించడానికి విక్రేతలకు ఇవి ఉపయోగపడతాయని వివరించింది. వీటితో ఫుల్‌ఫిల్‌మెంట్, సార్టేషన్ అసోసియేట్స్, టీమ్ లీడ్స్, ప్రాసెస్ అసిస్టెంట్స్‌లాంటి వేల కొద్దీ ఫుల్ టైమ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాల కల్పనకు వీలవుతుందని అమెజాన్ పేర్కొంది.

త్వరలో సీజీ సెమీ నుంచి మేడిన్ ఇండియా చిప్

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



సాణంద్ (గుజరాత్): సెమీకండక్టర్ కంపెనీ సీజీ సెమీ తొలిసారిగా భారత్‌లో తయారైన చిప్‌ను త్వరలో ప్రవేశపెట్టగలదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో కంపెనీ పైలట్ ప్లాంటును (జీ1) రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్ పటేల్‌తో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయం తెలిపారు. ఆర్డర్లు ఇచ్చేందుకు ముందుగానే చిప్స్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు పైలట్ లైన్ ఉపయోగపడుతుందని వివరించారు. సీజీ సెమీ పైలట్ ప్లాంటు రోజుకు గరిష్ఠంగా 5 లక్షల యూనిట్లు ఉత్పత్తి చేయగలదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దన్నుతో పాటు రెనెసాస్..స్టార్ మైక్రోఎలక్ట్రానిక్స్ భాగస్వామ్యంతో చిప్‌ల తయారీపై సీజీ సెమీ రూ. 7,600 కోట్లు ఇన్వెస్ట్ చేస్తోంది. 2027 నాటికి సీజీ సెమీ పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తుందని వైష్ణవ్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

29-8-2025	
విశాఖ	550–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	560–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,632.00	1.06
COALINDIA	375	0.68
HEROMOTOCO	5,106.60	0.65
LT	3,564.10	0.64
MARUTI	14,798.00	0.57

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	571.25	-3.94
HCLTECH	1,450.20	-2.85
POWERGRID	274.2	-2.04
TCS	3,098.00	-1.88
TATACONSUM	1,060.20	-1.82

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,516
ఎన్‌ఎస్‌ఈ	1,02,774
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	4,02,774
ఎఫ్ఐఐ	- 3,857
డీఐఐ	+ 6,920

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	63.60	$	64.15
బ్రెంట్	66.13	$	66.97

ఐపీవో స్ట్రీట్

లిస్టింగ్‌కు గ్రో రెడీ

- సెబీ నుంచి తాజాగా అనుమతి
- రూ. 6,000–8,700 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: స్టాక్ బ్రోకింగ్ దిగ్గజం బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజీ వెంచర్స్ పబ్లిక్ ఇష్యూ పట్టాలెక్కనుంది. ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రో బ్రాండుతో స్టాక్ బ్రోకింగ్ సేవలు అందిస్తున్న కంపెనీ దీంతో 70–100 కోట్ల డాలర్ల(రూ. 6,000–8,700 కోట్లు) మధ్య సమీకరించే వీలున్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. వెరసి కంపెనీ విలువ 700 కోట్ల డాలర్లకు చేరవచ్చని పేర్కొన్నాయి. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ తాజా ఈక్విటీ జారీని చేపట్టడంతోపాటు.. ప్రస్తుత వాటాదారులు షేర్లను ఆఫర్ చేయనున్నట్లు తెలుస్తోంది. లిస్టింగ్‌కు వీలుగా కంపెనీ గోప్యతా విధానంలో సెబీకి మే నెలలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. 2016లో ఏర్పాటైన కంపెనీ 2025 ఆగస్టుకల్లా 26 శాతం మార్కెట్ వాటాతో దేశీయంగా అతిపెద్ద స్టాక్ బ్రోకర్‌గా నిలుస్తోంది. గత ఆర్థిక సంవత్సరం(2024–25)లో రూ. 4,056 కోట్ల ఆదాయం, రూ. 1,818 కోట్ల నికర లాభం ఆర్జించింది. పీక్ ఫిఫ్టీన్, టైగర్ క్యాపిటల్‌సహా.. సత్య నాదెళ్ల(మైక్రోసాఫ్ట్ సీఈవో)కు కంపెనీలో పెట్టుబడులున్నాయి. కాగా.. ఐపీవో నిధులను టెక్నాలజీ డెవలప్‌మెంట్, బిజినెస్ విస్తరణపై వినియోగించనుంది.

రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!

- 34.2 లక్షల కోట్ల డాలర్లకు జీడీపీ
- 2038కల్లా చేరుకోనున్నట్లు ఈవై అంచనా



న్యూఢిల్లీ: కొనుగోలు శక్తి (పీపీపీ) రీత్యా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించే వీలున్నట్లు ఈవై నివేదిక అంచనా వేసింది. వెరసి 2038కల్లా దేశ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) 34.2 లక్షల కోట్ల డాలర్లకు చేరనున్నట్లు ఎకానమీ వాచ్ పేరుతో ఆగస్ట్ నెలకు విడుదల చేసిన నివేదికలో అభిప్రాయపడింది. ఈ బాటలో 2030కల్లా దేశ జీడీపీ 20.7 ట్రిలియన్ డాలర్లను తాకనున్నట్లు పేర్కొంది. తగిన చర్యలు చేపట్టడం ద్వారా ఎంపిక చేసిన దిగుమతులపై యూఎస్ విధించిన అధిక టారిఫ్‌ల ప్రభావాన్ని తగ్గించుకోగలదని తెలియజేసింది. వాస్తవిక జీడీపీ వృద్ధిపై 0.1 శాతానికి పరిమితం చేసుకోగలదని వివరించింది. ప్రపంచంలోని 5 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటైన భారత్ అత్యంత శక్తివంతంగా మారుతున్నట్లు పేర్కొంది. పటిష్ట ఆర్థిక మూలాలు, గరిష్ట పొదుపు, పెట్టుబడుల రేటు, సానుకూల జనాభా, ద్రవ్య పరిస్థితుల్లో నిలకడ వంటి అంశాలు ఇందుకు తోడ్పాటునివ్వనున్నట్లు వివరించింది. టారిఫ్ ఒత్తిళ్లు, వాణిజ్య మందగమనం వంటి అంతర్జాతీయ అనిశ్చితులున్నప్పటికీ దేశీ డిమాండ్, ఆధునిక టెక్నాలజీలలో సామర్థ్యాల పెంపు తదితరాలు మద్దతివ్వనున్నట్లు తెలియజేసింది.

జన్‌ధన్ ఖాతాలు 56.16 కోట్లు

రూ.2.68 లక్షల కోట్ల డిపాజిట్లు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకం కింద ఖాతాల సంఖ్య ఆగస్ట్ 13 నాటికి 56.16 కోట్లకు చేరింది. ఇందులో రూ.2.68 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ప్రకటించింది. 2015 మార్చి నాటికి ఈ ఖాతాల సంఖ్య 14.72 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. 11 ఏళ్లలో గణనీయంగా పెరిగినట్లు పేర్కొంది. జన్‌ధన్ ఖాతాదారుల్లో 56 శాతం మహిళలేనని.. 67 శాతం ఖాతాలు గ్రామీణ, చిన్న పట్టణాల్లో తెరిచినట్లు వెల్లడించింది. లబ్ధిదారుల ఖాతాలకు ప్రత్యక్ష నగదు బదిలీ రూపంలో రూ.45 లక్షల కోట్లను బదిలీ చేసినట్లు తెలిపింది. జన్‌ధన్ ఖాతాదారులకు 38.68 కోట్ల రూపే డెబిట్ కార్డులు మంజూరైనట్లు వెల్లడించింది. దేశంలో 94 శాతం వయోజనులకు బ్యాంక్ ఖాతాలున్నట్లు తెలిపింది. అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయాలన్న సంకల్పంతో కేంద్ర సర్కారు 2014 ఆగస్ట్ 28న ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకాన్ని ప్రారంభించడం గమనార్హం. దీనికింద సున్నా బ్యాలన్స్, ఉచిత రూపే డెబిట్ కార్డు, ప్రమాద బీమా తదితర సదుపాయాలతో సేవింగ్స్ ఖాతాను ప్రారంభించేందుకు అవకాశం కల్పించింది.

7ఏళ్లలో మహిళల ఉపాధిరేటు రెట్టింపు


- 22 శాతం నుంచి 40.3 శాతానికి
- కార్మిక శాఖ గణాంకాల వెల్లడి



న్యూఢిల్లీ: మహిళల ఉపాధి రేటు గత 7ఏళ్లలో దాదాపు రెట్టింపైనట్లు కార్మిక శాఖ తాజాగా పేర్కొంది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2017–18లో స్త్రీల ఉపాధి రేటు 22 శాతం కాగా.. 2023–24కల్లా 40.3 శాతానికి ఎగసింది. మరోపక్క ఇదే కాలంలో నిరుద్యోగ రేటు 5.6 శాతం నుంచి 3.2 శాతానికి దిగివచ్చింది. 2047కల్లా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మహిళా ఉద్యోగుల సంఖ్య 70 శాతానికి చేరుకోవడం కీలకంగా నిలవనున్నట్లు తెలియజేసింది. నియమితకాల శ్రామిక శక్తి సర్వే(పీఎల్ఎఫ్ఎస్) గణాంకాల ప్రకారం గత 7ఏళ్లలో మహిళా ఉపాధి రేటు(డబ్ల్యూపీఆర్) దాదాపు రెట్టింపైంది. వెరసి భారత్‌లో మహిళా ఉద్యోగుల సంఖ్య ప్రస్తావించదగిన స్థాయిలో బలపడింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ రేటు(యూఆర్) సైతం 2017–18లో నమోదైన 5.6 శాతం నుంచి 2023–24కల్లా 3.2 శాతానికి వెనకడుగు వేసింది. ఇది స్త్రీలకు పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలను ప్రతిబింబిస్తున్నట్లు కార్మిక శాఖ పేర్కొంది. గ్రామాలలో ఇది మరింత అధికంగా బదిలీ అయినట్లు వెల్లడించింది. పట్టణాలలో ఉపాధి రేటు 43 శాతంకాగా.. గ్రామీణంలో మహిళా ఉద్యోగుల రేటు 96 శాతం జంప్‌చేసినట్లు తెలియజేసింది. 2025 భారత నైపుణ్య నివేదిక ప్రకారం దేశీ గ్రాడ్యుయేట్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 55 శాతంమందికి ఈ ఏడాది ఉపాధి లభించనున్నట్లు పేర్కొంది. 2024లో ఇది 51.2 శాతంగా నమోదైంది.

ఇష్యూ బాటలో ఎస్‌ఎఫ్‌సీ ఎన్విరాన్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: వృథా నీటి శుద్ధి(వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్) సర్వీసులందించే ఎస్‌ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. వీటి ప్రకారం ఇష్యూలో భాగంగా రూ. 150 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.23 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 47.5 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 70 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వెచ్చించనుంది. 2005లో ఏర్పాటైన కంపెనీ వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్, సీ–టెక్‌లలో ప్రాప్రయిటరీ టెక్నాలజీ సమకూర్చుతోంది. 2025 మార్చికల్లా గోవాలో రెండు సమీకృత సాలిడ్ వేస్ట్ ట్రీట్‌మెంట్(ఎస్‌డబ్ల్యూటీ) యూనిట్లను కలిగి ఉంది. పబ్లిక్, ప్రయివేట్ భాగస్వామ్యంలో నెలకొల్పిన వీటి సంయుక్త సామర్థ్యం రోజుకి 425 టన్నులు. అంతేకాకుండా పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో ఆగ్రో ఆధారిత బయోగ్యాస్ ప్లాంటును సైతం నిర్వహిస్తోంది. తద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. కస్టమర్ల జాబితాలో రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఈఎంఎస్, ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్, ఎస్ఎంసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితరాలున్నాయి. గతేడాది(2024–25)కల్లా వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ విభాగంలో కంపెనీ ఆర్డర్‌బుక్ విలువ రూ. 460 కోట్లను తాకగా.. మురుగునీటి శుద్ధి బిజినెస్‌లో రూ. 101 కోట్లుగా నమోదైంది.

జెరాయ్ ఫిట్‌నెస్‌పై ఎన్‌సీఎల్‌ఏటీకి సల్మాన్ ఖాన్

న్యూఢిల్లీ: రూ. 7.24 కోట్లు బాకీపడిన జెరాయ్ ఫిట్‌నెస్‌పై దివాలా పిటీషన్‌ను ఎన్‌సీఎల్‌టీ తోసిపుచ్చడాన్ని సవాలు చేస్తూ బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ తాజాగా అప్పీలేట్ ట్రిబ్యునల్ ఎన్‌సీఎల్‌ఏటీని ఆశ్రయించారు. దీనిపై ఆగస్టు 22నే విచారణ జరగాల్సి ఉన్నప్పటికీ, పిటీషనరు తరఫు న్యాయవాదుల అభ్యర్థన మేరకు ఎన్‌సీఎల్‌ఏటీ, సెప్టెంబర్ 15కి వాయిదా వేసింది. వివరాల్లోకి వెళ్తే, 2018లో జెరాయ్ ఫిట్‌నెస్‌కి తన 'బీయింగ్ స్ట్రాంగ్' ట్రేడ్ మార్కు లైసెన్సును సల్మాన్ ఖాన్ ఇచ్చారు. కంపెనీ ఉత్పత్తులపై ఈ ట్రేడ్‌మార్క్‌ను ఉపయోగించుకునేందుకు అంగీకరించారు. అయినప్పటికీ, చెల్లింపులు జరగకపోవడంతో కంపెనీపై దివాలా చర్యలు తీసుకోవాలంటూ ఎన్‌సీఎల్‌టీని సల్మాన్ ఖాన్ ఆశ్రయించారు. అయితే, ట్రేడ్‌మార్క్‌తో ఉత్పత్తులను తయారు చేసి, విక్రయించడానికి జెరాయ్‌కి హక్కులు ఉన్నాయని.. కాకపోతే ముందస్తుగా సమ్మతించని ఉత్పత్తులను మాత్రం తయారు చేయరాదని సూచించింది.

లింక్ లక్ష్యం.. 20 శాతం వృద్ధి



కోల్‌కతా: డిజిటలీకరణ పెరుగుతున్నప్పటికీ రాబోయే అయిదేళ్లలో 15–20 శాతం వార్షిక వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు రైటింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ తయారీ సంస్థ లింక్ ఎండీ దీపక్ జలాన్ తెలిపారు. ప్రస్తుతం ఆదాయం రూ. 550 కోట్లుగా ఉండగా, నిర్వహణ లాభం సుమారు 11 శాతంగా ఉందని పేర్కొన్నారు. జపాన్, టర్కీ, కొరియాకు చెందిన కంపెనీలతో మూడు జాయింట్ వెంచర్లు ఉన్నాయని, కెన్యాలోని ఓ సంస్థలో మెజారిటీ వాటాలు ఉన్నాయని జలాన్ తెలిపారు. ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడం, ఆధునీకరణపై ఏటా సుమారు రూ. 20 కోట్ల మేర ఇన్వెస్ట్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం దేశీయంగా రైటింగ్ సాధనాల పరిశ్రమ ఏటా అయిదు – ఆరు శాతం మేర వృద్ధి చెందుతోందని, డిజిటలీకరణతో పురోగతి కొంత నెమ్మదించిందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఈ పరిశ్రమ 20 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వివరించారు. 50 దేశాలకు ఎగుమతులు చేస్తున్నామని, ఎగుమతుల ఆదాయం సుమారు రూ. 100 కోట్లుగా ఉందని జలాన్ పేర్కొన్నారు.

ఇండెక్స్, స్టాక్ ఫ్యూచర్స్‌కు ప్రీఓపెన్

బీఎస్‌ఈ తాజా ప్రతిపాదనలు



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్‌ఈ.. ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో ఇండెక్స్ అండ్ స్టాక్ ఫ్యూచర్స్‌కు ప్రీఓపెన్ సెషన్ ప్రారంభించే యోచనలో ఉంది. 2025 డిసెంబర్ 8నుంచి వీటిని ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదించింది. ఇందుకు తాజాగా సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈక్విటీ డెరివేటివ్స్‌లో లావాదేవీల సరళతను పెంచడంతో పాటు రిస్క్ పర్యవేక్షణను పటిష్టపరచమంటూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ.. స్టాక్ ఎక్స్ఛేంజీలను ఆదేశించిన నేపథ్యంలో బీఎస్‌ఈ తాజా ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఏర్పడింది. సెబీ సర్క్యులర్ ప్రకారం ఈక్విటీ విభాగంలో ప్రీఓపెన్ సెషన్‌కు ఇప్పటికే ఎక్స్ఛేంజీ మద్దతిస్తుంటే.. ఈక్విటీ డెరివేటివ్ విభాగంలోనూ ఇదే వ్యవస్థను అమలుచేయవచ్చని బీఎస్‌ఈ పేర్కొంది. కాగా.. ఈక్విటీ నగదు విభాగంలో ప్రస్తుతం స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు.. బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈ ప్రీఓపెన్ ట్రేడింగ్ సెషన్‌ను ఉదయం 9–9.15 మధ్య నిర్వహిస్తున్న విషయం విదితమే. ప్రీఓపెన్ సెషన్‌లో మార్పుల పరిశీలనకు వీటిని అక్టోబర్ 6 నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

ఫండ్స్‌లో పెట్టుబడులకు సేవింగ్స్ ప్రో అకౌంటు

జియో పేమెంట్స్ బ్యాంక్ కసరత్తు

ముంబై: ఖాతాల్లో నిరుపయోగంగా ఉన్న నిధులను మెరుగైన రాబడుల కోసం ఓవర్‌నైట్ మ్యుచువల్ ఫండ్స్‌లో ఆటో– ఇన్వెస్ట్ చేసే వెసులుబాటును జియో పేమెంట్స్ బ్యాంక్ (జేపీబీ) తమ కస్టమర్లకు అందుబాటులోకి తేవడంపై కసరత్తు చేస్తోంది. ఇందుకోసం దేశీయంగా తొలిసారిగా సేవింగ్స్ ప్రో పేరిట సేవింగ్స్ అకౌంటును త్వరలో ప్రవేశపెట్టనుంది. వార్షిక సర్వ సభ్య సమావేశం సందర్భంగా కంపెనీ మాతృ సంస్థ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎండీ హితేష్ సేథియా తెలిపారు. చెల్లింపులు, రెమిటెన్స్ సేవలు అందించే పేమెంట్స్ బ్యాంకు, దేశీయంగా మనీ ట్రాన్స్‌ఫర్లు, ఆధార్ ఆధారిత చెల్లింపులు వంటి ఆదాయ మార్గాలపై జియో పేమెంట్స్ బ్యాంక్ దృష్టి పెడుతున్నట్లు వివరించారు.

టారిఫ్‌లతో ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు

- వీటిని తప్పకుండా పరిష్కరించాలి
- ఆర్థిక శాఖ నివేదిక



న్యూఢిల్లీ: భారత ఎగుమతులపై అమెరికా టారిఫ్‌ల కారణంగా తక్షణం పడే ప్రభావం పరిమితంగానే ఉన్నప్పటికీ.. వీటి తాలూకూ ప్రభావాలు భారత ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు విసురుతున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. వీటిని తప్పకుండా పరిష్కరించాల్సి ఉందని పేర్కొంది. ఈ సమస్యల పరిష్కారానికి భారత్–యూఎస్ మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు కీలకమని తన నెలవారీ ఆర్థిక సమీక్షా నివేదికలో పేర్కొంది. అమెరికా 50 శాతం టారిఫ్‌లు 48 బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రభావం చూపించనున్నట్లు అంచనా. అంతర్జాతీయ ధోరణులకు అనుగుణంగా ఎగుమతుల్లో వైవిధ్యంపై దృష్టి సారించినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ఇటీవలే యూకే, ఈఎఫ్‌టీఏతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై చర్చలను ముగించినట్లు, యూఎస్, ఈయూ, న్యూజిలాండ్, చిలీ, పెరూతో చర్చలు కొనసాగుతున్నట్లు పేర్కొంది. ''ఈ చర్యల ఫలితాలు కనిపించేందుకు కొంత సమయం పడుతుంది. అధిక టారిఫ్‌ల కారణంగా అమెరికాకు తగ్గే ఎగుమతులను ఇవి పూర్తి స్థాయిలో భర్తీ చేయకపోవచ్చు''అని ఆర్థిక శాఖ నివేదిక వివరించింది. బలమైన ఆర్థిక పనితీరు, విధానపరమైన స్థిరత్వం, మౌలిక సదుపాయాలపై అధిక పెట్టుబడులు, భారత సావరీన్ రేటింగ్‌ను బీబీబీ మైనస్ నుంచి బీబీబీకి ఎస్అండ్‌పీ అప్‌గ్రేడ్ చేయడాన్ని సానుకూలంగా పేర్కొంది. దీనివల్ల రుణ వ్యయాలు తగ్గుతాయని, విదేశీ పెట్టుబడులు మరిన్ని ఆకర్షించొచ్చని అభిప్రాయపడింది. దేశీయంగా సాధారణం కంటే అధిక వర్షపాతం, ఖరీఫ్ సాగు మెరుగ్గా ఉండడం రిటైల్ ద్రవ్యోల్బణాన్ని సమీప కాలంలో నియంత్రణలోనే ఉంచుతాయని అంచనా వేసింది. జీఎస్టీ సంస్కరణలు, పన్నుల తగ్గింపు వంటివి వినియోగాన్ని పెంచుతాయని, వ్యాపార నిర్వహణ సులభతరం అవుతుందని పేర్కొంది.

జీడీపీపై అర శాతం ప్రభావం

అమెరికా టారిఫ్‌ల కారణంగా భారత ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం స్వల్పమేనని వాణిజ్య శాఖ మాజీ కార్యదర్శి జీకే పిళ్లై అభిప్రాయపడ్డారు. ఎగుమతులకు ప్రత్యామ్నాయ మార్కెట్లను గుర్తించలేకపోతే అప్పుడు జీడీపీ వృద్ధి రేటుపై 0.50 శాతం మేర ప్రభావం ఉంటుందన్నారు. ఫలితంగా టెక్స్‌టైల్స్, రత్నాభరణాలు, సముద్ర ఆహార ఉత్పత్తులు, కెమికల్స్ రంగాలకు ఇబ్బందులు ఎదురుకావొచ్చన్నారు. రష్యా చమురును యూరప్ దేశాలు, చైనా దిగుమతి చేసుకుంటున్నప్పటికీ భారత్‌పైనే అధిక టారిఫ్‌లు విధించడం వివక్ష చూపించడమేనన్నారు. ప్రభుత్వం ఈ ప్రభావాన్ని పరిమితం చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమస్యలను గట్టెక్కి, కొత్త మార్కెట్లలో అవకాశాలను సొంతం చేసుకునే దిశగా దేశీ పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలన్నారు.

రన్నరప్ ప్రజ్ఞానంద



సెయింట్ లూయిస్: సింక్‌ఫీల్డ్ కప్ గ్రాండ్ చెస్ టూర్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద రన్నరప్‌గా నిలిచాడు. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత వెస్లీ సో (అమెరికా), ఫాబియానో కరువానా (అమెరికా), ప్రజ్ఞానంద 5.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచారు. దాంతో విజేతను నిర్ణయించేందుకు ఈ ముగ్గురి మధ్య బ్లిట్జ్ ఫార్మాట్‌లో ప్లే ఆఫ్ గేమ్‌లు నిర్వహించారు. కరువానాతో జరిగిన గేమ్‌లో ప్రజ్ఞానంద 33 ఎత్తుల్లో గెలిచి... వెస్లీ సోతో జరిగిన గేమ్‌లో 38 ఎత్తుల్లో ఓడిపోయాడు. కరువానాతో జరిగిన గేమ్‌ను వెస్లీ సో 60 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని 1.5 పాయింట్లతో విజేతగా అవతరించాడు. ఒక పాయింట్‌తో ప్రజ్ఞానందకు రెండో స్థానం దక్కగా... అర పాయింట్ సాధించిన కరువానాకు మూడో స్థానం లభించింది. ఈ ప్రదర్శనతో ప్రజ్ఞానంద గ్రాండ్ చెస్ టూర్ టోర్నీ ఫైనల్‌కు కూడా అర్హత పొందాడు. సింక్‌ఫీల్డ్ కప్ చాంపియన్ వెస్లీ సోకు 77,667 డాలర్లు (రూ. 68 లక్షలు), రన్నరప్ ప్రజ్ఞానందకు 67,667 డాలర్లు (రూ. 59 లక్షలు), మూడో స్థానం పొందిన కరువానాకు 67,667 డాలర్లు (రూ. 59 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌కు ఈ టోర్నీ నిరాశను మిగిల్చింది. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడ్డ ఈ టోర్నీలో గుకేశ్ నాలుగు పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచాడు.

తనిష్క్‌కు రెండు పతకాలు

గుర్‌ప్రీత్ సింగ్‌కు స్వర్ణం • ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్




షిమ్‌కెంట్ (కజకిస్తాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. జూనియర్ విభాగంలో హైదరాబాద్ షూటర్ తనిష్క్ మురళీధర్ నాయుడు వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం, టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సొంతం చేసుకున్నాడు. 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో తనిష్క్ 568 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం గెలుచుకోగా... సూరజ్ శర్మ 571 పాయింట్లతో రజతం నెగ్గాడు. టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నేలవల్లి ముకేశ్, తనిష్క్, సూరజ్‌లతో కూడిన భారత జట్టు 1703 పాయింట్లతో స్వర్ణ పతకం గెలుచుకుంది. సీనియర్ విభాగంలో 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ విభాగంలో భారత షూటర్లు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. గుర్‌ప్రీత్ సింగ్ పసిడి పతకం కైవసం చేసుకోగా... అమన్‌ప్రీత్ సింగ్ రజతం గెలుచుకున్నాడు. ఇరువురు షూటర్లు 572 పాయింట్లతో సమంగా నిలవగా... అమన్‌ప్రీత్ (11) కంటే ఎక్కువ ఇన్నర్ సర్కిల్స్ నమోదు చేసుకున్న గుర్‌ప్రీత్ (18)కు పసిడి పతకం దక్కింది. చైనా షూటర్ లియాన్ బోఫన్ కాంస్యం నెగ్గాడు. 37 ఏళ్ల గుర్‌ప్రీత్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఇదే తొలి స్వర్ణ పతకం కావడం విశేషం. 12 ఏళ్ల క్రితం టెహ్రాన్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో గుర్‌ప్రీత్ కాంస్యం గెలిచాడు. టీమ్ విభాగంలో గుర్‌ప్రీత్, అమన్‌ప్రీత్, హర్ష గుప్తాతో కూడిన భారత త్రయం ఫైనల్లో 1709 పాయింట్లతో పసిడి పతకం గెలుచుకుంది. 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ జూనియర్ టీమ్ విభాగంలో సమీఉల్లాఖాన్, అడ్రియన్ కర్మాకర్, కుశాగ్ర సింగ్ రజావత్‌తో కూడిన భారత జట్టు 1844.3 పాయింట్లతో పసిడి పతకం చేజిక్కించుకుంది. దీంతో ఈ టోర్నీలో భారత పతకాల సంఖ్య 82కు చేరింది. ఇందులో 44 స్వర్ణాలు, 20 రజతాలు, 18 కాంస్యాలు ఉన్నాయి.

సబలెంకా ముందుకు...

మూడో రౌండ్‌లోకి మహిళల సింగిల్స్ డిఫెండింగ్ చాంపియన్

- శ్రమించి గెలిచిన రెండో సీడ్ స్వియాటెక్
- అల్‌కరాజ్, జొకోవిచ్ జోరు



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో టాప్ సీడ్ సబలెంకా 7–6 (7/4), 6–2తో పొలీనా కుదెర్‌మెటోవా (రష్యా)పై విజయం సాధించింది. 96 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఐదు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. నెట్ వద్దకు నాలుగు సార్లు దూసుకొచ్చి రెండుసార్లు పాయింట్లు గెలిచింది. 18 విన్నర్స్ కొట్టిన ఆమె 22 అనవసర తప్పిదాలు చేసింది. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయిన ఈ బెలారస్ స్టార్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

రెండో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా), మాజీ చాంపియన్ ఎమ్మా రాడుకాను (బ్రిటన్), ఏడో సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ) కూడా మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. సుజాన్ లామెన్స్ (నెదర్లాండ్స్)తో 2 గంటల 6 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో స్వియాటెక్ 6–1, 4–6, 6–4తో కష్టపడి గెలిచింది. పెగూలా 6–1, 6–3తో బ్లింకోవా (రష్యా)పై, రాడుకాను 6–2, 6–1తో జానైస్ జెన్ (ఇండోనేసియా)పై, పావోలిని 6–3, 6–3తో ఇవా జోవిక్ (అమెరికా)పై విజయం సాధించారు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ మిరా ఆండ్రీవా (రష్యా) 6–1, 6–3తో పొటపోవా (రష్యా)పై, పదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా) 6–2, 6–1తో మెక్‌నాలీ (అమెరికా)పై, తొమ్మిదో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) 6–3, 7–6 (9/7)తో తెరెజా వాలెన్‌టోవా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొంది మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో 16వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) 3–6, 3–6తో ఆన్ లీ (అమెరికా) చేతిలో, 17వ సీడ్ సమ్సోనోవా (రష్యా) 6–4, 3–6, 2–6తో ప్రిసిల్లా హాన్ (ఆస్ట్రేలియా) చేతిలో, 25వ సీడ్ జెలెనా ఒస్టాపెంకో (లాత్వియా) 5–7, 1–6తో టేలర్ టౌన్‌సెండ్ (అమెరికా) చేతిలో ఓడిపోయారు.

11వ సీడ్ రూనె ఓటమి

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్), మాజీ విజేత జొకోవిచ్ (సెర్బియా) మూడో రౌండ్‌లోకి ప్రవేశించగా... 11వ సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో అల్‌కరాజ్ 6–1, 6–0, 6–3తో మటియా బెలూచి (ఇటలీ)పై, జొకోవిచ్ 6–7 (5/7), 6–3, 6–3, 6–1తో జచారీ వజ్దా (అమెరికా)పై గెలుపొందారు. రూనె 6–7 (5/7), 6–2, 3–6, 6–4, 5–7తో జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ) చేతిలో ఓడిపోయాడు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 4–6, 7–6 (7/3), 6–2, 6–4తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)పై, ఆరో సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా) 6–4, 6–2, 6–4తో కరెనో బుస్టా (స్పెయిన్)పై, పదో సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ) 6–4, 6–0, 6–2తో డేవిడ్ గాఫిన్ (బెల్జియం)పై విజయం సాధించారు.




నీరజ్‌కు రజతం

జ్యూరిక్: డైమండ్ లీగ్ ఫైనల్లో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రజత పతకం దక్కించుకున్నాడు. గురువారం రాత్రి జరిగిన ఫైనల్లో నీరజ్ జావెలిన్‌ను 85.01 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. తొలి ప్రయత్నంలో జావెలిన్‌ను 84.35 మీటర్ల దూరం విసిరిన నీరజ్.. రెండో ప్రయత్నంలో 82 మీటర్లకే పరిమితమయ్యాడు. మూడు, నాలుగు, ఐదో ప్రయత్నాల్లో ఫౌల్ చేసిన నీరజ్... ఆఖరి ప్రయత్నంలో 85.01 మీటర్ల దూరంతో రెండో స్థానానికి దూసుకొచ్చాడు. జూలియన్ వెబర్ (జర్మనీ) 91.51 మీటర్ల దూరంతో అగ్రస్థానం కైవసం చేసుకున్నాడు. తొలి ప్రయత్నంలో జావెలిన్‌ను 91.37 మీటర్ల దూరం విసిరిన అతడు... రెండో ప్రయత్నంలో దాన్ని మరింత మెరుగు పరుచుకున్నాడు. వాల్‌కాట్ కేషోర్న్ (ట్రినిడాడ్ అండ్ టొబాగో) 84.95 మీటర్లతో కాంస్య పతకం ఖాతాలో వేసుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) 82.06 మీటర్ల దూరంతో నాలుగో స్థానంలో నిలిచాడు. జూలియస్ యెగో (కెన్యా; 82.01 మీటర్లు), అండ్రియన్ మర్దరె (మాల్డోవా; 81.81 మీటర్లు), సిమన్ వైలాండ్ (స్విట్జర్లాండ్; 81.29 మీటర్లు) వరుసగా ఐదో, ఆరో, ఏడో స్థానాల్లో నిలిచారు. 2022లో ఈ టోర్నీ విజేతగా నిలిచిన నీరజ్... ఈ సారి అలాంటి ప్రదర్శన పునరావృతం చేయలేకపోయాడు.

హైదరాబాద్ 'హ్యాట్రిక్'

- తన్మయ్, వరుణ్ గౌడ్ సెంచరీలు
- బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నీ


తన్మయ్


వరుణ్

చెన్నై: బ్యాటర్లు విజృంభించడంతో బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు మూడో విజయం ఖాతాలో వేసుకుంది. గ్రూప్ 'డి'లో భాగంగా జరిగిన పోరులో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో మధ్యప్రదేశ్‌ను చిత్తుచేసింది. దీంతో గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన హైదరాబాద్ 19 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో నిలిచింది. మధ్యప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకే ఆలౌట్ కాగా... హైదరాబాద్ 87 ఓవర్లలో 414/7 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. తన్మయ్ అగర్వాల్ (162 బంతుల్లో 130; 18 ఫోర్లు, 2 సిక్స్‌లు), వరుణ్ గౌడ్ (110 బంతుల్లో 100 నాటౌట్; 5 ఫోర్లు) సెంచరీలతో కదంతొక్కారు. కెప్టెన్ రాహుల్ సింగ్ (100 బంతుల్లో 59; 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. మధ్యప్రదేశ్ బౌలర్లలో రోహిత్ రజావత్ 3... అన్వేశ్, విష్ణు చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం మధ్యప్రదేశ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 45 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. సక్షమ్ పురోహిత్ (121 బంతుల్లో 78; 4 ఫోర్లు), ఆర్యన్ తివారి (91 బంతుల్లో 65; 6 ఫోర్లు) అర్ధశతకాలు చేశారు. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి, వరుణ్ గౌడ్ చెరో వికెట్ పడగొట్టారు.



హైదరాబాద్‌లో ప్రైమ్ వాలీబాల్ లీగ్

అక్టోబర్ 2 నుంచి నాలుగో సీజన్

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్ పోటీలకు రంగం సిద్ధమైంది. నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 2 నుంచి ఈ టోర్నమెంట్ జరుగుతుంది. టోర్నీ సెమీఫైనల్స్, ఫైనల్ సహా మొత్తం 38 మ్యాచ్‌లను ఇక్కడే నిర్వహిస్తారు. పీవీఎల్ మ్యాచ్‌లకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరంలో క్రీడలపై అభిమానులకు చాలా ఆసక్తి ఉందని, ఇదే క్రమంలో వాలీబాల్ లీగ్ కూడా పెద్ద స్థాయిలో విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు సీఎం చెప్పారు. టోర్నీ సమర్థ నిర్వహణకు తమ వంతుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోనీబాలాదేవి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌తో పాటు లీగ్‌లో పాల్గొంటున్న హైదరాబాద్ హాక్స్ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి పాల్గొన్నారు.

అజయ్ బాబుకు స్వర్ణ పతకం



అహ్మదాబాద్: కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత లిఫ్టర్లు వల్లూరి అజయ్ బాబు, బేద్‌బ్రత్ భరాలి బంగారు పతకాలు సాధించారు. గురువారం జరిగిన సీనియర్ పురుషుల 79 కేజీల కేటగిరీలో జాతీయ క్రీడల చాంపియన్ అయిన అజయ్ బాబు మొత్తం 335 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచాడు. స్నాచ్‌లో 152 కేజీల బరువెత్తి కామన్వెల్త్ చాంపియన్‌షిప్ రికార్డును కూడా నెలకొల్పాడు. క్లీన్ అండ్ జెర్క్‌లో 183 కేజీలు ఎత్తాడు. స్నాచ్‌లో ఇంతకుముందు నైజీరియాకు చెందిన ఎడిడివోంగ్ జోసెఫ్ 147 కేజీల రికార్డును అజయ్ తిరగరాశాడు. గత క్రీడల్లోనూ అతను బంగారు పతకం సాధించినప్పటికీ అప్పుడు 81 కేజీల విభాగంలో పోటీపడ్డాడు. సీనియర్ మహిళల 69 కేజీల కేటగిరీలో కామన్వెల్త్ క్రీడల (2022) కాంస్య పతక విజేత హర్జిందర్ కౌర్ మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. జూనియర్ పురుషుల 79 కేజీల విభాగంలో బేదబ్రత్ భరాలి స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్‌లో కొత్త రికార్డులతో పసిడి పట్టాడు. అతను స్నాచ్‌లో 145 కేజీల బరువెత్తాడు. తద్వారా 139 కేజీల గత రికార్డును అధిగమించాడు. అలాగే క్లీన్ అండ్ జెర్క్‌లో 181 కేజీల బరువెత్తి 169 కేజీల గత రికార్డును తుడిచిపెట్టాడు. మొత్తంగా బేదబ్రత్ 326 కేజీల బరువెత్తాడు. యూత్ మహిళల 77 కేజీల విభాగంలో గ్రీష్మ తోరట్ రజతం నెగ్గింది.



జాతీయ స్క్వాష్ చాంప్స్ సెంథిల్, అనాహత్

న్యూఢిల్లీ: భారత యువ స్క్వాష్ ప్లేయర్ అనాహత్ సింగ్ వరుసగా మూడోసారి జాతీయ చాంపియన్‌గా అవతరించింది. మహిళల సింగిల్స్‌లో తిరుగులేని ఆధిపత్యం కనబరుస్తున్న అనాహత్ గురువారం ముగిసిన జాతీయ స్క్వాష్ చాంపియన్‌షిప్ ఫైనల్లో 11–7, 11–6, 11–4తో రెండో సీడ్ ఆకాంక్ష సాలుంఖే (గోవా)పై విజయం సాధించింది. టాప్ సీడ్‌గా బరిలోకిగి దిగిన 17 ఏళ్ల అనాహత్... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయింది. సెమీఫైనల్లో సీనియర్ ప్లేయర్ జోష్నా చినప్పను చిత్తు చేసిన ఆకాంక్ష... తుదిపోరులో పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. 2022లో రన్నరప్‌గా నిలిచిన అనాహత్... ఆ తర్వాత వరుసగా మూడో ఏడాది టైటిల్ గెలిచి 'హ్యాట్రిక్' నమోదు చేసుకుంది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో వెలావన్ సెంథిల్ కుమార్ (తమిళనాడు) 11–8, 11–9, 4–11, 11–8తో డిఫెండింగ్ చాంపియన్ అభయ్ సింగ్‌పై గెలిచి టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. సెంథిల్ కుమార్ జాతీయ చాంపియన్‌గా నిలవడం ఇది రెండోసారి. 2023లోనూ అతడు ఈ టైటిల్ చేజిక్కించుకున్నాడు. గత రెండు ఫైనల్స్‌లో అభయ్ చేతిలో ఓడిన సెంథిల్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు.

పాటీదార్, దానిశ్ సెంచరీలు

సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ 432/2 • నార్త్ ఈస్ట్ జోన్‌తో దులీప్ ట్రోఫీ మ్యాచ్


పాటీదార్


దానిశ్

బెంగళూరు: టీమిండియా ఆటగాడు రజత్ పాటీదార్ (96 బంతుల్లో 125; 21 ఫోర్లు, 3 సిక్స్‌లు), దానిశ్ మాలేవర్ (219 బంతుల్లో 198 బ్యాటింగ్; 35 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో కదంతొక్కడంతో సెంట్రల్ జోన్ జట్టు భారీ స్కోరు చేసింది. నార్త్ ఈస్ట్ జోన్‌తో గురువారం ప్రారంభమైన దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో తొలి రోజు ఆట నిలిచే సమయానికి రజత్ పాటీదార్ సారథ్యంలోని సెంట్రల్ జోన్ 77 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 432 పరుగులు చేసింది. గత సీజన్‌లో విదర్భ జట్టు రంజీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించిన 21 ఏళ్ల దానిశ్ డబుల్ సెంచరీకి సమీపించాడు. నార్త్ ఈస్ట్ జోన్ బౌలర్ల అనుభవరాహిత్యాన్ని సొమ్ము చేసుకున్న దానిశ్, రజత్ జంట... ఆడుతూ పాడుతూ పరుగులు రాబట్టింది. వీరిద్దరూ రెండో వికెట్‌కు 199 పరుగులు జోడించారు. వర్షం కారణంగా మ్యాచ్ నిర్ణీత సమయం కంటే ముందే నిలిచిపోగా... తొలిరోజే సెంట్రల్ జోన్ స్పష్టమైన ఆధిక్యం కనబర్చింది. వికెట్ కీపర్ ఆర్యన్ జుయల్ (100 బంతుల్లో 60; 8 ఫోర్లు) హాఫ్ సెంచరీ సాధించగా... రజత్ వేగంగా పరుగులు రాబట్టాడు. భారత జట్టు తరఫున 3 టెస్టులు, ఒక వన్డే మ్యాచ్ ఆడిన పాటీదర్... ప్రత్యర్థి బౌలింగ్‌ను ఆటాడుకున్నాడు. టి20ల తరహాలో ధనాధన్ షాట్‌లతో విజృంభించి జట్టుకు కొండంత స్కోరు అందించాడు. సెంచరీ అనంతరం అతడు అవుట్ కాగా... దానిశ్‌తో పాటు విదర్భ సహచరుడు యశ్ రాథోడ్ (32 బ్యాటింగ్, 4 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. నార్త్ ఈస్ట్ జోన్ బౌలర్లలో ఆకాశ్ చౌదరీ, జతిన్ చెరో వికెట్ పడగొట్టారు.

నార్త్ జోన్ 308/6

దులీప్ ట్రోఫీలో భాగంగా ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న మరో క్వార్టర్స్‌లో నార్త్ జోన్ బ్యాటర్లు సమష్టిగా సత్తా చాటారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన నార్త్ జోన్ జట్టు గురువారం వర్షం కారణంగా ఆట నిలిచేపోయే సమయానికి 75.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 308 పరుగులు చేసింది. ఆయుశ్ బదోనీ (60 బంతుల్లో 63; 7 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... నిశాంత్ సింధు (70 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), కన్హయ్య వాధ్వాన్ (92 బంతుల్లో 42 బ్యాటింగ్; 3 ఫోర్లు), యశ్ ధుల్ (67 బంతుల్లో 39; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ అంకిత్ కుమార్ (42 బంతుల్లో 30; 4 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేశారు. నిశాంత్‌తో పాటు మయాంక్ డాగర్ (22 బంతుల్లో 28 బ్యాటింగ్; 5 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. భారత టెస్టు జట్టులో పునరాగమనం చేసేందుకు ప్రయత్నిస్తున్న సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ ఈస్ట్ జోన్ తరఫున ఒక వికెట్ పడగొట్టగా... మానిశి 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. గతేడాది నవంబర్ తర్వాత బరిలోకి దిగిన తొలి ఫస్ట్‌క్లాస్ గేమ్‌లో షమీ ఆకట్టుకున్నాడు. ఎక్కువ వికెట్లు తీయలేకపోయినా... లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టిపడేశాడు. సుదీర్ఘ స్పెల్స్ వేయగల ఫిట్‌నెస్ లేని కారణంగా ఇటీవల ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక కాని షమీ... గురువారం తొలి రోజు 17 ఓవర్లపాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా బౌలింగ్ చేశాడు.

శుబ్‌మన్ గిల్‌కు గాయం

సెంట్రల్ జోన్ కెప్టెన్ ధ్రువ్ జురెల్, ఈస్ట్ జోన్ కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ అనారోగ్య కారణాల వల్ల దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్‌కు దూరమయ్యారు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో నార్త్ జోన్‌తో జరుగుతున్న పోరులో ఈస్ట్‌జోన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాల్సిన అభిమన్యు జ్వరంతో తప్పుకున్నాడు. ఇప్పటికే ఆకాశ్‌దీప్, ఇషాన్ కిషన్ సేవలు కోల్పోయిన ఈస్ట్‌జోన్‌కు అభిమన్యు కూడా దూరమవడం దెబ్బకొట్టింది. దీంతో రియాన్ పరాగ్‌కు జట్టు పగ్గాలు అప్పగించారు. మరోవైపు నార్త్ ఈస్ట్ జోన్‌తో క్వార్టర్ ఫైనల్లో సెంట్రల్ జట్టుకు ధ్రువ్ జురెల్ కెప్టెన్‌గా వ్యవహరించాల్సి ఉండగా... గాయం కారణంగా అతడు తప్పుకోవడంతో రజత్ పాటీదార్‌కు జట్టు పగ్గాలు దక్కాయి. ఐపీఎల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు తొలి టైటిల్ అందించిన రజత్ పాటీదార్ నార్త్ ఈస్ట్ జోన్‌తో మ్యాచ్‌లో సెంచరీతో కదంతొక్కాడు. నార్త్ జోన్ జట్టుకు శుబ్‌మన్ గిల్ నడిపించాల్సి ఉండగా... అతడు జ్వరం బారిన పడి మ్యాచ్‌కు దూరం కావడంతో... అంకిత్ కుమార్ ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.

చైనా సైనిక కవాతుకు పుతిన్, కిమ్

హాజరుకానున్న 26 దేశాల అధినేతలు
- 10 వేల మంది సిబ్బందితో కవాతు
- తాజా ఆయుధాలను ప్రదర్శించనున్న చైనా

బీజింగ్: సెప్టెంబర్ 3న బీజింగ్‌లో జరగనున్న చైనా సైనిక కవాతుకు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ హాజరవుతారని చైనా తెలిపింది. ఇదొక చారిత్రక పర్యటన అవుతుందని చైనా విదేశాంగ శాఖ గురువారం విలేకరుల సమావేశంలో ప్రకటించింది. ఇది కిమ్ మొట్టమొదటి పాక్షిక అంతర్జాతీయ సమావేశం కాగా, కొత్త ప్రపంచ క్రమం కోసం ప్రయత్నిస్తున్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఇది దౌత్య విజయంగా మారింది. ఉత్తరకొరియా- చైనాలది దశాబ్దాల స్నేహమని, ప్రాంతీయ శాంతి, స్థిరత్వం కోసం రెండు దేశాలు పరస్పరం సహకరించుకుంటూనే ఉంటాయని తెలిపింది.

కవాతుకు 26 మంది దేశాధినేతలు..

రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ లొంగిపోయి 80 ఏళ్లవుతుండగా.. ఆ సంఘర్షణ ముగిసిన సందర్భంగా చైనా 'విక్టరీ డే'కవాతును నిర్వహిస్తోంది. వందలాది యుద్ధ విమానాలు, ట్యాంకులు, యాంటీ-డ్రోన్ వ్యవస్థలతో సహా తన తాజా ఆయుధాలను చైనా ప్రదర్శించే అవకాశం ఉంది. దాని సైన్యం కొత్త దళ నిర్మాణాన్ని పూర్తిగా కవాతులో ప్రదర్శించడం ఇదే మొదటి సారి. ఈ కార్యక్రమంలో పదివేల మంది సైనిక సిబ్బంది చారిత్రాత్మక టియానన్మెన్ స్క్వేర్ గుండా కవాతు చేస్తారు. చైనా సైన్యంలోని 45 స్థాయిల సైనికులు, యుద్ధ అనుభవజ్ఞులు కూడా ఇందులో పాల్గొంటారు. ఈ కవాతుకు హాజరు కానున్న 26 మంది దేశాధినేతల్లో పుతిన్, కిమ్ కూడా ఉంటారు. జిన్‌పింగ్ ఆహ్వానాన్ని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్ తిరస్కరించారు. ఆయన స్థానంలో జాతీయ అసెంబ్లీ స్పీకర్ కిమ్ జిన్-ప్యోను హాజరు కానున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడిని వ్యతిరేకిస్తున్న చాలా పాశ్చాత్య దేశాలు నాయకులు కవాతుకు హాజరు కావడం లేదు. ఇండోనేషియా అధ్యక్షుడు, మలేషియా ప్రధాన మంత్రి, మయన్మార్ సైనిక పాలకుడు, యురోపియన్ యూనియన్ నాయకుడు, స్లోవాక్ ప్రధాన మంత్రి రాబర్ట్ ఫికో, బల్గేరియా, హంగేరీ ప్రతినిధులు కూడా హాజరుకున్నారు. 1959 తర్వాత ఉత్తర కొరియా నాయకుడు చైనా సైనిక కవాతుకు హాజరు కావడం ఇదే తొలిసారి. 2015లో చివరిసారిగా విక్టరీ డే పరేడ్ నిర్వహించినప్పుడు ఉన్నతాధికారులలో ఒకరైన చో ర్యాంగ్-హేను పంపింది.

కవాతులో పాల్గొనొద్దు: తైవాన్

చైనా సైనిక కవాతులో పాల్గొనవద్దని ప్రజాస్వామ్య దేశాలకు తైవాన్ విజ్ఞప్తి చేసింది. చైనా ఈ సమయాన్ని ఉపయోగించుకుని సారూప్యత కలిగిన ప్రభుత్వాల మధ్య చీలికను తీసుకురావచ్చని హెచ్చరించింది. స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య దేశాలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాలని లేదా బహిరంగంగా ఖండించాలని ఆ దేశ విదేశాంగ శాఖ కోరింది. చైనా సైనిక, ఆర్థిక వృద్ధి ఇండో-పసిఫిక్‌లో ఉద్రిక్తతలకు దారి తీస్తుందని, ఒకప్పుడు రక్షణ రంగంలో చైనా కంటే అమెరికా ఎక్కువ ఖర్చు చేసినప్పటికీ, ఇప్పుడు చైనా దాన్ని దాటేసిందని ప్రకటించింది. చైనా రక్షణ వ్యయంలో దాదాపు 90 శాతం ఇండో-పసిఫిక్‌లో, ముఖ్యంగా భారత్-చైనా సరిహద్దులో కేంద్రీకృతమై ఉందని, ఈ సమయంలో అమెరికాతోపాటు మిత్రదేశాలు అప్రమత్తంగా ఉండాలని నొక్కి చెప్పింది.



హిమాచల్‌ప్రదేశ్‌ను భారీ వర్షాలు, మెరుపు వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. మండి జిల్లాలోని కిరాత్‌పూర్-మనాలీ జాతీయ రహదారిపై కొండ చరియలు విరిగిపడటంతో నిలిచిన వాహనాలు

'పీఎం జన్ ధన్ యోజన'తో ఆత్మగౌరవం

ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'పీఎం జన్ ధన్ యోజన'కు 11 ఏళ్లు పూర్తయ్యాయి. తమ భవితను సొంతంగా తీర్చిదిద్దుకునే శక్తిని ఈ పథకం ప్రజలకు ఇచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తి సైతం ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమైతే దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని వెల్లడించారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. పీఎం జన్ ధన్ యోజనతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని, వారి ఆత్మగౌరవం పెరిగిందని ఉద్ఘాటించారు. మారుమూల ప్రాంతాల్లోని పేదలకు సైతం బ్యాంకు ఖాతాలు, బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ''ఇవి గణితశాస్త్ర ఫార్ములాలు కాదు. దేశ అభివృద్ధి ఫార్ములాలు. నవీన ఆవిష్కరణ ద్వారా దేశంలో ఆర్థిక విప్లవం సాధ్యమైంది. చివరి-మైలు బ్యాంకింగ్ నుంచి మహిళల సాధికారత దాకా.. ప్రత్యక్ష నగదు బదిలీ నుంచి పరిపాలన పట్ల ప్రజల్లో పెరిగిన విశ్వాసం దాకా.. పీఎం జన్‌ధన్ యోజన భారతీయ బ్యాంకుల తీరుతెన్నులు మార్చేసింది'' అని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. పీఎం జన్‌ధన్ యోజన 2014 ఆగస్టు 28న ప్రారంభమైన సంగతి తెలిసిందే. దేశంలో ప్రతి కుటుంబానికీ బ్యాంకు ఖాతాల ఇవ్వాలన్న లక్ష్యంలో ఈ పథకాన్ని తీసుకొచ్చారు. దీంతో ప్రజలకు రుణం, బీమా, పెన్షన్ వంటి సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి.

వందే భారత్ రైళ్లకు మరిన్ని బోగీలు

న్యూఢిల్లీ: ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేటు ఎక్కువగా ఉన్న ఏడు రూట్లలోని వందే భారత్ రైళ్లకు మరిన్ని బోగీలను చేర్చాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఆ రూట్లు మంగళూరు సెంట్రల్-తిరువనంతపురం సెంట్రల్, సికింద్రాబాద్-తిరుపతి, చెన్నై ఎగ్మోర్- తిరునల్వేలి, మదురై- బెంగళూరు కంటోన్మెంట్, దియోగఢ్-వారణాసి, హౌరా-రూర్కెలా, ఇండోర్-నాగ్‌పూర్. ఇందులోని నాలుగు రైళ్లకు 8 కోచ్‌లు, మరో మూడింటికి 16 కోచ్‌లు ఉన్నాయి. 16 బోగీలున్న వాటిని 20 బోగీలకు, 8 బోగీలున్న వాటిని 16 బోగీలకు అప్‌గ్రేడ్ చేయనున్నట్లు రైల్వే బోర్డు ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిసిటీ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిలీప్ కుమార్ చెప్పారు. దీనిప్రకారం, మంగళూరు సెంట్రల్- తిరువనంతపురం సెంట్రల్, సికింద్రాబాద్-తిరుపతి, చెన్నై ఎగ్మోర్-తిరునల్వేలి రూట్లలోని 16 బోగీల వందేభారత్ రైళ్లను 20 బోగీలకు, మిగతా నాలుగు రూట్లలోని 8 కోచ్‌ల రైళ్లు 16 బోగీలకు అప్‌గ్రేడ్ అవుతాయని వివరించారు. దీంతోపాటు మరికొన్ని 20 కోచ్‌ల వందే భారత్ రైళ్లు, ఒక 16 కార్ రైలు పట్టా లెక్కించేందుకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఆక్యుపెన్సీని బట్టే వీటిని ప్రారంభిస్తారన్నారు.

తోటి లేబర్ పార్టీ ఎంపీతో బ్రిటిష్ సిఖ్ ఎంపీ వివాహం

లండన్: బ్రిటన్ పార్లమెంట్ సభ్యుడు, అధికార లేబర్ పార్టీకి చెందిన జీవున్ సంధేర్(30) తోటి ఎంపీ లూయిస్ జోన్స్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. సంప్రదాయ సిక్కు మతాచారం ప్రకారం, ఆపైన చర్చిలో బుధవారం పెళ్లి చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సంధేర్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. పార్లమెంట్‌లో హౌస్ ఆఫ్ కామన్స్ నేత లూసీ పావెల్ వీరికి నిశ్చితార్థం అయినట్లు 2024 డిసెంబర్‌లో ప్రకటించారు. లేబర్ పార్టీకి చెందిన వీరిద్దరూ రెండేళ్ల క్రితం ఎన్నికల ప్రచారం సమయంలో కలుసుకున్నారు. ఇంగ్లండ్‌లోని లో బరో స్థానానికి గత జూలైలో జరిగిన ఎన్నికల్లో సంధేర్ భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. అదేవిధంగా, నార్త్ ఈస్ట్ డెర్బీషైర్ నుంచి లూయిస్ జోన్ ఎంపీగా ఎన్నికయ్యారు. ఇంగ్లండ్‌లోని లుటన్‌లో జన్మించిన సంధేర్ తల్లిదండ్రులు పంజాబ్ నుంచి వలసవచ్చారు. సంధేర్ తరచూ తన కుటుంబంతో కలిసి భారత్ వెళ్తుంటారు. ఇండియా ఆల్ పార్లమెంటరీ గ్రూప్(ఏపీపీజీ) కో చైర్‌గా సంధేర్ వ్యవహరిస్తున్నారు. భారత్, యూకేల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు ఈ గ్రూపు కృషి చేస్తుంటుంది.

హరియాణాలో వచ్చేనెల 25న లక్ష్మీ యోజన

చండీగఢ్: హరియాణాలో 'దీన్ దయాళ్ లాడో లక్ష్మీ యోజన'ను వచ్చే నెల 25న ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ ప్రకటించారు. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.2,100 ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెప్పారు. హరియాణా మంత్రివర్గం గురువారం సమావేశమైంది. 'దీన్ దయాళ్ లాడో లక్ష్మీ యోజన' అమలుకు అంగీకారం తెలిపింది. బీజేపీ సిద్ధాంతకర్తల్లో ఒకరైన దీన్ దయాళ్ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 25 నుంచి పథకాన్ని అమలు చేయబోతున్నారు. 23 ఏళ్లు దాటిన నిరుపేద మహిళలు ఈ పథకానికి అర్హులు. రాష్ట్రంలో మొదటి దశలో దాదాపు 20 లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతారని అంచనా. రెండో దశలో మరిన్ని కేటగిరీల మహిళలను ఈ పథకంలో భాగస్వాములను చేయబోతున్నారు.

ఇద్దరు చొరబాటుదారుల హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాన్ని భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. బందిపోరా జిల్లాలోని గురేజ్ సెక్టార్‌లో గురువారం జరిగిన ఈ ఎదురుదాడిలో ఇద్దరు ఉగ్రవాదులు అక్కడికక్కడే మృతిచెందారు. జమ్మూ కశ్మీర్ పోలీసులు అందించిన నిఘా సమాచారం ఆధారంగా దళాలు అప్రమత్తమయ్యాయి. గురేజ్ సెక్టార్‌లో భారత సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించాయి. గురేజ్ సెక్టార్‌లోని నౌషెహ్రా నార్డ్ ప్రాంతంలో కొంతమంది ఉగ్రవాదుల కదలికలను సైన్యం గమనించింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు వారిని హెచ్చరించాయి. దీంతో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా బలగాలు ఎదురు కాల్పులు జరిపాయి. ఆ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులు అక్కడికక్కడే హతమయ్యారు. ఆ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో కశ్మీర్ లోయలో చొరబాటు ప్రయత్నాలు పెరిగాయి. ఆగస్టు 25న బారాముల్లా జిల్లాలోని ఉరీ సెక్టార్‌లో జాయింట్ ఫోర్సెస్ ఒక చొరబాటు ప్రయత్నాన్ని విఫలం చేశాయి. అంతకుముందు ఆగస్టు 13న జరిగిన ఉరీ సెక్టార్‌లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఒక సైనికుడు మరణించారు.

అలసట.. ఆకలి.. భయం..

దుర్భర స్థితిలో గాజా జర్నలిస్టుల రిపోర్టింగ్

దాదాపు రెండేళ్ల యుద్ధంతో పదేపదే నిరాశ్రయులైన అలసట.. ఒక్క కప్పు కాఫీ లేదా డికాక్షన్‌తో రోజంతా గడపడం.. ఏ క్షణాన ఎక్కడి నుంచి దాడి జరుగుతుందో తెలియని భయం. ఇలాంటి పరిస్థితుల్లోనూ వారు రిపోర్టింగ్ చేస్తున్నారు. ప్రాణాలను పణంగా పెట్టి తమ నేలకోసం, అక్కడి ప్రజల కోసం పాటు పడుతున్నారు. ఇప్పుడు వారికి మీడియా హౌస్ అంటే.. వేసవిలో గ్రీన్ హౌస్‌లా, శీతాకాలంలో రిఫ్రిజిరేటర్‌లా ఉండే టెంట్ హౌస్ మాత్రమే. గాజా జర్నలిస్టుల దుర్భర పరిస్థితులపై ఓ లుక్.

'నేను ఒక టెంట్‌లో నివసిస్తూ పని చేసుకుంటున్నా. మానవ ప్రాథమిక అవసరమైన నీరు కూడా లేకుండా బతుకుతానని నేను ఊహించలేదు' అన్నారు అబ్దుల్లా మిక్దాద్. విద్యుత్, ఇంటర్నెట్ కనెక్షన్ కోసం ఆస్పత్రుల చుట్టూ గుడారాలు వేసుకుని పని చేస్తున్న ఎంతో మంది జర్నలిస్టుల్లో ఆయన ఒకరు. గాజా అంతటా విద్యుత్తు నిలిపేశారు. అక్కడక్కడా కొన్ని ఆస్పత్రుల్లో మాత్రమే జనరేటర్లు ఇప్పటికీ పనిచేస్తున్నాయి. అవే.. ఫోన్లు, ఇతర పరికరాలను ఛార్జ్ చేయడానికి విద్యుత్తును అందిస్తున్నాయి. ఆస్పత్రుల దగ్గరుండి పనిచేయడం వాళ్ల ప్రాణాలను పణంగా పెట్టడమే అవుతోంది. ఇజ్రాయెల్ ఆసుపత్రులనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో అనేక మంది జర్నలిస్టులు ప్రాణాలొదిలారు. దక్షిణ నగరమైన ఖాన్ యూనిస్‌లోని నాసర్ ఆసుపత్రిపై సోమవారం ఇజ్రాయెల్ జరిపిన డబుల్ దాడుల్లో ఐదుగురు జర్నలిస్టులు సహా కనీసం 20 మంది మరణించారు.

వార్తలకు డిమాండ్..

అరుదైన సందర్భాల్లో తప్ప ఇతర జర్నలిస్టులను గాజా భూభాగంలోకి పంపడానికి ఇజ్రాయెల్ అనుమతించదు. బీబీసీతో సహా అంతర్జాతీయ వార్తా సంస్థలు గాజాలోని స్థానిక విలేకరులపై ఆధారపడతాయి. దాదాపు రెండేళ్ల యుద్ధంతో వార్తల కవరేజీకి డిమాండ్ కొనసాగుతోంది. ఇదే.. గాజాలోని యువకులకు, గతంలో ఎప్పుడూ జర్నలిజంలో పని చేయనివారికి, విలేకరులు, ఫోటో జర్నలిస్టులుగా మారడానికి తలుపులు తెరిచింది. కొంతమంది జర్నలిస్టులు స్థానిక, అంతర్జాతీయ మీడియా సంస్థల కోసం అధికారికంగా పనిచేస్తారు. కానీ చాలామంది తాత్కాలిక ఒప్పందాలపైనే పనిచేస్తున్నారు. దీంతో వారికి రక్షణ పరికరాలు ఉండవు. బీమా వంటి సౌకర్యాలేమీ ఉండవు. ప్రపంచంలోని ప్రతి జర్నలిస్టుకు అంతర్జాతీయ రక్షణ హక్కు ఉంటుంది. పాలస్తీనా జర్నలిస్టులకు మాత్రం అది వర్తించడం లేదు. గాజాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 197 మంది జర్నలిస్టులు మరణించారు. వీరిలో 189 మంది పాలస్తీనియన్లని అమెరికాకు చెందిన కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) తెలిపింది. ఇజ్రాయెల్ దళాలు తమను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయని గాజాలోని పాలస్తీనియన్ జర్నలిస్ట్స్ సిండికేట్‌కు చెందిన అహెద్ ఫర్వానా అంటున్నారు.

యుద్ధం మార్చేసింది..

రెండేళ్లుగా చావులు, ఆకలి గురించి వార్తలు కవర్ చేయడం తనను పూర్తిగా మార్చేసింది అని జర్మన్ మేగజైన్ డెర్ స్పీగెల్, బీబీసీతో పాటు ఇతర అంతర్జాతీయ సంస్థలతో పనిచేస్తున్న ఘడా అల్-కుర్ద్ తెలిపారు. 'రెండేళ్లుగా యుద్ధం.. మరణాలు.. ఆకలి.. చెప్పిందే చెప్పి భావోద్వేగాలను వ్యక్తీకరించే సామర్థ్యాన్ని, సున్నితత్వాన్ని కోల్పోయాం. నిరంతరం షాక్‌లో ఉంటున్నాం. బహుశా యుద్ధం ముగిసిన తర్వాత ఆ సామర్థ్యాన్ని తిరిగి పొందగలుగుతామో లేదో' అంటున్నారామె. యుద్ధం ప్రారంభంలోనే గాజాపై ఇజ్రాయెల్ దాడిలో తన ఇద్దరు కూతుళ్లను, తన సోదరుడు, అతని కుటుంబాన్ని కోల్పోయారు ఘడా. వారి మృతదేహాలు కూడా దొరకలేదు. శిథిలాల కింద ఉన్నాయని ఆమె నమ్ముతున్నారు. 'యుద్ధం మా మనస్తత్వాలను, వ్యక్తిత్వాలను మార్చేసింది. 7 అక్టోబర్ 2023కి ముందు ఉన్న స్థితికి తిరిగి రావడానికి చాలా కాలం పాటు వైద్యం అవసరం' అని ఆమె చెబుతున్నారు.

ఒక కప్పు కాఫీతో రోజంతా..

'టెంట్ లోపల కూర్చుని పనిచేసుకుంటూ ఉంటాం. ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియదు. ఒక్కసారిగా మీ పరిసరాలు బాంబు దాడికి గురవుతాయి. అయినా సరే.. కెమెరా ముందు, ఏకాగ్రతతో, మానసికంగా అప్రమత్తంగా, అలసట ఉన్నప్పటికీ అది బయటకు కనిపించనివ్వకూడదు.. ఇవన్నీ చేస్తూనే నేనున్న ప్రదేశాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తే ఏం చేయాలో కూడా ఆలోచిస్తూ రిపోర్టింగ్ చేయడం ఎంత కష్టమో ఊహించలేరు' అంటున్నారు జర్నలిస్టులు. భయం ఒక ఎత్తయితే.. కడుపులో పేగులు మెలిపెట్టే ఆకలి బాధ వర్ణనాతీతం. తాము కవర్ చేస్తున్న లక్షలాది మంది ప్రజల్లాగే గాజాలోని జర్నలిస్టులు ఆకలితో మాడిపోతున్నారు. 'బఠానీలను గ్రైండ్ చేసిన పొడితో ఒక కప్పు కాఫీ లేదా ఒక గ్లాసు తియ్యని డికాషన్ తాగి రోజంతా గడుపుతున్నాం' అని చెప్పారు ఇండిపెండెంట్ జర్నలిస్ట్ అహ్మద్ జలాల్. ఆకలి వల్ల తీవ్రమైన తలనొప్పి, అలసటతో బాధపడుతూ ఆయన రిపోర్టింగ్ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే అహ్మద్ తన కుటుంబంతో సహా చాలాసార్లు నిరాశ్రయులయ్యారు. అయినప్పటికీ తన కుటుంబానికి ఆహారం, నీరు, ఆశ్రయం కల్పించడానికి ప్రయత్నిస్తూనే తన పాత్రికేయ వృత్తిని కొనసాగిస్తున్నారు. 'తోటి జర్నలిస్టుల చావుల గురించి రిపోర్ట్ చేసేటప్పుడు నా గుండె నీరవుతోంది. తర్వాత నేనే కావచ్చు అని నా మనస్సు చెబుతుంది... ఆ నొప్పి నన్ను లోపలే దహించివేస్తోంది. కానీ కెమెరా ముందు అవేవీ కనిపించకూడదు. ఊపిరాడనట్లు, అలసిపోయినట్లు, ఆకలిగా, భయంగా ఉంటుంది. అయినా విశ్రాంతి తీసుకోవడానికి కూడా సమయం లేదని చెబుతున్నారు.

జర్నలిస్టులను ఉగ్రవాదులుగా..

ఆగస్టు 10న గాజా నగరంలోని మీడియా టెంట్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఐదుగురు జర్నలిస్టులు మృతి చెందారు. ఆ దాడిలో అల్ జజీరా కరస్పాండెంట్ అనాస్ అల్-షరీఫ్ సహా ముగ్గురు అల్ జజీరా సిబ్బంది, ఇద్దరు ఫ్రీలాన్సర్లు, ఒక వ్యక్తి మరణించారు. వారు అల్‌జజీరాకు చెందినవారు కావడంతో షరీఫ్ హమాస్‌లోని ఉగ్రవాద విభాగానికి అధిపతిగా పనిచేశారని ఇజ్రాయెల్ ఆరోపించింది. సోమవారం నాసర్ ఆసుపత్రిపై జరిగిన మొదటి దాడిలో రాయిటర్స్ కెమెరామెన్ హుసామ్ అల్-మస్రీ మరణించారు. నిమిషాల తర్వాత జరిగిన రెండవ దాడిలో రెస్క్యూ కార్మికులు, సంఘటనా స్థలానికి చేరుకున్న మరో నలుగురు జర్నలిస్టులు మరణించారు. వీరిలో అసోసియేటెడ్ ప్రెస్‌లో పనిచేస్తున్న ఫ్రీలాన్సర్ మరియం అబు దగ్గా, అల్ జజీరా కెమెరామెన్ మొహమ్మద్ సలామా, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అహ్మద్ అబు అజీజ్, ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్ట్ మోజ్ అబు తహా ప్రాణాలు కోల్పోయారు. అయితే.. ఈ సంఘటనపై స్పందించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు విషాదకరమైనదిగా అభివర్ణించారు. చనిపోయిందంతా అల్ జజీరా జర్నలిస్టులే అయితే ఈ ప్రకటన కూడా వచ్చి ఉండేది కాదేమో!

- సాక్షి, నేషనల్ డెస్క్

బస్ షెల్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ఒకే కుటుంబంలోని నలుగురు మృతి

మంగళూరు: కర్నాటక రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు బ్రేకులు ఫెయిలై ఐదు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. గురువారం కాసరగోడ్ నుంచి మంగళూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు దక్షిణ కన్నడ జిల్లాలోని తలపాడి వద్ద బస్ షెల్టర్‌ను, ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక చిన్నారి, మరో నలుగురు పెద్దలు ప్రాణాలు కోల్పోయారు. ఈ నలుగురూ ఒకే కుటుంబంలోని వారని అధికారులు తెలిపారు. మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. బస్ బ్రేక్ విఫలం కావడమే ఘటనకు కారణమని భావిస్తున్నామన్నారు. ప్రమాదంపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

మహారాష్ట్రలో భవనం కూలి 17 మంది మృతి

పాల్ఘార్: మహారాష్ట్రలోని పాల్ఘార్ అనధికారికంగా నిర్మించిన భవనం కూలి 17 మంది చనిపోయారు. విరార్‌లోని నాలుగంతస్తుల భవనం మంగళవారం అర్ధరాత్రి దాటాక కుప్పకూలింది. ఘటన సమయంలో 50 ఫ్లాట్లున్న ఈ భవనంలోని నాలుగో అంతస్తులో ఒక చిన్నారి బర్త్ డే పార్టీ జరుగుతోంది. ఘటన కారణంగా ఆ వింగ్‌లో ఉండే వారంతా శిథిలాల మధ్య ఇరుక్కుపోయారు. మృతుల్లో బర్త్‌డే జరుపుకున్న చిన్నారి కూడా ఉండటం విషాదకరం. గాయపడిన ఆరుగురిని శిథిలాల నుంచి వెలికి తీశారు. శిథిలాల తొలగింపు కొనసాగుతోంది.

శిబూ సోరెన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

జార్ఖండ్ అసెంబ్లీలో తీర్మానం ఆమోదం

రాంచీ: జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) వ్యవస్థాపకుడు, దివంగత నేత శిబూ సోరెన్‌కు భారతరత్నం పురస్కారం ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ జార్ఖండ్ అసెంబ్లీలో గురువారం ఒక తీర్మానం ఆమోదించారు. రవాణా శాఖ మంత్రి దీపక్ బిరువా ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. శిబూ సోరెన్ అందించిన సేవలను గుర్తుచేశారు. అనంతరం మూజువాణి ఓటుతో తీర్మానాన్ని సభ ఆమోదించింది. ప్రతిపక్షాలు సైతం తీర్మానానికి మద్దతు పలికాయి. శిబూ సోరెన్ ఈ నెల 4వ తేదీ తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే.

పాకిస్తాన్‌లో భీకర వరదలు.. 17 మంది మృతి

లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో భారీ వరదల ధాటికి 24 గంటల వ్యవధిలో కనీసం 17 మంది మృతిచెందినట్లు స్థానిక అధికారులు గురువారం ప్రకటించారు. సట్లెజ్, రావి, చినాబ్ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, వందలాది గ్రామాలు నీట మునిగాయని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా పంజాబ్ ప్రావిన్స్‌లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఇళ్లు ధ్వంసమయ్యాయి. రహదారులు కొట్టుకుపోయాయి. మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. జనజీవనం స్తంభించింది. భారీ వర్షాలకుతోడు భారత్‌లోని డ్యామ్‌ల నుంచి అక్కడి ప్రభుత్వం ఒక్కసారిగా నీటిని విడుదల చేయడం వల్లే వరదలు సంభవించినట్లు పాకిస్తాన్ అధికారులు వెల్లడించారు. భారత ప్రభుత్వం తమపై 'జల దాడి'ప్రారంభించిందని పాక్ మంత్రి అహసాన్ ఇక్బాల్ ఆరోపించారు. నీటిని ఆయుధంగా వాడుకోవడం తగదని చెప్పారు. రావి నదిపై భారత భూభాగంలో నిర్మించిన థీన్ డ్యామ్ గేట్లను ఎత్తడంతో దిగువకు వరద పోటెత్తినట్లు పాక్ అధికారులు తెలియజేశారు. థీన్ డ్యామ్‌తోపాటు మాధోపూర్ డ్యామ్ గేట్లను ఎత్తబోతున్నట్లు భారత ప్రభుత్వం ముందుగానే పాక్ సర్కార్‌ను అప్రమత్తం చేసినట్లు సమాచారం. పంజాబ్ ప్రావిన్స్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు సైన్యాన్ని కూడా రంగంలోకి దించారు. పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, పంజాబ్ ముఖ్యమంత్రి మర్యాం నవాజ్ గురువారం హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. వరదల్లో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. వరదల కారణంగా 10 లక్షల మంది ప్రభావితమైనట్లు ప్రభుత్వం అంచనా వేసింది. మరోవైపు కర్తార్‌పూర్ కారిడార్ సైతం నీట మునిగింది. సిక్కులకు పరమ పవిత్రమైన గురుద్వారా దర్బార్ సాహిబ్‌ను నీరు ముంచెత్తింది.

ప్రధాని మోదీ తల్లిపైనా దూషణలా?

రాహుల్‌పై బీజేపీ విమర్శనాస్త్రాలు

న్యూఢిల్లీ/పట్నా: బిహార్‌లో ఓటర్ అధికార్ యాత్ర సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీ తల్లిపైనా దూషణలకు దిగారని బీజేపీ ఆరోపించింది. వచ్చే ఎన్నికల్లో ఆయన పార్టీకి ప్రజలు తగు గుణపాఠం చెబుతారని హెచ్చరించింది. యాత్ర సందర్భంగా రాహుల్ దర్భంగాలో పాల్గొన్న సభలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మోదీని హిందీలో దూషిస్తున్న వీడియో క్లిప్ ఒకటి సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం కావడంతో బీజేపీ తీవ్రంగా స్పందించింది. చనిపోయిన మనిషిపైనా ఇలాంటి భాషను వాడటం రాహుల్‌కు తప్ప మరొకరికి రాదన్నారు. చప్పగా సాగుతున్న యాత్రలో పాల్గొన్న నేతల దూషణలకు హద్దులే లేకుండా పోయాయని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దూషణల దుకాణానికి సీల్ వేయడం బిహార్ నుంచే మొదలు కానుందని వ్యాఖ్యానించారు.

దేశవ్యాప్తంగా వర్షాలు, మెరుపు వరదలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో, హిమాచల్ ప్రదేశ్ నుంచి కేరళ వరకు ఆకస్మిక వరదలతో రహదారులు, వంతెనలు ధ్వంసమవుతున్నాయి. భవనాలు కొట్టుకుపోతున్నాయి. గ్రామాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. పంట పొలాలు నీట మునుగుతున్నాయి. కశ్మీర్‌లో రెండు రోజుల తర్వాత గురువారం వరద ఉధృతి తగ్గడంతో జనం కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో రావి నది ఉప్పొంగడంతో కంగ్రా జిల్లాలోని బడా బంగాల్ గ్రామంలోని ప్రభుత్వ స్కూలు, గ్రామ పంచాయతీ కార్యాలయం, ఆయుర్వేద డిస్పెన్సరీ, రెండు వంతెనలు కొట్టుకుపోయాయి. గ్రామానికి రాష్ట్రానికి సంబంధాలు తెగిపోయాయి.రాష్ట్రంలోని 12 జిల్లాలకు గాను 11 జిల్లాల్లో 536 రోడ్లు ధ్వంసమైనట్లు అధికారులు తెలిపారు. అస్సాంలోని గౌహతిని వరదలు ముంచెత్తాయి. వివిధ ఘటనల్లో ఇద్దరు చనిపోయారు. పంజాబ్‌లోని 8 జిల్లాలు ఆకస్మిక వరదల ప్రభావానికి గురయ్యాయి. దీంతో, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. యూపీలోని వారణాసిలో గంగా నది ప్రమాద హెచ్చరికకు చేరువగా ప్రవహిస్తోంది. దీంతో నిత్యం నిర్వహించే ఆరతి, శవ దహన కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడింది. రాజస్తాన్‌లోని బుంది జిల్లాలో వరద తీవ్రత తగ్గింది. మహారాష్ట్రలోని నాందేడ్, లాతూర్ జిల్లాల్లో అతి భారీ వర్షపాతం నమోదు కావడంతో లోతట్టు ప్రాంతాల్లోని 2,200 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కేరళలో భారీ వర్షాలకు వయనాడ్ జిల్లాలోని తమరస్సేరీ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. కర్నాటకలోని బీదర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రహదారులపైకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దక్షిణ కన్నడ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయడంతో గురువారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు.



ప్రధాని మోదీ వణికిపోతున్నారు: రాహుల్

మోతిహారి/సీతామర్హి: బిహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రతో ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ప్రధాని మోదీలో వణుకు మొదలైందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. యాత్రలో భాగంగా గురువారం ఆయన మోతిహారిలో మాట్లాడారు. రాష్ట్రంలో ఓటరు జాబితా సవరణ చేపట్టి ఈసీ తొలగించిన 65 లక్షల ఓటర్లు పేదులు, సమాజంలో అణగారిన వర్గాల వారివేనని ఆరోపించారు. బీజేపీ, ఈసీలు ఓటు హక్కును లాగేసుకువడాన్ని బిహార్ ప్రజలు సహించబోరని తెలిపారు. 'ఓట్ చోరీపై రోజు మాట్లాడుతున్నా, ప్రధాని ఎందుకు మౌనంగా ఉంటున్నారని మీరనుకుంటున్నారు? ఆయన దొరికిపోయారు. ఆయన అసలు స్వరూపం తెలిసింది. ఓటర్ అధికార్ యాత్రకు లభిస్తున్న ప్రజా స్పందనతో ప్రధాని వణుకుతున్నారు' అని రాహుల్ పేర్కొన్నారు. గతేడాది లోక్‌సభ ఎన్నికలయ్యాక మహారాష్ట్రలో ఎన్నికల కమిషన్ కనీసం కోటి మందిని కొత్త ఓటర్లుగా చేర్చిందని ఆరోపించారు.

ఇజ్రాయెల్ దాడి..'డబుల్ ట్రాప్'

గాజా సిటీ: గాజా ప్రాంతంలోని ఖాన్‌యూనిస్ నగరంలోగల నాస్సెర్ ఆస్పత్రిపై సోమవారం ఇజ్రాయెల్ జరిపిన భీకరదాడులకు సంబంధించిన మరో నిజం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ రోజు ఉదయం 10 గంటల సమయంలో ఆస్పత్రి బాల్కనీపై మొదటగా దాడి జరిగింది. ఆ ఘటనలో రాయిటర్స్ కెమెరామాన్ మరికొందరు చనిపోయారు. మరో 9 నిమిషాల తర్వాత సహాయక సిబ్బంది, జర్నలిస్టులు రాగా వారిపై మరోసారి ఇజ్రాయెల్ దాడికి పాల్పడినట్లు భావించారు. కానీ, తాజాగా వెలుగులోకి వచ్చిన మరో వీడియోను బట్టి అది తప్పని తేలింది. మొదటిదాడి తర్వాత ఇజ్రాయెల్ ఆర్మీ ఒకటి కాదు..వెంటవెంటనే రెండు దాడులు చేసినట్లు అర్థమవుతోంది. దీనివల్లే మృతుల, క్షతగాత్రుల సంఖ్య ఎక్కువైందని అర్థమవుతుంది.

వారసత్వ రాజకీయాలు చేస్తున్న అమిత్ షా

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధ్వజం

కోల్‌కతా: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) అధ్యక్షురాలు మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. అమిత్ షా వారసత్వ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన తనయుడు జై షా క్రికెట్ బోర్డు అధ్యక్షుడిగా పని చేస్తున్నాడని గుర్తుచేశారు. రూ.వేల కోట్ల విలువైన లావాదేవీలు జై షా కనుసన్నల్లో జరుగుతున్నాయని తెలిపారు. ఇది వారసత్వ రాజకీయం కాకపోతే సోషలిజమా? అని ప్రశ్నించారు. గురువారం టీఎంసీ విద్యార్థి విభాగమైన తృణమూల్ ఛాత్ర పరిషత్ వ్యవస్థాపక దినోత్సవంలో మమతా బెనర్జీ మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఎన్నికల సంఘం లాలీపాప్‌గా మారిందని ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరిట ఓట్ల చోరీ జరుగుతోందని విమర్శించారు.

పార్లమెంట్‌కు ఏజెంట్‌గా వ్యవహరించేది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



రాజ్యాంగబద్ధ సంస్థలు

అటార్నీ జనరల్

భారత రాజ్యాంగంలోని ఐదో భాగం, ఒకటో అధ్యాయంలో అటార్నీ జనరల్ పదవి గురించి వివరించారు. ఆర్టికల్ 76 ప్రకారం ప్రధానమంత్రి సూచన మేరకు రాష్ట్రపతి అటార్నీ జనరల్‌ను నియమిస్తారు. ఆర్టికల్ 76(1) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి నియామకానికి ఉండాల్సిన అర్హతలన్నీ అటార్నీ జనరల్ నియామకానికి అవసరం. 'అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా' పదవిని బ్రిటన్ నుంచి గ్రహించారు. అటార్నీ జనరల్ కేంద్ర ప్రభుత్వానికి మొదటి న్యాయాధికారి, భారతదేశంలోనూ తొలి న్యాయాధికారి. సుప్రీం కోర్టులో, దేశంలోని అన్ని హైకోర్టుల్లో వాదించే అధికారం ఉన్న ఏకైక వ్యక్తి అటార్నీ జనరల్. కేంద్రానికి సంబంధించిన అన్ని రకాల వివాదాంశాలపై న్యాయస్థానాల్లో వాదించే అధికారం ఉన్న ప్రధాన న్యాయాధికారి ఇతడే. విధి నిర్వహణలో అటార్నీ జనరల్‌కు ఇద్దరు సోలిసిటర్ జనరల్స్, నలుగురు అసిస్టెంట్ సోలిసిటర్ జనరల్స్ సహాయం చేస్తారు.

అటార్నీ జనరల్ పదవిలో ఉన్న వ్యక్తి ఏ కంపెనీలోనూ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించరాదు. ఆర్టికల్ 88 ప్రకారం అటార్నీ జనరల్ పార్లమెంట్‌లో సభ్యుడు కాకపోయినా ఉభయ సభల చర్చల్లో పాల్గొనే అధికారం ఉంది. కానీ ఓటు వేసే అధికారం లేదు. కేంద్రం అనుమతి లేకుండా అటార్నీ జనరల్ ఎవరి కేసుల్లోనూ వాదనలు వినిపించకూడదు. ఆర్టికల్ 76(4) ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం చూరగొన్నంత వరకు అటార్నీ జనరల్ అధికారంలో ఉంటాడు. రాష్ట్రపతి నిర్ణయించిన జీతభత్యాలను పొందుతాడు. అటార్నీ జనరల్ ప్రస్తుత వేతనం రూ. 2,25,000. వేతనంతోపాటు ఇతర సౌకర్యాలను పొందుతాడు. అటార్నీ జనరల్ రాజీనామా లేఖను రాష్ట్రపతికి సమర్పించాలి. భారత రాష్ట్రపతి న్యాయపరమైన అంశాలపై సూచనలు, సలహాలు కోరితే వివరణాత్మకమైన సూచనలు, సలహాలు ఇచ్చే అధికారం అటార్నీ జనరల్‌కు ఉంది.

అడ్వకేట్ జనరల్ (ఎ.జి.)

రాజ్యాంగంలోని ఆర్టికల్ 165 ప్రకారం సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సూచన మేరకు అడ్వకేట్ జనరల్‌ను గవర్నర్ నియమిస్తారు.
రాష్ట్రంలో మొదటి న్యాయాధికారి అడ్వకేట్ జనరల్. గవర్నర్ విశ్వాసం చూరగొన్నంత వరకు ఎ.జి. పదవిలో కొనసాగుతాడు. రాష్ట్ర శాసనసభ చర్చల్లో అడ్వకేట్ జనరల్ పాల్గొంటాడు, కానీ ఓటువేసే అధికారం లేదు. అడ్వకేట్ జనరల్‌గా నియమితుడయ్యే వ్యక్తికి హైకోర్టు న్యాయమూర్తికి ఉండాల్సిన అర్హతలుండాలి.

ఆర్టికల్ 165(1), 165(3)లో అడ్వకేట్ జనరల్ అర్హతలు, జీతభత్యాలను స్పష్టంగా ప్రస్తావించారు. గవర్నర్ నిర్ణయం మేరకు రాష్ట్ర సంఘటిత నిధి నుంచి అడ్వకేట్ జనరల్ వేతనాన్ని చెల్లిస్తారు. ఆర్టికల్ 194(4) ప్రకారం ఎమ్మెల్యేలకు వర్తించే హక్కులు, రక్షణలన్నీ అడ్వకేట్ జనరల్‌కు వర్తిస్తాయి. ఆయన రాష్ట్ర కార్య నిర్వాహక వర్గంలో అంతర్భాగం. కానీ రాష్ట్ర మంత్రి మండలిలో అంతర్భాగం కాదు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)

రాజ్యాంగంలోని ఐదో భాగం, ఐదో అధ్యాయంలో 148 నుంచి 151 వరకు ఉన్న అధికరణలు కాగ్ గురించి తెలుపుతున్నాయి. ఆర్టికల్ 148 ప్రకారం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను రాష్ట్రపతి నియమిస్తారు. ఆర్టికల్ 149 ప్రకారం కేంద్రం, రాష్ట్రాల ఖాతాలను కాగ్ నిర్వహిస్తాడు. ఆర్టికల్ 150 ప్రకారం కేంద్ర, రాష్ట్రాల ఖాతాలను కాగ్ తనిఖీ చేస్తాడు. ఆర్టికల్ 151 ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆడిట్ వార్షిక నివేదికను కాగ్ రాష్ట్రపతికి సమర్పిస్తాడు. రాష్ట్రపతి పార్లమెంట్‌కు పంపిస్తారు.

రాష్ట్రాలకు సంబంధించిన ఖాతాలను కాగ్ తనిఖీ చేసి, వార్షిక నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తాడు. గవర్నర్ రాష్ట్ర శాసనసభకు సమర్పిస్తారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీ కాలం ఆరేళ్లు లేదా ఆ పదవిని చేపట్టిన వ్యక్తికి 65 ఏళ్లు వచ్చే వరకు. కాగ్ అధికార దుర్వినియోగానికి పాల్పడితే పార్లమెంట్ అభిశంసన ద్వారా రాష్ట్రపతి అతణ్ని పదవి నుంచి తొలగిస్తారు. ప్రభుత్వ ఖాతాల సంఘానికి కాగ్ కళ్లు, చెవుల్లాంటివాడు. భారత సంఘటిత నిధి నుంచి కేంద్రం ఖర్చు చేసిన ధనం చట్ట ప్రకారం ఉందా? లేదా అని కాగ్ తనిఖీ చేస్తాడు.

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా కాగ్ పరిధి నుంచి అకౌంటింగ్ బాధ్యతలను వేరు చేశారు. కాగ్ ప్రభుత్వ కంపెనీల ఖాతాలను వ్యాపార పద్ధతిలో ఆడిట్ చేస్తాడు. భారత ప్రభుత్వంలో రాజ్యాంగ సృష్టించిన ముఖ్య అధికారి కాగ్ అని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. కాగ్ వేతనం, ఇతర సౌకర్యాలను భారత సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. కాగ్ వేతనాన్ని పార్లమెంట్ చట్ట ప్రకారం నిర్ణయిస్తారు. పదవిని స్వీకరించేటప్పుడు రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడతానని కాగ్ ప్రమాణం చేయాలి. కాగ్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన వ్యక్తి ఏ ఇతర ప్రభుత్వ నియామకాలకు అర్హుడు కాదు. ప్రస్తుతం కాగ్ వేతనం రూ. 2,25,000.

కేంద్ర సంఘటిత నిధి, రాష్ట్ర సంఘటిత నిధి, కేంద్ర ఆగంతుక నిధి, కేంద్ర పబ్లిక్ నిధి, రాష్ట్ర పబ్లిక్ నిధి, శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతాల ఖాతాలను కాగ్ పరిశీలించి నివేదిక ఇస్తాడు. కాగ్ పదవిని బ్రిటిష్ వ్యవస్థ నుంచి తీసుకున్నారు. బ్రిటన్‌లో ఈ పదవిని కాంప్ట్ అని పిలుస్తారు. ఆర్‌బీఐ, ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ, ఎఫ్‌సీఐ లాంటి సంస్థలు, కార్పొరేషన్లు పూర్తిగా ప్రైవేట్ ఆడిటర్‌లతో తమ ఖాతాలను ఆడిట్ చేయిస్తాయి. ఈ అంశంలో కాగ్‌కు సంబంధం ఉండదు. ఈ సంస్థలు తమ వార్షిక ఖాతాల నివేదికలను పార్లమెంట్‌కే సమర్పిస్తాయి.

కాగ్ వెలికితీసిన కుంభకోణాలు

- టెలికాం 2జీ (రెండోతరం) స్పెక్ట్రం వేలం.
- ముంబై ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ కుంభకోణం, కామన్‌వెల్త్ క్రీడల్లో అవినీతి, బొగ్గు గనుల కేటాయింపులో అవకతవకలు.
- ఓఎన్‌జీసీ(ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) నుంచి వేలం ప్రక్రియ నిర్వహించకుండానే గ్యాస్ నిక్షేపాలను వెలికి తీసేందుకు రిలయన్స్ సంస్థకు అనుమతి ఇవ్వడం. దేవాస్ అనే ప్రైవేట్ కంపెనీకి లాభం చేకూర్చేలా అత్యంత విలువైన ఎస్-బ్యాండ్ ప్రసారాలకు రహస్యంగా అనుమతి మంజూరు చేయడం.
- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లోపాలు.
- అగస్టా వెస్ట్‌ల్యాండ్ కంపెనీ హెలికాప్టర్ కొనుగోలు ఒప్పందం.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీకాలం?
ఎ) ఐదేళ్లు
బి) ఆరేళ్లు
సి) ఏడేళ్లు
డి) నాలుగేళ్లు
2. అటార్నీ జనరల్ ఆ పదవిలో ఎంత కాలం పాటు కొనసాగుతారు?
ఎ) నాలుగేళ్లు
బి) ఆరేళ్లు
సి) ఏడేళ్లు
డి) రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు
3. కింద పేర్కొన్న ఏ బాధ్యతను భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నిర్వర్తించరు?
ఎ) భారత సంఘటిత నిధికి చెందిన వ్యయానికి సంబంధించి తనిఖీ, నివేదిక
బి) ఆగంతుక నిధి, పబ్లిక్ అకౌంట్ల తనిఖీ, నివేదిక
సి) అన్ని రకాల వాణిజ్యం, ఉత్పత్తి, లాభం, నష్టాలకు సంబంధించిన తనిఖీ, నివేదిక
డి) ప్రజా ధనానికి సంబంధించిన వసూళ్లు, విడుదల నియంత్రణ; కోశాధికారి వద్ద ప్రభుత్వ ఆదాయాన్ని నిల్వ చేసేలా చూడటం
4. ఏ నివేదికలను పార్లమెంట్‌కు సమర్పించేలా రాష్ట్రపతి చర్యలు తీసుకుంటారు?
ఎ) కేంద్ర ఆర్థిక సంఘం
బి) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
సి) జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్
డి) పైవన్నీ
5. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉమ్మడిగా వర్తించే రాజ్యాంగ సంస్థలు?
ఎ) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
బి) అటార్నీ జనరల్
సి) సోలిసిటర్ జనరల్
డి) పైవన్నీ సరైనవే
6. అటార్నీ జనరల్‌కు సంబంధించి సరైంది?
ఎ) సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ఉండాల్సిన అర్హతలు ఉండాలి
బి) పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనవచ్చు
సి) పార్లమెంట్ సభ్యులకు ఉన్న అధికారాలు ఉంటాయి
డి) పైవన్నీ సరైనవే
7. ఏ రాజ్యాంగ బద్ధమైన పదవిని చేపట్టిన వారు పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ నియామకాలకు అర్హులు కారు?
ఎ) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
బి) యూపీఎస్సీ ఛైర్మన్
సి) అటార్నీ జనరల్
డి) ఎ, బి
8. అటార్నీ జనరల్‌గా నియమితుడయ్యే వ్యక్తికి కింద పేర్కొన వారిలో ఎవరితో సమానమైన అర్హతలు ఉండాలి?
ఎ) హైకోర్టు న్యాయమూర్తి
బి) సుప్రీంకోర్టు న్యాయమూర్తి
సి) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
9. భారతదేశంలో అత్యున్నత న్యాయాధికారి ఎవరు?
ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
బి) అటార్నీ జనరల్
సి) అడ్వకేట్ జనరల్
డి) సోలిసిటర్ జనరల్

సమాధానాలు

1) బి; 2) డి; 3) డి; 4) డి;
5) ఎ; 6) డి; 7) డి; 8) బి;
9) బి.

మాదిరి ప్రశ్నలు

1. ఫ్యాక్టరీలు, కర్మాగారాల్లో బాలకార్మికులు పనిచేయడాన్ని నిషేధించే ఆర్టికల్?
ఎ) ఆర్టికల్ 24 బి) ఆర్టికల్ 25
సి) ఆర్టికల్ 26 డి) ఆర్టికల్ 22
2. ఏ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు న్యాయ సలహా కోరవచ్చు?
ఎ) 142 బి) 144
సి) 143 డి) 145
3. రాష్ట్రపతిగా ఎన్నికయ్యేందుకు గరిష్ఠ వయసు?
ఎ) 75 బి) 70
సి) 80 డి) పరిమితి లేదు
4. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతున్న ఆర్టికల్స్?
ఎ) 12-32 బి) 13-32
సి) 13-25 డి) 12-35
5. రాజ్యాంగ సవరణ గురించి తెలిపే ఆర్టికల్ ఏది?
ఎ) ఆర్టికల్ 367 బి) ఆర్టికల్ 368
సి) ఆర్టికల్ 369 డి) ఆర్టికల్ 370
6. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా రద్దు చేయడానికి రాష్ట్రపతికి అధికారం కల్పించే అంశాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
ఎ) ఫ్రాన్స్ బి) ఐర్లాండ్
సి) కెనడా డి) జర్మనీ
7. ప్రధానమంత్రి సమానుల్లో ప్రథముడు అని అభిప్రాయపడింది?
ఎ) లాస్కీ బి) లార్డ్‌మార్లీ
సి) ఐవర్ జెన్నీ డి) రామ్‌సే మ్యూర్
8. పార్లమెంట్‌కు ఏజెంట్‌గా వ్యవహరించేది?
ఎ) స్పీకర్ బి) అటార్నీ జనరల్
సి) కాగ్ డి) సొలిసిటర్ జనరల్
9. జాతీయ మహిళా కమిషన్ తొలి అధ్యక్షురాలు?
ఎ) మోహినిగిరి
బి) పూర్ణిమా అద్వానీ
సి) విభా పార్థసారథి
డి) జయంతీ పట్నాయక్
10. పౌరహక్కుల రక్షణ చట్టాన్ని ఎప్పుడు చేశారు?
ఎ) 1951 బి) 1952
సి) 1953 డి) 1955
11. కనీస వేతనాల చట్టాన్ని ఎప్పుడు చేశారు?
ఎ) 1996 బి) 1980
సి) 1982 డి) 1948

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) డి;
5) బి; 6) డి; 7) బి; 8) సి;
9) డి; 10) డి; 11) డి.

విద్య, ఉద్యోగ సమాచారం

ప్రధాన మంత్రి యశస్వి స్కాలర్‌షిప్-2025


- పీఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రంట్ ఇండియా(పీఎం యశస్వి).. ఓబీసీ, ఈబీసీ, డీఎన్‌టీ వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన 9వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు ప్రీమియం స్థాయి విద్యను అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ స్కాలర్‌షిప్‌ను అమలు చేస్తోంది. ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఇతర ఖర్చులను ఈ స్కాలర్‌షిప్ కింద అందించనుంది.
- **స్కాలర్‌షిప్ వివరాలు:** ప్రధాన మంత్రి యశస్వి స్కాలర్‌షిప్ టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కీమ్ కేంద్ర ప్రభుత్వ రంగ స్కాలర్‌షిప్ (ఓబీసీ, ఈబీసీ, డీఎన్‌టీ విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా).
- **9వ తరగతి, 10వ తరగతి:** ప్రతి సంవత్సరం రూ.75,000 వరకు
- **11వ తరగతి, 12వ తరగతి:** ప్రతి సంవత్సరం రూ.1,25,000 వరకు
- **అర్హత:** ఓబీసీ, ఈబీసీ, డీనోటిఫైడ్ ట్రైబల్ వర్గాలకు చెందిన విద్యార్థుల ఎంపిక పూర్తిగా ప్రతిభ(గత తరగతి మార్కుల ఆధారంగా) జరుగుతుంది. వార్షిక కుటుంబ ఆదాయం రూ.2.5 లక్షల కంటే తక్కువగా ఉండాలి. ఈ స్కాలర్‌షిప్ కేవలం ఎంపికచేసిన 'టాప్ క్లాస్ స్కూల్స్'లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుంది.
- **వయసు:** 13 నుంచి 18 ఏళ్లలోపు ఉండాలి.
- **అవసరమైన సర్టిఫికేట్లు:** కుల, కుటుంబ, ఆదాయ సర్టిఫికేట్లు, గత తరగతి మార్కుల మెమో, ఆధార్, విద్యార్థి బ్యాంక్ ఖాతా వివరాలు, పాఠశాల నోడల్ ఆఫీసర్ సర్టిఫికేట్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 31.08.2025.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://scholarships.gov.in/

బ్రిక్-ఎన్ఐఐ, న్యూఢిల్లీలో సీనియర్ రీసెర్చ్ ఫెలోలు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ (బ్రిక్-ఎన్ఐఐ) ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రీసెర్చ్ ఫెలోల (ఎస్ఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.42,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.09.2025.
- **ఇంటర్వ్యూ తేది:** 08.09.2025.
- **వెబ్‌సైట్:** https://www.nii.res.in/

ఆధునిక జన్యు శాస్త్ర పితామహుడు ఎవరు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. 'ఫ్లేమ్ ఆఫ్ ది ఫారెస్ట్' అని దేన్ని పిలుస్తారు?
ఎ) మామిడి బి) వేప
సి) మోదుగ డి) తుమ్మ
2. లెగ్యూమ్ మొక్కల్లో నత్రజని స్థాపన చేసే బ్యాక్టీరియా ఏది?
ఎ) రైజోబియం బి) అజటోబాక్టర్
సి) అజోస్పైరిల్లం డి) రోడోస్పైరిల్లం
3. వరి పొలాల్లో నత్రజని కోసం ఏ జీవ ఎరువును వాడతారు?
ఎ) రైజోబియం బి) గ్రీన్‌మాన్యూర్
సి) అజొల్లా డి) క్లాస్ట్రీడియం
4. శంకువు రూపంలో ఉండే పుష్పాలు వేటిలో ఉంటాయి?
ఎ) వివృత బీజాలు బి) ఆవృత బీజాలు
సి) టెరిడోఫైటా డి) బ్రయోఫైటా
5. కిందివాటిలో వేగంగా పెరిగే మొక్క ఏది?
ఎ) చిక్కుడు బి) మల్లె
సి) వెదురు డి) నందివర్ధనం
6. నత్తల ద్వారా జరిగే పరాగ సంపర్కం?
ఎ) కీరప్టిరోఫిలి బి) మెలకోఫిలి
సి) సర్పెంటోఫిలి డి) ఎంటమోఫిలి
7. ఆధునిక జన్యు శాస్త్ర పితామహుడెవరు?
ఎ) మెండల్ బి) వాట్సన్
సి) హెచ్.జి. ఖొరానా
డి) టి.హెచ్. మోర్గాన్
8. వరిలో క్రోమోజోముల సంఖ్య?
ఎ) 12 బి) 24
సి) 36 డి) 46
9. చెరకులో ఎర్రకుళ్లు తెగులు దేని వల్ల సోకుతుంది?
ఎ) పైరిక్యులేరియా బి) ఫైటాప్‌థోరా
సి) కొలిటోట్రైకం డి) పక్సీనియా
10. వైరస్ అంటే అర్థమేమిటి?
ఎ) స్పాంజ్ బి) విషం
సి) ఆమ్లం డి) ఏదీకాదు
11. పించ్ పక్షులపై పరిశోధనలు చేసినవారు?
ఎ) డార్విన్ బి) మెండెల్
సి) మోర్గాన్ డి) రాబర్ట్‌హుక్
12. రిసర్పిన్ దేని నుంచి లభిస్తుంది?
ఎ) రావుల్ఫియా బి) కేసియా
సి) ఆసిమం డి) కాల్షియా
13. మొదటి నిజమైన నేల మొక్కలేవి?
ఎ) బ్రయోఫైటా బి) టెరిడోఫైటా
సి) జిమ్నోస్పెర్మ్స్ డి) ఆంజియోస్పెర్మ్స్
14. C_3 పథంలో ఏర్పడే మొదటి పదార్థం ఏది?
ఎ) OAA బి) PGA
సి) PHB డి) RUBP
15. మొక్కలు వాతావరణంలోకి విడుదల చేసే O_2 దేని నుంచి లభిస్తుంది?
ఎ) CO_2 బి) సూర్యరశ్మి
సి) పత్రహరితం డి) H_2O
16. నీటి బిందువుల రూపంలో పత్రం శీర్షం నుంచి విడుదలవడాన్ని ఏమంటారు?
ఎ) ట్రాన్స్‌పిరేషన్ బి) ఎవాపరేషన్
సి) గట్టేషన్ (Guttation) డి) ట్రాన్స్‌క్రిప్షన్
17. ఫలాలు త్వరగా పక్వం చెందడానికి ఉపయోగపడే హార్మోన్ ఏది?
ఎ) ఆక్సిన్లు బి) జిబ్బరిలిన్లు
సి) సైటోకైనిన్లు డి) ఇథిలిన్
18. ఏ కాంతిలో కిరణజన్య సంయోగక్రియ ఎక్కువగా జరుగుతుంది?
ఎ) నీలం బి) ఎరుపు
సి) ఆకుపచ్చ డి) ఇండిగో
19. 'కణ భాండాగారం' అని దేన్ని పిలుస్తారు?
ఎ) మైటోకాండ్రియా బి) రైబోజోమ్స్
సి) రిక్తిక డి) హరిత రేణువు
20. ఏ మూలక లోపం వల్ల 'చిన్న ఆకుతెగులు' సంభవిస్తుంది?
ఎ) Mn బి) Zn సి) Fe డి) K
21. 'ప్రకృతి పారిశుద్ధ్య కార్మికులు'గా వేటిని పేర్కొంటారు?
ఎ) వైరస్ బి) బ్యాక్టీరియా
సి) ప్రోటోజోవా డి) ఫంగస్
22. కిందివాటిలో ఉప ఉత్పన్నం ఏది?
ఎ) జిగురు బి) లేటెక్స్
సి) రెజిన్లు డి) పైవన్నీ
23. గోల్డెన్‌రైస్‌లో ఉండే విటమిన్ ఏది?
ఎ) విటమిన్ -ఎ బి) విటమిన్ - సి
సి) విటమిన్ - డి డి) విటమిన్ -ఇ
24. కణజాలవర్ధనంలో పూర్తి మొక్కను/మొక్కలను ఏర్పరచగలిగే కణ సామర్థ్యాన్ని ఏమంటారు?
ఎ) టోటిపొటెన్సీ బి) ఎఫిసియెన్సీ
సి) పార్థినోకార్పి డి) ఎఫినిటీ
25. సాధారణంగా శిలీంధ్రాలు అనేవి?
ఎ) స్వయం పోషకాలు
బి) పరాన్నజీవులు సి) పూతికాహారులు
డి) సహజీవన జీవులు
26. ట్రైకోడెర్మా అనేది ఒక..?
ఎ) శిలీంధ్రం బి) శైవలం
సి) బ్యాక్టీరియా డి) ప్రోటోజోవా
27. అలెగ్జాండర్ ఫ్లెమింగ్‌కు నోబెల్ బహుమతి ఎప్పుడు లభించింది?
ఎ) 1928 బి) 1930
సి) 1919 డి) 1945
28. జంతు రాజ్యంలో అతి పెద్ద వర్గం ఏది?
ఎ) ప్రోటోజోవా బి) ఆర్థ్రోపొడ
సి) మొలస్కా డి) క్షీరదాలు
29. జీవితాంతం నీటిని తీసుకోని జీవి ఏది?
ఎ) డెవిల్ ఫిష్ బి) కటిల్ ఫిష్
సి) సిల్వర్ ఫిష్ డి) స్టార్ ఫిష్
30. 'గైనకోమాస్టిజం' దేనిలో కనిపిస్తుంది?
ఎ) ప్లాటిపస్ బి) ఎఖిడ్నా
సి) కంగారు డి) వానపాము
31. కుక్కలో క్రోమోజోముల సంఖ్య?
ఎ) 72 బి) 36
సి) 78 డి) 46
32. దయాఫ్రాం ఏ వర్గానికి చెందిన జీవుల్లో ఉంటుంది?
ఎ) క్షీరదాలు బి) సరీసృపాలు
సి) పక్షులు డి) ఉభయచరాలు
33. వానపాములో చలనాంగాలేవి?
ఎ) వాజాలు బి) పిచ్చాలు
సి) సీటాలు డి) ఈకలు
34. కీటకాల రక్తంలో ఉండేది?
ఎ) హీమోగ్లోబిన్ బి) హీమోసయనిన్
సి) హీమోక్లోరిబియం
డి) పైవన్నీ
35. ఉద్దయ కందరాలు వేటిలో ఉంటాయి?
ఎ) పక్షులు బి) కీటకాలు
సి) సరీసృపాలు డి) క్షీరదాలు
36. ఏనుగు గర్భావధి కాలం ఎంత?
ఎ) 330-350 రోజులు
బి) 630-660 రోజులు
సి) 270-280 రోజులు
డి) 150-160 రోజులు
37. చేపల ద్వారా లభించే విటమిన్లేవి?
ఎ) బి, సి బి) ఎ, ఇ
సి) ఎ, డి డి) బి, డి
38. రక్తవర్గం Bలో ఉండే యాంటీబాడీస్?
ఎ) A బి) B సి) AB డి) O
39. జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం PH విలువ ఎంత?
ఎ) 3.0 బి) 2.0
సి) 4.5 డి) 7.4
40. గాంబియా జ్వరం దేనివల్ల సంభవిస్తుంది?
ఎ) ట్రిపానోసోమా బి) ప్లాస్మోడియం
సి) లీష్మానియా డి) పైలేరియా
41. పాలలో ఉండే చక్కెర ఏది?
ఎ) లాక్టోస్ బి) కేసిన్
సి) సుక్రోస్ డి) ఫ్రక్టోస్
42. నాడీ వ్యవస్థలో ముఖ్యంగా ఉపయోగపడే మూలకం ఏది?
ఎ) Na బి) Ca
సి) P డి) I
43. తెలంగాణ రాష్ట్ర పక్షి ఏది?
ఎ) పావురం బి) పాలపిట్ట
సి) కోకిల డి) నెమలి
44. ఎముకల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) కాంకాలజీ బి) ఆంకాలజీ
సి) ఆస్టియాలజీ డి) ఆప్తమాలజీ
45. ప్లనేరియాలో విసర్జకావయవాలు ఏవి?
ఎ) మాల్ఫీజియన్ నాళాలు
బి) ఫ్లేమ్ సెల్స్ సి) వృక్కాలు
డి) ట్రాఖియా
46. 'S' ఆకారంలో కేంద్రకం వేటిలో ఉంటుంది?
ఎ) అసిడోఫిల్స్ బి) న్యూట్రోఫిల్స్
సి) బేసోఫిల్స్ డి) లింఫోసైట్స్
47. పెరుగుదల హార్మోన్ లోపం వల్ల చిన్న పిల్లల్లో సంభవించే వ్యాధి?
ఎ) క్రిటినిజం బి) జిగాంటిజం
సి) ఆస్టియోమలేషియా
డి) ఆర్థ్రైటిస్
48. స్త్రీలలో ఉండే క్రోమోజోములు?
ఎ) XX బి) XY
సి) XXY డి) XYX
49. యూరికోటెలిక్ జీవులు ఏవి?
ఎ) సరీసృపాలు బి) పక్షులు
సి) ఆర్థ్రోపొడ డి) పైవన్నీ
50. మొదటగా కనుగొన్న క్లోన్ ఏది?
ఎ) జియోజియో బి) స్నాటి
సి) డాలి డి) విజి-బి

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) సి; 4) ఎ;
5) సి; 6) బి; 7) డి; 8) బి;
9) సి; 10) బి; 11) ఎ; 12) ఎ;
13) బి; 14) బి; 15) డి; 16) సి;
17) డి; 18) బి; 19) సి; 20) బి;
21) బి; 22) డి; 23) ఎ; 24) ఎ;
25) సి; 26) ఎ; 27) డి; 28) బి;
29) సి; 30) ఎ; 31) సి; 32) ఎ;
33) సి; 34) బి; 35) ఎ; 36) బి;
37) సి; 38) ఎ; 39) బి; 40) ఎ;
41) ఎ; 42) ఎ; 43) బి; 44) సి;
45) బి; 46) సి; 47) ఎ; 48) ఎ;
49) డి; 50) సి.

భారత్‌లో పండ్లు, కూరగాయల ఉత్పత్తి అంచనా?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తులను కొంత కాలం నిల్వ చేసేందుకు వీలు కల్పించే గిడ్డంగి సౌకర్యాల కొరత తీవ్రంగా ఉంది. లభ్యమవుతున్న వసతులు అశాస్త్రీయంగా ఉండటంతో రైతులు పంట చేతికి వచ్చిన వెంటనే తమ ఉత్పత్తులను విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. అందువల్ల వారికి గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో గ్రామీణ రుణగ్రస్థత పెరుగుతోంది. ఉత్పత్తిలో పెరుగుదల నేపథ్యంలో ఆహార ఉత్పత్తుల నిల్వసామర్థ్యం పెంపునకు ప్రాధాన్యం ఏర్పడింది.



నిల్వ సామర్థ్యం

(Storage Capacity)

వ్యవసాయమే ప్రధాన జీవనోపాధిగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో 'సమ్మిళిత వృద్ధి' సాధ్యపడాలంటే వ్యవసాయ రంగంలో సమూల ప్రగతి అవసరం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం భారత్‌లో ఆహార ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేదు. ఈ కారణంగా ఏటా మొత్తం ఉత్పత్తిలో 12 నుంచి 16 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు వృథా అవుతున్నాయి. వీటి విలువ రూ. 50,000 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా.

1994-95 తర్వాతి కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సగటు వార్షిక వృద్ధి 1.20 శాతంగా నమోదైంది. 1990-91లో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 176.4 మిలియన్ టన్నులు కాగా, 2013-14 నాటికి 264.4 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇటీవల రబీలో గోధుమ, బియ్యం, Cereals, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల కారణంగా ఖరీఫ్, రబీ కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సమానంగా ఉండటాన్ని గమనించవచ్చు. ఉత్పత్తిలో పెరుగుదలకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాలను పటిష్టపరిస్తేనే సత్ఫలితాలుంటాయి.

నిల్వ సౌకర్యాలు - గిడ్డంగులు

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు సంబంధించి భారత్‌లో గిడ్డంగులు (గోడౌన్లు) ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గిడ్డంగుల నిర్మాణం శాస్త్రీయంగా ఉన్నప్పుడే వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, పరిమాణాలను పరిరక్షించవచ్చు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్లు గిడ్డంగులను నిర్వహిస్తున్నాయి. భారత్‌లో సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ను అతిపెద్ద ప్రభుత్వ రంగ గిడ్డంగి నిర్వహణదారుగా పేర్కొనవచ్చు. ఇది సుమారుగా 120 వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులకు భద్రతతో కూడిన నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, శ్రేణీకరణ, పంపిణీ లాంటి సేవలను కూడా నిర్వహిస్తోంది. దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రత్యేక గిడ్డంగి కార్పొరేషన్లను ఏర్పాటు చేశాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు ఆయా రాష్ట్రాలకు సంబంధించి జిల్లా స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన మూలధనాన్ని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ సమానంగా సమకూరుస్తాయి. కేంద్ర, రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లతో పాటు భారత ఆహార సంస్థ కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది.

2010 చివరి నాటికి కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ), రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు, భారత ఆహార సంస్థల మొత్తం నిల్వ సామర్థ్యం 75 మిలియన్ టన్నులకు చేరింది. రైతులు వారి ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయించకుండా నిరోధించే క్రమంలో గ్రామీణ గోడౌన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2001 మార్చి నుంచి అమలు పరుస్తోంది. ఇప్పటివరకు 67 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న గ్రామీణ గోడౌన్లను ఏర్పాటు చేసినట్లు అంచనా. ఉత్పత్తి ధోరణి, విక్రయమైన మిగులు పరిశీలించినప్పుడు భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం తక్కువగా ఉన్నట్లు భావించవచ్చు. 2012 ఫిబ్రవరి 1 నాటికి భారత ఆహార సంస్థ 300.83 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం (సొంత, అద్దె గోడౌన్లు కలిపి) కలిగి ఉండగా రాష్ట్ర ఏజెన్సీలు 153.54 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మొత్తంగా భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం 91 మిలియన్ టన్నులకు పైగా పెరిగింది. ప్రభుత్వ ఏజెన్సీలకు సంబంధించి నిల్వ సామర్థ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర ప్రభుత్వ పథకాల అమల్లో భాగంగా ఆహార ధాన్యాల నిల్వకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఆహార భద్రత కల్పించే క్రమంలో ప్రభుత్వ ఏజెన్సీల ఆహార ధాన్యాల సేకరణ పెరుగుతున్న క్రమంలో లభ్యమయ్యే నిల్వ సామర్థ్యంపై అధిక ఒత్తిడి ఉంది. అధిక మద్దతు ధరల కారణంగా ఆహార ధాన్యాల సేకరణలో నిమగ్నమవుతున్న రాష్ట్ర ఏజెన్సీల నిల్వ సామర్థ్యంపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. నాబార్డ్ మంజూరు చేసిన గోడౌన్ల సగటు నిల్వ సామర్థ్యం 1261 మెట్రిక్ టన్నులు కాగా, మొత్తం గోడౌన్లలో 75 శాతం నిల్వ సామర్థ్యం వెయ్యి మెట్రిక్ టన్నుల కంటే తక్కువగా ఉంది. నాబార్డ్ సహకారంతో రైతులు ఏర్పాటు చేసుకున్న చిన్న, మధ్య తరహా గోడౌన్ల వల్ల వారి ఉత్పత్తులను తక్కువ ధర వద్ద విక్రయించే పరిస్థితి తగ్గి, గిట్టుబాటు ధర పొందగలుగుతున్నారని అనేక అనుభవ పూర్వక ఆధారాలు తెలియజేస్తున్నాయి.

నిల్వ సామర్థ్యం - ప్రాంతీయ అసమానతలు

ఉత్పత్తి కేంద్రాలుగా భారత్‌లో నిల్వ సామర్థ్యం కొన్ని ప్రాంతాల్లో అధికంగా కేంద్రీకృతమై ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉన్న ముఖ్య రాష్ట్రాల్లో 22 శాతం నిల్వ సామర్థ్యం లభ్యమవుతోంది. అవసరాలకు అనుగుణంగా కొన్ని రాష్ట్రాలు నెల లోపు నిల్వ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాయి. రాష్ట్రాల మధ్య ఆహార, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో తేడా; వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ నిమిత్తం మండీల ఏర్పాటులో వ్యత్యాసాలు నిల్వ సామర్థ్యానికి సంబంధించి ప్రాంతీయ అసమానతలు పెరగడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. స్థానిక ఉత్పత్తిదారులకు గ్రామీణ గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ ప్రోత్సాహకాలకు సంబంధించి వారిలో అవగాహన, బ్యాంక్ అధికారుల వైఖరి లాంటివి కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో ప్రాంతాల మధ్య అసమానతలకు కారణంగా ఉన్నాయి. మొత్తం గోడౌన్లు, నిల్వ సామర్థ్యంలో ఆహార ధాన్యాలు, సంబంధిత వ్యవసాయ ఉత్పత్తులను అధికంగా పండించే కొద్దిమంది రైతులే ఎక్కువగా కలిగి ఉన్నారు. అందువల్ల ధనిక రైతులే గిట్టుబాటు ధరలు పొందుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ అసమానతలతో పాటు ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. భారత్‌లో మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. ఉత్తర భారతదేశం వాటా 48 శాతం ఉండగా, దక్షిణ భారతదేశం 22%, పశ్చిమ ప్రాంతం 13%, మధ్య భారత దేశం 9%, తూర్పు ప్రాంతం 7% వాటా కలిగి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా దేశంలోని మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యంలో 1% మాత్రమే. నిల్వ సామర్థ్యంలో ప్రాంతాల మధ్య అసమానతల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు సంబంధించి ప్రభుత్వ సామర్థ్యం పరిమితంగా ఉంది. గోడౌన్లలో నిల్వ చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల్లో ఆహార ధాన్యాలపై గోధుమ, బియ్యం వాటా అధికంగా ఉంది. తర్వాతి స్థానాల్లో నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, పత్తి నిలిచాయి. నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహకం అందిస్తున్నప్పటికీ గోధుమ, బియ్యం నిల్వల్లోనే పెరుగుదల కనిపిస్తోంది.

గిడ్డంగుల నియంత్రణ విధానం: గిడ్డంగుల ఏర్పాటులో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంపొందించడం, వేర్‌హౌసింగ్ పరిశ్రమ అభివృద్ధి, నియంత్రణకు సంబంధించి భారత ప్రభుత్వం సెప్టెంబర్ 2007లో 'ది వేర్‌హౌసింగ్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్)' చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం 2010 అక్టోబర్‌లో వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేశారు. వేర్‌హౌసింగ్ అభివృద్ధి, నియంత్రణ చట్టం ముఖ్య ఉద్దేశం నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్ (NWR) మంజూరులో నియంత్రణ వాతావరణాన్ని కల్పించడం. NWR మంజూరు చేసే గిడ్డంగులకు వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (WDRA) గుర్తింపునిస్తుంది. ఇది 2011 మార్చి 31 నాటికి పరిశీలనకు వచ్చిన 300 దరఖాస్తుల్లో 51 అప్లికేషన్లకు అనుమతినిచ్చింది.

కోల్డ్ స్టోరేజీలు

భారత్‌లో పండ్లు, కూరగాయల సాంవత్సరిక ఉత్పత్తి 130 మిలియన్ టన్నులుగా అంచనా. వైవిధ్య వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వీటి ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల ఏర్పడింది. వీటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి అనేక అవకాశాలున్నప్పటికీ ఆయా ఉత్పత్తులను నిల్వ చేయడానికి అవసరమైన శీతల గిడ్డంగులు (Cold Storages) తగినంతగా లేవు. శీతల గిడ్డంగుల సౌకర్యం అధికంగా సింగిల్ కమోడిటీస్ అయిన బంగాళదుంప, ఆరెంజ్, ఆపిల్, ద్రాక్ష, దానిమ్మ, పూలు లాంటి వాటికి మాత్రమే అందుబాటులో ఉంది. అంటే శీతల గిడ్డంగుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం లేదు. బహుళ ఉత్పత్తులను నిల్వ చేసే విధంగా శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి. ఇది ఉత్పత్తిదారుల ఆర్థిక స్థోమతపై ఆధారపడి ఉంటుంది. రిఫ్రిజిరేషన్ వ్యవస్థను శీతల గిడ్డంగులు నిర్వహిస్తాయి. వస్తువులు నిల్వ చేయడానికి వీలుగా గది వాతావరణాన్ని రిఫ్రిజిరేషన్ వ్యవస్థ నియంత్రిస్తుంది. దేశంలోని 5274 శీతల గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 24.31 మిలియన్ టన్నులుగా అంచనా. శీతల గిడ్డంగులు ఎక్కువగా ప్రైవేటు రంగంలో ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ, సహకార రంగంలో ఏర్పాటైన శీతల గిడ్డంగుల వాటా చాలా తక్కువ. ప్రస్తుతం దేశంలోని శీతల గిడ్డంగుల్లో పండ్లు, కూరగాయలు, పత్తి, మిరపకాయల నిల్వలు కొనసాగుతున్నాయి. అసోం, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, కేరళ, సిక్కిం, తమిళనాడు రాష్ట్రాల్లోని పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో 1% మాత్రమే శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భారత్‌లోని మొత్తం శీతల గిడ్డంగుల సగటు నిల్వ సామర్థ్యం కంటే అధిక నిల్వ సామర్థ్యం ఉంది. మొత్తం మీద వీటి డిమాండ్ వ్యవసాయ ఉత్పత్తులకే అధికంగా ఉంది.

నిల్వ సామర్థ్యం పెంపునకు చర్యలు

- గత దశాబ్ద కాలంలో నిల్వ సామర్థ్యం సగటు సాంవత్సరిక వృద్ధి 6.7%గా నమోదైంది. నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేనందువల్ల ఏటా మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 20 నుంచి 30 శాతం వృథా అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న రాష్ట్ర గిడ్డంగులను ఆధునికీకరించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. రాష్ట్ర ఏజెన్సీలు నిర్వహిస్తున్న గిడ్డంగులు 20 ఏళ్ల పైబడి ఉన్నాయి. అందువల్ల ఆయా గిడ్డంగుల ఆధునికీకరణ ప్రాధాన్యం సంతరించుకుంది. వీటి ఆధునికీకరణకు 37 నుంచి 40 బిలియన్ రూపాయల వ్యయం అవుతుందని అంచనా.
- ఖరీఫ్, రబీ కాలాల్లో వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సమతౌల్యం సాధించాలి. వినియోగ అవసరాల దృష్ట్యా సాంవత్సరిక ఉత్పత్తిలో 70% నిల్వ చేసే విధంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. దీని కోసం గ్రామీణ గోడౌన్ల ఏర్పాటు పథకాన్ని ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలి. ప్రస్తుతం సగటు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సుమారుగా 30% ఉత్పత్తి అవుతున్నట్లుగా భావించి, మొత్తం 70 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల నిల్వ నిమిత్తం నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వృథా అవుతున్న ఆహార ధాన్యాల ఉత్పత్తిని 70 మిలియన్ టన్నులుగా భావిస్తే వాటి మొత్తం విలువ 70 నుంచి 100 బిలియన్ రూపాయల వరకు ఉంటుంది.
- ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యానికి సంబంధించి గోధుమ, బియ్యం అధిక మొత్తంలో ఆక్రమించినందువల్ల ఇతర ఆహార ధాన్యాలు, వ్యవసాయ వస్తువుల నిల్వకు అవరోధం ఏర్పడుతోంది. జొన్నలు, సజ్జలు, కార్న్, పప్పుధాన్యాలు, నూనె గింజలు, పత్తి, సుగర్ కేన్ లాంటి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. నిర్వహణలో ఉన్న గిడ్డంగుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి వేర్‌హౌస్ పర్‌ఫార్మెన్స్ ఇండికేటర్లను ప్రవేశపెట్టాలి.
- ప్రైవేటు రంగంలో నిల్వ సామర్థ్యం పెంపునకు ప్రోత్సాహకాలు అవసరం. నాబార్డ్, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ద్వారా గిడ్డంగి పరిశ్రమ అభివృద్ధిలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలి. 2010 మార్చి నాటికి మొత్తం నిల్వ సామర్థ్యం 91 మిలియన్ మెట్రిక్ టన్నుల్లో నాబార్డ్ పథకం కింద లబ్ధి పొందిన గిడ్డంగుల సామర్థ్యం 24 శాతం కాగా, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద లబ్ధి పొందిన గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 17 శాతం. గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.
- పంట చేతికి వచ్చే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉంటున్నాయి. రుణగ్రస్థత కారణంగా చిన్న, సన్నకారు రైతులు గిట్టుబాటు ధర లభించే వరకు వేచి చూడకుండా ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. అందువల్ల వ్యవసాయ ఆదాయాలు తగ్గి వ్యవసాయ రంగంపై పెట్టుబడులు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించడానికి రైతులు తమ ఉత్పత్తులను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునేవిధంగా ప్రోత్సహించాలి. గుర్తింపు ఉన్న గిడ్డంగుల్లో నిల్వ చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్‌ను అందిస్తే బ్యాంకుల నుంచి రైతులు స్వల్పకాల రుణాన్ని పొందగలుగుతారు. తద్వారా గిట్టుబాటు ధర లభించే వరకు వారి ఉత్పత్తులను విక్రయించకుండా వేచి చూస్తారు. ఈ స్థితి వ్యవసాయ ఆదాయాలు, వ్యవసాయ రంగంలో పెట్టుబడుల పెంపునకు దారితీస్తుంది. NWR మంజూరు గ్రామీణ ప్రాంతాల్లో పరపతి ప్రవాహం పెంపునకు, కాస్ట్ ఆఫ్ క్రెడిట్ (పరపతి వ్యయం) తగ్గింపునకు తోడ్పడుతుంది. ప్రామాణీకరణ, శ్రేణీకరణ, ప్యాకేజింగ్, బీమా సేవలు లాంటి ఇతర కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగవుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో అగ్రి - బిజినెస్‌లోని లాజిస్టిక్ చైన్‌లో ఉన్న తారతమ్యాన్ని ఇది పూరిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల పెంపుతో పాటు మూలధన సబ్సిడీ లాంటివి కల్పించడం ద్వారా రైతులను సహకార సంఘాల ఏర్పాటు దిశగా ప్రోత్సహించాలి. సహకార సంఘాల ద్వారా అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.

Understand the Author's Tone..

BANK EXAMS

GENERAL ENGLISH

Competitive exams have provided many aspiring candidates to get jobs in various public and private sectors. Candidates appearing for these exams are from various backgrounds and vernacular mediums. English remained a thing of concern for many as they find it as a stumbling block in getting through the exam. In many competitive exams it is mandatory to go through the English language paper and thus it comes out as a challenge for such candidates who lack in English language skills. Hence, it is essential for these candidates to put extra effort on their preparation to score well and be victorious. The English language part consists of questions pertaining to various sections like, grammatical skills, vocabulary knowledge and comprehension.

COMPREHENSION

The comprehension section demands a good reading and understanding capacity of the candidate. You are expected to go through the paragraph given, understand, analyze and derive meaning out of it. Before attempting any passage, skim it as it's very important to understand the tone of the author. It may be optimistic, pessimist, sarcastic, angry or contemplative. If you are able to understand what author is trying to say then there is high probability that you will mark right answers. The passage usually contains 10 questions related to the passage which include synonyms and antonyms of particular words from the paragraph that needs to be answered. If you find that questions are beyond the understanding you found from the passage, simply skip that question, never try to mark nearest answer. Mark the answer only if you are sure about it. Here are a few tips while attempting this section:

- Skim the passage that is given.
- Read the questions first which helps to have an idea as you will be focused.
- Casual reading is not advisable, stay focused and don't miss any detail while reading.
- Make a note of what you read which might help you while you come back in search of answers.
- If doubt persists re-read the passage to make sure you understand it well before answering.
- Understand the author's tone and answer the questions based on author's opinion rather than your opinion.

A methodical and well planned preparation always gives fruitful results. It is essential to have a basic foundation in English which can be acquired by regular reading habits. Time management is crucial during the test. Use time saving techniques. In order to accomplish this you must become familiarize with the directions prior to taking the exam, and practice all the given exercises from this section.

- Keep in mind that you need not dwell too long on any one question or become concerned that you have answered a previous question incorrectly.
- Answer all questions by applying the techniques; keep track of any question that you may want to return to if you have enough time.
- The most important thing is be confident and remember that you have prepared well. Relax and do the best you can.

Model Questions

Directions (Q. 1-15): Read the following passages carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

PASSAGE 1

"Let us laugh" says, W. Mathews, "it is the cheapest luxury man enjoys. It stirs up the blood, expands the chest, clears away the cobwebs from the brain and gives the whole system a healthy treatment," So is it not nice to laugh a lot? It is said, "Laughter is the best medicine." For those who dislike medicine, sweet or bitter. A good joke that provokes laughter is prescribed. It is nice to have a good laugh but a "guffaw" may sometime lock one's jaws and so it is suggested that those who enjoy a loud guffaw go slow and subside into a gurgle but the best thing is, as done in Hon'ble courts before a Hon'ble Judges, just titter. And be able to enjoy all jokes including ones directed at myself, but never making a laughing stock of myself in the process. Let us remember the wise saying, "He is not laughed at that laughs at himself."

1. It is said that laughter is the best medicine because
   1) It is the cheapest luxury man enjoys
   2) It is available free of cost
   3) It is cheaper whereas medicines in the shops are costly
   4) It is not mentioned
   5) It provides better treatment than costly medicines.
2. The writer says he would never make a laughing stock of himself. It means he should not
   1) let others ridicule him
   2) show disrespect to Judges
   3) laugh, but simply smile at others
   4) let others laugh
   5) laugh at others
3. The writer feels laughter is to be prescribed to those who
   1) are seriously ill
   2) dislike medicines
   3) cannot buy medicines
   4) who are happy
   5) do not need medicines
4. What may sometime lock one's jaws?
   1) Laughter 2) Mirth
   3) Guffaw 4) Gurgle
   5) Titter
5. By quoting a wise saying in the last line the writer
   1) Reiterates the point that laughter is the best medicine for us
   2) Pity on those who laugh
   3) Guides us about what we should do from being laughed at
   4) Cautions us as to how we should conduct ourselves in the Hon'ble Courts
   5) Censures those who cannot laugh at themselves

PASSAGE 2

I once saw a tigress stalking a month old kid. The ground was very open and the kid saw the tigress while she was still some distance away and started bleating, where on the tigress gave up her stalk and walked straight up to it. When the tigress has approached to within a few yards, the kid went **forward** to meet her, and on reaching the tigress **stretched** out its neck and put up its head to smell her. For the duration of a few heart beats the month-old kid and the queen of the forest stood nose to nose, and then the queen turned and walked off in the direction from which she came.

6. 'Stalking' in this context means
   1) Running threateningly
   2) Moving about in circles
   3) Attacking
   4) Targeting a victim
   5) Moving quietly without being seen or heard
7. The tigress walked straight up to the kid because
   1) It makes the kid joyous
   2) Running would frighten the kid
   3) Stalking was useless now
   4) The tigress was patient
   5) She was sure of her victim
8. The kid's behavior indicates that
   1) It was familiar with the sight of tigress
   2) It was attracted by the tigress's smell
   3) It was attracted to the tiger's food
   4) It took the tigress for a playmate
   5) It was not aware of the danger involved
9. The expression 'for the duration of a few heart beats' suggests
   1) The few seconds the tigress and the kid spent smelling each other
   2) The fear of the kid
   3) The excitement of the tigress
   4) The anxiety of the watcher
   5) The anxiety of the author
10. 'Queen' in the passage refers to
    1) The queen who came to see
    2) The lady 3) The kid
    4) The tigress 5) The author
11. The synonym of **forward** is
    1) Rearward 2) Onward
    3) Inward 4) Review
    5) Rejoice
12. The antonym of **'stretched'** is
    1) Expand 2) Prolong
    3) Lengthen 4) Elongate
    5) Contract

PASSAGE 3

India is not a backward country. It is the version of the outside world which is outdated. India is growing every day. It has a population of more than 100 million in the middle class, out of which a segment of 70 million is earning monthly wages more than that the average weekly pay of an Australian worker, which makes India an economic power as great as France.

13. What is meant by segment in the above paragraph
    1) The total population
    2) A large part of the population
    3) Some part of the population
    4) Half of the population
    5) Less than half of the population
14. What is the underlying theme of the paragraph?
    1) India is a great military power
    2) India is a backward country
    3) India is fast developing into a big power
    4) India has poor economy
    5) India can never develop

ANSWERS:

1) 1	2) 1	3) 2	4) 3
5) 3	6) 5	7) 5	8) 5
9) 4	10) 4	11) 1	12) 5
13) 3	14) 3		